# మనసంతా మనిద్దరమే

పి. ఎస్. నారాయణ

# మనసంతా మనిద్దరమే

పి.ఎస్.నారాయణ

## నవల

# మనసంతా మనిద్దరమే

## (నవల)

**చతుర**

మాసపత్రిక
సెప్టెంబర్, 2014 సంచికలో
సంక్షిప్తీకరింపబడి
ప్రచురింపబడింది.

## వెల:రు. 100

### :రచయిత చిరునామా:

పి.ఎస్.నారాయణ
**8-3-168/20/బి/7,**
సిద్ధార్థనగర్ నార్త్, ఏజీ కాలనీ దగ్గర,
హైదరాబాద్-**500 038**
ఫోన్ నం: **040-23713835/9948319407/9959808862**
Email; potturi_snarayana@yahoo.co.in

గమనిక

ఈ నవలలోని పాత్రలు, సంఘటనలు–
అన్నీ కల్పితాలు, ఎవర్నీ ఉద్దేశించినవి కావు.
ఎక్కడయినా పోలికలు, సామ్యాలూ
కనిపించినా అవి యాదృచ్ఛికమే.

–రచయిత

# మనసంతా మనిద్దరమే

హైదరాబాద్ వెళ్ళే గోదావరి ఎక్స్‌ప్రెస్ వాల్టేర్ స్టేషన్‌లో మొదటి నంబరు ప్లాట్‌ఫాం మీదకు వచ్చి ఆగింది ఇరవై ఐదు నిముషాల ముందుగా. అప్పుడు సరిగ్గా సాయంత్రం అయిదు గంటలయింది.

జనవరి వెళ్ళిపోబోతున్నా చలి తగ్గలేదు. వాన వస్తుందనేందుకు సూచనగా ఆకాశాన్నంతా నల్లటి మబ్బులు ఆవరించటంతో చీకటి పడుతున్నట్లుగా అంతా మసకమసకగా వున్నది.

అన్ని ప్లాట్‌ఫాంల మీద దీపాలు వెలుగుతున్నయి. వాటి చుట్టూ దోమలూ మూగుతున్నయి. టీవీలో ఏదో సినిమా వస్తున్నది. దాని మధ్యలో ప్రకటనలు. ప్లాట్‌ఫాం మీద పరుగెడుతున్న జనాల గోల. దీనికి తోడు రైళ్ళ రాకపోకల విషయంలో రైల్వేవారి అర్థం అయి కాని మాటలతో ప్రకటనలు.

సరిగ్గా ఆ సమయంలో స్టేషన్‌ముందు అపరంజి ఆటో దిగింది. డ్రైవర్‌కు డబ్బులిచ్చి, వ్యానిటీ భుజానికి తగిలించుకొని ఒక చేత్తో సూట్‌కేసును, మరో చేత్తో రెగ్జిన్ బ్యాగ్‌ను పట్టుకొని లోపలకు నడవసాగింది. టిక్కెట్టు పదిహేను రోజుల క్రితమే ఆన్‌లైన్‌లో తీసుకోవటంతో లోయర్ బెర్తే దొరికింది.

ఎనిమిదీ తొమ్మిది మధ్యలో ఇంటినుంచి తెచ్చుకున్న టిఫెన్ తినేసి బెర్త్‌మీద పడుకొని దుప్పటి బిగిస్తే తెల్లవారుతుండగా నాంపల్లిలో దిగేటంతవరకూ ఏ దిగులూ వుండదు. తను సంవత్సరానికి ఒకసారి హైదరాబాద్‌లో వున్న బాబాయ్ దగ్గరకు వెళ్ళి వారం పది రోజులు వుండి రావటం అలవాటే.

ఈసారి వెళ్ళటంలో ఓ ప్రత్యేకత ఉన్నది. బాబాయి కూతురు నిమ్మీ అమెరికానుంచి వస్తున్నది. తన ఈడుదే. మహా అయితే సంవత్సరమో, సంవత్సరంన్నరో తనకంటే పెద్దయివుంటుంది.

బాగా తెలిసిన స్నేహితుడి కొడుకు అవ్వటంతో మంచి సంబంధం అంటూ– ఇప్పుడేం తొందరొచ్చింది నాన్నా, ఇంకా చదువుకుంటాను– అని నిమ్మీ అంటున్నా, బాబాయి ఆ సంబంధం ఎక్కడ తప్పిపోతుందోనన్నట్లుగా దాని పెళ్ళిచేసి అమెరికా పంపించేశాడు సంవత్సరం క్రితం.

నిమ్మీ వచ్చేటప్పటికి తను హైదరాబాద్‌లో వుండాలని, ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళి రిసీవ్ చేసుకోవాలనేది అపరంజి ఆలోచన. వాళ్ళిద్దరికీ అంత స్నేహమున్నది. ఆపైన ఇప్పుడు కాలేజీకి శెలవలవ్వటంతో ఈ పదిరోజులూ ఆ అమ్మాయితోనే గడపాలనేది మనస్సులోని మాట. కాలేజీలు తెరిస్తే ఎటూ వీలుపడేది కాదు.

హైదరాబాద్‌లో తనతో విశాఖపట్టణంలో బి.టెక్ చేసిన చాలా మంది స్నేహితురాళ్ళు ఉన్నారు. వాళ్ళని కూడా కలవచ్చు. ఆపైన ఒకరోజంతా చార్మినార్ దగ్గర అందరితో కలిసి షాపింగ్ ఉండనే ఉంటుంది. అందుకే ఆ అమ్మాయికి అక్కడకు వెళ్ళటం అంటే బహు సరదా.

ప్లాట్‌ఫాం మీదకు బండివచ్చి వున్నది అన్న ప్రకటన వింటూనే వడివడిగా ముందుకు అడుగులు వేయసాగింది. ఎస్ సెవన్‌లో ఇరవై అయిదో నంబరు బర్త్ మీద చేతిలో బరువు పడేస్తేనేగాని సగం చికాకు తీరదు.

ప్రయాణీకులు చాలామంది రైలు ఎక్కటంతో ప్లాట్‌ఫాం కాస్తంత తెరిపిగా వున్నది. వాళ్ళను పంపటానికి వచ్చినవాళ్ళు కిటికీలదగ్గరా, తలుపుల దగ్గరా జేరి లోపల వాళ్ళతో కబుర్లు చెప్పుకుంటున్నారు.

అపరంజి ఎస్ సెవన్ వెతుక్కుంటూ ముందుకు వచ్చి, అది కనబడగానే తలుపు దగ్గరే నిల్చున్న పాసింజర్లను తప్పుకొని లోపలకు వెళ్ళింది. తన సీటు నాలుగో బేలో వున్నది. అప్పటికే అక్కడ ముగ్గురు కుర్రవాళ్ళు ఎదురెదురుగా కూర్చొని పెద్దగా

నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

అపరంజి వాళ్ళను చూస్తునే రాత్రంతా వీళ్ళ గోల భరించాలి కాబోలు అనుకొని కించిత్ తటపటాయిస్తూ కదలకుండా నిలబడిపోయింది. వాళ్ళూ ఎదురుగ్గా వచ్చి నిలుచున్న అపరంజిని నోళ్ళు తెరుచుకొని చూస్తూ ఉండిపోయారు. కళ్ళముందు మెరుపులా మెరుస్తున్న అందమైన ఆ బంగారు బొమ్మను చూస్తూ రెప్పలార్పటం కూడా మరిచిపోయారు.

పచ్చటి పసిమిరంగులో ఐదడుగుల ఆరంగుళాల పొడుగుండి కళకళలాడే ముఖంతో ఎవరినైనా ఇట్టే ఆకట్టుకోగల రూపం ఆమెది. పెద్దపెద్ద కళ్ళు ఆయస్కాంతాలయి ఇతరుల చూపుల్ని తన మీదకు పదేపదే లాక్కుంటయి. అందునా తన చక్కటి ఆకారాన్ని గులాబిరంగు చీరలో నిండుగా చుట్టేసి, పిరుదాలుదాటి క్రిందదాకా వున్న పొడువైన జడలో కనకాంబరాలు తురమటంతో దివినుండి భువికి దిగివచ్చిన రంభలాగానే వున్నది.

"నాది ఇరవై ఐదో నంబరు బెర్తు... విండోసైడ్ సీటు!" అన్నది అక్కడ కూర్చున్న అతడిని ఇక తమరు లేవచ్చు అన్నట్లుగా.

అందానికి తోడు తీయని కంఠం వాళ్ళను మరింతగా ఉక్కిరిబిక్కిరి చేసింది.

"యస్ మేడమ్!" ఆమె అంతరంగం అర్థమయినట్లుగా అతడూ చటుక్కున లేచి ఎదురు బర్త్‌మీద స్నేహితుల పక్కగా వెళ్ళి కూర్చున్నాడు.

అపరంజి చేతిలోని సూట్‌కేస్‌ను, బ్యాగ్‌ను సీటుమీద పెట్టి తన సీట్లో కూర్చున్నది.

"మీరెక్కడకు వెళుతున్నారు, మేడమ్!" ఎదురు బెర్త్‌మీద కుర్రాడు ఇకిలిస్తున్నట్లుగా పళ్ళు బయటపెట్టి, ఆమెనే కన్నార్పకుండా చూస్తూ అడిగాడు.

చికాగ్గా చూచింది అతడి వంక నుదురు ముడివేసి. తను ఈ ప్రశ్నకు సమాధానం చెబితే వెంటనే మరో ప్రశ్న సంధిస్తాడు. దానికి సమాధానం చెబితే ప్రశ్నల వర్షం కురిపించేస్తారు అంతా కలిసి. కోతుల్ని మొదట్లోనే కట్టడి చేయకపోతే వాటి పిచ్చిగోలకు

అంతూపొంతూ వుండదు.

చూస్తే ఆ మొహాలు మొరటు తేలి వున్నయి. అంతగా చదువుకున్న వాళ్ళలా కనబడటంలేదు.

"చూద్దాం... ఇక్కడనుంచి హైదరాబాద్‌కు మధ్యలో చాలా స్టేషన్లు వున్నయిగదా... ఎక్కడ దిగాలనిపిస్తే అక్కడ దిగిపోవటమే!" చాలా తేలిగ్గా నవ్వేస్తూ అన్నది అపరంజి వాళ్ళకు అందీ అందకుండా.

ఆ అమ్మాయి సమాధానానికి ఏం మాట్లాడాలో అర్థంకాలేదు ఆ ముగ్గురికి.

"మేం సికింద్రాబాద్ వెళుతున్నాం మేడమ్!..." అన్నాడు నసుగుతున్నట్లుగా మరొకడు.

అపరంజి చిరునవ్వుతో వాళ్ళవంక చూచింది. వాళ్ళ వాలకం చూస్తే రాత్రికి వాళ్ళు నిద్రపోయేలా లేరు. పిచ్చివాగుడు వాగుతూ, నవ్వులూ కేరింతలతో తననూ నిద్రపోనివ్వకపోవచ్చు. ఏ అర్థరాత్రో సీసాలు బయటకు తీసి వీరంగం వేయకుండా వుంటే అదృష్టమే!

"అంటే అఖరి స్టేషన్ వరకూ ప్రయాణం చేస్తారన్నమాట!" అని కొంటెగా అంటూనే పెట్టెను సీటుక్రింద పెట్టేసి, బ్యాగ్‌లోనుంచి చైన్ తీసి లాక్ చేసింది. 'తనకు వీళ్ళపీడా తెల్లవారేంతవరకూ వదలదు!' అని మనస్సులోనే అనుకుంటూ.

బ్యాగ్‌ను దగ్గరకు తీసుకొని అందులోనుంచి ఇంగ్లీషు మ్యాగజైన్‌ను బయటకు తీసింది ఇక మీతో నాకు మాటలు అనవసరం అన్నట్లుగా. ఇంట్లోనైనా సరే అపరంజి సామాన్యంగా ఖాళీగా కూర్చోదు. చేస్తే ఏదైనా పని, లేదంటే పుస్తకాలు చదవటం... టీవీని, అందులోని సీరియల్స్‌నూ చూడాలనే తపన అంతగా లేదు. ఎప్పుడైనా బాలసుబ్రహమణ్యం ప్రోగ్రాం 'పాడుతా తీయగా' వస్తుంటే పిల్లలు పాడే పాటల్ని సరదాగా వింటుంటుంది.

"అన్నా! ఒకసారి మా బోగీలోకి రావా...!"

చటుక్కున తలెత్తింది అపరంజి ఆ కొత్త కంఠం ఎవరిదా అన్నట్లుగా.

చిన్నపిల్లలా కనబడటానికి ప్రయత్నిస్తున్నట్లుగా అలంకరణ చేసుకున్న ముప్ఫయికి పైగానే వున్న యువతి. ఆ హెయిర్ స్టయిలూ, ముఖానికి పూసుకున్న పౌడరు కాస్తంత ఎబ్బెట్టుగానే వున్నయి. వాళ్ళకు దగ్గరగా నిలబడి ఏదో రహస్యంలా మరీ ముందుకు వంగి చెబుతున్నది.

“ఏమైంది?”

“ఎవడో వెధవ... ఫ్యామిలీ లేడీస్ అనికూడా చూడకుండా పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడు... సరోజ ఏడుస్తున్నది!”

“వెంకట్ లేడా?” అన్నాడు లేచి నిలబడుతూ. “పద!”

ఆ ఇద్దరు వెళ్ళిపోయారు. వాళ్ళు వెళుతుండగానే ఇంకోడు కూడా లేచి వాళ్ళ వెనగ్గా వెళ్ళాడు.

“మర్యాదలు మంట కలిసిపోయినయ్ మేడమ్!... ఆడమనిషి కనబడటం ఆలస్యం ప్రతివెధవా సీమటపాకాయల్లా పేలిపోవటమే!” అన్నాడు అసహనంగా ముఖంపెట్టి అక్కడ మిగిలివున్న ఆ ఒక్కడూ.

అతడు కాస్తంత చదువుకున్నవాడిలాగానే వున్నాడు. షర్ట్‌ను టక్ చేశాడు. సన్నఫ్రేము కళ్ళజోడు పెట్టుకున్నాడు. నున్నగా తల దువ్వుకున్నాడు.

అపరంజి అతడి మాటల్ని పట్టించుకోనట్లుగానే పుస్తకంలోకి తల దూర్చేసింది. వాళ్ళను చూస్తుంటేనే చికాగ్గా వున్నది. ఇప్పుడు వచ్చిన ఆ అమ్మాయితో మరింత చికాకు ఏర్పడింది. తెల్లవార్లూ ఎదురు బెర్తులమీద వీళ్ళ గోల భరించాలీ అనుకుంటే మరింత చికాకు వేస్తోంది. ఇక తనపై రెండు బెర్తలకూ ఎవరొస్తారో? ఎలాంటి వాళ్ళు వస్తారో?

చటుక్కున లేచి వడివడిగా బోగీదిగింది. తలుపు పక్కగా అంటించివున్న చార్టులో పేర్లు చూచింది. తన పేరు, తన ఎదురుగ్గా కూర్చున్న ముగ్గురు పేర్లే కాకుండా మరో

ఇద్దరు పేర్లున్నయి. ఒకరు తన వయస్సులోనే వున్న అమ్మాయి 'నివేదిత'. విజయవాడలో ఎక్కుతుంది. తన పైనున్న మిడిల్ బెర్త్ ఆ అమ్మాయిది. మరొకరు ఎనభై ఏళ్ళ 'పరాంకుశం'. ఆయనది అప్పర్ బెర్త్. ఆయన రాజమండ్రిలో ఎక్కుతాడు. క్రింద కూర్చున్న వీళ్ళు గనుక గోలచేస్తుంటే తను పైబెర్త్‌కు వెళ్ళి ఆ ముసలాయన్ని క్రింద పడుకోమంటే సరిపోతుంది!... ముసలాయన గనుక క్రిందపడుకోవటానికి సంతోషపడతాడుగూడా.

రైలు కూతకూస్తూనే బయల్దేరటంతో చేయెత్తి గడియారం వంక చూచుకున్నది... ఐదు గంటల ఇరవై అయిదు నిముషాలు... అంటే బండి సరిగ్గా టైంకే బయల్దేరుతున్నదన్నమాట. హైదరాబాద్‌కు కూడా అనుకున్న సమయానికి జేరితే రెండు గంటలపాటు నిమ్మీ గదిలో పడుకొని దుప్పటి బిగించివేయవచ్చు. తనని ఎవరూ డిస్టర్బ్ చేసే వాళ్ళే ఉండరు.

తరువాత పావుగంటలోనే పక్కబోగీలోకి వెళ్ళిన ఇద్దరూ వచ్చారు ఇకిలించుకుంటూ.

"ఏమైంది?" ఆత్రంగా అడిగాడు అక్కడ కూర్చున్న అతను.

"రెండు పీకాను... వాడు అక్కడనుంచి లేచి వెళ్ళిపోయాడు!"

"గోవిందు లేడా?"

"వాడు ఎస్ నైన్‌కు వెళ్ళినట్లున్నాడు... అక్కడ రాజ్యం ఒక్కతే వున్నది కదా!"

వాళ్ళు ఎంత చిన్నగా మాట్లాడుకుంటున్నా అపరంజి చెవిన పడుతూనే వున్నయి ఆ మాటలు. ఆమెకు ఏమీ అర్థంకావటంలేదు... వీళ్ళూ, ఆ ఆడవాళ్ళు మూకమ్మడిగా ఎందుకు హైదరాబాద్ వెళుతున్నదీ... ఏ స్నేహితుల పెళ్ళికో వెళుతున్నారనుకున్నా వాళ్ళ వాలకం అలాలేదు. ఇందాక వచ్చిన అమ్మాయి వేషం చూస్తే బజారు మనిషిలా కనబడుతున్నది.

పాంట్రీకారు కుర్రాడు టీ తెస్తే తాగింది. తన బెర్త్‌మీద ఎక్కాల్సిన ఇద్దరూ

ఇప్పుడప్పుడే రారు గనుక ఎయిర్ పిల్లో తీసి గాలి ఊది తలక్రింద పెట్టుకొని పడుకున్నది. అటూ ఇటూ తిరుగుతున్న పాసింజర్లు. ఎదురుగ్గా కూర్చున్న కుర్రాళ్ళ వెకిలి నవ్వులు. పాంట్రీకారు కుర్రాళ్ళ అరుపులు. మధ్యలో పిచ్చిపిచ్చి పాటలతో అడుక్కుండే వాళ్ళ గోల. లాభంలేదు అనుకుంటూ దుప్పటి బిగించేసింది. ఓ రెండు గంటలు పడుకొని లేచి టిఫెన్ తిని మళ్ళా పడుకోవచ్చు. చేతిలో పుస్తకాన్ని బ్యాగ్‌లో పడేసింది. తలుపుదాకా వెళ్ళి తల్లికి ఫోన్ చేసింది రైలు బయల్దేరినట్లుగా.

బాబాయ్, పిన్నీ, నిమ్మీ గుర్తుకు వచ్చారు. మగపిల్లవాడి తరువాత చాలా సంవత్సరాలకు పుట్టిన ఆడపిల్ల అవ్వటంతో నిర్మల అతి గారాబంగా పెరిగినా చదువులో ఎప్పుడూ ప్రథమంలోనే వుండేది. మంచీ మర్యాద నేర్చుకున్నది. చాలా సరదాగా వుంటుంది. దానితో కూర్చుంటే టైమే తెలియదు. దానికి పెళ్ళవుతున్నదంటే ఇక దూరం వెళ్ళిపోతుంది గదా అనుకుంటూ తను ఎంతగానో బాధపడింది. అదీ బాధపడినమాట వాస్తవమే గాని, మూడుముళ్ళూ పడిన మరుక్షణంనుంచి అందరినీ మరిచిపోయి అతడిని క్షణం వదలకుండా అతుక్కుపోయి – ఏం మాట్లాడుతున్నదో తెలియదుగాని– గలగలా వాగుతునే వున్నది. అతడూ బాగున్నాడు. సరదాగా దానితో సమానంగా మాటలు చెబుతున్నాడు.

ఆలోచనల నడుమ ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు.

పెద్దగా చప్పట్లు వినబడటంతో మెళుకువ వచ్చి నిండా కప్పుకున్న దుప్పటిని తీసి చూసింది. ముగ్గురు హిజ్రాలు ఎదురుగా కూర్చున్న కుర్రవాళ్ళ బుగ్గలమీద పొడుస్తు వెకిలిగా ఏదో అంటున్నారు. వాళ్ళూ వాళ్ళతో నవ్వులు కలిపి కొంటె మాటలు మాట్లాడుతున్నారు. వాళ్ళనూ, వాళ్ళ చేష్టలనూ చూడలేక మరల దుప్పటి బిగించేసింది అపరంజి. ఈ రైళ్ళలో ఇదో గొడవ.

మళ్ళా ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు. ఉన్నట్లుండి మెళుకువ రావటంతో టైం చూచుకున్నది. ఎనిమిది దాటి పావుగంటయింది. రైలు వేగం తగ్గటంతో బయటకు చూచింది. సామర్లకోట స్టేషన్ వస్తోంది. లేచి వాష్‌బేసిన్ దగ్గరకు వెళ్ళింది చేతులు

కడుక్కురావటానికి. టిఫెన్ తినేస్తే మళ్ళా పడుకోవచ్చు. ఫోన్ చేసింది తల్లికి. టిఫెన్ తినబోతున్నాను అంటూ. ఆమెకు గంటగంటకూ ఫోన్ చేయకపోతే ఒంటరిగా కూతురు ఎలా వెళుతున్నదోనని మహా కంగారు పడిపోతుంది.

ఆమె అటు వెళ్ళగానే సెల్‌లో తను తీసిన అపరంజి ఫొటోను మిగతా ఇద్దరికీ చూపించసాగాడు అక్కడ కిటికీ పక్కగా కూర్చున్న అతడు. "ఏం ఫిగర్రా!... మనం ఓ పట్టుపట్టామంటే ముంబయ్‌లో లక్ష కురిపించవచ్చు... లేపేద్దామా?" అన్నాడు హుషారుగా.

"రిస్క్‌లో పడతామేమో!" మరొకడు నసుగుతున్నట్లుగా అన్నాడు.

"మనం చేస్తున్నవే రిస్క్‌తో కూడిన పనులు... దాన్ని గురించి భయపడటం దేనికి?" నిర్లక్ష్యంగా అతడు అంటుంటే మూడోవాడు ఒక్కక్షణం కూడా ఆలోచించలేదు. "రెడీ!" అన్నాడు బొటనవ్రేలు పైకెత్తి చూపుతూ.

అపరంజి రావటంతో అందరూ మౌనం దాల్చారు.

ఆమె టిఫెన్‌డబ్బా తీస్తుండటంతో, "మన భోజనం కూడా సామర్లకోటలోనే గదా ఇస్తానన్నది!... పదండి చేతులు కడుక్కు వద్దాం!" అంటూ లేచారు ముగ్గురూ.

వాళ్ళు లేస్తూనే ఉన్నారు పాంట్రీకారు మనిషి భోజనం ప్లేట్లు తీసుకు వచ్చాడు.

"ఇక్కడ మూడా?"

"అవును... ఎస్‌ఎయిట్... ఎస్ నైన్‌లో కూడా ఇవ్వాలి!"

"ఇస్తానండి!"

వాళ్ళు వాష్ బేసిన్ దగ్గర చేతులు కడుక్కు వచ్చి కూర్చొని ప్లేట్లు చేతిలోకి తీసుకుంటున్న సమయంలో వాళ్ళ దగ్గరకు ఓ అమ్మాయి వచ్చింది.

"మా తమ్ముడు సికింద్రాబాద్‌నుంచి ఫోన్ చేశాడండి... నన్ను వాడి గదికి వచ్చి ఉండమంటున్నాడు... నాకు తోడుగా వుంటానన్నాడు... హైదరాబాద్‌లో

ఉద్యోగం దొరికితే సరే, లేదంటే బొంబాయ్ వెళ్ళాల్సివస్తే నాతో వస్తానన్నాడు... సరే అన్నాను!" అన్నది తలవంచుకొని.

మనిషి ముదురాకుపచ్చ చీరలో వున్నది. చెవులకు జూకాలు. కాస్తంత రంగు తక్కువే అనిపించినా చూడటానికి చక్కగా వున్నది. బిగించి జడవేసుకున్న ఆమె తీరు చూస్తుంటే ఇంకా నేటి షోకులకు అలవాటు పడినట్లుగా కనబడటం లేదు.

"అలాగే... నీ ఇష్టం... అయినా నీకు తోడు ఇంకా నలుగురు ఆడవాళ్ళు వస్తున్నారు కదా... భయమేమున్నది..." అన్నాడు చిరునవ్వుతో కిటికీ పక్కన కూర్చున్న అతను.

ఆ అమ్మాయి తృప్తిగా ఒకసారి అతడి వంక చూచి వెళ్ళిపోయింది.

అపరంజి టిఫెన్ తిని డబ్బాతీసుకొని వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళింది.

"అదేమిటి? మధ్యలో ఆ వెధవెందుకు... ఇది కాస్తా మన చేయి జారిపోయిందంటే వస్తయ్యనుకున్న డబ్బులుకూడా పోతయ్!" అన్నాడు రెండోవాడు నసుగుతున్నట్లుగా.

"వాడిబొంద... తమ్ముడంటే ఎవడో కుర్రముండాకొడుకయి వుంటాడు... ఆమాత్రం రస్సా ఇవ్వలేమా వాడికి!" అంటూనే సెల్ ఆన్‌చేసి అపరంజి ఫొటోను స్క్రీన్‌మీద చూడసాగాడు.

"మనం పకడ్బందీగా ప్లాన్ వేసి లేపేయాలిరా... వదిలిపెట్టగూడదు... ఈ ట్రిప్పులో తలా పాతికవేలన్నా మిగలాలి!" అన్నాడు అందులో ఒకడు.

"చూద్దాం!"

"చూద్దాం కాదు చేద్దాం అను!"

"ఓకే!" అతడు పకపకా నవ్వాడు. అతడి మీదకు వంగి మిగతా ఇద్దరూ నోళ్ళు తెరుచుకొని ఆ సెల్‌లోని అపరంజి ఫొటో వంకే చూస్తున్నారు.

"సినిమాస్టార్‌లా చాలా బాగున్నదిరా... మేడమ్ చూసిందంటే వదిలిపెట్టదు...

ఎంతన్నా ముందుకు దూకేస్తుంది!”

“సికింద్రాబాద్ వెళ్ళగానే ఫొటోను నెట్‌లో మేడమ్‌కు పంపించాలి!” అన్నాడు కిటికీ పక్కన కూర్చున్న అతను. అతడే ఆ గ్యాంగ్ మొత్తానికి నాయకుడు. పేరు శంకర్.

సరిగ్గా ఆ సమయంలో వాష్‌బేసిన దగ్గర చేయి కడుక్కుంటున్న అపరంజి పక్కన వచ్చి అంతకు ముందు తన ముందు సీట్లో కూర్చున్నవాళ్ళతో మాట్లాడి వెళ్ళిన ఆకుపచ్చ చీర అమ్మాయి నిలబడింది చేతులు కడుక్కునేందుకు.

ఆ అమ్మాయి బెర్త్ పక్కబోగీలో వున్నది. అక్కడ అప్పటికే వాష్‌బేసిన్ దగ్గర చాలామంది వుండటంతో రెస్టిల్ దాటి ఇటుపక్కకు వచ్చింది.

వెంటనే గుర్తించింది అపరంజి. ఆ అమ్మాయినడిగితే తన ఎదురుగ్గా కూర్చున్న వెధవల చరిత్ర ఏమిటో కొంతయినా తెలుస్తుంది అనుకుంటూ, “మీరూ సికింద్రాబాదేనా వెళుతున్నది?” అన్నది తలెత్తి చొరవగా.

“అవునండి!”

“ఉద్యోగం కోసమా?”

కొద్దిక్షణాలపాటు మాట్లాడలేకపోయింది. “మీకెలా తెలుసు... మిమ్మల్నీ శంకరే తీసుకువస్తున్నాడా?” అన్నది కనురెప్పలు రెపరెపలాడిస్తూ.

ఆ మాటతీరు చూస్తే కాస్తంత నవ్వు వచ్చింది. అంతేగాకుండా ఆ అమ్మాయి చాలా అమాయకురాల్లా కనబడింది.

“మీ శంకర్ ఎవరో నాకు తెలియదుగాని, ఇందాక నా బర్త్ ఎదురుగా కూర్చున్న వాళ్ళతో మీరు మాట్లాడుతుంటే నాకు అనిపించింది మీరు ఉద్యోగ ప్రయత్నంలో హైదరాబాద్ వెళుతున్నారని!... ఏం చదివారు?”

“ఇంటరు తప్పానండి... ఎంత చదివినా నాకు చదువు వచ్చి చావటం లేదండి...

అందుకే తెలిసిన వాళ్ళ సలహాతో అక్కడ ఉద్యోగం దొరుకుతుందేమోనని బయల్దేరాను... ఈలోగా నా అదృష్టంకొద్దీ శంకర్ వచ్చి సాయం చేస్తానన్నాడు... ఇప్పుడు మగపిల్లలంతా ఉద్యోగం చేసే ఆడపిల్లల్నే అడుగుతున్నారు కదండీ!" అన్నది దీర్ఘం తీస్తూ. ఆపైన ఆమాట అంటున్నప్పుడు కాస్తంత ముఖం ఎర్రబడింది.

"శంకర్ నీకు బాగా తెలుసా?"

"లేదండి... మా బస్తీలో ఒకామె పరిచయం చేసి నన్ను అప్పగించిందండి... మీ ఎదురు బెర్త్‌లో కిటికీ పక్కగా కూర్చున్నాడే అతడే శంకరంటే... చాలా మంచివాడండి... హైదరాబాద్‌లో గాని, ముంబయ్‌లోగాని ఎట్లాగైనా సరే ఉద్యోగం ఇప్పిస్తానని మమ్మల్నందరినీ తీసుకువస్తున్నాడు!... ఆయనకు అక్కడ చాలామంది తెలుసట... అందరిదగ్గరా పాతికవేల దాకా తీసుకుంటాడు ఉద్యోగమిప్పించినందుకు... నా దగ్గరే ఏమీ తీసుకోలేదు... మీరు అసలే బీదవాళ్ళు, మీరేమిస్తారులే అన్నాడు పాపం!" అన్నది తలతిప్పుతూ మాటమాటకీ నా బెర్త్ వైపుకు చూస్తూ.

"మీతో వచ్చే ఆడవాళ్ళుకూడా అందుకోసమేనా వస్తున్నది?"

"అనుకుంటానండి... కాని వాళ్ళ వేషాలు చూస్తే నాకు అసహ్యమేస్తున్నది!" అన్నది అమాయకంగా ముఖం పెట్టి ఆ అమ్మాయి.

అపరంజి ఆ అమ్మాయినే చూస్తున్నది. చూస్తే ఆ శంకర్‌ది పెద్ద గ్యాంగ్‌లాగానే వున్నది. ముఖ్యంగా అప్పుడప్పుడూ వాళ్ళ దగ్గరకు వచ్చి మాట్లాడి వెళుతున్న ఆడవాళ్ళ తీరు చూస్తుంటే భయంకరమైన ఆలోచనలు ఆమెను చుట్టుముట్టసాగినయ్.

"మీ పేరేంటి?"

"నా పేరు వసంతలక్ష్మి అండి... మాది శ్రీకాకుళం అండి!" అన్నది కళ్ళను గుండ్రంగా తిప్పుతూ.

"నీతోపాటు మీ పెద్దవాళ్ళను కూడా తీసుకురావాల్సింది!"

సరిగ్గా అప్పుడే శంకర్ అనబడే అతడు భోజనంచేసి తన సీటు దగ్గరనుంచి

వాష్‌బేసిన్ వైపుకు చేతులు కడుక్కోవటానికి వస్తుండటంతో అపరంజి మాటలాపి వెనక్కు తిరిగి నాలుగు అడుగులు వేసింది.

అతడు వస్తూనే వాష్‌బేసిన్ దగ్గరున్న వసంతలక్ష్మితో, "ఎవరామె... ఏమిటీ ఆమెతో మాట్లాడుతున్నావ్... నేను ముందే చెప్పానుగదా... రైల్లో కొత్తవాళ్ళతో మాటలు పెట్టుకోవద్దని... రకరకాల మోసగత్తెలుంటారు... అయినా నీ బోగీలో నువ్వు వుండక ఇక్కడకెందుకు వచ్చావ్...!" అతడు చికాగ్గా అరుస్తున్నట్లే అన్నాడు.

అపరంజి ముందుకు వెళుతున్నదల్లా కొద్దిక్షణాలు అక్కడే ఆగిపోయింది.

"అక్కడ వాష్‌బేసిన్ దగ్గర ఖాళీ లేకపోతేను..." నసుగుతున్నట్లుగా అంటున్నది ఆ అమ్మాయి.

అపరంజి విసురుగా తన సీటు దగ్గరకు వచ్చేసింది.

'నో... ఇదేదో పెద్ద గ్యాంగ్‌లాగా వున్నది... వీళ్ళంతా కలిసి ఆ అమ్మాయిని ఏదో మోసం చేయబోతున్నారు...' తన సీటుమీద కూర్చుని కడిగి తెచ్చిన స్టీలు డబ్బాను తువ్వాలపెట్టి తుడుస్తూ తలెత్తి ఎదురు బెర్త్ మీద కూర్చున్న వాళ్ళ వంకచూచింది. అప్పటిదాకా అపరంజి వంకే చూస్తున్న వాళ్ళిద్దరూ చటుక్కున తలలువంచుకున్నారు.

చికాగ్గా చేతిలోని డబ్బాను బ్యాగ్‌లో పడేసి, సీటు కింద పెట్టేసింది సంచీని. మళ్ళా బెర్త్‌మీద దుప్పటి పరిచి తలవేపు దిండు పడేసింది.

"నాకు నిద్రవస్తున్నది... లైటార్పుతున్నాను!" అంటూనే వాళ్ళ సమాధానం కోసం ఎదురు చూడకుండానే లైటు ఆర్పేసి, బెర్త్‌మీద పడుకుంటూ, దుప్పటి కప్పేసుకున్నది, వాళ్ళకు ఇంకా తనవంకే చూసే అవకాశమివ్వకుండా.

మిగతా ఇద్దరు కూడా లేచి చేతులు కడుక్కోవటానికి వాష్‌బేసిన్ దగ్గరకు వెళ్ళారు.

* * *

అపరంజి కళ్ళుమూసుకు పడుకున్నా నిద్రపట్టలేదు. ఎదురుబెర్త్‌మీద కూర్చున్న వాళ్ళ గురించే ఆలోచిస్తోంది. వాళ్ళతో పాటే ప్రయాణిస్తున్న ఆడవాళ్ళగురించి ఆలోచిస్తున్నది. అమాయకురాల్లా అనిపిస్తున్న పచ్చచీర అమ్మాయి వసంతలక్ష్మి గురించి ఆలోచిస్తున్నది.

నిజంగా ఉద్యోగాలు ఇప్పించటానికే ఆ ఆడవాళ్ళందరినీ వీళ్ళు తీసుకువెళు తున్నారా? అయినా వాళ్ళ మొహాలు చూస్తుంటే ఉద్యోగాలు చేసే మొహాల్లా కనబడటంలేదు.

అప్పటికి అపరంజి దుప్పటి బిగించుకు పడుకొని గంటకు పైగా అయింది. ఎన్నో పిచ్చిపిచ్చి ఊహలు. భయంకరమైన ఆలోచనలు... కాస్త ఇబ్బందిగానే పడుకున్నది బిగుసుకుపోయి.

"ఎక్కడ పెడదాంరా ముహూర్తం దీనికి?" చిన్నగా గుసగుసగా మాటలు వినబడ్డయి.

వాళ్ళ మాటలు అర్థంకాకపోయినా ఎలర్ట్ అయి చెవులు రిక్కించుకొని మరీ వినటానికి ప్రయత్నిస్తున్నది.

"చూద్దాం... చార్ట్‌లో చూశాను నాంపల్లిలో దిగుతుంది... పేరుగూడా బాగుంది– అపరంజిట! తెల్లవారేలోగా బలవంతంగానైనా నోరుమూసి ఏదైనా స్టేషన్‌లో దింపేయటమే... విజయవాడలో అయితే జనం గోలలో ఎవరికీ పట్టదు... రాజుని టాక్సీ తీసుకొని రెడీగా బయట వుండమని చెబుతాను... రెండు పీకైనా సరే మీ ఇద్దరూ దాన్ని తీసుకొని సరాసరి ముంబాయ్ వెళ్ళి మన అడ్డాలో పడేయండి... పిచ్చిపిచ్చిగా గోలచేస్తే కాళ్ళూ చేతులూ కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కేయటమే... నేను మనతో వచ్చిన వాళ్ళల్లో ఇద్దరిని హైదరాబాద్‌లో బాస్‌కు అప్పజెప్పి వాళ్ళ బదులు ఇంకో ఇద్దర్ని తీసుకొని రేపు రాత్రికి బయల్దేరతాను బస్సులో... నేను వచ్చింతరువాత దీని సంగతి చూద్దాం!" చాలా చిన్నగా అంటున్నాడు శంకర్.

ఆమాటలు వింటూనే బిగుసుకుపోయింది అపరంజి!

# 2

అపరంజి అరగంటవరకూ కదల్లేదు. అలాగే దుప్పట్లోనే కదలకుండా వుండిపోయింది. ఆ అమ్మాయి ఎంత ధైర్యస్థురాలయినా వాళ్ళ మాటలు విన్న తరువాత జావలా జారిపోయింది. వాళ్ళు చాలామంది ఉన్నట్లున్నారు... తను మాత్రం ఒక్కతే!

ఈ పరిస్థితుల్లో ఏంచేయాలో ఆమె బుర్రకు ఎక్కటమే లేదు. తలంతా మొద్దుబారి పోయింది. శరీరాన్ని చిరుచెమట పట్టసాగింది.

ధైర్యం తెచ్చుకొని ఏదో ఒక నిర్ణయం తీసుకోకపోతే తను ఓ భయంకరమైన కూపంలో ఇరుక్కుపోవచ్చు... తరువాత ఏమనుకొనీ ఏమీ లాభం లేదు. గుండె దిటవు చేసుకున్నది. అది రణరంగమయినా వెనుకడుగు వేయకుండా కత్తి దూయవలసిందే– తప్పదు!

తను ఒంటరిదే అవ్వవచ్చు కాని, వందలమంది ప్రయాణీకులున్న రైలులో వాళ్ళు ఏం చేయాలన్నా అంత తేలిక కాదు!

రైలు దూసుకుపోతుంటే, ఉండిఉండి దాటిపోతున్న చిన్నచిన్న స్టేషన్లలోని దీపాల వెలుగు కిటికీలోనుంచి లోపల బోగీలోకి పడుతున్నది.

ఆమె ఆలోచనలు ఒక కొలిక్కి రావటానికి అరగంటకు పైగా పట్టింది. ఓ నిర్ణయానికి వచ్చిన దానిలా చటుక్కున లేచి కూర్చున్నది. బోగీలో చాలావరకూ ప్రయాణీకులు పెద్దదీపాలు ఆర్పి నిద్రలకు ఉపక్రమించారు. పట్టాలమీద రైలు పరుగెడుతున్న శబ్దం తప్ప మరేమీ వినబడటంలేదు.

ఎదురు ముగ్గురు కుర్రవాళ్ళూ బెర్తుల మీద పడుకున్నారు. నిద్రపోతున్నారో, తనను కాటు వేసేందుకు అదునుకోసం ఎదురు చూస్తూ నిద్ర నటిస్తున్నారో తెలియటంలేదు.

తను వచ్చే స్టేషన్‌లో నిశ్శబ్దంగా పెట్టెతీసుకొని దిగిపోతే బాగుంటుందేమో

అనుకున్నది... ఆ ఆలోచన బాగున్నట్లే అనిపిస్తోంది. అది ఏ ఊరైతేనేం... తెల్లవారింతరువాత బస్సులో ముందుకో, వెనక్కో వెళ్ళిపోవచ్చు. ఒకరోజు ఆలస్యమయినా కొంపలంటుకుండేదేమీ లేదు.

సెల్‌లో టైం చూచుకుంది. పదకొండు గంటలవ్వటానికి ఇంకా పదినిముషాలున్నది. ఏదో స్టేషన్ వస్తున్నట్లున్నది రైలు వేగం తగ్గింది.

లేచి టాయిలెట్ వైపుకు నడిచింది. అలా నడుస్తుంటే ఆమె ఆలోచనలు మరో మలుపు తిరిగినయి... తను అనుకున్న గమ్యం జేరకుండా ఆ వెధవలకు భయపడి మధ్యలో దిగి పారిపోవటమా లేక పూర్తిగా ప్రయాణం చేసి వాళ్ళను ఓ పట్టుపట్టి చూడటమా? వాళ్ళ విషపు చూపులు తనమీద కాకపోతే మరో అమాయకురాలిమీద పడవచ్చు!...

బోగీ తలుపు తెరిచి బయటకు చూచింది. వచ్చింది ఏలూరు స్టేషన్. పదింటికి ఏలూరు రావాల్సిన బండి ఇప్పుడు వచ్చిందీ అంటే దాదాపు గంట లేటుగా నడుస్తున్నదన్నమాట– వెంటనే చటుక్కున టాయిలెట్‌లోకి వెళ్ళి తలుపు వేసుకొని బోల్టుపెట్టేసింది.

చేతిలోని సెల్‌ను ఆన్ చేసి మేనమామకు కాల్ చేసింది.

“చెప్పు అప్పూ! ఎక్కడనుంచి? హైదరాబాద్ వెళతావని చెల్లాయి చెప్పింది... వెళ్ళలేదా?”

“సారీ మామయ్యా! డిస్టర్బ్ చేశానా... అర్జంటుగా నీ సలహా కావాల్సివచ్చి ఫోన్ చేస్తున్నాను... ఇప్పుడు గోదావరిలో వెళుతూ రైల్లో వున్నాను!” అన్నది అపరంజి త్వరత్వరగా. ఆమె మాటల్లో కించిత్ తడబాటు, కంగారు కూడా వున్నది.

“ఏం ఫరవాలేదు చెప్పు... నేను ఇప్పుడే ఓ పార్టీని పంపి ఆఫీసు గదిలోనుంచి బయటకు వస్తున్నాను... రైల్లో ఏదైనా గొడవ జరిగిందా?” అన్నాడు ఆయనా ఆత్రంగా.

ఇంత రాత్రిపూట రైల్లో ప్రయాణిస్తూ ఫోన్ చేసిందంటే ఆయనకు అనుమానమొస్తున్నది. ఆపైన అపరంజి మాటతీరు కూడా గమనించాడు. ఆయన విశాఖపట్టణంలో పేరుమోసిన క్రిమినల్ లాయరు. మంచి పలుకుబడి వున్న వ్యక్తి.

అపరంజి ఆలస్యం చేయలేదు. "నేనెక్కిన బోగీలో నా ఎదురు సీటులో కొందరు వెధవలు జేరారు!"

"నిన్ను టీజ్ చేస్తున్నారా?"

"నాజోలికి మాటలతో వస్తే నేనూ వాతలు పెట్టినట్లుగా మాట్లాడగలను... అదిగాదు మామయ్యా సమస్య... వాళ్ళను చూస్తుంటే అనుమానంగా ఉన్నది... వాళ్ళు సెల్‌లో నా ఫొటోనుగూడా ఎక్కించినట్లున్నారు... దుప్పటి కప్పుకు పడుకున్న నేను నిద్రపోతున్నానని భావించి మాట్లాడుకుంటున్న వాళ్ళ మాటలు నాకు స్పష్టంగా వినబడినయి...!"

"ఏమన్నారు?" ఆయనా త్వరత్వరగా అడిగాడు.

"వాళ్లు వైజాగ్‌లో కొందరు అమ్మాయిలతో ఎక్కారు... అందరూ ఒకచోట కూర్చోకుండా వేరువేరు బోగీల్లో కూర్చున్నారు... నా ఎదురుగ్గా మాత్రం ముగ్గురు మగవాళ్ళు కూర్చున్నారు... అవతల బోగీల్లో ఎక్కిన వాళ్ళల్లో ఎంతమంది మగవాళ్లున్నారో తెలియదు... ఆడవాళ్లు కొందరు ఇక్కడకు అప్పుడప్పుడు వచ్చి పోతున్నారు... చాలా లేకిగా ప్రవర్తిస్తున్నారు... వాళ్ళేదే గ్యాంగ్‌లా ఉన్నదనిపిస్తున్నది నాకు!"

"రైల్లో రకరకాల వాళ్ళు వస్తుంటారు పోతుంటారు... మనం అపటం కష్టం... మన జాగ్రత్తలో మనం ఉంటే సరి...!"

"అది కాదు మామయ్యా! వాళ్ళ ఆలోచనలే నన్ను భయపెడుతున్నయి... నా ఫొటో కూడా తీశారని చెప్పాను కదా... వాళ్ళ మాటల్లో నాకు అర్థమయింది– బలవంతానో, మాయచేసో నన్ను తీసుకెళ్ళి బొంబాయిలో అమ్మేస్తే లక్షలొస్తయ్యనేది

వాళ్ళ ఆలోచనలా కనబడుతున్నది... నిజంగా అలాంటిది జరిగితే అంతకు మించిన ఘోరం మరొకటి వుండదు... ఈ పరిస్థితులలో ఏం చేయాలో అర్థంకాక నీకు ఫోన్ చేస్తున్నాను... నేనా ఒంటరిగా ప్రయాణం చేస్తున్నాను... వాళ్ళా చాలామంది వున్నారు... ఎదిరించి నిలబడగలనా అనేదే నా ముందున్న ప్రశ్న!... ఇప్పుడు ఏదైనా స్టేషన్‌లో వాళ్ళ కళ్ళుగప్పి దిగిపోతే ఉత్తమంగా ఉంటుందా అనేది మరో ఆలోచన!" ఆ మాటల్ని చాలా నీరసంగా అన్నది. సామాన్యంగా అపరంజి ఏ విషయంలోనూ ఓడిపోవటం సహించదు.

ఆ విషయం ఆయనకూ తెలుసు. ఆలోచిస్తున్నట్లుగా కొద్దిక్షణాలు మౌనంగా ఉండిపోయాడు.

రైలు పెద్దగా కూత కూసి ఏలూరు స్టేషన్‌నుండి మళ్ళా బయల్దేరింది.

"ఇప్పుడు ఎక్కడున్నానన్నావ్!"

"రైలు ఏలూరు దాటుతోంది!"

"కరెక్ట్ టైంకే నడుస్తున్నదా?"

"లేదు... గంట లేటులో వున్నది!"

"ఐసీ... నీ బోగీ నంబరు ఎంత?"

"నాది ఎస్ సెవన్... వాళ్ళ మనుష్యులు ఈ బోగీలోనే కాకుండా ఎస్ ఎయిట్, ఎస్ నైన్‌లలో కుడా వున్నారు!"

"నీ బెర్త్ నంబరు ఎంత?"

– తన నంబరే కాకుండా ఆ ముగ్గురి బెర్త్ నంబర్లు కూడా వడివడిగా చెప్పేసింది.

"ఓకే!..." ఆయన ఓ క్షణం ఆగాడు. "భయపడకుండా నీ బెర్త్‌మీదే ఏదైనా పుస్తకం చదువుకుంటూ తెల్లవార్లూ మెళుకువతో కూర్చో... వాళ్ళ మాటల్లో కల్పించుకొని తగువులాట పెట్టుకోబోకు... భయపడుతున్నట్లుగా ప్రవర్తించబోకు... నీ జోలికి

వస్తే మాత్రం పెద్దగా రంకెలుపెట్టి గోలచేసి బోగీలో అందరినీ లేపేసేయ్! వాళ్ళు ఏం పెట్టినా తినబోకు!” తరువాత రెండు నిముషాల్లోనే సెల్ ఆఫ్‌చేసి టాయిలెట్‌లోనుంచి బయటకు వచ్చింది అపరంజి.

మేనమామ మాటలు విన్నతరువాత ఆమెకు కొండంత ధైర్యం వచ్చింది. తనూ వాళ్ళను ఒక ఆట ఆడించగలదు. వాళ్ళు ఏమాత్రం తన జోలికి వచ్చినా, మామయ్య చెప్పినట్లు ఆ బోగీలో వున్న అందరినీ లేపి కూర్చోబెట్టగలదు. కాలేజీలో ఇంటర్ చదువుతున్నప్పుడు స్టూడెంట్స్ యూనియన్‌కి రెండేళ్ళు సెక్రటరీగా పని చేసింది. చాలామంది వెధవల్ని నోటితోనే అదుపు చేసిన అనుభవం తనకున్నది!

* * *

టైం చూచుకున్నది. పన్నెండున్నరయింది. ఇంకో పావుగంటలో విజయవాడ స్టేషన్ రావచ్చు.

ఏలూరునుంచి పడుకోకుండా కూర్చొని లైటేసుకొని పుస్తకం చదువుకుంటున్న అపరంజిని ఎదురు బెర్త్‌లమీద పడుకున్న ఆ ముగ్గురూ అసహనంగా దొంగ చూపులు చూస్తునే వున్నారు.

మెళుకువతో వున్న ఆ అమ్మాయిని ఏలా విజయవాడలో దింపాలో శంకర్ బుర్రకు తట్టటంలేదు. ఆ అమ్మాయిని ఏదో వంకతో విజయవాడ స్టేషన్‌లో దింపగలిగితే ఆపైన మాయచేసేయటం బహుతేలిక!

“అరేయ్ కిష్టూ! స్టేషన్ వస్తున్నదిగాని దిగి ఇవాళ్టి పేపరు కొనుక్కురారా... నిద్రపట్టి చావటంలేదు!” అన్నాడు శంకర్ పెద్దగా అపరంజినే చూస్తూ, మెదడులో ఓ భయంకరమైన ఆలోచనకు శ్రీకారం చుడుతూ. అంతేకాదు తనిప్పుడేం చేయాలో తనకు తెలుసు అన్నంత ధీమాగా పడుకున్నవాడల్లా లేచి నిలుచున్నాడు... కార్యరంగంలోకి దిగటానికి నడుం బిగిస్తున్నట్లుగా!

పైనించి కిష్టు దిగుతుంటే మధ్య బెర్త్‌లోవాడు ఆవలిస్తూ చిటికెలేస్తున్నాడు...

రైలు నడక వేగం తగ్గిందన్నట్లుగా శబ్దమూ తగ్గింది. బోగీ ఊగటమూ తగ్గింది. కిటికీ అద్దాలలోనుంచి విజయవాడ స్టేషన్‌లోని దీపాలు దేదీప్యమానంగా వెలుగుతూ కనబడుతున్నయి...

ఏం జరగబోతున్నదో అర్థం కానట్లుగా మెడవరకూ దుప్పటి కప్పుకు కూర్చున్న అపరంజి చూపుల్ని చేతిలోని పుస్తకం మీదకు, కిటికీలోనుంచి ప్లాట్‌ఫాం మీద కనబడుతున్న దీపాల వెలుగు వైపుకూ మార్చిమార్చి తిప్పుతున్నది...

ఆమె గుండె కాస్తంత ఆవేశంతో దడదడలాడుతున్నా ధైర్యంగా ముడుచుకు కూర్చున్నది... తనూ ఆ ముగ్గురూ తప్ప బోగీలో మరెవ్వరూ మెళుకువతో ఉన్నట్లుగా అనిపించటంలేదు. బయట జనం తమకు కావాల్సిన బోగీకోసం అటూఇటూ పరుగెడుతున్నారు.

సరిగ్గా ఆ సమయంలోనే ఒక్కసారిగా ఆ బోగీకి రెండు వైపులనుంచి పోలీసులు బిలబిలా బూట్లచప్పుడు చేసుకుంటూ రాసాగారు. వాళ్ళ భుజాలకు తుపాకులు తగిలించుకొని వున్నారు. వాళ్ళు వచ్చి అపరంజి కూర్చున్న బెర్త్ దగ్గరే ఆగిపోయారు. వాళ్ళను చూస్తుంటే ఆమెకు కొండంత ధైర్యం వచ్చింది... కప్పుకున్న దుప్పటిలో ముడుచుకు కూర్చున్నదల్లా తేలిగ్గా అటూ ఇటూ కదిలింది, చేతిలోని పుస్తకాన్ని మూసి పక్కన పెడుతూ.

వాళ్ళు ఆరుగురు దాకా వున్నారు. అపరంజి ఎదురుగ్గా బెర్తుల ముందున్న ఆ ముగ్గురినీ చూస్తూ, “మీ ముగ్గురూ మాతో క్రిందకు రండి!” అన్నాడు అందరికంటే ముందు నిలుచున్న సబిన్స్‌పెక్టర్ తన కంఠాన్ని హెచ్చిస్తూ.

“దేనికి?” కలవరపాటును ముఖంలో కనబడనీయకుండా నిగ్రహించుకుంటూ పెద్దగా అడిగాడు శంకర్. అతడు ఇలాంటి ఢక్కామొక్కీలు ఎన్నో తిన్న అనుభవజ్ఞుడు.

మరుక్షణంలోనే ఆమెకు అర్థమయిపోయింది– వాళ్ళ రాకలో మామయ్య హస్తమున్నదని. అందుకే ధైర్యంగా కప్పుకున్న దుప్పటిని తీసేసి కాళ్ళు క్రిందకు దించి రిలాక్స్ అవుతున్నట్లుగా కూర్చున్నది.

“ఎస్ ఎయిట్‌లోనూ, ఎస్ నైన్‌లోనూ వున్న మీవాళ్ళంతా గూడా దిగుతున్నారు... మీకోసం పోలీసువ్యాన్ స్టేషన్ ముందు రెడీగా వున్నది!” అంటూనే శంకర్ అనబడే క్రిందబెర్త్ మీదనుండి లేచి నిలబడిన సన్నఫ్రేము కళ్ళజోడు వాడి చొక్కా కాలర్‌ని బిగించి పట్టుకున్నాడు ఆ ఇన్‌స్పెక్టర్! అతడి పక్కనున్న కానిస్టేబుల్స్ మిగతా ఇద్దరినీ పట్టుకున్నారు.

ఆ దృశ్యాన్ని చూస్తూనే, ‘థాంక్యూ మామయ్యా!’ మనస్సులోనే అనుకున్నది అపరంజి. విజయవాడలో తనను ఎలాగైనా మోసేయాలనుకున్న వాళ్ళనే పోలీసులు మోసేస్తున్నారు. తను సాధించిన విజయానికి, పెదవులు ఎంతగా బిగపట్టుకున్నా, నవ్వును ఆపుకోలేక హాయిగా నవ్వేసింది.

పోలీసుల చేతిలో చిక్కి గింజుకుంటూ కూడా అపరంజి వంకే చూస్తున్న శంకర్ ఆమె నవ్వుతున్న తీరుకు ముఖమంతా కందగడ్డలా అయింది. కళ్ళూ ఎర్రబడి రక్తాన్ని విరజిమ్మసాగినయ్... ఓటమితో గూడిన అవమానంతో గుండె నిండిపోగా ఆవేశం అతడిని అటూ ఇటూ ఊపేస్తోంది.

రెండు నిముషాల్లోనే పోలీసులు వాళ్ళను తీసుకొని దిగిపోయారు. బోగీలోని పాసింజర్లు చాలామంది ఈ హడావుడికి లేచి కిటికీల్లోనుంచి, తలుపుల దగ్గరా జేరి ప్లాట్‌ఫాం మీదకు చూస్తున్నారు. బయటా ప్రయాణీకులు గుంపులు గుంపులుగా జేరి గుసగుసలాడుతున్నారు. అపరంజీ లేచి కిటికీ దగ్గరకు వచ్చింది.

పక్కబోగీల్లోనుంచి దింపిన వాళ్ళలో ఆడవాళ్ళూ వున్నారు... తలవంచుకొని ఏడుస్తూ వాళ్ళ వెనగ్గా నడుస్తున్న పచ్చచీర కట్టుకున్న అమ్మాయిని చూస్తుంటే మనస్సు చివుక్కుమన్నది అపరంజికి... జాలివేసింది. కానీ తను ఏం చేయగలదు? ఆ పోలీసులే నిజాలు తెలుసుకొని ఆ అమ్మాయిని వాళ్ళ కబంధహస్తాలనుండి బయటపడేయాలి... భగవంతుడే ఆమెకు సాయం చేయాలి... వెనక్కు తిరిగింది బెర్త్ దగ్గరకు వెళ్ళేందుకు...

రాజమండ్రిలో ఎక్కిన ముసలాయన పై బెర్త్‌మీదనుండి మెడక్రిందకు వాల్చి ఎవరినో అడుగుతున్నాడు, “ఏమైంది?” అంటూ.

అటే వెళుతున్న మరో పాసింజరు "టెర్రరిస్ట్‌ల్లా వున్నారు... ఉప్పందిందల్లే వున్నది పోలీసులు పట్టుకు వెళుతున్నారు... మొత్తం ఆడా మగా కలిసి పది మంది దాకా వున్నారు!" చెప్పాడు ఆగల్లా.

మనస్సంతా మామయ్యమీద కృతజ్ఞతా భావంతో నిండిపోగా గుండెనిండా గాలిపీల్చుకొని ఓ నిట్టూర్పు విడిచి తన బెర్త్‌మీద కూర్చున్నది. ఇక పడుకుంటే హైదరాబాద్ వెళ్ళేంతవరకూ ఏ చింతా లేకుండా హాయిగా నిద్రపోవచ్చు...

ఈరోజు తనకు చెడుదినమేకాదు, శుభదినంగూడా- ఓ భయంకరమైన ప్రమాదంనుండి తప్పించుకోగలిగింది... ఆమె మనస్సంతా ఆనందంతో గాలిలో తేలిపోసాగింది...

కానీ ఆ క్షణాన ఆమెకు తెలియదు- తను ఓ ఊబిలోనుండి బయటపడ్డానని సంతోషపడుతున్న ఆ సమయంలోనే, ఆ విజయవాడ స్టేషన్‌లోనే తను మరో పెద్ద ఊబిలో కాలు పెట్టబోతున్నదని... అదే ఆమె జీవితాన్ని అతలాకుతలం చేయబోతున్నదనీను!

* * *

బెర్త్‌మీద కూర్చుంటూనే సెల్ తీసుకొని మామయ్య నంబరుకు కాల్‌చేసింది. "నేను అప్పుని!... చాలా థాంక్స్ మామయ్యా... మొత్తం గ్యాంగ్‌ని పోలీసులు పట్టుకు వెళ్ళారు!" చాలా చిన్నగా తన మాటలు మరెవ్వరికీ వినబడకుండా వుండేలా మౌత్‌పీసుకు చేయి అడ్డంపెట్టుకొని చెప్పింది. "ఈ గొడవంతా మమ్మీకి చెప్పబోకు తెగ కంగారుపడిపోతుంది!"

"డోంట్ వర్రీ బేబీ!... నీ కాల్‌కోసమే ఎదురుచూస్తూ నిద్రపోకుండా కూర్చున్నాను... నేను చెప్పినవాళ్ళు ఆ పనిని నిర్విఘ్నంగా పూర్తిచేశారన్నమాట... వాళ్ళకు కృతజ్ఞతలు చెబుతానులే... బాబాయ్ ఇంటికి వెళ్ళగానే ఫోన్‌చేయ్... విష్ యూ హ్యాపీ జర్నీ!" ఆయన పకపకా నవ్వుతూ సెల్ అఫ్ చేశాడు.

బెర్త్‌మీద పడుకుంటూ చేతిలోకి పుస్తకం తీసుకున్నది– రైలు బయల్దేరగానే లైటార్పి దుప్పటి బిగించేయవచ్చు అనుకుంటూ.

సరిగ్గా ఆ సమయంలోనే ఓ అమ్మాయి ఆమె బెర్త్ పక్కకు వచ్చి భుజాన వున్న బ్యాగ్‌ను ఖాళీగావున్న ఎదురు  బెర్త్‌మీద పడేసి, సూట్కేసును అపరంజి పడుకున్న బెర్త్ క్రిందపెట్టి హ్యాండిల్‌కు చెయిన్ తగిలిస్తోంది లాక్ చేయటానికి.

వచ్చిన ఆ అమ్మాయి వైపుకు ముఖం తిప్పిన అపరంజి వింతగా అటే చూస్తూ ఉండిపోయింది నోరుతెరుచుకొని చాలాసేపు!... ఎక్కడో చూసినట్లున్న ముఖం! కాదు... కాదు... ఎక్కడో చూడటమేమిటి... అద్దంలో తననే తాను చూచుకుంటున్నట్లున్న ముఖం... చటుక్కున లేచి కూర్చున్నది!

చార్ట్‌లో చూసింది ఆ అమ్మాయి పేరు– నివేదిత!

“మీరు నివేదితేనా?” ఆత్రుతను ఆపుకోలేనట్లుగా అడిగింది అపరంజి.

చెయిన్‌ను పెట్టెహ్యాండిల్‌కు మెలివేసి, తాళం వేస్తున్నదల్లా అపరంజి మాటకు తలెత్తింది...

“నేను మీకు ఎలా...” అంటున్నదల్లా ఆగిపోయి రెప్పలార్పటం కూడా మరిచిపోయి అపరంజినే చూస్తూ వుండిపోయింది.

రైలు పెద్దగా కూతకూస్తూ బయల్దేరింది.

కొద్దిక్షణాల తరువాత చటుక్కున లేచి నిలుచుంటూ, “ముందు నా ఈ బెర్త్‌ను ఎత్తనివ్వండి!” అన్నది నోరు పెగల్చుకొని నివేదిత.

“ఎదురు బెర్త్‌లు మూడూ ఖాళీనేలేండి... అటు మధ్యదాన్ని కూడా ఎత్తేస్తే హాయిగా ఎంతసేపైనా కూర్చోనూ వచ్చు, లేదా పడుకోనూవచ్చు...!” అంటూనే, “చాలా గమ్మత్తుగా వున్నది కదా... సృష్టి ఎంత విచిత్రమయింది... మీరు గమనించారో లేదో... మనిద్దరం ఒకే పోలికలో వున్నాం...!” మాటలు ఆపి ఆ అమ్మాయినే చూస్తూ అన్నది అపరంజి.

"నాకూ అదే వింతగా వున్నది!" నివేదితా చిన్నగా అన్నది.

ఇద్దరూ ఒకళ్ళనొకళ్ళు చూసుకుంటూ చాలాసేపు అలాగే ఉండిపోయారు. ఆశ్చర్యంతో వాళ్ళ కళ్ళు పెద్దవయినయి. ఏం మాట్లాడాలో తెలియనంత విభ్రాంతికి లోనయ్యారు.

"నిజమే కోట్లమందిని సృష్టించే బ్రహ్మ మాత్రం ఏం చేయగలడు... ఎన్ని కొత్త ముఖాల్ని తయారు చేయగలడు... ఆయనకూ అప్పుడప్పుడూ చేసిన బొమ్మల్నే చేస్తూ కాపీ కొట్టక తప్పటం లేదన్నమాట... మన రూపాలకి కాపీరైట్ అంటూ లేదుగదా మరి!" అపరంజి పకపకా నవ్వింది.

ఆ నవ్వుకు ఏదో మాయలోనుంచి బయటపడినట్లుగా కళ్ళు రెపరెపలాడిస్తూ తన తలను ఆమె మాటలకు ఒత్తాసుగా ఊపి, క్రింద పెట్టెదగ్గర మోకాళ్ళమీద కూర్చొని దానికి తగిలించివున్న చెయిన్‌కు తాళాన్ని వేసి, దాన్ని మరోసారి లాగి చూచింది నివేదిత.

"తాళం వేయటం అయిందిగదా... ముందు ఆ పెట్టెదగ్గరనుండి లేచి సీటుమీద కూర్చోండి... తరువాత తీరిగ్గా ఆశ్చర్యపోదాం ఇద్దరం... మీరూ హైదరాబాదే వస్తున్నారా?" అన్నది దిండును తలవైపు కిటికీ పక్కగా నిలబెట్టి కాళ్ళు బారజాపుకొని ఆనుకు కూర్చుంటూ.

నివేదితా కోలుకున్నట్లుగా లేచినిలబడింది గూడలెగరేస్తూ. "రియల్లీ వండర్‌ఫుల్... కవలపిల్లలు, లేదా అక్కా చెల్లెళ్ళు ఒకే పోలికలో వుండటం సహజం... అక్కడక్కడా చూస్తుంటాం... కానీ ముక్కూ మొహం తెలియని మనం ఇలా ఒకే పోలికలలో వుండటం ఊహించలేని విషయం!" ఎదురు బెర్త్‌మీద దుప్పటి పరిచి దానిమీద కూర్చుంటూ అన్నది నివేదిత. "లక్షల్లోనో, కోట్లలోనో ఇలాంటిది జరిగే అవకాశముండవచ్చు!"

"ఇక దాన్ని తీరిగ్గా పడుకొని ఆలోచిద్దాంగాని... లైటార్పేదా?" అన్నది అపరంజి ఆ అమ్మాయితో చొరవగా.

"ఆపేయండి... ఒకటీ నలభైకి రావాల్సిన బండి రెండున్నరకు వచ్చింది... అంటే మనం హైదరాబాద్‌కు ఏడులోపు వెళ్ళలేం!... నేను ఒకరోజు ముందు బయల్దేరి చాలా మంచి పని చేశానన్నమాట... దిల్‌షుక్‌నగర్‌లోని కోచింగ్ సెంటర్‌లో ఎల్లుండి తొమ్మిది గంటలకు రిపోర్ట్ చేయాలి... అసలు రేపే బయల్దేరదామనుకున్నాను కానీ, ఈ రైళ్ళమీద నమ్మకం లేక ఓ రోజు ముందు బయల్దేరాను!"

"మన్ని సృష్టించిన ఆ బ్రహ్మే మనల్ని ఇలా కలపాలని అనుకొని వుంటాడు... అందుకే ఒకరోజు ముందు బయల్దేరారు మీరు... లేకపోతే మనకు జీవితంలో కలిసే అవకాశమే ఉండేది కాదేమో!" అన్నది లైటార్పుతూ అపరంజి. "ఇప్పటిదాకా ఒక టెన్షన్‌లో వున్నాను... ఇప్పుడేమో మరో విచిత్రమైన పరిస్థితిలో పడిపోయాను!" అన్నది చాలా చిన్నగా. "ఇది ఊహించలేని నిజం... రియల్లీ ఏ వండర్!"

"నాకూ అలాగే వున్నది!" అన్నది నివేదిత. "మీరెక్కడనుంచి వస్తున్నారు?"

"వైజాగ్‌నుంచండీ!"

"నాకు ఆ ఊరే తెలియదుగాని, రైలు స్టేషన్‌ని మాత్రం అప్పుడప్పుడూ చూసివుంటాను... మా నాన్న బ్యాంక్‌లో సీనియర్ మేనేజర్ అవ్వటంతో భువనేశ్వర్‌లోనూ, కలకత్తాలోనూ పనిచేశారు... అక్కడనుంచి తిరుపతి వెళ్ళేటప్పుడు, ఆంధ్రప్రదేశ్‌లో బంధువుల ఇళ్ళల్లో ఫంక్షన్స్ ఉన్నప్పుడూ ఇటు పక్కకు రావాలీ అంటే విశాఖపట్టణం ద్వారానే గదా రావాల్సింది!"

"ఇప్పుడు విజయవాడలో వుంటున్నారా?"

"అవునండీ... కోల్‌కతా నుండి చెన్నయ్ వెళ్ళి మూడు సంవత్సరాలు వున్న తరువాత విజయవాడకు వచ్చాం... మేం మన రాష్ట్రంలో కంటే నార్త్‌లోనే ఎక్కువ కాలం గడిపాం!" అన్నది నివేదిత.

"మీరు పుట్టింది ఎక్కడ?"

"కోల్‌కతాలోనే... మా నాన్నకు మొదటిసారి ఆఫీసర్‌గా ప్రొమోషన్ వచ్చినప్పుడు

అక్కడకు ట్రాన్స్‌ఫర్ చేశారట... అక్కడకు వెళ్ళిన మొదటి సంవత్సరంలోనే పుట్టానట నేను... అందుకే కాస్త బెంగాలీ వాసనతో నివేదిత అని పేరు పెట్టారు... తరువాత మూడేళ్ళకు గుంటూరు వచ్చి మూడేళ్ళు ఉన్నమాట వాస్తవమేగాని, ఆ తరువాత ఎప్పుడూ ఆంధ్రప్రదేశకు రాలేదు... భువనేశ్వర్, అహ్మదాబాద్, నాగపూరు, ముంబయ్... ఇలా ప్రతి మూడేళ్ళకూ అటూ ఇటూ మారుతునే వున్నాం... చివరకు మా డాడీ రిటైర్‌మెంట్ దగ్గర పడుతుండటంతో ఆంధ్రాకు పోస్టింగ్ ఇవ్వమని ఒత్తిడి తీసుకువస్తే విజయవాడకు మార్చారు... మేం ఇక్కడకు వచ్చి ఆరునెలలు అయింది!" అన్నది ఆ అమ్మాయి. "మిమ్మల్ని తీసుకు వెళ్ళి మా డాడీకి చూపించాలి!" అన్నది నవ్వుతూ కళ్ళు పెద్దవి చేసుకొని ఇంకా అపరంజినే చూస్తూ నివేదిత. "ఆయనా థ్రిల్ ఫీలవుతారు!"

ఆ అమ్మాయి నవ్వినా ఆ పళ్ళూ, పెదాలు తనకు లాగానే మెరవటం గుర్తించింది అపరంజి. 'ఇది చాలా వింతయిన విషయమే!'

"మీది మొదటినుంచి విశాఖపట్టణమేనా?"

"ఆహా... మా అమ్మది అనకాపల్లి అవ్వటంతో అక్కడ పుట్టానట... పెరగటమంతా వైజాగే... నాకు ఊహ తెలిసినప్పటినుండీ మానాన్న రియల్ ఎస్టేట్ బిజినెస్‌లోనే వున్నారు... ఈ మధ్యనే అక్కడ వందో ఎపార్ట్‌మెంట్ కట్టటం పూర్తిచేశానంటూ గ్రాండ్‌పార్టీకూడా ఇచ్చారు!" అన్నది ఆ మాటల్లో కాస్తంత గర్వం తొంగిచూస్తుండగా.

"హైదరాబాద్‌లో బంధువులున్నారా?"

"మా బాబాయి వుంటాడు... ప్రతి సంవత్సరం వెళ్ళి అక్కడ ఓ పదిరోజులుండి వస్తుంటాను... అలాంటిదే ఈ ట్రిప్పుకూడా!" అన్నది. "మీరో?"

"సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాను... అక్కడ ఓ కోచింగ్ సెంటర్‌లో జేరుతున్నాను... పదిహేను రోజులక్రితం నేనూ మానాన్నా వచ్చి వాళ్ళతో మాట్లాడి వెళ్ళాం... రెండు నెలలు ఉంటాను!"

"సో... కలెక్టర్ అవ్వాలనేది మీ కోరికన్నమాట... నేటి పరిస్థితుల్లో ఆ సీట్‌లో కూర్చొని ఒత్తిళ్ళు తట్టుకోవటం ఇబ్బందిగా వుండదా?" అన్నది నివేదిత ముఖంలోకి పరిశీలనగా చూస్తూ అపరంజి.

"దేంట్లో లేదండి ఒత్తిడి... ఏ పని చేయకుండా ఇంట్లో కూర్చోవటం కూడా ఒత్తిడితో కూడిందే... చూద్దాం... ముందు సెలక్ట్ అవ్వాలిగదా... ఆ తరువాతే ఆ ఒత్తిడిలగురించి ఆలోచించాల్సింది... మీరేం చేస్తున్నారు?"

"నేను ఎలక్ట్రానిక్స్‌లో ఎమ్.టెక్ చేస్తున్నాను... వీలయితే విదేశాలకు వెళ్ళి అనుభవాన్ని జోడించుకొని వచ్చి ఇక్కడే ఏదైనా ఇనిస్టిట్యూట్ ప్రారంభిద్దామని... నాన్నా అదే బాగుంటుందంటున్నాడు... నేను దాంట్లో నిలదొక్కుకుంటే తన వ్యాపారాన్ని మానేసి విశ్రాంతి తీసుకోవాలనేది ఆయన కోరిక... మనిషికి తృప్తే అత్యంత ఆనందాన్ని కలిగించేది... తను సంపాదించింది చాలు అనేది ఆయన ఉద్దేశ్యం!"

"మీరు చెప్పింది నిజమే... చాలా అనర్థాలకు కారణం మనిషిలో తృప్తిలేకపోవటమే... కోట్లకు కోట్లు సంపాదిస్తూ, ఆస్తిని పెంచుకు పోతున్నా తినే పదార్థాలలో మార్పు వుండదుకదా!" నివేదిత నవ్వింది. "మా డాడీ అదే అంటారు... తిరిగినంతకాలం దేశాన్ని పట్టుకు తిరిగాను... ఇప్పటికి మన రాష్ట్రానికి రాగలిగాను... ఇక్కడే ఓ చిన్న గూడు ఏర్పరుచుకుంటే ఆ నీడలో జీవితాంతం ఏ చీకూ చింతా లేకుండా గడిపేయవచ్చు అని... మా అమ్మయితే ప్రతి శుక్రవారం కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి మించిన ఆనందం ఇంకెక్కడ దొరుకుతుంది అంటుంది!'

అపరంజి సెల్‌లో టైం చూచింది– రెండు దాటుతోంది.

"ఇక పడుకుందామా... రాబోయే ఈ నాలుగు గంటలే కాదు... ఆ బ్రహ్మ మనిద్దరినీ ఎందుకు ఒకే విధంగా సృష్టించాడోగాని జీవితాంతం మనం కలుస్తూనే వుండాలనేది నా మనస్సులోని కోరిక!"

"నాకూ ఆలాగే అనిపిస్తోంది... తెలియని ఆత్మీయతే మనల్ని బంధిస్తున్నదేమో!"

"మనం ఒకే పోలికలో వున్నాం... ఒకే వయస్సులో వున్నాం... అవునూ- మీ పుట్టిన తేదీ ఏమిటి?" అపరంజి ఆత్రంగా అడిగింది.

"జనవరి పదహారు పందొమ్మిది వందల తొంభై!" చెప్పింది నివేదిత.

"మైగాడ్... నాదీ అదే!" ఆశ్చర్యంతో పెద్దగా అరిచింది అపరంజి.

# 3

"మైగాడ్...!" మరోసారి ఉద్రిక్తతకు లోనుగాకుండా ఉండలేకపోయింది అపరంజి. "ఇదో వింతలో వింత... మన వెనుక పెద్ద విచిత్రమే ఉన్నట్లనిపిస్తోంది!"

"నాకూ అలాగే వున్నది... పోలికలేకాదు, పుట్టిన తేదీకూడా ఒకటే అవ్వటం ఊహించలేని విషయం!"

చాలాసేపు ఎవరి ఊహల్లో వారు ఉండిపోయారు.

"దీనివెనుక నిజాల్ని మనం ఛేజించక తప్పదు!" అన్నది పడుకున్నదల్లా లేచికూర్చుంటూ అపరంజి. ఆమెకు చాలా ఎక్సయిటింగ్‌గా వున్నది.

"ప్రపంచంలో ఎన్నో వింతలు జరుగుతున్నయి... అందులో ఇది ఒకటి అవ్వవచ్చు... మాకు ఆంధ్రాతో పెద్దగా సంబంధాలు లేవు... అంతా నార్త్ జీవితమే అవ్వటంతో ఇక్కడ బంధువులు కొద్దిమంది వున్నా సన్నిహితత్వం తక్కువ... చెప్పానుగదా ఎప్పుడో నా చిన్నప్పుడు గుంటూరులో మూడేళ్ళు ఉన్నామని... నేను కోల్‌కతాలో పుట్టాను... మీరు అనకాపల్లిలో పుట్టారు... ఎయిత్ వండర్‌గా దీన్ని గిన్నీస్‌లోకి ఎక్కించాల్సిందే!" అన్నది నివేదిత. ఆమె కూడా నిజాల్ని ఆస్వాదించటానికి చాలా ఆతురత పడుతున్నది.

"మన పేరెంట్స్‌నే అడిగితే!"

"వాళ్ళు మాత్రం ఏం చెప్పగలుగుతారు... మా వాళ్ళూ మీవాళ్ళూ ఇంతవరకూ కలిసే అవకాశమే లేదుగదా!" నివేదిత చాలా తెలివిగలది. అందుకే సివిల్స్‌కు

తయారవ్వాలని పట్టుబట్టి మరీ కోచింగ్‌లో జేరబోతోంది. ఇప్పటికే స్వయంగా ఆమె చాలా వరకూ తయారయింది. ఇప్పుడు తీసుకోబోతున్న కోచింగ్ ఆ ప్రయత్నంలో చివరి అంకం.

"నేను పుస్తకాల పురుగుని... కనబడ్డ ప్రతిపుస్తకాన్ని చదవటం అలవాటు... షేక్స్పియర్ తన నాటకం 'ట్వెల్త్ నైట్'లో సోదరుడిని, సోదరిని ఒకే పోలికలతో తీర్చిదిద్దాడు. అలాగే షెర్డాన్ తన 'కామెడీ ఆఫ్ ఎర్రర్స్' లో కూడా ఒకే పోలికలున్న ఇద్దరిని సృష్టించాడు. తెలుగులోనూ కందుకూరు వీరేశలింగం పంతులుగారు తన 'చమత్కారమంజరి'లో రాశారుకదా?"

"అవన్నీ కల్పిత పాత్రలు... సినిమాలూ వచ్చినయి ఆలాంటి పాత్రలతో... పెద్దపెద్ద హీరోలంతా డబుల్ రోల్స్ వేసినమాట నిజమే కానీ మనం ఇప్పుడు భౌతికంగా ఎదురెదురుగ్గా కూర్చున్నామనే విషయాన్ని మరిచిపోవద్దు!"

నివేదితా అపరంజి మాటలకు ఆలోచనలో పడింది. "నెట్‌లో చూసి ఈలాంటి ఒకే పోలికలు ఉన్నవాళ్ళు ప్రపంచంలో ఎక్కడెక్కడ వున్నదీ తెలుసుకోవచ్చు... నేను చూస్తాను... వీలుంటే మీరూ చూడండి!"

"తప్పకుండా... నేను దేన్నీ తేలిగ్గా వదిలిపెట్టను... పరిశోధన అనేది మనల్ని ఉత్తేజపరుస్తుంది కూడా... చూద్దాం... ఈ విషయాన్ని ఎలా వదిలిపెట్టనో, మిమ్మల్నీ వదిలిపెట్టను!" అన్నది పకపకా నవ్వుతూ.

నివేదితా నవ్వింది.

"ఈరోజు నాకు అన్నీ ఉద్రిక్తత కలిగిస్తున్నవే!" అన్నది కళ్ళు పెద్దవి చేసుకుంటూ అపరంజి రెండు నిముషాల తరువాత. "బయల్దేరిన వేళావిశేషం అలాంటిదన్నమాట!"

"ఇంకేమైంది!"

"నేనో భయంకరమైన ట్రాప్‌లో పడవలసినదాన్ని... అదృష్టం కలసిరాగా తప్పించుకోగలిగాను!" అంటూ రైలెక్కినదగ్గరనుంచి విజయవాడలో ఆ ముఠాను

పోలీసులు రైలు దించేంతవరకూ జరిగిన విషయాలన్నీ తు.చ.తప్పకుండా చెప్పటమే కాకుండా, తన ఫోటోను వాళ్ళ సెల్‌లో తీసినట్లుగానే తనూ వాళ్ళ ఫొటోలను తీసిన వైనాన్ని చెప్పి వాటిని నివేదితకు చూపించింది.

"మైగాడ్!" ఈసారి ఆ మాట అనటం నివేదిత వంతయింది. "ఇంత ఘోరంగా వుంటుందా ప్రపంచం!"

"అవును... ఇంతకంటే ఘోరంగా వుండవచ్చు... మీరు జిల్లాకే అధికారి అవ్వాలని కోరుకుంటున్నారుగదా... మీ ఉద్యోగ నిర్వహణలో ఎప్పుడూ, ఎవ్వరూ ఊహించలేని ఎన్నో విషయాలు మీ దృష్టికి తప్పకుండా వస్తయి...!"

నివేదిత ఏం మాట్లాడాలో తెలియనట్లుగా మౌనంగా వుండిపోయింది.

"జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే నేను ఈరాత్రి రైలులో అనుభవించింది చిన్న తుమ్రీ మాత్రమే!... మనకు తెలియనివి, ఊహించలేనివి ఎన్నో భయంకరమైన ఘోరాలు జరుగుతుంటయి... విషయం తెలుసుకున్నప్పుడు ఇలాంటి మనుష్యులు కూడా వుంటారా అని ఒళ్ళు గగుర్పొడుస్తుంది!" అన్నది అపరంజి.

నివేదిత ఆమెనే కన్నార్పకుండా చూస్తున్నది. రైలు మ్రోత తప్ప మరేమీ వినబడటంలేదు. ప్రయాణీకులంతా నిద్రలో వున్నారు. వాళ్ళిద్దరూ మాత్రం వెలుగుతున్న నీలి బలుబు కాంతిలో ఒకళ్ళనొకళ్ళు రెప్పలార్పటం కూడా మరిచిపోయినట్లుగా చూసుకుంటూనే వున్నారు.

"పూర్వకాలంలో లేరని కాదు... అప్పుడూ కీచకులు వున్నారు... రావణాసురులు, కంసులు, హిరణ్యకశుపులూ వున్నారు... దుర్యోధనులు, దుశ్శాసనలూ వున్నారు... అయినా వాళ్ళ శాతం తక్కువగా వుండేది... నీతికీ నిజాయితీకీ విలువనిచ్చే వాళ్ళు ఎక్కువుండేవారు... ఇప్పుడాశాతాలు అటూఇటూ అయిపోయినయి!" భవిష్యత్తు ఎంత భయంకరంగా వుంటుందో అన్నంత దిగులుగా చూస్తూ అన్నది అపరంజి. "సమాజం పూర్తిగా కలుషితమయి అట్టడుగు స్థాయికి దిగజారిపోతోంది!"

"విద్యార్థి దశలో నీతుల్ని మాత్రమే నేర్చుకోగలిగిన మనకు ఇక అవినీతుల భాగవతాన్ని గురించి జీవితమే నేర్పాలి!" నివేదిత దిగులుగా అన్నది ఆ మాటలను.

"నీతి దిగజారిపోతున్నప్పుడు నిజాయితీగా అధికారం చెలాయించటమూ కష్టమే... నేను మిమ్మల్ని నిరాశపుచ్చటంలేదు... ముందుగానే మీరు కొన్ని నిజాలు తెలుసుకుంటే తరువాత మనం ఇప్పుడు ఒకళ్ళనొకళ్ళం చూసుకొని విభ్రాంతి చెందినంతగా మీరు ఎదుర్కోబోయే సమస్యలకు ఆశ్చర్యపోరు!"

"ఇది ఒక్క మన రాష్ట్రంలోనేనా... అంతా ఇంతేనా?"

"నేటి ప్రపంచమంతా ఇంతే... దోపిడీ, దగా, మోసం చాలామందికి వెన్నతో పెట్టిన విద్య అయింది!" అన్నది అపరంజి చిరాగ్గా. ఆమెకు ఇంకా తనకు తప్పిన ప్రమాదం గుర్తుకు వస్తుంటే గుండె దడదడలాడుతున్నది.

'తను ఆ రాక్షసుల చేతిలో చిక్కివుంటే?' ఆమె ఒళ్ళంతా భయంతో గగుర్పొడిచింది. ఒణుకు శరీరాన్ని ఊపింది... ఆ జీవితాన్ని ఊహించలేదు... జీవితాంతం గుర్తించుకోదగ్గ రోజు ఇది... మరిచిపోలేదు... అంతేకాదు అటు నివేదితా జీవితాంతం తనను వెంటాడుతునే వుంటుంది...

ఇద్దరికీ నిద్ర రావటం లేదు. ఆలోచనల నడుమ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

"ఇప్పుడు మిమ్మల్ని చూస్తుంటే ఇద్దరం ఒక తల్లికి పుట్టిన బిడ్డలమేనేమో అనిపిస్తోంది!" అన్నది దూరతీరాలకు పరుగెడుతున్న కొత్త ఊహలతో మనస్సునంతా నింపుకుంటూ, కళ్ళు మూసుకొని, అపరంజి. "అలా అవ్వాలనీ లేదనుకోండి... అయినా, అయితే?..." ఆమె ప్రతిస్పందన కోసం అన్నట్లుగా చివాలున కళ్ళు తెరిచి ఆమెనే సూటిగా చూస్తూ అన్నది.

"అది ఎలా తెలుసుకోవటం?" నివేదితా ఆలోచనలలో పడింది. 'అపరంజి చెప్పినదాంట్లో అసంబద్ధత ఏమీ లేదు!'

"మీరు సివిల్స్‌కు తయారవుతున్నారంటే నాకంటే ఎన్నో రెట్లు తెలివిగలవారు...

మీరే ఆలోచించండి!"

నివేదిత పేలవంగా నవ్వింది. "నేను అమ్మా నాన్నల ప్రేమ అనే తెర వెనుకే మరే ప్రపంచమూ తెలియనంత గుంభనగా పెరిగిన దాన్ని... మీరు ఇందాక చెప్పారే రైలెక్కుతూనే ఎదుర్కున్న భయంకరమైన సంఘటనని... నేనైతే ఏడుస్తూ కూర్చునేదాన్నేకాని మీలాగా ధైర్యం చేసి వాళ్ళను చిత్తుచేసి ఉండేదాన్ని కాదేమో!"

"అలా ఎందుకనుకోవాలి... పరిస్థితులే మనస్సును ఉత్తేజపరిచి, ఏదైనా మార్గాన్ని చూపిస్తాయి... ముందు ధైర్యం తెచ్చుకోవాలి... అప్పుడే మనస్సును నిర్దేశించుకోగలుగుతాం... విజయం సంపాదించిపెట్టే మార్గాన్ని ఎంచుకోగలుగుతాం... మీకా ధైర్యంలేదని ఎవరంటారు?... మీమీద మీకా నమ్మకం లేకపోతే సివిల్స్‌కు తయారవ్వటానికి ప్రయత్నించేవారే కాదు... మీరు అందులో నెగ్గుతారు కూడా... అప్పుడే మీ మనస్సులో పోరాటం ప్రారంభమవుతుంది... కుళ్ళుతున్న సమాజంతో పోరాటం ప్రారంభిస్తారు... ఎంత సున్నితమైన మనస్కులయినా సమస్యలు చుట్టుముట్టినప్పుడే రాటుతేలి కఠినంగా ప్రవర్తించగలిగేది, విజయాలు పొందగలిగేది... దానికి కావాల్సింది దృఢమైన మనస్సే... వెరపును అధిగమిస్తే విజయాలను స్వంతం చేసుకోవటం బహుతేలిక!"

నివేదితను ఆలోచనలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నయి. అపరంజిని చూస్తున్నా, ఆమె మాటలు వింటున్నా- ఆమెకున్నంత ధైర్యం తనకు లేదేమో అనిపిస్తోంది. పుస్తకాలు చదువుకుంటూ ఇంట్లో కూర్చోవటం కాదు, ప్రపంచాన్నే చదవటం నేర్చుకోవాలి... సివిల్స్‌కు అదీ ముఖ్యమే!

"మూడవుతున్నది... పడుకుందాం... ఈ రైలు ఏ బీబీనగర్‌లోనో, ఘటకేశ్వర్‌లోనో సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్లాట్‌ఫాం ఖాళీలేక పడివుండకుండా వుంటే ఏడుగంటలకన్నా నాంపల్లి జేరగలుగుతాం... మీరూ నాంపల్లిలోనే దిగుతారు కదా!" అంటూనే ఆ బెర్త్‌మీద కాళ్ళ బారజాపుకొని పడుకున్నది అపరంజి.

"అవునండీ... అక్కడనుంది దిల్‌షుక్‌నగర్ దగ్గరకదా!" నివేదితా పడుకుంటూ

చెప్పింది.

"మీరు హైదరాబాద్‌లో ఎన్నాళ్ళుంటారు?" అడిగింది అపరంజి.

"వాళ్ళిచ్చే కోచింగ్ రెండు నెలలు!"

"ఎక్కడుంటారు?"

"వసతి ఏర్పాటు కూడా వాళ్ళదే... దానికీ డబ్బు తీసుకున్నారు... అంతా దిల్‌షుక్‌నగర్‌లోనే... మీరో?"

"నేను పది రోజులుంటాను... ఖైరతాబాద్‌లో మా బాబాయిగారుంటారు... వాళ్ళమ్మాయి రేపుదయం అమెరికానుంచి వస్తోంది... అదంటే నాకు చాలా ఇష్టం... నా ఈడుదే... ఇండియాలో పదిరోజులుంటుంది... అది ఉన్నన్నిరోజూలూ ఉండాలనే వచ్చాను... అదిగాక ఇంకా అక్కడ చాలామంది స్నేహితురాళ్ళున్నారు... వాళ్ళను కలవాలి... రేపుదయాన్నే నిమ్మీకోసం ఎయిర్‌పోర్ట్‌కు బయల్దేరటంతో నా కార్యక్రమం ప్రారంభమవుతుంది... ఇవ్వాళంతా విశ్రాంతి... ఫోన్లమీద మా స్నేహితురాళ్ళందరికీ నేను వచ్చిన వార్త చెప్పటం, బాబాయి పిన్నితో కబుర్లు చెప్పుకోవటం మాత్రమే ఈరోజున నేను చేసే పని!" అన్నది నవ్వుతూ అపరంజి.

"నేనూ రేపుదయం కోచింగ్‌లో జేరితే రెండు నెలలు వరకూ నాకదే ప్రపంచం!... అఫ్ కోర్స్ అది నాకు ఎంతగానో నచ్చేదే అనుకోండి!"

తాదప్యంగా నివేదిత ముఖంలోకే చూస్తూ, "మిమ్మల్ని చూస్తుంటే నాకు మీరూ మా నిమ్మీ అంత ఆత్మీయులే అనిపిస్తోంది... దానికి మిమ్మల్ని చూపించాలి... అసలు నిజంగా మనం స్వంత అక్కా చెల్లెళ్ళమే అయితే... సారీ!" నవ్వింది అపరంజి. "ఒకేరోజు పుట్టిన మనం ఎవరు ఎవరికి అక్కవుతామో తెలియదుగదా... పుట్టిన సమయం తెలుసుకుంటేనేగాని ఓ నిర్ణయానికి రాలేం... అయితే నాకో పనిచేయాలని వున్నది మీకభ్యంతరం లేకపోతే!"

"చెప్పండి!"

"మనం డిఎన్ఎ టెస్ట్ ఎందుకు చేయించుకోగూడదు... నిజానిజాలు తెలిసే అవకాశమున్నది కదా... మనం నిజంగా ఒక తల్లిబిడ్డలమే అయితే అప్పుడు అసలు తల్లిదండ్రులు ఎవరా అని పరిశోధన ప్రారంభించవచ్చు!"

"నిజమే... మీ ఆలోచన బాగానే వున్నది... నిజం తెలుసుకోవటంలో తప్పేమున్నది... నాకూ అభ్యంతరం లేదు!"

అపరంజి కొన్ని నిముషాల వరకూ ఆలోచనలలో పడినదానిలా నిశ్శబ్దంగా ఉండిపోయింది.

"నా ఉద్దేశ్యలో మన పరిశోధన పూర్తయి నిజానిజాలు బయటపడేంత వరకూ ఈ విషయాన్ని రహస్యంగా ఉంచితే ఎలా ఉంటుందా అని చూస్తున్నాను!"

"నాకూ అదే బాగుంటుందనిపిస్తోంది... అసలు మనం కలుసుకున్న విషయమే మరొకరికి తెలియకుండా వుంటే మరీ మంచిది... ఏమీ లేకపోయినా అనవసరంగా చర్చలను, లేనిపోని రభసను ఆహ్వానించినట్లుగా వుంటుంది!"

"గుడ్... మంచిమాట అది... అంతేకాదు ఆ పరీక్షా ఫలితం ఎలా వున్నా మనం మానసికంగా జీవితాంతం ఆత్మీయులగానే ఉండటం ఎంతో ఆనందం కలిగిస్తుందనేది నా మనస్సులోని మాట!"

అప్పుడే ఇద్దరూ ఒకళ్ళ సెల్‌నంబరు మరొకరిదాంట్లో నిక్షిప్తం చేసుకున్నారు. తరువాత మరేమాటలకూ అవకాశమివ్వకుండా దుప్పట్లు కప్పేసుకున్నారు- నిద్రపడుతుందా, లేక మనస్సు ఆలోచనలతో నిండిపోతుందా అని కూడా ఆలోచించకుండా.

తిరిగి ఆరున్నరకు ఇద్దరూ లేచి ఎదురెదురుగా కూర్చున్నారు. అప్పుడు రైలు ఘటకేశ్వర్‌దాటి చర్లపల్లిలో వున్నది. అపరంజి అన్నమాటే నిజమయింది. అది ఆగవలసిన స్టేషన్ కాకపోయినా అక్కడ ఆగివున్నది.

అపరంజి లేస్తూనే సెల్ ఆన్‌చేసి తల్లికి రింగిచ్చింది. "మమ్మీ! గుడ్‌మార్నింగ్...

క్షేమంగా చర్లపల్లిదాకా జేరా... ఇంజను కాస్త వేడెక్కిందట విశ్రాంతి తీసుకుంటోంది... ఇంటికి వెళ్ళింతరువాత మళ్ళా ఫోన్ చేస్తా... డాడీకి చెప్పు!" అంటూనే సెల్ ఆఫ్ చేసి నవ్వింది. "మా అమ్మకు ప్రతిదీ కంగారే... నేను ఇంటిదగ్గర బయల్దేరిన దగ్గరనుండి అనుకున్న గమ్యానికి జేరి ఫోన్ చేసేంతవరకూ ఆమె బిపి రైజ్‌లోనే వుంటుంది!"

"మా అమ్మా అంతే... నా ఉద్దేశ్యంలో తల్లులంతా అంతే... తండ్రులకు మనస్సులో ఏముంటుందో తెలియదుగాని వీళ్ళలాగా బయటపడరు!" అన్నది నివేదిత నవ్వుతూ.

"నిజమే...!" అంటూ ఏదో చెప్పబోతున్న అపరంజిని, ఆమె ఎదురుగా కూర్చున్న నివేదితను చూస్తూ అటు వెళ్తూ ఆగిపోయిన ఓ ముసలామె, "మీరు కవలలా?" అన్నది నోరంతా తెరుచుకొని, చేతిని జారిపోయిన బుగ్గలమీద వేసుకుంటూ. "చాలా బాగున్నారమ్మా... ఏ ఊరు మీది?" అన్నది.

"మాది సికింద్రాబాదండి!" అపరంజి ఆలస్యం చేసి ఆమెకు మరిన్ని ప్రశ్నలకు అవకాశమివ్వదలుచుకోలేదు.

"ఎక్కడనుంచి వస్తున్నారు?"

"విజయవాడనుంచండి!"

"ఇద్దరూ ఒకటే తరగతా?"

"అవునండీ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్లో వున్నాం!" అన్నది వస్తున్న నవ్వును ఆపుకుంటూ.

"బాగున్నదమ్మా!" అంటూ ఆమె ముందుకు వెళ్ళిపోయింది వడివడిగా. తనవాళ్ళందరినీ తీసుకు వచ్చి చూపిస్తుందేమోకూడా అనుకున్నది అపరంజి లోలోనే నవ్వుకుంటూ.

ఆమె చొరవగా అబద్ధాలు చెప్పిన తీరుకు విస్మయం చెందింది నివేదిత. "మీరు..." అదే అనబోయింది.

అపరంజి ఫక్కున నవ్వింది. "సరే! ఎలాగూ కలిశాం... అందరికీ కవలల్లాగానే కనపడుతున్నాం... మనం ఎవరమయినా అక్కా చెల్లెళ్ళు లాగానే ముందుముందు బ్రతకటంలో ప్రమాదమేమీ లేదుగదా... అందుకే ఇక 'మీరు' అంటూ ఒకళ్ళనొకళ్ళం గౌరవించుకోవటం చూసేవాళ్ళకు ఎబ్బెట్టుగా వుండటమేగాకుండా లేనిపోని అనుమానాలకు దారితీస్తుంది... హాయిగా 'నువ్వు' అంటూ స్వేచ్ఛగా మాట్లాడుకుందాం... ఏమంటావ్ నివేదితా!" అన్నది అపరంజే మొట్టమెదటిగా.

నివేదితా ఆమెను ఆప్యాయంగా చూస్తూ, "అది నాకూ ఆనందాన్ని కలిగిస్తుంది!" అన్నది కళ్ళు మెరుస్తుండగా. "మీకయితే కజిన్స్ ఉన్నారు... నాకు బంధువులే తక్కువని చెప్పానుగదా... నాకూ ఓ సోదరి ఉందని చెప్పుకోవటం ఆనందమే!"

* * *

గోదావరి ఎక్స్‌ప్రెస్ చర్లపల్లిలో ఆగటమేగాకుండా సికింద్రాబాద్ ఔటర్ సిగ్నల్ దగ్గరకు వచ్చి పదినిముషాలబట్టీ ఆగివున్నది. అప్పుడు సమయం ఎనిమిది గంటలపైన పావుగంట అయింది.

అపరంజి సెల్ రింగయింది. కాల్ చేసింది ఆమె బాబాయి.

ఆన్ చేస్తుండగానే, "ఎక్కడున్నావు?... సికింద్రాబాద్‌కైనా ఇంకా జేరావా లేదా?" అడిగాడు ఆయన.

"లేదు బాబాయ్... అవుటర్‌లో ఉన్నాం!" అన్నది నవ్వి.

"అయితే ఒక పనిచేయ్... నేను పద్మారావ్‌నగర్‌లో పనుండి వచ్చాను... నా పనయి ఇంటికి వెళుతున్నాను... నువ్వు సికింద్రాబాద్‌లో దిగిపో... ఇద్దరం కలిసి ఇంటికి వెళదాం... నువ్వు మళ్ళా నాంపల్లినుండి ఆటోలో రావటం దేనికి... నేను స్టేషన్‌ముందు పార్కింగ్‌లో కారులో కూర్చొని వుంటాను...!"

"ఇంకా లేటయితే నువ్వు ఇబ్బంది పడతావేమో బాబాయ్!"

"ఏం ఫరవాలేదు... నువ్వు వచ్చేస్తే సరాసరి ఇంటికి వెళ్ళిపోవచ్చు!"

"ఓకే... థాంక్యూ బాబాయ్!" సెల్ ఆఫ్ చేస్తుండగానే రైలు కదిలింది.

మరుక్షణంలోనే తిరిగి సెల్‌మ్రోగింది. చేసింది సుధీర్. "ఇంటికి జేరావా, అంజీ!" అన్నాడు అవతలనుంచి అతడు అపరంజి సెల్ ఆన్ చేస్తుండగానే.

చికాగ్గా ముఖం చిట్లించింది అపరంజి. "నేను చేసేంతవరకూ నువ్వు చేయబోకు... రైలు ఇప్పుడే దిగబోతున్నాను!" అంటూనే అతడికి మరో మాటకు అవకాశమివ్వకుండా ఆఫ్ చేసింది.

పెట్టెతీసి సీటుమీద పెట్టింది. బ్యాగ్ పెట్టింది. "నేను ఇక్కడే దిగిపోతున్నాను నివేదితా... మా బాబాయ్ స్టేషన్‌కు వస్తున్నాడు... నువ్వు హాస్టల్‌కు వెళ్ళగానే ఫోన్ చేస్తావుగదా!"

"అలాగే!"

రైలు ప్లాట్‌ఫాం మీదకు వస్తుండటంతో బ్యాగ్‌ను ఒక చేత్తో పట్టుకొని, నివేదిత చేతిని తన చేతిలోకి తీసుకొని ఆప్యాయంగా పట్టుకున్నది. ఆమె చేయి పట్టుకున్నప్పుడు చాలా ఉద్రిక్తతకు లోనయింది అపరంజి. శరీరమంతా ఏవో విద్యుత్ తరంగాలు సోకినట్లనిపించగా సన్నని ఊపు ఆమె శరీరాన్ని ఊపింది. శక్తినంతా కూడగట్టుకొని ఆమె చేతిని బలంగా నొక్కింది.

"బై!" అంటూనే ముందుకో అడుగువేసింది.

ప్రయాణీకులు చాలామంది దిగేందుకు తలుపుల వైపుకు సామాన్లతో వరుసగా నిలబడివున్నారు. నివేదితా అపరంజి వెనుకగా ఓ అడుగు వేసింది.

మూడో నంబరు ప్లాట్‌ఫాం మీద రైలు ఆగింది. తరువాత ఐదు నిముషాలకు గాని అపరంజి క్రిందకు దిగలేకపోయింది. ఆమే ఆఖరు అవ్వటంతో నివేదితా వెనగ్గా వచ్చి తలుపు దగ్గర ఆగిపోయింది.

"నాంపల్లిలో దిగిం తరువాత ఆటోవాళ్ళతో జాగ్రత్త... అక్కడనుంచి దిల్‌షుక్‌నగర్‌కు మహా అయితే మీటరు యాభై, అరవైకి మించి కాదు... వందిస్తావా,

రెండొందలు ఇస్తావా అంటారు!" అన్నది నివేదితనే చూస్తూ.

"అలాగే!"

"నువ్వు హాస్టల్‌కు జేరగానే నాకు రింగివ్వు!" నివేదితను వదిలి వెళ్ళటానికి ఇబ్బంది పడుతున్నట్లుగా కొద్దిక్షణాల వరకూ అక్కడే నిలబడిపోయింది. "ఇక్కడే చాలా మంది దిగిపోతారు... అంతగా అయితే ఆడవాళ్ళు ఉన్నచోటుకు వెళ్ళి కూర్చో!" చిన్నపిల్లకు సూచనలిస్తున్నట్లుగా చెబుతున్న ఆ మాటలు తనకే అశ్చర్యాన్ని కలిగిస్తున్నయి...

– నివేదిత సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న విషయం తను మరిచిపోతున్నదా?

"బై..." చేయూపుతూ వడివడిగా ఫుటోవర్ బ్రిడ్జివైపుకు అడుగులు వేయసాగింది– బయట బాబాయి తనకోసం ఎదురు చూస్తుంటాడు. ఆయన కంపెనీకి వెళ్ళే టైం గూడా అవుతుండాలి. ఆయన బాలానగర్‌లో వున్న ఓ కెమికల్ ఫ్యాక్టరీలో డెప్యూటీ జనరల్ మేనేజర్.

తనని తాను నిగ్రహించుకుంటూ, క్రిందవున్న తను దిగిన బోగీ తలుపు వంకకు తలతిప్పి చూడకుండా బ్రిడ్జిమీద అడుగులు వేస్తున్నది... అలా చూసివున్నట్లయితే ఇంకా తలుపు దగ్గరే నిలబడి తననే చూస్తున్న నివేదితను గమనించి పరుగెత్తుకుంటూ వెనక్కు వచ్చేదేమో!

నివేదిత వెనక్కు వెళ్ళి తన సీటులో కూర్చున్నది అపరంజి రూపాన్నే కళ్ళముందుంచుకుంటూ గూడలెగరేసి... ఇది ఎంత విచిత్రమైన విషయం?

ఆ బేలో తను ఒక్కతే ఉన్నది. అవతలదాంట్లో ఎవరో ఆడవాళ్ళు గలగలా మాట్లాడుకుంటున్నారు. ఇందాక చూచింది వాళ్ళను. గుజరాతీల్లాగా వున్నారు.

బోగీ అంతా ప్రయాణీకులు పారేసిన చెత్తతో అసహ్యంగా వున్నది.

ఆమె సెల్ రింగయింది. చేసింది డాడీ. "ఎక్కడున్నావే బంగారం... హాస్టల్‌కు జేరావా లేదా ఇంకా?" అన్నాడు ఆయన.

"లేదు డాడీ! ఇప్పుడే సికింద్రాబాద్‌లో రైలు బయల్దేరింది... ఎట్లాలేదన్నా ఇంకో గంట పడుతుంది హాస్టల్‌కు జేరేటప్పటికి!"

"అమ్మ మాట్లాడుతుందట... ఎట్లా వెళ్ళావో అని ఆదుర్దా పడుతోంది!"

"ఇవ్వు... హాయిగా ఏ ఇబ్బందీ లేకుండా జరిగింది ప్రయాణం!" అన్నది. అటు తల్లి లైన్‌లోకి రాగానే ఓ ఐదు నిముషాలు మాట్లాడి ఆఫ్‌చేసింది.

అప్పటికే రైలు బయల్దేరి జేమ్స్‌స్ట్రీట్ స్టేషన్‌ను దాటుతోంది.

'తను వద్దన్నా వినరు వాళ్ళు... రెండు వారాలు కాకముందే ఇద్దరూ వస్తారు తనని చూడటానికి!... అమ్మయితే తనకోసమని ఓ అట్టపెట్టెనిండా స్వీట్లు, హాట్లూ తయారుచేసి తీసుకువస్తుంది...'

ఒకళ్ళిద్దరు పాసింజర్లు అటూ ఇటూ తిరుగుతున్నారు. ఆమె లేచి సీటుక్రింద చైన్ వేసివున్న పెట్టెను తాళం తీసి సీటుమీద పెట్టింది. తరువాత కిటికీలోనుంచి బయటకు చూస్తూ కూర్చున్నది. పది పదిహేను అంతస్తులు మించి పైకి లేచిన అపార్టుమెంట్లు... వాటి పక్కనే గుడిశెలు... మధ్య మధ్యలో మురుగు కాలవలు... రోడ్లమీద అప్పటికే పోతున్న కార్లు, స్కూటర్లు, బస్సులు...

నగరపు జీవితమే బహు యాంత్రికమైనది... అన్ని నగరాలూ అంతే... తను కోల్‌కతాలో చూసింది... అహ్మదాబాద్‌లో చూసింది... ముంబాయ్‌లో చూసింది... ఢిల్లీలో చూసింది... ఎక్కడకు వెళ్ళినా నగరమంటే జనమే...

నాంపల్లి స్టేషన్‌లో రైలు ఆగింతరువాత ఎస్ సెవన్ నుండి దిగుతున్న నివేదితను చూస్తూనే ఆ బోగీకి ఎదురుగ్గా కాస్తంత దూరంలో నిలబడివున్న ఓ ఆటోవాలా వడివడిగా బయటకు వచ్చి ఎగ్జిట్ గేట్ పక్కగా నిలబడ్డాడు.

నివేదితా బయటకు వచ్చింది. ఆమె మెట్లుదిగుతుండగా, వెనగ్గా ఆమె అడుగుల్లో అడుగులు వేస్తూ, "ఆటో కావాలా అండీ?" అని అడిగాడు అతి వినయంగా..

మెడ వెనక్కు తిప్పి చూసింది ఆ మాట వింటూనే. కాస్త వయస్సు మీరిన వాడే.

కాకిప్యాంటుమీద కాకి చొక్కా వేసుకున్నాడు. లావు ఫ్రేము భూతద్దాల కళ్ళజోడు పెట్టుకున్నాడు... అతడికి దైవభక్తి మెండు అన్నట్లుగా నుదుట పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకున్నాడు.

ఆమె మాట్లాడలేదు.

"ఎక్కడకు వెళ్ళాలండీ!"

"దిల్‌షుక్‌నగర్!"

అతడు పక్కకు వచ్చేశాడు హుషారుగా. ముఖం మీద చిరునవ్వు వెలసింది. "పదండి అమ్మా... ఆ పెట్టె నాకివ్వండి!" అన్నాడు పెట్టె అందుకునేందుకు చేయిజాస్తూ.

నివేదిత పెట్టె ఇవ్వలేదు. ముందుకు అడుగులు వేస్తూనే, "ఏమివ్వాలి?" అన్నది, అపరంజి చెప్పిన మాటలు గుర్తుకురాగా.

"మీటరివ్వండి చాలు... నేను అటే వెళ్ళాలి... తెల్లవారుజామున రెండింటికి ఎక్కాను... ముందు ఇంటికి వెళ్ళి ఏమైనా తినాలి!" అన్నాడు త్వరత్వరగా అతడు. అంతేగాకుండా చొరవగా ఆమె చేతిలోని పెట్టె అందుకుంటూ, "దిల్‌షుక్ నగర్‌లో ఎక్కడికి వెళ్ళాలండీ?" అన్నాడు.

"సాయిబాబా గుడి రోడ్డులోకి.."

"ఇంకేం... ఆ వీధి చివరే మా ఇల్లుకూడా!" అంటూ వడివడిగా పార్కింగ్‌లో వున్న తన ఆటో వైపుకు నడిచి దాంట్లో ఆ పెట్టెను పెట్టాడు. ఆటోకూడా శుభ్రంగా వున్నది. అతడు తన సీటులో కూర్చుంటూనే మీటరు వేశాడు.

"మీరు మా ఇంటివైపుకే అన్నారని మీటరు మీద వస్తున్నానమ్మా... అసలు ఇప్పుడెవరూ మీటరు మీద రావటం లేదు... పెట్రోలు రేట్లు ఎలా పెరిగిపోతున్నయ్యో మీకు తెలిసిందేగదా... మీటరు మీద ఆటో నడిపితే ఆ వచ్చేడబ్బులు మాకు రెండు పూట్లా తిండికి సరిపోవు!"

ఆటోలో కూర్చున్న నివేదిత మాట్లాడలేదుగాని, తన అదృష్టం కొద్దీ ఆ సమస్య చాలా తేలిగ్గా తీరిపోయింది అన్నట్లుగా తృప్తిగా ఓ నిట్టూర్పు విడిచింది!

స్టేషన్ దాటి ముందుకు వెళుతున్నది ఆటో.

ఆమెకాక్షణాన తెలియదు ఆ ఆటో డ్రైవరు శంకర్ ముఠామనిషేనని, అతడి పనల్లా గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ఎస్ సెవెన్ బోగీనుండి దిగిన ఆ అమ్మాయి ఏ ఇంటి దగ్గర దిగబోతున్నదో తెలుసుకొని ఆ ఇంటి వివరాలు అతడికి తెలియజేయటమేనని!

# 4

బాబాయ్‌తో కలిసి వచ్చిన అపరంజి పోర్టికోలో కారుదిగి మెట్లెక్కుతుండగానే చేతిలోని సెల్ రింగయింది. చేసింది సుధీర్!

"ఇంటికి వెళ్ళగానే నేనే చేస్తానని చెప్పానా... బేగంపేట ఫ్లయ్‌ఓవర్ మీద ఓ ట్రక్కు తల్లక్రిందులుగా పడితే ట్రాఫిక్ జామయి షాపర్స్‌స్టాప్ దగ్గర తలకాయ పట్టుకొని కూర్చొని వున్నా... సెల్ ఆఫ్‌చేస్తున్నా!" అన్నది అరుస్తున్నట్లుగా.

"అబద్ధాలు ఆడితేనే నీలాంటి ఆడపిల్లలు పుట్టేది...!"

"నాకేమయింది... నాలాంటి ఆడపిల్ల మరోతి ఈ ప్రపంచంలో నీకు దొరుకుతుందా!" ఆ మాట అంటుండగానే ఆమె కళ్ళముందు నివేదిత నిలుచొని వున్నది– నేనున్నాను అన్నట్లుగా! కాస్తంత తడబడింది...

"నాంపల్లి ఖైరతాబాద్ మధ్యలో బీగంపేట ఎందుకొస్తుందమ్మా అంజమ్మా!" అన్నాడు ఎగతాళిగా.

విసుగ్గా సెల్ ఆఫ్ చేస్తుండగానే ఎదురుగ్గా నిల్చున్న పిన్ని అడిగింది. "ఎవరికే అప్పుడే క్లాస్ పీకుతున్నావ్?"

"ఇంకెవ్వరూ... సుధీర్ బావ!" అన్నది. ఆ మాట చెబుతున్నప్పుడు ఆమె చెంపలు కాస్తంత ఎరుపెక్కినయి.

“కూర్చో! ప్రయాణం సుఖంగా జరిగిందా... ముందు కాఫీ కలుపుకు వస్తానుండు?” అన్నది.

“మొహమే కడగలేదు... టిఫెన్ రెడీగా వుంటే రెండునిముషాల్లో తయారయి వస్తాను!” అంటూ బ్యాగ్‌లో తువ్వాల తీసుకొని బాత్‌రూంకు నడిచింది.

అపరంజి టీపాయ్‌మీద పెట్టి వెళ్ళిన సెల్ మళ్ళా మ్రోగింది. ఈసారి ఆ ఫోన్‌ను, దానిమీద వున్న సుధీర్ పేరును చూస్తూనే అపరంజి పిన్ని ఆన్ చేసి, “ఏరా సుధీర్... అంతా కులాసానా?” అడిగింది.

“అదేమిటి బేగంపేటలో ట్రాఫిక్ జాంలో ఇరుక్కొని వున్నానన్న ఆ మహారాణి అప్పుడే ఇంటికి ఎలా వచ్చింది!”

“వాళ్ళ బాబాయి వెళ్ళి తీసుకు వచ్చారులేగాని... నువ్వు గూడా వస్తే బాగుండేదిరా... నిమ్మీ పదిరోజులే వుంటుందిట... వాళ్ళాయన ఇక్కడ ఏదో సెమినార్‌లో పేపర్ ప్రెజంట్ చేయటానికి వస్తున్నాడు వచ్చేవారం... అదవ్వగానే అదీ ఆయనతోటే వెళ్ళిపోతుంది!”

“నాకు క్షణం తీరిక లేకుండా ఉన్నదత్తయ్యా!”

“అంత పెద్ద రాజ్యాలేం ఏలుతున్నావురా? ఇంజనీరింగ్ అయి రెండేళ్ళు కాలేదు... అప్పుడే సీనియర్‌వయి అక్కడ బరువంతా నువ్వే మోస్తున్నట్లుగా మాట్లాడతావ్!” అన్నది పెద్దగా నవ్వుతూ.

“సీనియర్ అయినా జూనియర్ అయినా మనస్సుపెట్టి చేయాలిగదా... మన పనిలో ఏ మాత్రం తేడా వచ్చినా నష్టపోయేది కంపెనీనే... దాంతో నా ఉద్యోగం గాలిలో దీపమే!” అన్నాడు నవ్వుతూ.

అతడు విశాఖపట్టణంలోనే ఓ పేరున్న సాఫ్ట్‌వేర్ కంపెనీలో టీమ్‌లీడర్‌గా పనిచేస్తున్నాడు. ఆ నగరంలో తనెంత గొప్ప క్రిమినల్ లాయరో తన కొడుకూ అతడి ప్రొఫెషన్‌లో అంత గొప్పవాడవ్వాలనేది అతడి తండ్రి కోరిక. ఆయనలాగానే సుధీరూ

నిబద్ధతతో కూడిన మనిషి. అందుకే అతి త్వరలోనే అతడు ఆ కంపెనీలో ఓ ముఖ్యమయిన వ్యక్తిగా గుర్తించబడ్డాడు.

"అది బాత్‌రూంలోకి వెళ్ళిందిగాని... అమ్మా నాన్నా కులాసానా?"

"అంతా బాగానే వున్నారు అత్తయ్యా! దాన్ని బయటకు రాగానే ఫోన్ చేయమని చెప్పు!"

"నేను చెప్పనక్కరలేదు... అదే చేస్తుందిలే!" అన్నది మరోసారి పకపకా నవ్వుతూ.

సరిగ్గా అరగంటకు టిఫెన్ తిని, కాఫీ త్రాగి, "పిన్నీ! తెల్లవార్లూ నాకు నిద్రలేదు... పడుకుంటాను గాని నేను లేచిందాకా లేపబోకు... మరీ ఆలస్యమయితే నువ్వు భోజనం చేసి అన్నీ టేబుల్‌మీదే ఉంచేసేయ్... పెట్టుకు తింటాను!" అంటూనే బెడ్‌రూంలోకి వెళ్ళి తలుపు వేసి బోల్టుపెట్టేసి మంచంమీద వాలిపోయింది.

ఎదురుగ్గా నిలువెత్తు అద్దం... పూలపూల మాక్సీలో వున్న తనని తాను అందులో చూచుకుంటూనే లేచి కూర్చొని స్నానం చేసినప్పుడు దూముడి వేసుకున్న ఒత్తయిన జుట్టును విడదీసి ముందుకు లాక్కుంటుంటే విచిత్రంగా అనిపించింది- ఎదురుగ్గా అద్దంలో కనబడుతున్నది తనా, నివేదితా?

చాలా సేపటివరకూ కనురెప్పలార్పటం కూడా మరిచిపోయి ఆ అద్దం వంకే చూస్తూ ఆలోచనలలో పడిపోయింది- తను ఈ మిస్టరీని మూలాలకు పోయి ఛేదించక తప్పదు. నో... ముక్కూ ముఖం తెలియనివాళ్ళు అంత ఒకటిగా ఎవరూ ఉండరు. తనకూ నివేదితకూ రక్తసంబంధం ఉండిఉండాలి!

వెంటనే సెల్‌లో నివేదిత నంబరుకు క్లిక్ చేసింది.

అటు ఆన్ చేయగానే, "కులాసాగా హాస్టల్‌కు జేరావా?" అన్నది వడివడిగా.

"ఎవడో ఆటోవాడు మంచివాడే దొరికాడు... అతడు మా హాస్టల్‌కు దగ్గరలోనే వుంటాడట... జాగ్రత్తగా తీసుకువచ్చి నన్ను హాస్టల్ దగ్గర దించాడు!"

"ఫైన్... మనం ఎల్లుండి కలుద్దాం... ఇవ్వాళంతా విశ్రాంతి తీసుకుంటేనే గాని కుదిరేలా లేదు... తెల్లవార్లూ టెన్షనేనాయె... రేపు నిమ్మీతో క్షణం తీరికుండదు... ఎల్లుండి నీ వీలుని బట్టి, మనం ఎక్కడ కలవగలిగేది నిర్ణయిద్దాం... నిమ్మీని కూడా నాతో తీసుకు వద్దామని వున్నా మన విషయాన్ని కొంతకాలం గోప్యంగా వుంచాలని అనుకున్నాం కదా... దాన్ని తీసుకురాను... దానికంట్లో పడ్డావో మా బంధువులందరిలో మన విషయమే చర్చనీయాంశమవుతుంది!" అన్నది నవ్వుతూ. "ఓకే... హాస్టల్లో వసతులు సరిగ్గా వున్నయ్యోలేవో చూడు... సరిగ్గా లేకపోతే వదిలిపెట్టబోకు... ముక్కుపిండి డబ్బు వసూలు చేశారు... నీ మాట వినకపోతే చెప్పు... వచ్చి దుమ్ము దులిపేస్తాను!" సెల్ ఆఫ్ చేసింతరువాత తన మాటలకు తనకే నవ్వు వచ్చింది అపరంజికి– నివేదిత దగ్గర తను మరీ చనువు తీసుకుంటున్నదా అనిపించింది.

చూస్తే నివేదిత తన స్వంత చెల్లెలేనేమో అనిపిస్తోంది!– ఆ విషయంలో శోధన ఎక్కడనుంచి మొదలు పెట్టాలి అనేదానిమీద కాస్తంత బుర్రపెట్టాలి... తలవైపు రెండు దిండ్లు పెట్టుకొని, విడివడిన పొడువైన జుట్టును వాటిమీదగా క్రిందకు జార్చి, పడుకున్నది. పక్కన పెట్టిన సెల్ తీసుకొని బావకు రింగిచ్చింది.

"నేను చాలా బిజీగా వున్నాను... సాయంత్రం ఫోన్‌చేయ్!" అవతల సుధీర్ కసురుకుంటున్నట్లుగా అన్నాడు.

"సాయంత్రందాకా ఆగే ప్రసక్తే లేదు... నేను అపరంజిని! మాబావతో నా ఇష్టం వచ్చినప్పుడు మాట్లాడే హక్కు నాకున్నది!"

"అంజీ!" అన్నాడు సుధీర్ ఆప్యాయంగా ఆ మాటలు వింటూనే.

"నువ్వు ఫోన్లమీద, రోడ్లమీద అంజీ, గంజీ అంటూ పిలిచావంటే ఊరుకోను... అపరంజీ అని పిలువు లేదా ముద్దుగా 'సోనీ' అని పిలువు... రెండింటికి అర్థం అదేగదా!"

"ఖర్మరా నాయనా... ఎన్నిసార్లు చెప్పినా బుర్రకెక్కించుకోవేం... నువ్వు నాకు ఎప్పటికీ పరాయిదానివి కాలేవు కనుకనే నీపేరులో 'పర'ను పీకేసి 'అంజీ' అంటూ

పిలుస్తున్నది!"

"నువ్వు ఏం పీకినా మనిద్దరం ఒంటరిగా గదిలో వున్నప్పుడే!" అన్నది మురిపెంగా.

"నువ్వు నన్ను దగ్గరకే రానీయవ్... నేను పీకేమేవుంటయి?"

"ఛుప్... హద్దుమీరుతున్నావ్... చెంపలేసుకో!" అన్నది సీరియస్‌గా.

"సరేగాని... పదిరోజులు నిన్ను చూడకుండా నేనెలా వుండనే!"

"నా ఫొటో ఒకటి నీ పర్సులో వున్నదిగదయ్యా మొగుడా... పెళ్ళయిందాకా దానితోనే నీ సరదాలు తీర్చుకోవాలి... అప్పటివరకూ కళ్ళుమూసుకు కూర్చోవటమే... అప్పుడు నీ తపస్సుకు మెచ్చి భగవంతుడు త్వరలోనే మనిద్దరినీ ఒకటవ్వమని దీవిస్తాడు!" అన్నది మురిపెంగా.

"ఏదో గొప్పగా ఊళ్ళేలాలన్నట్లుగా చదువుతున్న ఆ ఎమ్‌టెక్ పూర్తయితేనేగాని వీల్లేదంటుంటివి కదా!" అన్నాడు కాస్తంత చికాకుతో.

"వివాహం విద్యనాశాయ... శోభనం..." తడబడుతూ ఆగిపోయింది.

అతడు ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయలేదు. గుసగుసగా "ఏమౌతుంది చెప్పరా!" అన్నాడు కవ్విస్తూ.

సెల్ ఆఫ్ చేసేసింది ముసిముసి నవ్వులతో. సుధీర్‌నుంచి వెంటనే రింగ్ వచ్చింది.

ఆన్‌చేసి, "ముందు ఫోన్ పెట్టేసేయ్... ఈ పదిరోజుల్లో నువ్వెప్పుడూ నాకు చేయవద్దు... నీతో మాట్లాడాలనుకున్నప్పుడు నేనే చేస్తాను... ఇక్కడ నేనెంత బిజీగా వుంటానో నాకే తెలియదు... నిమ్మీతోగాని, మా స్నేహితురాళ్ళతోగాని కలిసివున్నప్పుడు దేవుడొచ్చి డిస్టర్బ్ చేసినా నేనూరుకోను!" టకటకా చెప్పేసి ఆటు అతడికి మరో మాటకు అవకాశమివ్వకుండా ఫోన్ ఆఫ్ చేసి, దుప్పటి బిగించేసింది అపరంజి.

* * *

తూరుపు తెలతెలవారుతుండగా ఆ ఇంటిముందు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి వచ్చిన కారు ఆగింది. అందులోనుంచి ముందు అపరంజి దిగింది. ఆ వెనుక నిమ్మీ దిగింది. తరువాత వాళ్ళమ్మ దిగింది. ముందు సీట్లోనుంచి వాళ్ళ నాన్న దిగాడు. డ్రైవరు డిక్కీ తెరిచి సూట్కేసులు తెచ్చి లోపల పెట్టాడు.

నిర్మల అన్నయ్య ఢిల్లీనుంచి భార్యను, పిల్లవాడిని తీసుకొని చెల్లెలు తిరిగి అమెరికా వెళ్ళేలోగా వస్తానని ఫోన్ చేశాడు. అతడు అక్కడ ఓ కంపెనీలో ఫైనాన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు.

నిర్మలను చూస్తుంటే కాస్తంత విచిత్రంగా అనిపించింది అపరంజికి. నిమ్మీకి తనలాగానే వత్తుగా పొడుగయిన జుట్టు. దానికి అదంటే ఎంతో ఇష్టం కూడా. పెళ్ళయి అమెరికా వెళ్ళేంత వరకూ అలా కత్తిరించుకున్న వాళ్ళందరినీ తిట్టిపోస్తుండే అదే అంత జుట్టునూ భుజాల వరకూ కత్తిరించేసుకున్నది!

"ఇదేం మాయరోగమే నీకు?" కారులో వస్తుండగా అడిగింది అపరంజి మెత్తటి ఆమె జుట్టు మీద చేయివేస్తూ.

నిర్మల పకపకా నవ్వింది. "పెళ్ళే ఒక మాయ... మొగుడు ఓ పెద్ద మాంత్రికుడు... ఇక అమెరికా అంటావా అదో భూతల స్వర్గం... ఆరునెలలో ఆకారమే కాదు అలవాట్లే మారిపోతయి!" అన్నది.

"మనకు ఓ వ్యక్తిత్వమంటూ ఉండదా?"

"ఎందుకుండదూ... పరిసరాలనుబట్టి పరకాయప్రవేశం చేస్తుంటుంది... జీన్స్‌ప్యాంట్, టీషర్ట్ వేసుకొని అంత పెద్దజడను తోకలాగా వేలాడేసుకుంటూ తిరగటం ఏం బాగుంటుంది... అందుకే హెయిర్ స్టయిల్‌గూడా మార్చేశాను... మళ్ళా ఇండియాకు అంటూ రావటం జరిగితే అప్పుడాలోచిద్దాం ఏం చేయాలా అని!" ముసిముసి నవ్వులతో గుసగుసగా అన్నది.

– మనుష్యులు ఇంత త్వరగా ఎలా మారిపోతారో అర్థంకాలేదు అపరంజికి.

అంతదాకా ఎందుకు పెళ్ళయ్యేంతవరకూ భుజాల మీద చేతులు వేసుకొని తిరిగిన తాము, విమానందిగి లూంజ్‌లోంచి ముందుకు వస్తున్న దాన్నిచూస్తానే పరుగెడుతున్నట్లుగా ముందుకు వెళ్ళి కౌగిలించుకోబోతుంటే, చేయి జాపి 'హాయ్' అని మాత్రం ఊరుకున్నది, తనకు చాలా నిరాశ కలిగిస్తూ.

నిర్మలతో ఈ పదిరోజుల్లో తను ఎన్నో ప్రోగ్రామ్‌లు వేసుకున్నది. దాని వాలకం చూస్తుంటే అవి నెరవేరతయ్యో లేదో అనే అనుమానం వస్తోంది. చూద్దాం... నిన్నసాయంత్రమే జంటనగరాల్లో వున్న స్నేహితురాళ్ళందరికీ తన రాక విషయం ఫోన్‌చేసి చెప్పింది. వాళ్ళల్లో చాలామంది రేపు పదింటికి తయారవుతారు. వాళ్ళకూ నిర్మల తెలుసు.

లోపలకు వస్తుండగానే నిర్మల, "ముందు స్నానం చేసి కాసేపు రిలాక్స్ అవుతాను!" అంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది.

వెనగ్గా వెళ్ళిన అపరంజిని, "ఇంతకీ బావతో నీ పెళ్ళి నిర్ణయమయిందా లేదా... నాకు నెల ముందు చెబితేనేగాని రాలేనేవ్!" అన్నది మంచం మీద వాలిపోతూ.

"నువ్వు ఎప్పుడు వస్తావో చెప్పు అప్పుడే చేసుకుంటాను!" అన్నది నిర్మల పక్కనే కూర్చుంటూ.

"నేను వస్తానన్న సమయానికి ముహూర్తాలు దొరకొద్దూ!"

"అవే దొరుకుతయిగాని... ఎలా వున్నది అమెరికా జీవితం?" కుతూహలంగా అడిగింది అపరంజి.

"ఫైన్ యార్... ఇక్కడేమున్నది మురుగ్గుంటలూ, చింపిరిజుట్టు మనుష్యులూ తప్ప... రోడ్డుమీద కారు పోతుంటే మనం అద్దం మీద పోతున్నామా అనిపిస్తుంది... చుట్టూ పచ్చదనం. వ్వాహ్... చెప్పలేనే అది... నువ్వుగూడా పెళ్ళి చేసుకొని బావను తీసుకొని వచ్చి అమెరికాలో వాలిపో!"

నిర్మల మాటలు అపరంజికి కాస్తంత చికాకు కలిగించినయ్. "సరేలే... ముందు

ఆ జీవితాన్ని నువ్వు అనుభవించు... తరువాత నా ఏడుపేదో నేను ఏడుస్తానుగాని... ఇప్పుడు మన ప్రోగ్రాం ఏమిటి...?" అడిగింది.

"ఇవ్వాళంతా రెస్టు... రేపు వేరేవాళ్ళు నాకోసం వస్తారు... ఇంట్లోనుంచి కదలలేను!"

"ఎవరే వాళ్ళు?"

"నీకు తెలిసినవాళ్ళు కాదులే... ఆయన ఫ్రెండ్స్ ఏవేవో ఐటమ్స్ కొని ఇచ్చారు వాళ్ళవాళ్ళకోసం... వాళ్ళకు వాటిని ఇవ్వాలి... అక్కడనుంచి మా ఫ్రెండ్ ఒకామె తండ్రికి బైపాస్ అయితే అమెరికానుంచి పదిరోజుల క్రితం వచ్చింది... ఎల్లుండి వాళ్ళింటికి వెళ్ళాలి!"

"మరి మన స్నేహితుల్ని ఎప్పుడు కలవాలని?"

"చూద్దాంలే... వెళ్ళేలోగా ఎప్పుడో ఒకరోజు కలుద్దాం... ఏముంటయి గాలి కబుర్లేగదా...!" అన్నది కాస్తంత నిర్లక్ష్యంగా.

"సరేలే... నీ మాటలు వింటుంటే నీతో పదిరోజులు గడపాలని వచ్చిన నాతో కూడా కలిసి వుండేలాలేవు... నేను వెళతానులే వాళ్ళతో!" కాస్త నిష్ఠూరంగా అన్నది అపరంజి నిర్మల వంక గుర్రుగా చూస్తూ.

"ఏమీ అనుకోవద్దే అప్పూ... నాకెందుకో ఇక్కడ మురికిరోడ్లమీద తిరగాలంటే చాలా అసహ్యంగా వున్నది... అంతేకాదు ఇక్కడ మనుష్యులు కూడా లేకిగా మాట్లాడుతుంటారు మేనర్స్ లేకుండా... నా మటుకు నన్ను వదిలేసేయ్... లేదంటావా నీకేమీ తోచకపోతే చెప్పు నా గదిలో కూర్చొని కబుర్లు చెప్పుకుందాం... అంతేగాని అందర్నీ పోగుచేసి పిచ్చిపిచ్చి కాలక్షేపాలు చేయటం నాకిష్టంలేదు!"

విస్మయంగా నిర్మల మొహంలోకి చూస్తూ ఉండిపోయింది అపరంజి. అది ఇక్కడున్నంత కాలం ఏ మాత్రం సమయం దొరికినా స్నేహితురాళ్ళతో గడిపేది. అటువంటిది ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నదీ అంటే సంవత్సరం గూడా గడవకముందే

అమెరికా నిర్మలను పూర్తిగా మార్చి వేసిందన్నమాట!'

నిర్మలను పడుకోనిచ్చి బయటకు వస్తూనే ఆ బెడ్‌రూం తలుపు దగ్గరకు వేసింది. అది అంత దూరంనుంచి వస్తున్నదిగదా అని ఎంత హుషారుగా వచ్చిందో దాని మాటలు వింటూ అంత నీరసపడిపోయింది!

రేపు ఆయనగారు గూడా విమానం దిగితే తనేకాదు, అమ్మా నాన్నా కూడా దానికి కనబడకపోవచ్చు!

హాల్లో సోఫాలో కూర్చుంటూనే టీపాయ్‌మీద వున్న తెలుగు పేపర్లు చేతిలోకి తీసుకొని పరధ్యాన్నంగా పేజీలు తిప్పసాగింది. అకస్మాత్తుగా ఆమె దృష్టి ఒక వార్తమీద పడింది...

**ఆడపిల్లల్ని వ్యభిచారగృహాలకు తరలిస్తున్న ముఠా అరెస్టు.**

వడివడిగా ఆ వార్తను చదవటం మొదలు పెట్టింది అపరంజి.

"నిన్నరాత్రి విశాఖపట్నంనుండి హైదరాబాద్ వెళుతున్న గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న కొందరు వ్యక్తులను వైజాగ్, హైదరాబాద్, ముంబయ్‌ల నడుమ రెడ్‌లైట్ యేరియాలకు వ్యభిచారుణులను జేరవేసే ముఠాగా గుర్తించి విజయవాడ స్టేషన్‌లో పోలీసులు నిర్భందించారు. వాళ్ళంతా తెలివిగా విడివిడిగా వేరువేరు బోగీల్లో ప్రయాణిస్తున్నా అందరినీ ఒకేసారి విజయవాడలో పట్టుకొని రైలు నుంచి దింపటం జరిగింది.

అయితే స్టేషన్ బయటకు తీసుకువచ్చి వాళ్ళను వ్యాన్‌లో ఎక్కిస్తున్న సమయంలో పోలీసుల కళ్ళుగప్పి ఆ ముఠానాయకుడు పరారయ్యాడు. అతడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పరిచి వేట ప్రారంభించారు.

అదుపులో వున్న మిగిలిన తొమ్మిదిమందిని ఉదయాననే విజయవాడలో మేజస్ట్రీటు ముందు హాజరుపరచగా వారంరోజులపాటు రిమాండుకు పంపటం జరిగింది! రైళ్ళలో ఇలాంటి ముఠాలు తరచూ తిరుగుతునే వుంటయ్యనీ దానికి పోలీసు నిఘాలో లోపమేనని

పలువురు విమర్శిస్తున్నారు"

ఆ వార్తను చూస్తూనే అపరంజి గాభరా పడింది. ముఠానాయకుడు అంటే శంకర్‌గాడే అయివుంటాడు. వాడిదగ్గర సెల్‌లోనే తన ఫొటో వున్నది. అంటే తనను వేటాడటానికిగాను పోలీసులనుంచి తప్పించుకొని పారిపోలేదు కదా?... ఏం చేయాలో తెలియనంత అయోమయంలో పడిపోయింది ఆ క్షణాన అపరంజి. మామయ్యకు చెబితే!

* * *

రాత్రి తొమ్మిది గంటలయింది. అప్పుడే అందరి భోజనాలయినయి. నిర్మల అపరంజి బెడ్‌రూంలో జేరారు.

వార్తా పత్రికలో ఆ వార్తను చూసినప్పటినుండి అపరంజి పూర్తిగా నీరసపడిపోయింది. ఇదెక్కడ గొడవ తనకు? మామయ్యకు ఫోన్‌చేస్తే, 'చీకటి పడింతరువాత ఒంటరిగా బయటకు వెళ్ళబోకు... మరీ అవసరమొస్తే ఎవరినైనా తోడు తీసుకువెళ్ళు... వీలయినంత త్వరగా ఫ్లయిట్‌లో విశాఖపట్టణం వచ్చేయ్... అనవసరంగా టెన్షన్ పడబోకుగాని కాస్త ఎలర్ట్‌గా వుండు– అంతే!' అంటూ చెప్పాడు. నిజమే అంతదూరాన వున్న ఆయన మాత్రం ఏం చేయగలడు? అప్పటికీ పెద్దపెద్ద వాళ్ళతో పరిచయాలు వున్నవాడు కాబట్టి రైల్లోనే తను చేయవలసిందేదో చేశాడు!

బెడ్‌రూంలోకి వెళ్ళిన ఐదు నిముషాలకు నిర్మల, "తలుపు బోల్ట్ పెట్టిరావే!" అన్నది లైటార్పి మంచం మీద పడుకోబోతున్న అపరంజిని చూస్తూ.

"బోల్టు దేనికే... అవసరమొచ్చి అత్తయ్య వస్తే!"

"ఆమె గారు ఇప్పుడేం రాదుగాని... చెప్పింది చేయి... లైటార్పబోకు!" అంటూ నిర్మలా మంచం మీదనుంచి లేచి మంచం పక్కన పెట్టివున్న తన పెట్టె తెరిచి అందులోనుంచి ఓ సీసా బయటకు తీసింది. తరువాత టీపాయ్ దగ్గరకు రెండు కుర్చీలు లాగి ఒకదాంట్లో కూర్చుంటూ, "ఇటురా...!" అంటూ అపరంజిని పిలిచింది.

అపరంజి నోరు తెరుచుకొని నిర్మలనే చూస్తున్నది... ఆ సీసాలో వున్నది హాట్ డ్రింక్!

"పడుకోబోయేముందు ఓ పెగ్ వేసుకుంటే ఎంత హాయిగా వుంటుందో తెలుసా... నువ్వా రుచి చూద్దుగాని రా!" అంటూ నోరు తెరుచుకు చూస్తున్న అపరంజినే చూస్తూ కళ్ళు ఎగరవేసింది నిర్మల.

"బుద్ధుండే మాట్లాడుతున్నావా... మీ ఆయనకు తెలిస్తే నీ జీవితం ఏమౌతుందో ఆలోచించు!" విసురుగా నిర్మల పక్కగా నిలబడుతూ అన్నది.

నిర్మల పకపకా నవ్వింది. "నేను ఓ పెగ్ వేసుకుంటే ఆయనెంత సంబరపడిపోతాడో తెలుసా... ఆయన బలవంతం మీదే నేనీ అలవాటు చేసుకున్నది... ముందు భయపడ్డానుగాని తరువాత తరువాత దానిలోని మజా తెలిసొచ్చింది... ఇది వేసుకున్న పదినిముషాల్లోనే మేం స్వర్గంలో కాలుపెడతాం!... తెల్లవారిందాకా సర్వం మరిచిపోయి ఆనందిస్తాం... మాకు ఆ సమయంలో ఎలాంటి భేషజాలు ఉండవు... ఆ డిమ్‌లైట్ కాంతిలో ఎంతగా ఒకటయిపోతామో నువ్వు ఊహించలేవ్!" నిర్మల కళ్ళు మెరుస్తుండగా అపరంజినే చూస్తూ అన్నది. "అందుకే నేను అన్నది... అమెరికాకు మించిన స్వర్గం మరెక్కడా మనం చూడలేమని!"

అపరంజి ఏం మాట్లాడాలో తెలియనంత అయోమయంలో పడిపోయింది. కోపాన్ని నిగ్రహించుకోలేకపోయింది. "ఓకే... నువ్వా స్వర్గంలో తిరుగుతుండు, నేను కళ్ళు మూసుకొని నాకు తెలిసిన నరకంలో నిద్రపోతాను... తలుపు తీసుకు వెళ్ళి నేను మరో చోట పడుకుంటే నీ పరువు బజారుకెక్కుతుందని ఇక్కడే ముక్కు మూసుకు పడుకుంటానంటున్నాను!" విసురుగా వచ్చి ఆ డబుల్‌కాట్‌మీద ఓ పక్కకు జరిగి పడుకొని దుప్పటి కప్పేసుకున్నది.

నిర్మల "థాంక్యూ!" అంటూనే గూడలెగరేసింది. అప్పటికే ఆమె గ్లాసులో పోసుకున్నది సగం అయిపోయింది.

* * *

పొద్దున ఏడుగంటలప్పుడు అపరంజి తల్లి ఫోన్ చేసింది కూతురుకి. "చిక్కడపల్లిలో సూర్యనారాయణగారని మీ నాన్న ఫ్రెండ్ వున్నాడు గదా... ఆయన్ని కలువు... నాలుగు రోజుల క్రితం అమెరికానుంచి వచ్చాడు కొడుకు దగ్గరనుంచి. నా బిపి, నాన్న సుగర్ చెక్ చేసుకునేందుకు ఇన్‌స్ట్రుమెంట్స్ తెచ్చారట... షుమారుగా పదివేలవుతయిగాని ఏటీఎమ్‌లో డ్రాచేసుకొని వెళ్ళి డబ్బు ఇచ్చేయ్... ఆయన ఎవరికన్నా ఇచ్చి పంపిస్తానన్నారుగాని... నువ్వు ఇప్పుడు అక్కడే వున్నావుగదా... మళ్ళా ఆయనకు అదోపని పెట్టటం దేనికి? ఆయన అడ్రసు, ఫోన్ నంబరూ రాసుకో!"

"నిమ్మీకి చెబితే తెచ్చేదిగదే!"

"సూర్యనారాయణగారు ఆరునెలల క్రితం వెళ్ళారు... అప్పుడు చెప్పారు నాన్న ఆయనకు... ఇప్పుడు వస్తూ తెచ్చాడు... వాళ్ళిద్దరూ మంచి ఫ్రెండ్సని తెలుసుకదా నీకు!"

"సరేలే... నేను ఫోన్‌చేసి అంకుల్‌తో మాట్లాడతానులే!" ఆయన ఫోన్ నంబరు, అడ్రసు రాసుకుంటూ అన్నది.

ఎనిమిది గంటలప్పుడు మరల సెల్ రింగయింది. బావ చేశాడనుకున్నది అపరంజి. కానీ చేసింది నివేదిత!

"చెప్పు... ఎడ్జస్ట్ అయినావా... నిన్న క్లాసులు మొదలయినయ్యా!"

"మొదలయినయి... హాస్టల్ కూడా బాగానే వున్నది... రూంలో నాతో కలిసి వుంటున్నది- నెల్లూరు అమ్మాయి... మంచిదిలాగానే వున్నది... సరదాగా మాట్లాడుతోంది!"

"గుడ్! మనం ఎప్పుడు కలుద్దామో చెప్పు!"

"నేను నిన్నంతా ఆలోచించాను... నువ్వు చెప్పిన టెస్ట్ చేయించటం వలన నిర్మలంగా సాగిపోతున్న మన కుటుంబాలు ఒక్కసారిగా అల్లకల్లోలానికి గురవుతయ్యేమోనని భయంగా వున్నది... అందుకే ఆ టెస్ట్ చేయించుకొని

మనకేగాకుండా మన పెద్దవాళ్ళకు గూడా మనశ్శాంతిని కరువు చేయటం నాకిష్టం లేదు!" అన్నది చిన్నగా.

అపరంజి మాట్లాడలేకపోయింది. నిజానిజాలు తెలుసుకోవటంలో తప్పేమిటి? అందువలన కలిగే అనర్థాలు ఏముంటయ్! అనవసరంగా నివేదిత భయపడుతున్నదేమో...

కొద్ది క్షణాలు ఆలోచిస్తున్నట్లుగా ఆగి, "అది ఫోన్లమీద తీసుకునే నిర్ణయం కాదుగాని... రేపు మనం ఎక్కడో అక్కడ కలుద్దాం... దాన్ని గురించి క్షుణ్ణంగా చర్చించి ఓ నిర్ణయం తీసుకుందాం... ఓకేనా!"

"థాంక్యూ! అలాగే!"

తొమ్మిదింటికి అపరంజి స్నేహితురాలు శ్యామల ఇంటికి బయల్దేరింది. నిర్మల రాదని అర్థమవ్వటంతో అడగలేదు. స్నేహితురాలైతే భోజనానికి ఉండేలా రమ్మనమని, మిగతా స్నేహితురాళ్ళను కూడా పిలుస్తున్నట్లుగా చెప్పింది. సాయంత్రందాకా అక్కడే గడపాలనేది ఆలోచన. ముందు ఒంటరిగా వెళ్ళటానికి కాస్తంత జంకింది, మామయ్య మాటలు గుర్తుకు రాగా... అయినా పట్టపగలు ఎవడొస్తాడు తన జోలికి అన్న ధైర్యం ఆమెను బయల్దేరదీసింది.

పిన్నికి చెప్పి బయటకు వచ్చి ఆటో ఎక్కింది. తన స్నేహితురాలుండేది బోయగూడాలో. కనుక అక్కడనుంచి వస్తూవస్తూ చిక్కడపల్లిలో అమ్మ చెప్పిన సూర్యనారాయణగారిని కలిసి ఆయనిచ్చేవి తీసుకురావచ్చు.

మామూలే. ఖైరతాబాద్‌నుంచి బోయగూడాకు ఆటో అతను వందరూపాయలు అడిగాడు. ఇవ్వనని మరో ఆటో పిలిచింది. ఆలస్యమయినా ఇబ్బందేం లేదు. ఎవరో ఒకరు దొరక్కొండా వుండరు. మూడు ఆటోల తరువాత నాలుగో అతను మీటరుమీద రావటానికి అంగీకరించాడు. వెంటనే దాంట్లో ఎక్కి కూర్చున్నది అపరంజి.

నివేదితను ఎలా కన్విన్స్ చేయాలా అని ఆలోచిస్తున్నది. తన ఉద్దేశ్యంలో

తామిద్దరూ స్వంత అక్కా చెల్లెళ్ళే గనుక అయితే ఆమె తల్లిదండ్రులుగాని, తన తల్లిదండ్రులు గాని ఒకళ్ళు అబద్ధమాడుతున్నారనేది నిజం!. అలా ఎందుకు నిజాన్ని దాచవలసి వచ్చిందో తెలుసుకోవటమే తనకు కావాల్సింది.

నివేదిత రైల్లోనే చెప్పింది... వాళ్ళు ఇంతవరకూ ఒకళ్ళకొకళ్లు తెలిసిన ఛాయలు ఎక్కడా కనబడటంలేదు. అసలు కలిసే అవకాశమే ఎక్కడా లేదు.

మరి ఎలా జరిగింది ఇది. లేదా ఇద్దరూ ఒకే పోలికలో వుండటం కాకతాళీయమా? అప్పుడు ఇద్దరి పుట్టిన తేదీలూ ఒకటే అవ్వటం అనేది విచిత్రంలో మరో విచిత్రం...

నో... ఇందులో తనకుగాని, నివేదితకు గాని తెలియని చిదంబర రహస్యం ఏదో వుండివుండాలి... నిజానిజాలు పరిశోధించి తెలుసుకోక తప్పదు!

నివేదిత సహకరించకపోయినా తను మాత్రం దాన్ని వదిలిపెట్టదు...

ఆటో లక్డకీపూల్ దాటింది. ద్వారకా హోటల్ దగ్గర మలుపు తీసుకొని ఏజీ ఆఫీసు దాటింది. సెక్రటేరియట్ ముందు ఫ్లయ్ఓవర్ ఎక్కి అతి రయంగా ముందుకు దూసుకుపోతోంది.

బ్రిడ్జి దిగుతూనే ఇందిరాపార్క్వైపుకు తిరిగి అశోక్నగర్ బ్రిడ్జిదాటింది. ఆర్టీసీ క్రాస్రోడ్స్ దగ్గర సికింద్రాబాద్ వైపుకు తిరిగి, సప్తగిరి థియేటర్ ముందునుంచి వెళుతోంది.

సరిగ్గా అక్కడ ఆర్టీసీ బస్సు స్టేజిముందుకు వస్తుండగానే ఓ వ్యక్తి ఆటోకి అడ్డుగా నిలబడి ఆపమన్నట్లుగా చేయెత్తాడు.

అపరంజి అతడిని చూస్తూనే బిగుసుకుపోయింది. కనుగుడ్లు ముందుకు భయంతో పొడుచుకు వచ్చినయి...

"ఆపొద్దు... పోనీయ్!" అన్నట్లుగా పెద్దగా అరిచాననుకున్నదిగాని నోటినుంచి ఆ మాటలు చాలా పేలవంగా వచ్చినయి.

శరీరమంతా మంచు ముద్దల మధ్య ఇరుక్కున్నట్లుగా వణికిపోతున్నది...

రోడ్డుమీద ఆటోకు అడ్డంగా నిలబడి ఆపమంటున్నది విశాఖపట్నంనుంచి విజయవాడవరకూ తనతో ప్రయాణం చేసిన వ్యభిచారుణుల ముఠా నాయకుడు శంకర్!

## 5

"ఆపొద్దు... ఆపొద్దు!" ఈసారి కంఠం హెచ్చించి అరుస్తున్నట్లుగా అన్నది ఆపరంజి. శంకర్‌ను దాటి వెళ్ళిపోయిన తరువాతగాని ఆమెకు పూర్తిగా గొంతు పెగల్లేదు. అతడిని చూస్తూనే గుండె దడదడలాడటం మొదలుపెట్టింది.

"ఇక్కడ షేర్‌డు ఆటోలు ఎక్కువమ్మా... అందుకనే జనం ఆపుతుంటారు బండిలో పాసింజర్లున్నా... నాది అలాంటిది కాదు!" మెడ వెనక్కు తిప్పి అన్నాడు అతను.

అంటే తనని చూసి గుర్తించి ఆపటానికి ప్రయత్నించలేదన్నమాట శంకర్‌గాడు!

మిత్రురాలు శ్యామల ఇంటిముందు ఆటోదిగుతున్న అపరంజిని చూస్తూనే, పరుగెత్తుకుంటూ బయటకు వచ్చింది. అప్పటికే మరో ఇద్దరు వచ్చి వున్నారు అక్కడ.

సాయంత్రం నాలుగు గంటలవరకూ అపరంజి సర్వం మరిచిపోయింది. సరస్వతి, విజయ, కాత్యాయిని వచ్చారు. కామాక్షీ వచ్చింది. సందడే సందడి. వాళ్ళంతా కలిసి సంవత్సరమే అయినా ఎన్నో సంవత్సరాల తరువాత కలిసినట్లుగా ఆప్యాయంగా కబుర్లుచెప్పుకుంటూ పరుగెడుతున్న కాలాన్ని పట్టించుకోకుండా కాలక్షేపం చేశారు.

ప్రతివాళ్ళూ అడిగేవాళ్ళే ఎప్పుడూ తనతో వచ్చే నిర్మల ఎందుకు రాలేదని. అబద్ధాలను ఏర్చికూర్చి నిమ్మీ రాకపోవటానికి కారణాలను వాళ్ళకు చెప్పలేక ఇబ్బందిపడింది అపరంజి.

నాలుగు గంటలప్పుడు చిక్కడపల్లిలోనే వుంటున్న కామాక్షితో కలిసి ఆటోలో బయల్దేరింది సూర్యనారాయణగారింటికి. బయల్దేరేముందు ఆయనకు ఫోన్ చేసి

ఇంట్లోనే ఉన్నట్లుగా రూఢి చేసుకున్నది. ఆయన అపరంజిని చూచి చాలా సంతోషించాడు. "ఎన్నేళ్ళయిందమ్మా నిన్ను చూచి? మీ నాన్న రాఘవను చూచే రెండు మూడేళ్ళయివుంటుంది. వాడు క్రితం సారి హైదరాబాద్ వచ్చినప్పుడు మా ఇంటికి భోజనానికి రారా అంటే అతి కష్టం మీద వచ్చి ఓ గంట కూర్చొని వెళ్ళాడు... నా చిన్నప్పుడు వాడు నన్ను ఎంతగా ఆదుకున్నాడో తెలుసా అమ్మా! నాది కాలేజీకి ఫీజులు కూడా కట్టలేని స్థితి... అటువంటిది వాడే ఫీజులు కట్టి నా చేత పరీక్షలు రాయించాడు... ఈ రోజున నేను ఈ స్థితిలో వున్నాను అంటే రాఘవే కారణం!... నువ్వన్నా భోజనం చేసి వెళతావా..." అన్నాడు ఆప్యాయంగా అపరంజిని చూస్తూ.

"పెందరాళే ఇంటికి వెళ్ళాలి అంకుల్... మా బాబాయి కూతురు అమెరికానుంచి వచ్చింది... దాన్ని చూద్దామనే వచ్చాను విశాఖపట్నంనుంచల్లా... మళ్ళా పదిరోజుల్లో వెళ్ళిపోతుంది... నేను వెళ్ళిందాకా అది భోజనం చేయకుండా కూర్చుంటుంది!" ఇక్కడా అబద్ధమే... తప్పదు మరి... "ఈసారి వచ్చినప్పుడు తప్పకుండా ఆంటీ చేతి వంట రుచిచూసి మరీ వెళతాను!" అన్నది అనునయంగా.

ఆయన అమెరికానుంచి తెచ్చిన పరికరాలకు డబ్బులు తీసుకోమన్నా తీసుకోలేదు. 'రాఘవ దగ్గర వీటికి నేను డబ్బులు తీసుకోవటమేమిటి... ఇంకోసారి ఆ మాట అనవద్దు' అంటూ అపరంజి ఎంత చెప్పినా వినలేదు.

తరువాత అరగంటలోనే అక్కడనుంచి బయల్దేరింది అపరంజి. తను ఆటోలో వెళతానంటే కాదని ఆయన తన కారులో పంపించాడు. ఆమె కూడా అభ్యంతరం చెప్పలేదు. ఒకవిధంగా అది తనకు మేలే... ఏ టెన్షన్‌లేకుండా ఇంటికి వెళ్ళవచ్చు... పొద్దుటి అనుభవం గుర్తుకు వచ్చింది!

ఇంట్లోకి వెళుతుండగానే పిన్ని పెద్ద కంఠంతో అరుస్తున్నట్లుగా అన్నది. "నిన్ను ఒంటరిగా బయటకు వెళ్ళవద్దని మామయ్య చెప్పాడుటకదా... ఎందుకు వెళ్ళావ్... ఇందాక ఫోన్ చేసి నిన్ను పోనిచ్చినందుకుగాను నానా చివాట్లు పెట్టాడు... మరీ నీకంత బయటకు వెళ్ళాల్సిన అవసరముంటే చెప్పు బాబాయ్ కారు ఉంచి వెళతాడు!"

అపరంజి మాట్లాడలేకపోయింది.

* * *

ఉదయం ఆరుగంటలు. దిల్‌షుక్‌నగర్‌లో సాయిబాబా గుడి వీధిలో సివిల్స్‌కు కోచింగ్ ఇచ్చే సంత్‌సాయీరాం ఇనిస్టిట్యూట్ పక్కనే నాలుగు అంతస్తుల భవనంలోవున్న దాని తాలూకు ఆడపిల్లల హాస్టల్లో హడావుడి మొదలయింది. దానికి అరఫర్లాంగు దూరంలో మగపిల్లల హాస్టల్ ఉన్నది. అక్కడా అంతే.

అందరికీ చదువు చదువు చదువు. క్షణం విశ్రాంతిగా కూర్చోరు. ఎలాగైనా సివిల్స్‌లో విజేతలు కావాలి. ఆ హాస్టల్‌కు అన్ని వార్తాపత్రికలూ వస్తయి. వార్తలకంటే ముఖ్యంగా వాటిల్లోని సంపాదకీయాలు ఆలోచింపజేసేవిలా వుంటయి. వార్తలకు కొత్త కోణాలు చూపుతుంటయి. ప్రత్యేక శ్రద్ధతో వాటిని చదువుతారు. వివిధ విషయాలమీద వున్న వ్యాసాలు చదువుతారు. ఇవిగాక చాలా వాటిల్లో విద్యార్థుల జ్ఞానాన్ని పెంచేందుకుగాను నిర్వహిస్తున్న ప్రతిభ, చదువు, విజేతలాంటి పేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తారు.

అక్కడ ఇచ్చే ప్రశ్నలు, సమాధానాల్లో నివేదిత ఎప్పుడూ ఛాయిస్‌ను చూడదు. ప్రశ్న చూడగానే సమాధానం మనస్సుకు తట్టాలీ అనేది ఆమె ఆలోచన. వాళ్ళ బ్యాచ్‌లో ఇంటర్వ్యూదాకా వెళ్ళి నెగ్గలేకపోయిన ఒక అమ్మాయి వున్నది. ఏవేవి చదవాలో ఆ అమ్మాయి సలహాలు కూడా తీసుకుంటుంటారు. అంతేగాక చాలామంది అవసరమనుకున్నప్పడల్లా విషయసేకరణలో ల్యాప్‌టాప్‌లో నెట్‌లోకి వెళ్ళిపోవటం... రాయబోయే పరీక్షలమీదే తప్ప మరేదానిమీద వాళ్ళకు ధ్యాస వుండదు...

కొందరు అయిదున్నరకే లేచారు. తెల్ల బూట్లు వేసుకున్నారు. స్వెట్టర్‌లు తొడుక్కున్నారు. తలకు మఫ్లర్‌లు చుట్టుకొని బయటకు వచ్చారు. అక్కడకు అరకిలోమీటర్ దూరంలో ఓ పార్కు వున్నది. చాలా శుభ్రంగా వుంటుంది. వాకింగ్ చేసేవారికోసం లోపలవైపున చుట్టూ సీమెంటు బాట. దాని పక్కనే క్రోటన్ మొక్కలు. గోడవారగా పెద్దపెద్ద చెట్లు. అన్ని వైపులా వెలుగుతున్న దీపాలు. ఐదు గంటలనుంచే

మైక్‌లో ప్రసారమయ్యే భగవద్గీతో, భక్తిగీతాలో చాలా చిన్నగా వినబడుతుంటయి వచ్చినవాళ్ళ మనస్సులకు ప్రశాంతత చేకూరుస్తూ.

సంక్రాంతి వెళ్ళినా ఇంకా చలి తగ్గలేదు. శివరాత్రి వెళితేనేగాని 'శివశివా' అంటూ పోదని నానుడి. ఆపైన రాష్ట్రం నలుమూలలనుంచీ వచ్చిన ఆ పిల్లలకు వాళ్ళు ఉండే ఊళ్ళకంటే ఇక్కడ చలి ఎక్కువగానే ఉన్నట్లనిపిస్తోంది.

రోజూలాగానే హాస్టల్‌నుండి అయిదారుగురు ఆడపిల్లలు కలిసి వచ్చారు. వాళ్ళు వచ్చేటప్పటికే చాలామంది ఆ సీమెంటు బాటమీద వడివడిగా నడుస్తూ కనబడ్డారు. కొందరు వయస్సుమళ్ళిన వాళ్ళు రెండు మూడు సార్లు తిరిగి వచ్చి అక్కడక్కడా వున్న సీమెంటు బెంచీలమీద కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఓ పక్కన యోగా తరగతులు జరుగుతున్నయి. గురువుగారు చేస్తూ, మైక్‌లో ఎదురుగా కూర్చున్నవాళ్ళకు సూచనలు ఇస్తున్నారు. ప్రతివాళ్ళూ దుప్పటో, జంపకానానో పరుచుకొని కూర్చొని వివిధ భంగిమల్లో ఆయన చెప్పినట్లుగా ఆసనాలు వేస్తున్నారు.

తరువాత గంటకు పార్కుదాటి చెమటలు పడుతున్న ముఖాన్ని తుడుచుకుంటూ నివేదిత మిగతా ఆడపిల్లలతో కలిసి బయటకు వచ్చింది. వాళ్ళు వెళ్ళి స్నానాలు చేసి బ్రేక్‌ఫాస్ట్ తీసుకొని క్లాసులకు వెళ్ళాలి.

గేటుపక్కనే ఒకామె కూర్చొని నానబోసిన మొలకలెత్తిన గింజల్ని అమ్ముతున్నది. మరొకామె గ్రైండర్‌లో క్యారట్ జ్యూస్ తయారుచేస్తున్నది. వాకింగ్‌కు వచ్చినవాళ్ళు, యోగా చేసేవాళ్ళు, వెళుతూ వెళతూ పక్కగా వున్న గట్టుమీద కూర్చొని వాటిని కొనుక్కొని తింటున్నారు, త్రాగుతున్నారు.

నివేదిత గేటుదాటుతుండతానే, "నమస్కారమమ్మా!" అన్న మాట వింటూనే తల పక్కకు తిప్పింది ఎవరా అనుకుంటూ. అతడు మూడు రోజుల క్రితం తనని నాంపల్లి స్టేషన్‌నుండి హాస్టల్‌కు తీసుకు వచ్చిన ఆటో డ్రైవరు!

"ఈ యేరియాలో ఇదే పెద్ద పార్కమ్మా! మార్నింగ్ వాక్ అలవాటున్నదా

అమ్మా!... అది ఆరోగ్యానికి ఎంతో మంచిది... నేను నైట్ డ్యూటీ చేయని రోజున తప్పకుండా వస్తాను!" అన్నాడు నవ్వుతూ. "మీరెక్కడికైనా వెళ్ళాలంటే చెప్పండమ్మా... ఆటో తీసుకు వస్తాను... మీటరు మీద ఒక్కపైసా ఎక్కువివ్వద్దు... మీ ఫ్రెండ్స్‌కు కూడా చెప్పండి..."

"అలాగే!" అంటుండగానే రాత్రి తల్లి ఫోన్‌చేసి చెప్పిన విషయం గుర్తుకు రావటంతో ఆలోచనలోపడ్డట్లుగా ఆగింది. 'వచ్చే ఆదివారం మా అత్తయ్య మనవడి పెళ్ళి హైదరాబాద్‌లోనే... ఫోన్‌చేసి చాలా నిష్ఠూరంగా మాట్లాడింది... ఇన్నాళ్ళూ దేశం పట్టుకు తిరిగారు గనుక మీరు మా ఇళ్ళల్లో శుభకార్యాలకు రాకపోయినా అంతగా బాధపడలేదు... ఇప్పుడు దగ్గరలోకే వచ్చారు... రాకపోతే ఊరుకుండేదిలేదు... మేం రావద్దా మీ అమ్మాయి పెళ్ళికి అంటూ చివాట్లుపెట్టింది... నాకూ నాన్నకూ రావాలనే ఉన్నదిగాని, శ్రీనివాసరావు అంకుల్– నీకు తెలుసుగదా నాన్నతోపాటు మూడేళ్ళు కలకత్తాలో పనిచేసి, రిటయిరయి విజయవాడ వచ్చి సెటిల్ అయ్యాడు క్రితం సంవత్సరం... వాళ్ళమ్మాయి సునీత పెళ్ళి విజయవాడలో అదే లగ్నానికి... నాకు ఇక్కడ అండగా నిలిచేవాళ్ళు తక్కువ... నువ్వే దగ్గరుండి అన్నీ చూడాలి అంటూ ఒత్తిడి చేస్తున్నాడు... ఉండక తప్పేలా లేదు... ఎలాగూ నువ్వు అక్కడే వున్నావుగదా నువ్వన్నా వెళితే వాళ్ళు సంతోషిస్తారు!' అంటూ.

'నాకు ఇలాంటి పనులు పెట్టొద్దమ్మా... నేను చదువుకోవటానికి వచ్చాను! పెళ్ళిళ్ళూ పేరంటాలు అంటూ టైం వేస్ట్ చేయటం నాకిష్టంలేదు!' అన్నది చిరాగ్గా తను.

'పొద్దున ఎనిమిదింటికి పెళ్ళి... ఆదివారమే కదా... వెళ్ళి ఆ సమయానికి వుండి వీలుంటే భోజనం చేసిరా... అడ్రసు, ఫోన్ నంబరు చెబుతానుగాని రాసుకో... ఎట్లాగో అట్లా వీలుచూసుకొని వెళ్ళు... మేమూ రాక, అక్కడున్న నువ్వూ వెళ్ళకపోతే బాగుండదు!' అంటూ వివరాలు చెప్పింది.

అది గుర్తుకు రాగానే, "నీకు అత్తాపూర్ తెలుసా?" అని అడిగింది అతడిని

నివేదిత.

"అత్తాపూర్ తెలియకపోవటమేమిటమ్మా... మా ఆడదాని పుట్టిల్లు అక్కడేగా!" అన్నాడు గారపట్టిన పళ్ళను బయటకుపెట్టి పెద్దగా నవ్వుతూ. "ఎప్పుడు వెళ్దామో చెప్పండి... మా అత్తగారికి గూడా ఒంట్లో బాగోలేదట చూసి చాలా రోజులయింది! మిమ్మల్ని దించాల్సిన చోట దించి మీ పని పూర్తయ్యేలోగా మా వాళ్ళింటికి వెళ్ళి వస్తాను!"

"వచ్చే ఆదివారం పొద్దున్నే అక్కడ ఓ పెళ్ళికి వెళ్ళాలి...!"

"తప్పకుండానమ్మా... రోజూ పొద్దున్నే ఇక్కడ కనబడుతునే ఉంటాను గదా... శనివారం చెప్పండి చాలు... మీరెన్నింటికి రమ్మనమంటే అన్నింటికి హాస్టల్‌కు ఆటో తీసుకు వస్తాను!"

"నీ సెల్‌నంబరు ఇవ్వరాదూ!"

అతడు నవ్వాడు. "తీసుకోవాలమ్మా!... ఇంకా తీసుకోలేదు... సంసారం గడవటమే ఇబ్బందిగా వున్నది... నలుగురు పిల్లలు... అందులో ఒకడయితే కాలేజీకి వచ్చాడు... వాళ్ళ ఫీజులు కట్టటానికే నా ఆదాయమంతా సరిపోతోంది... అందుకే మరీ డబ్బు అవసరం పడ్డప్పుడు రాత్రిళ్ళు కూడా బండి వేస్తాను... ఎంత కష్టపడ్డా రెండు పూటలా తిండికి సరిపడటమే కష్టంగా వున్నది... సెల్లే కాదు... మా ఇంట్లో టీవీకూడా లేదు... ఎప్పుడో ఇరవై ఏళ్ళ క్రితం కొన్న రేడియోనే నా భార్యకు కాలక్షేపం!" అన్నాడు అతడు దిగులుగా మొహంపెట్టి. "నా జీవితం ఇంతేనమ్మా!"

అతడి మాటలు వింటుంటే జాలివేసింది అపరంజికి. "నీ పేరు?"

"కృష్ణదేవుడు! మానాన్న బ్రతికున్నంతకాలం పూజించింది ఆయన్నే!" అన్నాడు నవ్వుతూ.

అతడివంక విచిత్రంగా చూస్తూ వుండిపోయింది నివేదిత ఆపేరు చాలా కొత్తగా ఉండటంతో.

అతడు మరోసారి నమస్కారంచేసి వెళ్ళిపోయాడు.

అప్పటికే ఆమెతోపాటు వచ్చిన వాళ్ళంతా చాలా దూరం వెళ్ళారు.

* * *

రాత్రి ఎనిమిది గంటలయింది. ఆసుపత్రిలోవున్న స్నేహితురాలి తండ్రిని చూడటానికి వెళ్ళిన నిర్మల ఇంకా రాలేదు. వెళ్ళేటప్పుడు తననికుడా రమ్మనమంటుందేమో అనుకున్నదిగాని, రమ్మనక పోవటంతో కాస్తంత చిన్నతనమేసింది అపరంజికి. నిర్మల పూర్తిగా మారిపోయింది. ఈసారి ఎప్పుడైనా అది ఇండియా వచ్చినా తను హడావుడి పడుతూ రావాల్సిన పనిలేదు. అంతగా అయితే వచ్చి ఒకటి రెండు రోజులుండి వెళ్ళవచ్చు.

మేడమీదకు వెళ్ళింది. ఈసారి రాక ఆమెకు అన్నివిధాల ఉత్కంఠతోనే కాదు, నిరాశతోనూ నిండిపోయింది. రైలులో ఆ ముఠా గోల, తరువాత నివేదిత దర్శనం, ఇప్పుడు ఎంతో సరదాగా గడుపుదామని వచ్చిన తనను నిరాశపరుస్తూ నిర్మల ప్రవర్తన...

ఆ శంకర్‌గాడిదో గోల... తను భయపడ్డట్లే అతడూ హైదరాబాద్ జేరాడు. తనకోసమేనేమోననేది తన భయం. అది అయివుండవచ్చు, కాకపోనూ వచ్చు. మామయ్య సలహా పాటించటం ఎందుకైనా మంచిదనిపించింది.

మేడమీదకు వెళుతూనే ఓ పక్కగా పిట్టగోడనానుకొని కూర్చున్నది. నేల చల్లగా వున్నది. పక్కగా వున్న కొబ్బరిచెట్లగాలి ఆ వాతావరణానికి మరింత చల్లదనాన్ని ఇస్తున్నది. వాటి ఆకుల నడుమనుండి పడుతున్న చంద్రకిరణాలు నేలమీద తెల్లని గీతలు గీస్తున్నాయి...

చేతిలోని సెల్‌వంకే చూస్తూ నివేదిత నంబరుకు కాల్‌చేసింది. ఆ అమ్మాయిని ఎలా అయినా కన్విన్స్ చేసి డిఎన్ఏకు అంగీకరించేలా చేయాలి. నిజానిజాలు తెలుసుకునేదాకా తనకు నిద్రపట్టదు.

ఆ రింగ్‌కు సమాధానంగా నివేదిత తన సెల్‌ను ఆన్‌చేస్తూనే, "చెప్పు అక్కా!"

అన్నది. ఆ అమ్మాయి నోటినుండి ఆ మాట అప్రయత్నంగా వచ్చింది.

అపరంజికి ఆమాట వింటూనే ఒళ్ళంతా పులకరించినట్లయింది. "చెల్లీ!" అన్నది ఆవేశంగా. నివేదితమీద ఆప్యాయతతో కళ్ళు తడవటం మొదలు పెట్టినయి. కొద్దిక్షణాల వరకూ గొంతు పూడుకుపోయింది. తరువాత రెండు నిముషాలకు తేరుకొని, "చదువు ఎలా సాగుతోంది!" అన్నది చిన్నగా.

"బాగానే చదువుతున్నాను... నా రూంమేట్‌కూడా మంచిదే... ఆ అమ్మాయికీ చదువుతప్ప మరే ధ్యాసా లేదు... ఇక్కడ అందరిలోనూ పరీక్షల్లో విజయం సాధించాలనే తపన ఒక్కటే కనబడుతున్నది నాకు!"

"గుడ్!... అనుకున్నది సాధించటంలో ఎంత శ్రమయినా ఎవ్వరూ పట్టించుకోరు... విజయం పొందినప్పుడు అంత కష్టపడ్డామా అని ఆశ్చర్యపోతారు కూడా... అది మొక్కను నాటిననాటికంటే దానినుండి లభించే ఫలాలను ఆస్వాదిస్తున్నప్పుడు పొందే ఆనందంలాంటిది!" అన్నది సంతోషంగా అపరంజి. "రోజూ అమ్మకూ నాన్నకూ ఫోన్ చేస్తున్నావా?"

"ఒకసారి కాదక్కా... రెండు మూడుసార్లు!" అన్నది పెద్దగా నవ్వుతూ.

కొద్దిక్షణాల నిశ్శబ్దం తరువాత, "నేను చెప్పింది ఆలోచించావా చెల్లీ?... ఉత్కంఠకు తెరదించి నిజానిజాలు తెలుసుకోవాలనేది నా ఆలోచన... అంతకుమించి మరేమీ లేదు!" చిన్నగా అడిగింది అపరంజి.

నివేదితకు ఆ విషయం అర్థమవ్వగా మాట్లాడలేనట్లుగా కొద్దిసేపు మౌనంగా ఉండిపోయింది. "నాకు భయంగా వున్నది...!" అన్నది తరువాత నోరు తెరిచి అపరంజి రెట్టించటంతో.

"దేనికి?... ఎందుకు భయపడాలో అర్థం కావటంలేదు... అసలు సంగతి తెలుసుకోవటంలో తప్పేమున్నది?"

"తప్పున్నదని నేను అనటంలేదు... తెలుసుకోవటం వలన లాభాలకంటే నష్టాలే

ఎక్కువున్నయ్యేమోననేది నా ఉద్దేశ్యం!"

"లాభాల సంగతి తరువాత చూద్దాం... నష్టాల గురించి చెప్పు... అది నిజంగా మనకు నష్టమే కలిగించేదే అయితే నేనూ ఆ ఆలోచనను విరమించుకుంటాను!"

"గత ఇరవైరెండు సంవత్సరాలుగా స్వంత తల్లీదండ్రులుగా భావిస్తూ వాళ్ళ అనుబంధంతో ఆనందం పొందుతూ, వాళ్ళ ఆప్యాయతలను ఆస్వాదిస్తూ, వాళ్ళవలన ఇంత వాళ్ళమయి ఇప్పుడు ఏవేవో పరిశోధనలు చేసి, పరీక్షలు చేయించుకొని, మీ వాళ్ళో మా వాళ్ళో లేక ఇద్దరూనో అబద్ధాలాడుతున్నారని తెలుసుకొని మన బుర్రలు పాడుచేసుకోవటమే కాకుండా వాళ్ళకూ మనస్థాపం కలిగించటం దేనికి? దానివలన ఏం ప్రయోజనం? ఎవరికి ప్రయోజనం?" చాలా దృఢంగా వున్నాయి ఆ మాటలు.

"మనల్ని కన్న తల్లిదండ్రులు ఎవరో తెలుసుకోబోయే ఆనందం ముందు ఇది చాలా చిన్న బాధ మాత్రమే! నిజాలు మనకు తెలిసినయ్యని వాళ్ళు కలతచెందవచ్చు... మనం తెలుసుకున్నది నిజమే అయితే వాళ్ళ బాధ తాత్కాలికమే. త్వరలోనే కోలుకుంటారు...!"

"నా తల్లిదండ్రులే మన తల్లిదండ్రులయితే నేను భయపడాల్సిన అవసరంలేదు... అంతేకాదు నాకు రక్తం పంచుకుపుట్టిన ఓ సోదరి ఉన్నదని ఎంతగానో సంతోషిస్తాను... కానీ మీ తల్లిదండ్రులు ఎంతగా బాధపడతారో ఆలోచించావా?"

"అదే చెబుతున్నది... నేను తల్లిదండ్రులుగా భావిస్తున్న వాళ్ళు నిజంగా నా తల్లిదండ్రులు కానప్పుడు నేను నిజాన్ని తెలుసుకున్నంత మాత్రాన వాళ్ళు బాధపడవలసిన అవసరం లేదు... అది ఎప్పటికయినా బయటపడుతుందనే విషయం వాళ్ళకూ తెలుసు గనుక అందుకు తయారుగానే వుంటారు... అంతేకాదు ఇన్ని సంవత్సరాలు నన్ను పెంచి పెద్దచేసిన వాళ్ళమీద నాప్రేమ ఏమాత్రం తగ్గకపోగా పెరుగుతుంది– తాము కనకపోయినా కన్నకూతురి కన్నా మిన్నగా నన్ను పెంచిన వాళ్ళకు నేను జీవితాంతం ఋణపడివుంటాను... నిజంగా వాళ్ళే తల్లిదండ్రులయితే మనం ఎలాంటి కృతజ్ఞతలూ చెప్పుకోవాల్సిన అవసరం లేదు... మనల్ని పెంచి పెద్ద చేయటమనేది

కన్నందుకు అది వాళ్ళ బాధ్యతే!"

నివేదిత మాట్లాడలేదు.

"చెప్పు... నేను చెప్పినదాంట్లో నిజం లేదంటావా?"

"నిజం లేదని ఎలా అంటాను... నేను రాత్రి ల్యాప్‌టాప్‌లో నెట్‌కు వెళ్ళాను... అసలు ఇది సంభవమా అనేది తెలుసుకోవాలని... మనంత పోలికలున్నవాళ్ళు వేరువేరు చోట్ల జన్మించటం జరగకపోవచ్చు గాని, దగ్గర పోలికలున్నవాళ్ళు చాలా చోట్ల ఉన్నారు... సినిమాలల్లో డూప్‌లుగా వేస్తున్నది అలాంటి పోలికలున్నవాళ్ళే! అంతేకాదు చాలామంది గొప్పవాళ్ళు వాళ్ళ పోలికలున్నవాళ్ళ కోసం వెతుక్కుంటూనే వుంటారు... ఎప్పుడయినా, ఎక్కడయినా అవసరాలకు పనికి వస్తారని!" అన్నది నవ్వుతూ.

"సినిమాలల్లో ఫైటింగ్ సీన్లలో పాల్గొని దెబ్బలు తినేందుకా!" అపరంజీ నవ్వింది.

"దేవుడి సృష్టి ఒకవిధంగా వాళ్ళకు మేలే చేస్తుంది!"

"స్వంత వ్యక్తిత్వం పోగొట్టుకునా?"

"ఎందుకనుకోవాలి అలాఅని... ఏ టేల్ ఆఫ్ టూ సిటీస్, ప్రిన్స్ అండ్ పాపర్ చదవలేదా?"

"నాకూ తెలుసు వాటిలో వున్న విషయం... చార్లెస్ డికెన్స్, మార్క్‌ట్వైన్ వ్రాసిన నవలల్లో ఒకే పోలికలున్న ఇద్దరున్నారు... వాళ్ళమీదే కథంతా నడిచేది!"

"అదేగదా తెలుగులో రాజూ-పేద పేరుతో సినిమాకూడా వచ్చిందని విన్నాను... సూపర్ హిట్ అయిందట!"

"ఓకే... అవన్నీ కల్పిత గాథలు... వదిలేయ్... మనం ఎదురెదురుగ్గా వున్నాం... మనం ఎంతగా ఒకటిగా వున్నామో రైలు ప్రయాణంలో తోటి ప్రయాణీకుల చూపుల్లోనూ, మాటల్లోనూ గమనించలేదా... అందుకే నిజానిజాలు తెలుసుకోవాలనేది నా తపన... మరొకర్ని ఇబ్బంది పెట్టటానికి కాదు!"

నివేదిత మాట్లాడలేదు. మాట్లాడలేకపోతోంది.

"సివిల్స్‌లో ఎంత కష్టపడయినా సరే విజయం సాధించాలనేదే నా మనో వాంఛ... అది నెరవేరాలీ అంటే సంకల్పబలం, సాధనా కావాలి... దానికి ఏకాగ్రత ఎంతో అవసరం... అందుకుగాను మనస్సు ఎంతో నిర్మలంగా వుంటేనేగాని విజయాన్ని పొందలేను... ఈ సమయంలో నా మనస్సులోకి మరే ఆలోచనా రాగూడదు... ఆ ఆలోచనలు నన్ను మనశ్శాంతికి దూరం చేయగూడదు... కోచింగ్ సెంటర్‌లో గడిపే కాలాన్ని మించి నా గదిలో టేబుల్ లైటు ముందు కూర్చొని కళ్ళు చించుకొని కాగితాల్లోని ప్రతి అక్షరాన్ని ఆకళింపు చేసుకుంటున్నాను... అటువంటి నేను మనస్సు కలిచివేసే ఏ చిన్నవిషయాన్నయినా భరించలేను... నా ధ్యేయాన్ని నాశనం చేసుకోలేను... సారీ అక్కా! ఇంకా ఆ విషయాన్ని మరిచిపో... ఇక మన స్నేహాన్ని అంటావా... అది స్నేహమనను... ఒకే రక్తం పంచుకు పుట్టిన అక్కా చెల్లెళ్ళులాగానే బ్రతుకుదాం... మన పెద్దవాళ్ళను కూడా మనల్ని చూడనీయ్... మనలాగానే వాళ్ళనూ ఆశ్చర్యపోనీయ్... నన్ను క్షమించు అక్కా! గుడ్‌నైట్!"

ఆఫ్ అయిన సెల్ వంకే ఆ చీకట్లో మేడమీద ఒంటరిగా కూర్చున్న అపరంజి గుడ్లప్పగించి చూస్తోంది.

సరిగ్గా అప్పుడే నిర్మల మేడమీదకు వచ్చింది. "సారీరా అప్పూ!.. నీకు తెలియని వాళ్ళ మధ్య బోరుకొడుతుందేమోనని నిన్ను తీసుకు వెళ్ళలేదు... పాపం నా ఫ్రెండ్ ఫాదర్‌కు సీరియస్‌గానే వున్నది... ఇక నా స్వంత పనలన్నీ అయిపోయినట్లే... మా హబ్బీ శంషాబాద్ విమానాశ్రయంలో విమానం దిగేంతవరకూ మనదే ప్రపంచం!" అన్నది దగ్గరకు వస్తూ.

* * *

సికింద్రాబాద్ స్టేషన్‌కు దగ్గరలో వున్న ఒక సాధారణ లాడ్జి అది. గత యాభై సంవత్సరాలుగా నడుస్తున్నా ఎలాంటి మార్పులు చేర్పులూ లేవు. పాత బిల్డింగు. పాత మంచాలు. పాత పరుపులు. అక్కడకు వచ్చేది కూడా పాత కస్టమర్లే. దగ్గర

ఊళ్ళనుండి వచ్చి, పనులుగాక మరీ పొద్దుబోతే ఒకరాత్రో, అరరాత్రో గడిపే పాసింజర్లు కూడా చవకలో లభిస్తుందని అక్కడకు వస్తుంటారు.

దాని యజమానికి అది తండ్రినుంచి సంక్రమించిన ఆస్థి. ఆయన పోతూపోతూ ఆ పాత బిల్డింగ్‌నయితే ఇచ్చాడుగాని, దాన్ని నేటి పరిస్థితులకు అనుగుణంగా మార్చే ఆర్థిక బలాన్ని చేకూర్చలేదు. దాన్ని అట్లా వుంచినా తిండికి ఇబ్బందిలేకుండా ఆదాయం వస్తూనే వున్నది. దాన్ని నమ్ముకొని మరో నలుగురయిదుగురు వయసు మీరిన వాళ్ళు దాంట్లో పనిచేస్తుంటారు అక్కడే వుండి సేటు పెట్టింది తింటూ.

రాత్రి తొమ్మిది గంటలయింది. శంకర్ అప్పుడే హోటల్లో భోజనం చేసి వచ్చి మంచం మీద వాలిపోయాడు. పక్కనే ఒక కాలు ఊగుతున్న టీపాయ్‌మీద ఆఫ్ బాటిల్ పెట్టుకున్నాడు. దాని పక్కనే కాసిని చిప్స్, పకోడీలు కలిపి బండిమీద కట్టించుకు వచ్చిన పొట్లం వున్నది. ఓ అరగంట ఆలోచనలతో గడిపి, మరునాడు చేయాల్సిన పనులలో  నిర్ణయాలు తీసుకొని, తరువాత ఆ సీసా ఖాళీచేసి పడుకొని నిద్రపోతాడు.

మంచం మీదవాలిన పదినిముషాలకే అతడి సెల్ మ్రోగింది. ఆ నంబరు చూస్తూనే పడుకున్నవాడల్లా లేచి కూర్చున్నాడు.

"ఏరా శంకర్! ఏమయింది... సినిమాస్టార్‌లాంటి అమ్మాయిని తీసుకువస్తున్నానని ఫోన్ చేసల్లా చెప్పావ్... దాన్ని తీసుకురాకపోంగా నా మనుష్యుల్నే విజయవాడ స్టేషన్‌లో పోలీసులకు అప్పగించావ్... ఒళ్ళు ఎలా వున్నది... బుద్ధాగాడిని పంపమంటావా?" అన్నది అరుస్తున్నట్లుగా. తనకు తెలుసు బుద్ధా బహు కిరాతకుడని!

అలాంటి బెదిరింపు మాటలకు అతడు బాగా అలవాటు పడ్డాడు. అందుకే కంగారు పడకుండా తేలిగ్గా నవ్వుతూ, "అలా ప్రతిదానికీ తొందరపడితే ఎలా... మనమే తెలివిగలవాళ్ళం అనుకోవటం కాదు... పోలీసులూ మనల్ని మించిన తెలివిగలవాళ్ళే... విజయవాడలో మనవాళ్ళంతా బయటకు వచ్చేశారని కృష్ణ సాయంత్రమే ఫోన్‌చేసి చెప్పాడు... పోలీసులు వాళ్ళ మీద మోపిన ఏ నేరాన్ని ఋజువు చేయలేకపోయారు... అక్కడ చక్రం తిప్పటానికి నాకు పదివేలు ఖర్చయింది...

దానికితోడు ఆ శ్రీకాకుళం కొత్తపిల్ల బయటకు వస్తూనే పారిపోయింది... అదో మహా పిరికిగొడ్డు... పోతేపోయిందిలే... నేనేం డబ్బులివ్వలేదు... తిండిపెట్టించాను అంతే!" అన్నాడు.

"అయితే ఇప్పుడేమంటావ్?"

"అనేదేమీలేదు... విజయవాడలో ఖర్చు చాలా అయిందంటున్నాను... అటు నేను చెప్పినట్లుగా ఆ బంగారు బొమ్మను తేవటంలో చాలా రిస్కు గూడా వున్నది... చూస్తే అది మహా పొగరుమోతులా వున్నది... అందుకే లక్షరూపాయలకు తక్కువయితే కుదరదు!"

అవతల స్త్రీ పెద్దగా నవ్వింది. "ఏరా... అంత పెద్దవాడివయిపోయినావా?" ఆ మాటలోని ఎగతాళికి అతడి ఒళ్ళు కాస్తంత జలదరించింది. అవతల నవ్వుతున్నది ముంబాయ్‌లో ఓ బ్రోతల్ హౌస్ మేడమ్... మరీ అంత పెద్దగా నవ్విందంటే తలకాయలే లేచిపోతయ్యని అతడికి తెలుసు... శంకర్ మన రాష్ట్రంలో ఆ కంపెనీకి ఏజెంటు...

"అదిగాదు మేడమ్! కష్టానికి ఫలితముండాలంటావా... నీకేం దర్జాగా అక్కడ కూర్చొని కబుర్లు చెబుతుంటావ్... పోలీసుల చేతుల్లో లాఠీ దెబ్బలు తినేది, జైలుపాలయ్యేది నేనేగదా...!" అనునయిస్తున్నట్లుగా అన్నాడు.

"సరేలేరా సన్నాసీ! విజయవాడ ఖర్చులో సగం ఇస్తాలే!" ఆమెకూ తెలుసు శంకర్ అంత ఖర్చుపెట్టి వుండడని. "నువ్వు ఊరిస్తున్న ఆ పిల్లఫొటో పంపుతానన్నావ్ పంపలేదు... వెంటనే పంపు... చూసి అదెంత చేస్తుందో చెబుతా!"

"లక్షకు తక్కువయితే కష్టం మేడమ్!" నసుగుతున్నట్లుగా అన్నాడు.

"మాటకు ముందు లక్షంటావ్ ఏమిటిరా నీ ఉద్దేశ్యం... నా దొడ్లో ఏవైనా చెట్టుందా... ఫ్యామిలీ లేడీ అంటావ్... పొగరుమోతంటావ్... అదే నిజమయితే దాన్ని లైన్‌లో పెట్టటానికి నేనెంత తిప్పలు పడాలో ఆలోచించు... ఈలోగా

దానివిషయం ఏ పోలీసులకో, మహిళాసంఘాలకో ఉప్పందిందంటే నేను నెత్తిన చెంగేసుకొని ముంబాయ్‌నుంచి పారిపోయి మరెక్కడో మారుమూల మరో దుకాణం తెరవాలి... దాన్ని చూసి న్యాయంగా ఎంతివ్వాలో అంతిస్తాను కదా. నచ్చి అది నాకు అనుకూలంగా మారితే నీజేబు ఎప్పుడూ ఖాళీగా వుండదు... ఊరికినే నసపెట్టి నాకు చికాకు కలిగించబోకు...!" అవతల ఫోన్ పెట్టేసింది విసురుగా మేడమ్!

అతడికి తెలుసు... అలాగే మాట్లాడుతుందిగాని చివరకు ఫొటో చూస్తే ఒప్పుకుంటుందని... దానికి తన కంపెనీమీద నికరాదాయం రోజుకు పదివేలకు తక్కువుండదు– వాళ్ళకూ, వీళ్ళకూ మామూళ్ళంటూ ఎంత ఖర్చుపెట్టినా!

శంకర్ మంచంమీద జారిగిల పడిపోయాడు. ఒకసారి క్రీగంట బాటిల్ వంక చూశాడు...

మళ్ళా సెల్ మ్రోగింది... మేడమే అయివుంటుందిలే అనుకుంటూ చేతిలోకి తీసుకుంటే చేసింది శంభు. తన శిష్యుడు ఆటో డ్రైవర్ శంభు ఎలియాస్ త్రినేత్రుడు ఎలియాస్ కృష్ణదేవుడు!

# 6

ఆదివారం ఉదయం ఎనిమిది గంటలు.

అపరంజి బద్ధకంగా లేచింది మంచం మీదనుంచి. రాత్రి పన్నెండు గంటలదాకా నిర్మల అమెరికా విషయాలు చెబుతూనే వున్నది. తనూ అక్కడ ఉద్యోగంలో జేరాలని ప్రయత్నిస్తున్నదట!

"రేపు పిల్లలు పుడితే ఇబ్బందిగదే!" అన్నది అపరంజి.

''దానికి తగ్గ ఏర్పాట్లు దానికున్నాయిలే... డబ్బు ఎక్కువ ఖర్చు అవుతుందన్నమాటేగాని మన అవసరానికి ఆ సౌకర్యాన్ని ఉపయోగించుకోక తప్పదు... అయినా మేము మరో అయిదేళ్ళదాకా పిల్లలజోలికి వెళ్ళ దలుచుకోలేదు!" అన్నది

నిర్మల ముఖం పక్కకు తిప్పుకుంటూ.

"అయితే పిన్ని బాబాయ్ ఇప్పుడప్పుడే అమ్మమ్మ తాతయ్యలు కాలేరన్నమాట!"

"బామ్మా తాతయ్యలయి ఆ మురిపాన్ని తీర్చుకున్నారు కదా!... ఇంకా తొందరేమున్నది?" అన్నది పకపకా నవ్వుతూ నిర్మల.

అప్పటికి అపరంజి హైదరాబాద్ వచ్చి వారం రోజులయింది. ఈసారి ప్రతిసారిలా తను స్నేహితురాళ్ళ ఇళ్ళచుట్టూ తిరగటంలేదు. మామయ్య ఇచ్చిన వార్నింగ్‌తో పిన్ని ఇంటినుంచి కదలనీయటంలేదు. అమెరికా వాతావరణపు మైకంలో వుండి ఇక్కడ ప్రతిదాన్నీ 'డర్టీ డర్టీ' అంటున్న నిర్మలకూ బయట తిరగాలని అనిపించకపోవటం మరో కారణం. వాళ్ళ స్నేహితురాళ్ళే రోజూ ఒకళ్ళిద్దరు వచ్చి వెళుతున్నారు.

టిఫిన్ తిని కాఫీ త్రాగి టీపాయ్‌మీద వున్న ఆరోజు పేపరు తీసుకొని చూడటం మొదలు పెట్టింది. తన తరువాత మంచం దిగిన నిర్మలది ఇంకా స్నానమే కాలేదు.

సరిగ్గా అప్పుడు సెల్ మ్రోగింది. అది చేసింది నివేదిత.

"అక్కా! నన్ను ఎవరో బలవంతంగా ఆటోలో లాక్కు వెళుతు...!" అంటూనే వున్నది ఆమె చెంప ఛెళ్ళుమన్న శబ్దమూ, తరువాత ఎవరో పెద్దగా వేసిన కేక, "అమ్మా" అంటూ నివేదిత ఏడపు– అన్నీ ఒక్కక్షణంలో ఆమె చెవికి సోకటమే గాకుండా– తరువాత దాని గొంతు నులిమేసినట్లుగా సెల్లూ ఆగిపోయింది.

బిగుసుకుపోయింది అపరంజి. ఆమెకు నివేదిత ఏం చెప్పిందో అర్థం కానంతగా పిచ్చి చూపులతో చేతిలోని సెల్‌వంకే చూస్తూ ఉండిపోయింది...

బలవంతాన తీసుకు వెళుతున్నారంటే?– మనస్సంతా గందరగోళమయింది. క్షణంలో కళ్ళముందు శంకర్ మెదిలాడు. నివేదితనే తననిగా భావించి బలవంతాన లాక్కు వెళ్ళటం ఆ శంకర్‌గాడు చేసిన పనికాదుగదా... ఆ ఆలోచన రాగానే ఉక్కిరిబిక్కిరి అయింది... ఏదో జరగరానిది జరుగుతున్నట్లుగా వణికిపోసాగింది...

అదే నిజమయితే నివేదితను కిడ్నాప్‌చేసి, ముంబయ్ తరలించి... ఆ

మహానగరంలోని నరకకూపాల్లో కుక్కివేసి, జీవితాన్ని మగరాక్షసుల రొచ్చుకాళ్ళతో తొక్కించివేస్తూ... మరొక్కమాటగూడా ఊహించలేనట్లుగా ఆమెను నిర్వీర్యం చేస్తూ కళ్ళను చీకట్లు క్రమ్మివేస్తున్నయి...

శంకర్‌కు నివేదిత ఎక్కడ కనబడింది...?

ఒక్క ఉదుటున లేచింది. "పిన్నీ! నేను బయటకు వెళుతున్నాను!" అంటూనే ఆ గదిలోనుంచి బయటకు వచ్చేసి, పోర్టికో మెట్లను దూకుతున్నట్లుగా దిగి, క్రోటన్ మొక్కల మధ్యగా పరుగెడుతూ గేటు దాటింది.

వంటయింట్లో వున్న ఆమె అపరంజి కేక వింటూనే హడావుడిగా బయటకు వచ్చింది, "ఎక్కడికే?" అంటూ.

అప్పటికే అపరంజి ఆటో ఎక్కేసి "చిక్కడపల్లి!" అన్నది.

"వంద రూపాయలు!" అన్నాడు అతడు తాపీగా.

"ముందు పోలీస్ కంట్రోల్‌రూంకు పోనీయ్... అక్కడ నీకు వంద ఇచ్చి నేను చిక్కడపల్లి మరో ఆటోలో వెళతాను!" అన్నది పెద్దగొంతుకతో అరుస్తున్నట్లుగా!

అ కంఠం విని తలను వెనక్కు తిప్పిన అతడు ఆమె ముఖాన్ని చూస్తూనే, ఏమనుకున్నాడో ఏమో ఆటోను ముందుకు దూకించటమే కాదు, చిక్కడపల్లి వెళ్ళేందుకు దగ్గర దారి ఏదా అని ఆలోచించసాగాడు!

* * *

"అంకుల్ అర్జంటుగా మీ సాయం కావాల్సివచ్చింది!" అపరంజి కంఠం వణుకుతున్నది.

ఏసీపి జగన్నాథం అప్పుడే డ్రస్ చేసుకు వచ్చి సోఫాలో కూర్చొని బూట్లు వేసుకుంటున్నాడు.

అపరంజి పక్కన కామాక్షి వున్నది. ఆయనకు తెలుసు విశాఖపట్నంలో వుండే

అపరంజి తన కూతురుకి ఆత్మీయ మిత్రురాలని!

చాలా కంగారుగా వున్న అపరంజి వంక నుదురు ముడివేసి చూస్తూ, "చెప్పు... ఏంజరిగింది?" అన్నాడు.

"మా స్నేహితురాలిని కిడ్నాప్ చేశారు, అంకుల్!"

ఆయన ఆ మాటలకు ఎలర్ట్ అయినట్లుగా సర్దుకు కూర్చున్నాడు.

"నీకెలా తెలిసింది?" కళ్ళు చికిలించాడు.

"అదే ఫోన్ చేసింది నాకు!"

"వాళ్ళు వదిలిపెట్టటానికి ఎంత డబ్బు కావాలని అడుగుతున్నారట?"

ఆయన ప్రశ్నకు బిత్తరపోయింది అపరంజి. ఆ పోలీసు ప్రశ్నకు ఏం చెప్పాలో అర్థంకానట్లుగా తడబడింది. "అదేం చెప్పలేదు అంకుల్! నా సెల్‌లో కాల్ వచ్చింది... అందుకే హడావుడిగా మీదగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చాను!" అన్నది వడివడిగా.

"ఆ పని ఎవరు చేశారో చెప్పిందా?" ఆమెనే నిశితంగా చూస్తూ అడిగాడు.

"లేదు అంకుల్! నన్ను బలవంతంగా ఆటోలో తీసుకు వెళుతున్నారు... అంటూనే వున్నది ఆ అమ్మాయిని కొట్టినట్లుగా పెద్దశబ్దమయి ఫోన్ ఆగిపోయింది... నా అనుమానం..." అంటూ ఆయన వంక చూస్తూ వుండిపోయింది.

"ఎవరిమీద నీ అనుమానం?"

సరిగ్గా ఆ సమయంలో అపరంజి సెల్‌లో రింగయింది. చికాగ్గా చూసింది దాంట్లో డిస్‌ప్లే అయిన పేరు వంక. అది చేసింది నిర్మల. అరగంటక్రితం తను ఇంటినుంచి బయల్దేరింతరువాత ఇది ఆరోసారి! దాన్ని వెంటనే కట్ చేసేసింది.

"ఆ పనిచేసింది శంకర్ అనే రౌడీ అని! మూడు రోజుల క్రితం ఆడపిల్లల్ని తీసుకొని వైజాగ్‌నుంచి ముంబయ్ వెళుతున్న గ్యాంగ్‌ను విజయవాడ స్టేషన్‌లో పట్టుకున్న విషయం మీ దృష్టికి వచ్చిందో లేదో... అక్కడ రైల్లోనుంచి పోలీసులు దించిన ఆ

గ్యాంగ్‌నుంచి దాని లీడర్ తప్పించుకు పారిపోయాడు... వాడే ఆ శంకర్!"

"అయితే అతడే ఇప్పుడు హైదరాబాద్ వచ్చి ఈ అమ్మాయిని కిడ్నాప్ చేశాడంటావ్... అదేనా నీవనేది? కానీ అతడ్ని పోలీసులు పట్టుకోవటానికి, ఇప్పుడు నీ స్నేహితురాలిని అపహరించటానికి లింకేమిటో నాకు అర్థం కావటం లేదు!"

"అతడి దృష్టి ఆ రైల్లోనే అదే బోగీలో ప్రయాణించిన నా మీద పడింది గనుక!"

"అప్పుడు నిన్ను కిడ్నాప్ చేయాలికానీ ఆ అమ్మాయిని ఎందుకు చేస్తాడు?" ఆయన కంఠస్వరంలో కాస్తంత విసుగు ధ్వనించింది. ఈ అమ్మాయి ఏదో అపోహతో అనవసరంగా భయపడుతున్నదా అనిపిస్తోంది ఆయనకు.

మళ్ళా సెల్ రింగయింది. నిర్మలే చేసింది. "మరోసారి చేశావంటే చంపేస్తాను... నేను చేసిందాకా నువ్వు నోర్మూసుకు కూర్చో!" పెద్ద పెట్టున అరవసాగింది.

"ఎవరు చేసిందా ఫోను?" జగన్నాథం అడిగాడు.

"మా కజిన్!" అన్నది చిరాగ్గా. ఒక్క క్షణం ఆలస్యమయినా నివేదిత ముంబాయ్ జేరిపోతుందేమోనన్నంతగా భయపడిపోతున్నది అపరంజి.

"ఇంట్లో ఇక్కడకు వస్తున్నట్లుగా చెప్పివచ్చావా నువ్వు?"

"లేదంకుల్!"

"కామాక్షీ! నువ్వా సెల్ తీసుకొని వాళ్ళకు చెప్పు... అపరంజి నీ దగ్గరే వున్నదని, ఓ గంటలో వస్తుందని, కంగారు పడవద్దని!"

కామక్షి అపరంజి చేతులోని సెల్‌ను తీసుకొని పక్కకు వెళ్ళింది.

"అలా కూర్చొని, ఎక్సయిట్ అవ్వకుండా... నీ బదులు ఆ అమ్మాయిని ఎందుకు కిడ్నాప్ చేయవలసి వచ్చిందనుకుంటున్నావో వివరంగా చెప్పు!" అన్నాడు ఆయనా సోఫాలో కాస్త రిలాక్సింగ్‌గా వెనక్కు వాలుతూ.

"ఆ అమ్మాయికూడా నా పోలికలతోనే ఉన్నది కనుక!" నీరసంగా తలవాల్చింది.

తను వైజాగ్‌లో బయల్దేరిన దగ్గరనుంచి జరిగినదంతా ఆయనకు చెబితేనే కాని ఆయనకు తన భయమేమిటో అర్థంకాదు.

"ఎవరా అమ్మాయి?" అపరంజి కళ్ళల్లోకే రెప్పలార్పకుండా చూస్తూ అడిగాడు. ఆయనకూ అర్థమయింది– ఆ అమ్మాయి పూర్తిగా విషయాన్ని చెప్పటం లేదని, దేన్నో నిగూఢంగా వుంచాలని ప్రయత్నిస్తున్నదనీను!

"తెలియదు!"

ఆయనకు విచిత్రంగా తోచింది అపరంజి మాటలు. సోఫాలోనుంచి లేవబోయాడు ఇక బయల్దేరాలి అన్నట్లుగా.

"అంకుల్! దయయుంచి మీరు కూర్చోండి... మీరు రహస్యంగా ఉంచుతానంటే నేను దీని వెనుక వున్న నిజాలనన్నిటినీ చెబుతాను... విజయవాడ స్టేషన్‌లో ఆ ముఠాను పట్టించటం వెనుక నా హస్తం వుండటంతో నామీద పగబట్టారు...!"

ఆయన చిన్నగా నవ్వాడు. "అదే నేను అడిగేది... అప్పుడు వాళ్ళు నిన్నే వెంటాడి పట్టుకొని ఎత్తుకెళ్ళేవాళ్ళు... అంతేగాని ముక్కూ ముఖం తెలియని మరో అమ్మాయిని కాస్తంత నీ పోలికలు ఉన్నంత మాత్రాన తీసుకు వెళ్ళరు! వాళ్ళ కోపమంతా నీమీదేగాని ఆ అమ్మాయిమీద కాదుగదా!"

"నేను చెప్పేది పూర్తిగా వినండి అంకుల్... అసలు జరిగిన విషయం అంతా చెబితేనేగాని, నిజాలేమిటో మీకు అర్థం కావు! కానీ అవన్నీ చెబుతూ కూర్చుంటే నివేదిత ఇక కోలుకోలేనంతగా ఆ యమకూపంలోకి జారిపోతుందేమోనని నాకు భయంగా వున్నది అంకుల్!"

"దట్స్ గుడ్! కమాన్... అంతా వివరంగా చెబితే నేను ఆ కిడ్నాపర్స్‌ను ఎలా పట్టుకోవాలో ఆలోచించి ఆ అమ్మాయిని రక్షించటానికి అనువైన ప్రణాళికను తయారు చేయగలుగుతాను... ఒక్క విషయం కూడా వదలకుండా నిన్ను కిడ్నాప్ చేయాలనుకున్న ఆ శంకర్ గురించి చెప్పు... ఆ అమ్మాయిని అతడే తీసుకు వెళ్ళాడనేందుకు నువ్వు

అనుకుంటున్న కారణాలు చెప్పు... ఇక ఆలస్యమవుతుందని భయపడుతున్నానంటావా... సగం సమాచారంతో మేం ప్రయత్నించి విఫలమయ్యేదానికంటే ఆలస్యమయినా పూర్తి సమాచరంతో పకడ్బందీగా ముందుకు అడుగు వేస్తేనే విజయాన్ని సాధించగలమనేది నా ఇన్నేళ్ళ అనుభవం నాకు నేర్పిన పాఠం!" ఆమాటలు చెప్పి అపరంజినే చూస్తూ ఉండిపోయాడు.

అపరంజి ఒక నిట్టూర్పు విడిచింది. "అలాగే అంకుల్! ఆ నిజాలు చెప్పటం వలన కొన్ని సమస్యలు మా కుటుంబాల్లో రావచ్చు... కానీ వాటికిమించి నివేదిత భద్రతే ముఖ్యం కనుక అన్నీ చెబుతాను... సాధ్యమయినంతవరకూ వాటిని మీరూ రహస్యంగా వుంచితే మా అందరికీ మేలుచేసిన వారవుతారు!"

"డోంట్ వర్రీ! ఐ ప్రామిస్!"

"థాంక్యూ అంకుల్!... విశాఖపట్నంలో బాగా పేరున్న క్రిమినల్ లాయర్ రామబ్రహ్మంగారు మా మేనమామ!"

ఆ మాట వింటూనే ఆయన ఉత్సుకతతో ముందుకు వంగాడు. "నిజమా! రామబ్రహ్మం అంటే పి.రామబ్రహ్మమేనా?"

"అవునంకుల్!... నేను రైల్లోవున్న ఆ గ్యాంగ్ విషయం ఫోన్‌చేసి చెప్పగానే, ఆయనే విజయవాడలో వాళ్ళందరినీ పట్టుకొని అరెస్ట్‌చేసేలా ఏర్పాటు చేశాడు... అదైనా నేను ఎందుకు చేశానూ అంటే వాళ్ళు దారిలో ఎక్కడో అక్కడ నన్ను బలవంతాన దింపేసి ముంబయ్‌లో అమ్మేయాలనే ఆలోచనలో ఉన్నట్లుగా పసిగట్టటంతో!"

"గుడ్... ఆయన చాలా తెలివిగలవాడు... క్షణాలల్లో నిర్ణయాలు తీసుకోగలడు... నాకు పరిచయమేలే... ఓ మర్డర్ కేసులో హైకోర్టులో నాచేత మూడు చెరువుల నీళ్ళు త్రాగించాడు!" ఆ మాటంటూ ఆయన పకపకా నవ్వాడు.

భయంభయంగా చూచింది ఆయన వంక అపరంజి. ఆ కారణంతో తనకు సాయం చేయకపోంగా అపకారం చేయడు గదా ఈ పెద్దమనిషి!

ఆయన ఒక్కక్షణం ఆలోచిస్తున్నట్లుగా ఆగి, "వర్రీ కాబోకు బేబి... ఆ కేసులో ఆయన కర్తవ్యం ఆయన నిర్వర్తించాడు... నా కర్తవ్యం నేను నిర్వర్తించాను... నేను దాన్ని ఎప్పుడో మరిచిపోయానుగాని... అంత బ్రిలియంట్ లాయర్ మేనగోడలిగా నీకు నేను తప్పకుండా సాయం చేస్తాను!... కమాన్... నువ్వు నీకు తెలిసిన వివరాలన్నీ పూర్తిగా చెప్పు... కిడ్నాప్ అంటే, అందునా ఆడపిల్లని... మా దృష్టిలోకి వచ్చిం తరువాత కూడా నోరు, కళ్ళు మూసుకొని కూర్చోలేం... కూర్చోము! ఒక్క క్షణమూ వృధా చేయం!"

"థాంక్యూ అంకుల్!"

"కామాక్షీ! స్ట్రాంగ్ కాఫీ మూడు పట్టుకురామ్మా!" కూతురుకి చెప్పాడు జగన్నాథం.

కామాక్షి లోపలకు వెళ్ళింది.

"ఇప్పుడు చెప్పు! నువ్వు రహస్యంగా వుంచాలన్నావు కదా ఆ విషయాల్ని... తప్పకుండా నీ మాట ఆచరిస్తాను... అయితే నా దగ్గర మాత్రం ఏదీ దాచవద్దు!"

"అలాగే అంకుల్!" అంటూ వారం రోజుల క్రితం ఆమె విశాఖపట్నంలో బయల్దేరినప్పటినుండి సికింద్రాబాద్ వచ్చేంతవరకూ జరిగిన విషయాలన్నిటినీ ఏ ఒక్కటీ వదలకుండా చెప్పింది. క్రితంరాత్రి నివేదితతో జరిగిన సంభాషణను కూడా వివరంగా చెప్పింది. "అందుకే ఈ విషయాన్ని రహస్యంగా వుంచాలనుకుంటున్నాను అంకుల్... కిడ్నాప్ విషయం మీడియాలోరాకుండా చూస్తే ఎంతో మేలు చేసిన వారవుతారు... మేం ఎవరమూ అనేది తరువాత తేల్చుకుందాం... ముందు నివేదిత వాళ్ళ చేతుల్లోనుంచి బయటకు రావాలి!" అన్నది. తడుస్తున్న ఆ అమ్మాయి కంఠంలోనుండి మాటలు ముద్దముద్దగా వస్తున్నయి. "ఆ అమ్మాయి ఎవరైనాకాని ఎలాంటి హానీ జరగగూడదు... ముఖ్యంగా నావలన!" చివరగా గొంతు పెగల్చుకొని అన్నది.

ఆయన లేచి నిలబడ్డాడు. "నువ్వూ కామాక్షి నాతోపాటు రండి... కంట్రోల్‌రూంకు వెళ్ళి మనం వెంటనే కొన్ని చర్యలు చేపట్టాలి! నా శాయశక్తులా ఆ అమ్మాయిని

రక్షించేందుకే ప్రయత్నిస్తాను... నీకు నివేదితనుండి ఫోన్ వచ్చింది ఇప్పుడు నీ దగ్గరున్న సెల్‌కే గదా!"

"అవునంకుల్!"

"ఫైన్!"

ముగ్గురూ ఆయన కారులో కంట్రోల్ రూం ముందు దిగేటప్పటికి మరో పావుగంట పట్టింది. ఆయన కారు దిగుతూనే పరుగెడుతున్నట్లుగా ఆ భవంతి మెట్లెక్కాడు లిఫ్ట్‌వున్నా, అక్కడ ఆగిలేని దానికోసం ఎదురుచూడకుండా. అంత వయస్సులో వున్న ఆయనతో సమానంగా మెట్లెక్కటానికి వాళ్ళిద్దరూ ఆయాసపడుతున్నారు.

ఆయన లోపలకు వెళుతూనే అక్కడున్న ఇన్‌చార్జి శాల్యూట్ అందుకుంటూ, "సుభాష్! ముందు ఈ అమ్మాయి ఫొటోను, ఈ అమ్మాయి దగ్గరున్న సెల్‌లోని శంకర్ అనబడే దాదా ఫొటోను అన్ని పోలీస్ స్టేషన్లకి, మొబైల్ పార్టీలకు ఫ్లాష్ చేయాలి... ఇమ్మీడియట్! అతడు ప్రస్తుతం మన ట్విన్ సిటీస్‌లోనే వున్నాడు!" అన్నాడు.

అతడు వింతగా జగన్నాథం వంక చూచాడు. తమ ఎదురుగ్గా కూర్చున్న ఆ అమ్మాయిని ఎందుకు అన్ని స్టేషన్లకు ఫ్లాష్ చేయాలో ఆయన బుర్రకు ఏమాత్రం ఎక్కలేదు. అతడి సందిగ్ధతను అర్థం చేసుకున్నాడు జగన్నాథం.

"అచ్చం ఇలాంటి అమ్మాయినే ఆ శంకర్ ముఠా కొద్దిసేపటి క్రితం కిడ్నాప్ చేసింది... ఆ అమ్మాయి ఫొటో మనకిప్పుడు దొరికే అవకాశం లేదు గనుక ఈ అమ్మాయి ఫొటోతోనే మనం ముందుకు దూకాలి... బహుశః ఇక్కడగాని, ముంబయ్‌లోగాని ఆ కిడ్నాప్ అయిన అమ్మాయిని బ్రోతల్ హౌసుకు అమ్మే ప్రయత్నంలో వాళ్ళు ఉండివుండవచ్చు అనేది అనుమానం!"

"ఆ అమ్మాయి, ఈ అమ్మాయి ట్విన్సా?" ఆయన ఉత్సుకతతో ముందుకు వంగాడు కుర్చీలో.

"అవ్వవచ్చు... కాకపోవచ్చు... ఆ వివరాలన్నీ తరువాత చెబుతాను... ముందు

ఫొటోలు ఫ్లాష్ చేసి మనవాళ్ళందరినీ ఎలర్ట్ చేయండి... అపరంజీ! నీ సెల్‌ను వారికివ్వు!" అంటూనే దాన్ని అందుకొని ఆయనకిస్తూ, "కిడ్నాప్ అయింతరువాత ఆ అమ్మాయినుండి మొట్టమొదటి సారిగా వచ్చిన కాల్ ఇందులో వున్నది... ఏ ఏరియానుంచి ఆ కాల్ వచ్చింది గుర్తిస్తే ముందు మనం ఎక్కడ వల విసరాలో సూచనగానైనా తెలుస్తుంది!"

కంట్రోల్‌రూం ఇన్‌చార్జి ఆఫీసర్ కాలింగ్ బెల్ నొక్కాడు.

* * *

"అంజీ!"

"నేను చేస్తానని చెప్పాను గదా... మళ్ళా ఎందుకు చేశావ్!" అపరంజి అరుస్తున్నట్లుగా అన్నది. "ఆపేస్తున్నాను!"

"మీ అమ్మానాన్నా ఎంత కంగారు పడుతున్నారో తెలుసా... అమ్మ నీకోసం ఫోన్ చేస్తే నువ్వు ఇంట్లోనుంచి హడావుడిగా ఎందుకో బయటకు వెళ్ళావని పిన్ని చెప్పిందట... నువ్వేమో సెల్ ఆఫ్ చేసుకు కూర్చున్నావ్... ఏమిటి ప్రాబ్లమ్... నన్ను గాని రమ్మనమంటావా?"

ఆ సమయంలో అపరంజి కామాక్షి వాళ్ళింట్లో వున్నది. ఏసీపి జగన్నాథం కూతుర్ని, అపరంజిని ఇంటికి వెళ్ళి వుండమని ఆయన కంట్రోల్ రూంలోనే కూర్చున్నాడు. వీళ్ళు ఇంటికి వచ్చేటప్పటికి కామాక్షిద్వారా ఆ విషయం తెలుసుకున్న నిర్మలకూడా అక్కడకు వచ్చింది.

పన్నెండు గంటలయింది. పొద్దున పిన్ని ఇచ్చిన కాఫీ త్రాగటమే. నిర్మల స్నానం చేసి వస్తుందేమో ఇద్దరూ కలిసి టిఫెన్ తినవచ్చులే అనుకున్నది. అప్పుడే నివేదిత కాల్ రావటం తను పరుగెత్తుకుంటూ చిక్కడపల్లిలోని కామాక్షి ఇంటికి వచ్చి ఆమె నాన్నతో మాట్లాడటం, అంతా కలిసి కంట్రోల్ రూంకు రావటం వెంటవెంటనే జరిగిపోయినయి.

"ఇక మీరిక్కడుండి చేసేదేంలేదు... ఇంటికెళ్ళి భోజనంచేసి కూర్చోండి... ఏమైనా విషయాలు తెలిస్తే నేను ఫోన్‌చేస్తా!" అంటూ అపరంజి సెల్‌కూడా ఇచ్చేశాడు... "జాగ్రత్త... ఫొటోలు ఏవీ డిలీట్ చేయబోకు!"

కామాక్షి ఎంత చెప్పినా అపరంజి భోజనం చేయలేదు. అతి బలవంతం మీద ఓ గ్లాసు ఆరంజ్‌జ్యూస్ త్రాగింది.

అప్పుడు వచ్చింది సుధీర్ దగ్గరనుంచి ఫోను.

"ఏం జరిగింది అసలు? అందరూ కంగారు పడుతున్నారు... మీ మామేమో అసలు అది బయటకు ఎందుకు వెళ్ళిందీ అంటూ ఇంటికప్పు ఎగిరిపోయేలా అరుస్తున్నాడు!"

"ఏం జరగలేదయ్యా బాబూ! మా ఫ్రెండ్ నెవరో కిడ్నాప్ చేశారు... కామాక్షి ఫాదర్ ఇక్కడ ఏసీపీకదా... అందుకని ఆయన దగ్గరకు వచ్చాను ఏమైనా సాయంచేయగలుగుతారేమోనని... నేను శుభ్రంగా వున్నానుగాని ఎవ్వరూ భయపడనక్కరలేదు!"

"అంతేనా జరిగింది... నిజమేనా అది?"

"బావా! సెల్ ఆఫ్ చేసేస్తున్నాను... మళ్ళా చేశావో ఊరుకోను... నేను గ్రేట్ క్రిమినల్ లాయర్ పి.రామబ్రహ్మంగారి మేనకోడల్ని!" అంటూనే సెల్ ఆఫ్‌చేసి సోఫాలో వెనక్కువాలి కళ్ళుమూసుకొని నుదురు రుద్దుకోసాగింది.

"నీకంత ఆత్మీయ స్నేహితురాలెవరో చెబితే ఆ ఏడ్చే ఏడుపేదో మేమూ ఏడుస్తాం కదా!" నిర్మల చిరాగ్గా అపరంజివంక చూస్తూ అన్నది.

"నిమ్మీ! నోర్మూసుకు కూర్చో!"

"కూర్చోవటానికి కాదు అమ్మ కంగారు చూడలేక వచ్చాను... పొద్దున నువ్వు ఇంట్లోనుంచి పరుగెత్తుకుంటూ వెళ్ళిన పావుగంటకే ఢిల్లీనుంచి అన్నయ్యా, వదినా వచ్చారు... వాళ్ళూ హడావుడి పడుతున్నారు... మా హబ్బీ ఏమో ఢిల్లీనుంచి ఈవినింగ్

ఫ్లయిట్‌లో వస్తున్నాడు... మేం ఇప్పుడు శంషాబాద్ వెళ్ళాలి!" అన్నది లేస్తూ నిర్మల.

"అరే... నాకీగొడవ లేకుండా వుంటే నేనూ వచ్చేదాన్నిరా బావగార్ని రిసివ్ చేసుకునేందుకు... సారీ!"

"ఫర్వాలేదులేగాని... ఊరికినే టెన్షన్ పడబోకు... ఎవరో కిడ్నాప్ అయితే మనకేమిటి అంత హడావుడి... స్నేహితురాలంటున్నావు కాబట్టి నీకు చేతనయింది నువ్వు చేశావ్... ఇక ఫలితాన్ని దేవుడికి వదిలేయటమే... అంతేగాని నువ్వు హైరానపడుతూ అందర్నీ హైరాన పెట్టబోకు!" నిర్మల విసుగ్గా చూచింది అపరంజి వంక.

తనెలా చెప్పగలదు ఆ స్నేహితురాలు తనకెంత ఆత్మీయురాలో!

* * *

మియాపూర్ చౌరస్తా... అది నేషనల్ హైవే అవ్వటంతో ఇరవైనాలుగుగంటలూ వాహనాలు ఒకదానివెనుక ఒకటి పరుగెడుతూనే వుంటయి... మహా అయితే రాత్రి రెండు మూడు గంటలప్పుడు కాస్తంత రద్దీ తగ్గవచ్చు!

దేశానికే పెద్ద వ్యాపారకేంద్రమయిన ముంబయ్‌కి హైదరాబాద్‌ను కలిపే ముఖ్య రహదారి అదే!

కంట్రోల్ రూంనుంచి మెసేజ్ వచ్చిన అరగంటలోనే కూకటిపల్లినుండి ఆ రోడ్డుమీద అప్పటికే వున్న పోలీస్ చెక్‌పోస్ట్‌లే కాకుండా మరి కొన్ని వెలిసినయి...

నివేదితనుండి అపరంజికి వచ్చిన కాల్ మియాపూర్ టవర్‌నుంచి ట్రాన్స్‌మిట్ అయిందని గుర్తించటంతో ఆ చుట్టుపక్కల బందోబస్తు, తనిఖీలు ఎక్కువయినయి.

దిల్‌షుక్‌నగర్‌నుండి మియాపూర్‌దాకా తీసుకొచ్చారూ అంటే అపరంజి అనుమానించినట్లే- ఆ అమ్మాయిని ముంబయ్‌కు తరలించే ఆలోచనలో వాళ్ళు ఉండివుండవచ్చు!

ఏసీపీ జగన్నాథం స్వయంగా ఆ ఆపరేషన్‌ను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాడు.

ఆంధ్రా బార్డర్ వరకూ మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ వున్న వాహనాలనన్నిటినీ పూర్తిగా తనిఖీ చేయమని చెప్పారు. అలాగే మహారాష్ట్రలో ఆంధ్రా వాహనాలమీద ఒక కన్నేసి వుంచమన్నారు.

– ఎట్టి పరిస్థితులలోనూ ఆ అమ్మాయిని ముంబయ్ జేరనివ్వగూడదు... ముందు సమాచారం అందినా తాము అరికట్టలేకపోతే– అది తమ చేతగాని తనాన్ని ఋజువుచేస్తుంది.

ప్రతి కిలోమీటరుకు ఒకచోట ట్రాఫిక్ జామ్ అవుతూనే వున్నది పోలీసులు వాహనాల్ని ఆపి తలుపులు తెరిచి మరీ చూస్తుండటంతో... ఒకటా రెండా... కార్లు, బస్సులు, లారీలే గాకుండా వాహనాలనన్నిటినీ వదలకుండా డిక్కీలతో సహా తెరిపించి చూస్తున్నారు.

పోలీస్ మొబైల్ వ్యాన్లయితే అటూఇటూ తిరుగుతునే వున్నయి– ఏర్పాటయిన చెక్‌పోస్ట్‌ను తప్పిస్తూ రోడ్డుదిగి పక్కదార్లవెంట ముందుకు వెళ్ళి మళ్ళా హైవేమీదకు ఎక్కడ ఆ వాహనం ఎక్కుతుందోనని...

హైదరాబాద్‌నుంచి ముంబయ్ వెళ్ళాలంటే ఆ ముఖ్య రహదారిమీదగానే కాదు, చుట్టూతిరిగి మరేదైనా మార్గంలోనైనా వెళ్ళి మహారాష్ట్రలో కలవచ్చు... అందుకే ఆ హైవేతోపాటుగా హైదరాబాద్‌నుండి బయటకు వెళ్ళే అన్ని రహదార్లనూ దిగ్బంధనం చేశారు. ఎలాంటి ఛాన్సు తీసుకోదలుచుకోలేదు!

సమయం పదకొండు గంటలయింది. ఎండ కాస్తంత ఎక్కువగానే వున్నది.

మియాపూర్ చౌరస్తాలో ఓ పక్కగా చెట్టుక్రింద జీపులో ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టరు, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు కానిస్టేబుల్స్ కూర్చొని వున్నారు. వాళ్ళకు కాస్తంత దూరంలో జగన్నాథం మరో కారులో కూర్చొని పరిస్థితిని పరిశీలిస్తున్నాడు.

సరిగ్గా ఆ సమయంలో ఎడంవైపు మియాపూర్ ఆర్టీసీడిపోకు వెళ్ళే రోడ్డులో

రెండు కిలోమీటర్ల లోపల కొండగుట్టల నడుమ ఓ పాత గోడౌన్ ముందుకు ఓ అంబులెన్స్ వచ్చి ఆగింది.

అది ఆగుతుండగానే ఇద్దరు స్ట్రెచర్ పట్టుకొని అందులోనుంచి వడివడిగా దిగారు. ఓ సిస్టర్ దిగింది. ఓ డాక్టర్ స్టెత్ పట్టుకొని దిగాడు.

అందరూ షట్టర్ తీసివున్న ఆ గోడౌన్‌లోకి వెళ్ళారు. ఎప్పుడూ సామాన్యంగా తెరవని ఆ గోడౌన్ లోపలంతా ముక్కకంపు కొడుతున్నది.

అక్కడ ఓ కుక్కి మంచం మీద ఓ స్త్రీ అపస్మారక స్థితిలో కళ్ళుమూసుకొని పడుకొని వున్నది. లోపలకు వెళ్ళిన వాళ్ళు ఆమెను స్ట్రెచర్‌మీద ఎత్తి పడుకోబెట్టి బయటకు తీసుకువచ్చి అంబులెన్స్‌లోకి ఎక్కించారు. ఆ వెనుకనే దాంట్లోకి సిస్టర్ ఎక్కింది. డాక్టర్ ఎక్కాడు.

ఆ అంబులెన్స్ ఆ గోడౌను నుండి మట్టిరోడ్డులో సైరన్ మ్రోగించుకుంటూ అతిరయంగా మెయిన్ రోడ్డు ఎక్కి ముందుకు దూసుకుపోసాగింది.

అందులో స్ట్రెచర్ మీద వున్నది నివేదిత!

డాక్టర్ వేషంలో వున్నది శంకర్!

# 7

నివేదితను ఎక్కించుకున్న అంబులెన్స్ ఒక్కక్షణం ఆలస్యమయినా లోపలవున్న రోగి మరణిస్తాడేమోనన్నంత వేగంగా ఆ రోడ్డుమీద దూసుకుపోతోంది.

గుట్టల్లోవున్న పాత గోడౌన్ నుంచి పదినిముషాలల్లోనే మియాపూర్ చౌరస్తాకు వచ్చింది. అది సిగ్నల్స్ దగ్గరకు వస్తూనే వున్నది రెడ్‌లైట్ వెలిగింది.

దాన్ని నడుపుతున్న శంభు పక్కనే కూర్చున్న శంకర్ వంక చూచాడు. అతడి పోనీయ్ అన్నట్లుగా కళ్ళతోనే సైగ చేశాడు.

శంభు యాక్సిలేటర్‌ను బలంగా తొక్కి, కాస్తంత పక్కగా వున్న ఆటోను తప్పించి ముందుకు దూకించాడు. అప్పటికే సిటీ వైపుకు వెళ్ళే వాహనాలు సిగ్నెల్స్ దాటినయి. అడ్డమొచ్చిన అంబులెన్స్‌ను చికాగ్గా చూస్తూనే సడన్ బ్రేకులతో వాహనాల్ని ఆపి దానికి దారి ఇచ్చినయి.

దూరంనుంచే జగన్నాథం గమనించాడు ఆ అంబులెన్స్‌ని. అది ప్రైవేటు వాహనం. ఏపీ రిజిస్ట్రేషన్‌తోనే వున్నది. కళ్ళు చిట్లించాడు. దానివేగం అతడిలో అనుమానాన్ని రేకెత్తించింది. ఆపైన అంత సీరియస్‌గా వున్నప్పుడు సిటీలో వున్న పెద్ద హాస్పిటల్స్‌కు వెళ్ళాలిగాని బిహెచ్ఎల్ వేపు ఎందుకు వెళుతున్నదో అర్థంకాలేదు.

వెంటనే వైర్‌లెస్‌లో ముందున్న చెక్‌పోస్ట్‌కు ఆ అంబులెన్స్‌ను ఆపమని మెసేజ్ ఇస్తూ అందులో ఎవరున్నదీ తనకు వెంటనే చెప్పమని రిసీవర్‌ను చేతిలోనే పెట్టుకొని మెసేజ్ కోసం ఎదురు చూడసాగాడు.

ఐదు నిముషాలయింది. పదినిముషాలయింది. ఎలాంటి సమాచారం అటునుంచి రాలేదు. ఆయనే మళ్ళీ చేశాడు చికాకుపడుతూ.

"ఇంతవరకూ ఏ అంబులెన్సూ రాలేదు సార్... వస్తుందేమోనని చూస్తున్నాం... రాగానే చెబుతాను!"

"పది నిముషాలయింది అది మియాపూర్ చౌరస్తాదాటి... ఇంకా రాలేదంటావేమిటి... సరిగ్గా చూస్తున్నారా మీరు?" అన్నాడు కంఠం హెచ్చించి.

"లేదు సార్... అసలు ఇంతవరకూ ఏ అంబులెన్సూ ఇటు రాలేదు... హాస్పిటల్‌నుంచి పేషెంట్‌ను గాని, డెడ్ బాడీనిగాని మధ్యలో ఏ ఇంటికైనా తీసుకువెళ్ళారేమో... జీపులో కానిస్టేబుల్స్‌ను పంపి చుట్టుపక్కలంతా గాలించమని చెబుతాను!" అన్నాడు వినయంగా అవతల చెకపోస్ట్ దగ్గరున్న సబిన్స్‌పెక్టర్.

ఆ మాట వింటూనే తన కారును ముందుకు దూకించాడు చికాకు పడుతూ జగన్నాథం.

"ముందు ఏవైనా నర్సింగ్‌హోంలున్నయ్యేమో చూడు!" అన్నాడు డ్రైవర్‌తో తనూ జాగ్రత్తగా అటూ ఇటూ చూస్తూ. ఆయన నమ్మకం– దాంట్లో చచ్చిన బాడీ వుండదు... ఉంటే సిగ్నెల్స్ పడ్డా ఆపకుండా హడావుడిగా వెళ్ళాల్సిన అవసరం లేదు!

కారు ముందుకు పోతున్నది.

ఎక్కడా ఏ హాస్పిటలూ కనబడలేదు. ఉన్నవన్నీ ఫర్నిచర్ షాపులు, గుడ్డల కొట్లు, సూపర్ బజార్లు... కాదంటే చిన్న చిన్న హోటళ్ళు...

చాలా అసహనంగా వున్నది ఆయనకు... కళ్ళు సూదుల్లాపెట్టి అన్ని వైపులా తీక్షణంగా చూస్తున్నాడు...

* * *

అంబులెన్స్ ముందుసీట్లో కూర్చున్న శంకర్ ముఖం వెనక్కు తిప్పి క్రూరంగా స్ట్రెచర్‌మీద మగతగా పడుకొని వున్న నివేదిత వంక చూచాడు.

ఆ అమ్మాయిని చూస్తుంటే అతడి కళ్ళు ఎర్రబడుతున్నయి... విజయవాడలో పోలీసులు తమని పట్టుకొని రైలు దింపించిన ఆ అమ్మాయంటే వళ్ళు కుతకుతలాడిపోతున్నది. అందుకే వదలగూడదనుకున్నాడు. తనలాంటి వాళ్ళ జోలికి వచ్చినవాళ్ళ పరిస్థితి ఏమిటో ఆ అమ్మాయికి తెలిసివచ్చేలా చేయాలి. నిప్పు జోలికి వెళితే అది ఎంత భయంకరంగా కాలుతుందో జీవితాంతం గుర్తుండేలా చేయాలి!

తన దృష్టిపడిన ఏ ఆడదాన్నీ ఇంతవరకు వదలలేదు. అందునా తనని ఇబ్బందుల్లో పెట్టిన అది తన చేతుల్లో కాలి మసయిపోవాల్సిందే!

విజయవాడలో తను తెలివిగా తప్పించుకొని, హైదరాబాద్‌లోని తన శిష్యుడు శంభుని నాంపల్లి స్టేషన్‌కు వెళ్ళి ఉదయాన్నే వచ్చే గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ఎస్ సెవన్‌నుండి దిగబోయే ఆ పిల్ల ఎలావుండేది చెప్పి, ఆ అమ్మాయి రైలు దిగి ఎక్కడకు వెళ్ళేదీ గుర్తించమన్నాడు. వీలయితే మంచిగా మాట్లాడి దగ్గరవ్వమన్నాడు. వాడు చాకు. చూచిరమ్మంటే కాల్చి వచ్చే రకం. తను చెప్పినదానికంటే ఎక్కువే చేశాడు.

– తమని పోలీసులు విజయవాడ స్టేషన్‌లో దించినప్పుడే ఆ అమ్మాయి ఎంత తెలివిగలతో అర్థమయింది. అందుకే చిన్నపామునైనా పెద్దకర్రతోనే కొట్టాలని నిర్ణయించుకున్నాడు... కసిపెంచుకున్న ఆ అమ్మాయిని అప్పజెప్పి, ముంబాయ్ మేడమ్‌నుండి ఎక్కువ డబ్బు సంపాదించుకోవాలని ఆశపడుతున్న అతడు తగు జాగ్రత్తలు ముందుగానే తీసుకున్నాడు... తను ఇచ్చిన ఇంజక్షన్‌తో ఇంకా ఐదారు గంటలవరకూ కళ్ళుతెరిచి మన ప్రపంచంలో పడదు... ఈలోగా తను హైదరాబాద్‌నుండి చాలాదూరం... తెలివి వచ్చినా ఏమీ చేయలేనంత దూరం తీసుకువెళ్ళిపోవాలి!

ఉదయాన్నే ఏడుగంటలకు అత్తాపూర్‌లో వివాహానికి బయల్దేరిన నివేదితకు అత్తాపూర్ ఎక్కడున్నదో తెలియదు. ఏ దారిలో వెళ్ళాలో తెలియదు... ఇక్కడే ఇక్కడే అంటూ ఆటో డ్రైవరు ఆమెను కూకటపల్లి దాటించి, మియాపూర్ చౌరస్తా దగ్గర కుడివైపుకు తిప్పి జనసంచారం తక్కువగా వున్న ఆ డబుల్ రోడ్డుమీద తీసుకువెళ్తుంటే అనుమానంగా అడగనుకూడా అడిగింది.

"అత్తాపూర్ అంటే ఊరిబయటమ్మా! ఏ ఆటోవాడూ రానుకూడా రాడు... నేను తెలిసినవాడిని కాబట్టి మీటరుమీద వస్తున్నాను... మీకెందుకు మీరు మెదలకుండా కూర్చోండి... పెళ్ళవ్వగానే ఇద్దరం హాయిగా వేడివేడి భోజనం చేసి తిరిగి బయల్దేరదాం!" అన్నాడు చిన్నగా నవ్వుతూ కృష్ణదేవుడు.

మెయిన్‌రోడ్డు దాటి గుట్టలనడుమ మట్టిరోడ్డులోకి ఆటో తిరగ్గానే నివేదిత అనుమానం బలపడింది.

అక్కడక్కడా ఆ రాళ్ళ గుట్టలనడుమ కూలీలు రాళ్ళు తవ్వుతూ కనబడ్డారు. ఆ చుట్టుపక్కల ఎక్కడా నివాసయోగ్యమయిన ఇళ్ళున్నట్లే కనబడటంలేదు.

వివాహం జరిగే స్థలం అలాంటి ప్రదేశంలో వుంటుందని తను అనుకోదు. వెంటనే "ఆపు!" అంటూ పెద్దగా అరిచింది.

అంతవరకూ వచ్చిన మెయిన్ రోడ్డుమీద కూడా అప్పుడో బస్సు ఇప్పుడో బస్సు, ఎక్కువగా షేర్‌డు ఆటోలు, టూ వీలర్సు కనబడుతున్నాయి.

అతడు ఆమె అరుపును వినిపించుకోనట్లుగా ముందుకు ఆ మట్టిరోడ్డుమీద దుమ్ములేపుకుంటూ తుప్పల్లోనుంచి ఆటోను తీసుకువెళుతున్నాడు.

అతడు ఎటు వెళుతున్నాడో ఆమెకు అర్థం కావటంలేదు. చుట్టుపక్కల అసలు ఇళ్ళే లేవు. చూస్తే దారి మళ్ళిస్తూ ఊరిబయటకు తీసుకు వెళుతున్నాడా అని అనుమానమొస్తోంది...

ఆమె నుదురు ముడివడింది. కళ్ళు అదరసాగినయి. భయంతో పెదవులు ఒణుకుతున్నయి... తనకు ఏమాత్రం తెలియని దారివెంట అతడు ఎక్కడికో తీసుకు వెళుతున్నాడు.

నో... నో... వీడేదో పెద్ద మోసగాడిలా వున్నాడు... మృదువుగా మాట్లాడుతూ ముళ్ళపొదల్లోకి లాక్కువెళ్ళటం లేదుగదా... తను ఇక ఏమాత్రం తాత్సారం చేయగూడదు...

“ఏయ్... ఆటోను ఆపు!” గొంతు పెంచి పెద్దగా అరిచింది.

అతడు మాట్లాడకపోవటమే కాదు, మెడకూడా వెనక్కు తిప్పకపోంగా ఆ ఎర్రటిమట్టి బాటలో ఆటోను మరింత వేగంగా ముందుకు తీసుకుపోతున్నాడు!

నివేదిత ఏం చేయాలో అర్థంకానంత అయోమయంలో పడిపోయింది. కొద్దిక్షణాలపాటు కళ్ళుమూసుకొని ఆలోచిస్తూనే, జాకెట్టులోనుంచి సెల్‌ను బయటకు తీసి, అక్కడ తనకు తెలిసిన అపరంజి నంబరుకు కాల్‌చేసి, అటు ఆమె ఆన్ చేయగానే, “అక్కా! నన్ను ఎవరో బలవంతంగా ఆటోలో లాక్కు వెళుతు...” అంటూనే వున్నది, కృష్ణదేవుడు ఆటోను సడన్‌గా ఆపేసి, క్రిందకు దూకుతూనే నివేదిత చెంప పగిలేలా ఒక దెబ్బకొట్టి, ఆమె చేతిలోని సెల్‌ను లాక్కొని రాళ్ళ గుట్టల నడుమవున్న మురికి నీటిగుంటలోకి విసిరివేశాడు!

* * *

“దానికి ఫోన్ చేశారా లేదా?” నివేదిత తల్లి రుక్మిణి అడిగింది భర్తను. వాళ్ళిద్దరూ

అప్పుడు అతడి కొల్‌కతా స్నేహితుడు శ్రీనివాసరావు కూతురు పెళ్ళికిగాను వివాహమండపానికి వచ్చారు.

"చేశాను... అది స్విచ్ ఆఫ్‌చేసుకు కూర్చున్నది... కాసేపుండి చేస్తాను!" అన్నాడు వివేకానందమూర్తి. "క్లాసులో వున్నదేమో... అక్కడుంటేనే సెల్ ఆఫ్ చేస్తుంది!"

"నా బొంద క్లాసు... మీరు మరీ ఆయోమయంలో పడిపోతున్నారు... ఇవ్వాళ ఆదివారం... దాన్ని అత్తాపూర్‌లో మా అత్తయ్య మనవడి పెళ్ళికి వెళ్ళమంటే వెళతానన్నది కదా... ఇప్పుడు తొమ్మిది దాటింది... అక్కడికే వెళ్ళివుంటుంది... హైమవతిగూడా వెళతానన్నది... అది రాత్రి ఫోన్‌చేసి ఎంతగా అరిచింది గుర్తులేదా!"

"స్పెషల్ క్లాసు ఏమైనా ఉన్నదేమోలేవే!"

"అలాంటిదేమైనా వుంటే నిన్ననే చెప్పేదికదా తనకు పెళ్ళికి వెళ్ళటానికి వీలుబడదని... నేను గట్టిగా వెళ్ళమంటే వెళతాననే అన్నది!... పోనీయ్ హైమవతికన్నా చేయండి... మన అమ్మాయి అక్కడికి వచ్చిందేమో చెబుతుంది!"

హైమవతి రుక్మిణి పెదనాన్న కూతురు. హైదరాబాద్‌లోనే వుంటుంది. ఆమె భర్తగూడా బ్యాంకులో ఆఫీసరు.

"అదిగాదు పిన్నీ! నివేదిత ఇక్కడకు వస్తున్నప్పుడు మాటమాత్రం ఫోన్ చేయవచ్చుగదా... కోచింగ్ సెంటరు దిల్‌షుక్‌నగర్‌లోనే అంటుంటివి... మేమా వున్నది కొత్తపేటలో... మాకు దగ్గరే... దాన్ని అక్కడ హాస్టల్లో వుంచటం దేనికి... నా దగ్గరే వుండి రోజూ వెళ్ళి వచ్చేది... అవునులే మేం ఎక్కడ కనబడతాం... మా ఆయన చిన్న ఆఫీసరుగదా... బాబాయ్‌లాగా చీఫ్ మేనేజర్‌గా చేస్తుంటే మీ దృష్టిలో వుండేవాళ్ళం!" అన్నది నిష్ఠూరంగా ఆ అమ్మాయి.

"ఛీ! నోర్మూయ్... పిచ్చివాగుడు వాగావంటే ఊరుకోను... చెబుతాలే దానికి మీ ఇంటికి వెళ్ళమని!" అన్నది అరుస్తున్నట్లుగా రుక్మిణి.

"రేపు అత్తయ్య మనవడి పెళ్ళికి మీరు వస్తున్నారా?" హైమవతే అడిగింది.

"లేదే... ఇక్కడ మేము ఇంకో పెళ్ళికి తప్పకుండా వెళ్ళాల్సివచ్చింది... వాళ్ళూ చాలా దగ్గర వాళ్ళే... నివేదిత వస్తుందిలే అక్కడ పెళ్ళికి... అసలు దాన్ని మీ ఇంటికే నువ్వన్నట్లు పంపించేదాన్నిగాని మీ ఇల్లు దిల్‌షుక్‌నగర్‌కు దగ్గరని నాకేం తెలుసు... అప్పటికీ ఆమాట అంటే అది అన్నది... నేను ఎనిమిదింటికల్లా క్లాసులో వుండాలమ్మా... హాస్టలే నయం... కోచింగ్ సెంటర్‌కు పక్క బిల్డింగే అది అంటూ!" అనునయంగా చెప్పింది రుక్మిణి హైమవతితో. "రాత్రి ఫోన్‌చేసి దాన్ని అక్కడ పెళ్ళికి వెళ్ళమని చెప్పాను... అక్కడ కలుస్తుందిలే నిన్ను!"

అసలు హైమవతి సంగతి నివేదితకు చెబితే, "నేను ఎవ్వరింట్లో వుండనమ్మా... కోచింగ్ సెంటరు, హాస్టలు తప్ప నేను ఎక్కడకూ వెళ్ళను... చదువుకోవటానికి వెళు తున్నాను ఈ లింకులు పెట్టబోకు!" అన్నది. ఈ పెళ్ళికి వెళ్ళటానికీ తను మరీ బ్రతిమలాడి చెబితేనేగాని ఒప్పుకోలేదు.

"అయితే సర్లే... దాన్ని మా కారులో మా ఇంటికి తీసుకు వెళ్ళి... ఎల్లుండి పొద్దున హాస్టల్ దగ్గర దించి వస్తాను!"

"నీ ఇష్టం... దానిష్టం!" అన్నది ముభావంగా. ఆమెకు తెలుసు హైమవతి బలవంతం చేసి వాళ్ళింటికి తీసుకు వెళ్ళినా కూతురు ఓ పావుగంటో, అరగంటో కూర్చొని హాస్టల్‌కు వెళ్ళి పుస్తకాలు ముందేసుకుంటుందని.

అదో పుస్తకాల పురుగు... విజయం సాధించేంతవరకూ చేపట్టిన పనిని వదలదు!

అందుకే రాత్రి చదువుకుండే సమయంలో కూతురితో వాదన పెట్టుకోవటం ఇష్టంలేక హైమవతి సంగతి చెప్పలేదు. పెళ్ళికి బయల్దేరేముందు చెబితే, చదువుకుంటుండదు కాబట్టి తను చెప్పింది కాస్త సావకాశంగానైనా వింటుంది. ఆ నిర్ణయంతోటే పొద్దుటినుంచీ కూతురుకోసం సెల్‌మీద ప్రయత్నిస్తున్నది.

ఆయన ఫోన్ చేయటం మొదలు పెట్టేటప్పటికే ఎనిమిది గంటలయింది.

ఆటో ఎక్కేముందే సెల్ స్విచ్ అఫ్‌చేసింది దారిలో రణగణధ్వనిలో మాట్లాడటానికి

ఇబ్బందిగా వుంటుందని నివేదిత.

ఆయన ప్రతి పదినిముషాలకూ చేస్తూనే వున్నాడు కాని అవతలనుంచి స్విచ్ ఆఫ్ చేసివున్నదనే మెసేజే వస్తున్నది.

పది గంటలకు హైమవతికి చేశారు పెళ్ళిలో హైమవతిని కలుస్తుంది కాబట్టి ఫోన్ ఆన్‌చేసి మాట్లాడమని చెప్పటానికి. అప్పటికి శ్రీనివాసరావు కూతురు వివాహలగ్నం అయిపోయి కాస్త హడావుడి తగ్గింది.

హైమవతి కాల్ రిసీవ్ చేసుకుంటూనే, "లేదు బాబాయ్... ఇంకా రాలేదు అది... దిల్‌షుక్‌నగర్ అత్తాపూర్‌కు చాలా దూరం కదా... రాగానే నేను చేయిస్తాలే!"

రుక్మిణికి ఆదుర్దా ఆగక కంగారు కూడా మొదలయింది.

"హాస్టల్‌కన్నా చేయండి... అది ఇంకా బయల్దేరిందో లేదో!"

"బయల్దేరే వుంటుందిలేవే... చిన్న పిల్లా అది... నీ ఆదుర్దా మరీను!"

"మీరు ఏం మనిషో నాకు అర్థం కావటంలేదు... దాన్ని ఇంతవరకూ మనం ఎక్కడకూ ఒంటరిగా పంపలేదు... అటువంటిది పంపాం... ఆదివారమైనా పొద్దుటినుంచి అది సెల్ ఆన్ చేయలేదూ అంటే అస్సలు మీకు చీమకుట్టినట్టుగా గూడా లేదేమిటి... ఉండండి ల్యాండ్‌లైన్‌కు చేసి నేను హాస్టల్‌కు మాట్లాడతాను... ఏం మనుష్యులో ఏమిటో!"

రుక్మిణి నివేదిత ఉండే హాస్టల్‌కు రింగిచ్చింది. అటు లిఫ్ట్ చేయగానే, "నేను విజయవాడనుండి మాట్లాడుతున్నానండి... మీ హాస్టల్లో రెండొందల రెండో నంబరు గదిలో వుండే నివేదిత తల్లిని... ఒక్కసారి మా అమ్మాయిని పిలుస్తారా... అది సెల్ ఆఫ్ చేసుకు కూర్చున్నది... అర్జంటుగా మాట్లాడాలి!" అన్నది త్వరత్వరగా.

"నివేదితేనా... ఉదయం ఏడింటికే ఎక్కడో పెళ్ళికి వెళ్ళాలని వెళ్ళిందండి... మధ్యాహ్నం భోజనానికి రానని కూడా చెప్పింది!" అన్నది అవతలనుంచి ఆ లేడీస్ హాస్టల్ ఇన్‌చార్జ్.

ఒక్కసారిగా నీరసమావరించింది రుక్మిణికి. ఉదయం ఏడుగంటలకే హాస్టల్‌నుంచి బయల్దేరింది పదయినా ఇంకా పెళ్ళి దగ్గరకు జేరకపోవటమేమిటి?

రిసీవర్ పెట్టేస్తునే, "ఏమండీ! త్వరగా రండి!" అంటూ అప్పటికే పెళ్ళికొచ్చినవాళ్ళ మధ్యలోకి వెళ్ళిపోయిన భర్తను వెతికి పట్టుకొని పక్కకు తీసుకువెళ్ళింది.

* * *

టీపాయ్‌మీద పెట్టివున్న సెల్ రింగవ్వటంతో అపరంజి, కామాక్షి ఒక్కసారే ముందుకు వంగారు జగన్నాథంగారే చేశారేమోనన్నట్లుగా. సెల్ స్క్రీన్‌మీద డిస్‌ప్లేఅయిన పేరు చూస్తూనే కామాక్షి, "ఇంకా ఇక్కడ నేనెందుకు... అమ్మదగ్గరకు వెళ్ళి వంటయిందేమో కనుక్కువస్తాను... నువ్వు మాట్లాడి మురిపాలు తీర్చుకో!" అంటూనే అక్కడనుంచి వెళ్ళిపోయింది– ఆ కాల్ వచ్చింది అపరంజి బావనుండి అవ్వటంతో.

అపరంజి సెల్ ఆన్ చేస్తూనే, "నీకెన్ని సార్లు చెప్పాలి... నేను చేస్తానని చెప్పానా లేదా... ఏమిటా తొందర?" అన్నది పెద్ద కంఠంతో అరుస్తున్నట్లుగా..

"నేను నీ కాబోయే మొగుణ్ణే అంజీ!... కాస్త గౌరవమిచ్చి మాట్లాడవే... భవిష్యత్తులో నిన్ను బంగారు పల్లకీలో తిప్పవలసినవాణ్ణి నేనే అని గుర్తుంచుకో!" అన్నాడు మరింతగా కవ్విస్తూ.

"ఇప్పుడు చాలా సీరియస్‌గా వున్నాను... తరువాత నీ థీరీలన్నీ వింటానుగాని... నీ బోడి స్నేహితులెవరూ పక్కన లేరుగదా... అంజీ గంజీ అంటున్నావ్... రేపొద్దున నేను నా పేరు మార్చుకున్నట్లుగా అన్ని పేపర్లలోనూ, అన్ని ఎడిషన్లలోనూ, అన్ని భాషల్లోనూ వచ్చేస్తుంది నీ కోతి మూక విన్నదంటే... !" అన్నది చాలా విసురుగా.

"ఎవ్వరూ లేరులే... నా గదిలో ఏసీ అన్ చేసి నేనొక్కడినే నా ఒళ్ళో ఓ దిండు పెట్టుకొని కూర్చున్నాను నీకో శుభవార్త చెప్పాలని!" అన్నాడు ముద్దు ముద్దు మాటలతో సుధీర్.

"నేను చాలా సీరియస్‌గా వున్నానయ్యా... ఇప్పుడు కాదయ్యా అంటే

వినిపించుకోవేంటి... నేనే ఫోన్ చేస్తానన్నానుగదా... ముందు స్విచ్ ఆఫ్ చేయ్!" అన్నది విసురుగా.

"ఐసీసీయూలో ఉన్నావేమిటి ఖర్మ... ఆ ఆసుపత్రి పేరేదో చెప్పితగలడు... నేను కారు తీసుకు బయల్దేరుతున్నాను!"

చిరాగ్గా సెల్ ఆఫ్‌చేసిన కొద్ది క్షణాల్లోనే మళ్ళా రింగయింది. చేసింది సుధీరే. తలకొట్టుకుంటూ ఆన్ చేసింది. "నువ్వు చెప్పదలుచుకున్న ఆ అర్జంటు విషయమేమిటో రెండు నిముషాలల్లో చెప్పేయాలి... నేనో అర్జంట్ కాల్ కోసం ఎదురు చూస్తున్నాను! దాన్ని మిస్ అవ్వటం నాకిష్టంలేదు!" అన్నది విసుగ్గా.

"నాకు మించి నీకు అంత అర్జంట్‌గా కాల్ చేసే వాళ్ళెవరున్నారే అంజీ!"

"అయ్యా నీకు దణ్ణం పెడతాను... చెప్పదలుచుకున్నదేదో వెంటనే చెప్పు!"

"నేను అమెరికా వెళుతున్నాను!"

"వెళ్ళు!"

"నిన్ను తీసుకు వెళుతున్నాను!"

"మీ అత్త అట్లకాడ కాలేస్తుంది! జాగ్రత్త!"

"నీకోసమా? నాకోసమా?"

"నీకోసమే... నువ్వేగదా ఆ వెధవ కూత కూస్తున్నది... పెళ్ళికాకుండానే నన్ను తీసుకువెళతానంటున్నావు అంటే బరితెగించిపోతున్నావన్నమాట!"

"అదేరా నేను చెప్పేది... నాకు వెళ్ళటానికి ఇంకా రెండు నెలలు టైముంది... ఈలోగా ఆ మొదటి కార్యక్రమం వాళ్ళు పూర్తి చేస్తే రెండో కార్యక్రమం మనం కానిచ్చేసి చేతులూ చేతులూ పట్టుకొని విమానం ఎక్కేద్దామని"

"ఏంటి బావా! ఆ రెండో కార్యక్రమం?" అన్నది దీర్ఘంతీస్తూ అపరంజి.

"ప్రతిదానికీ తొందరేనా... మొదటిది అయిం తరువాత చెబుతానుగాని నువ్వు

మన పెళ్ళి విషయాన్ని వెంటనే ఇక్కడకు వచ్చేసి మీ అమ్మ చెవిలో వేసి, నేను భరించలేనంతగా బావ నన్ను సతాయించేస్తున్నాడే అని ఒకసారి  కళ్ళు తుడుచుకొని ముక్కు చీదేయ్... మీ మామయ్య దగ్గర నా ఏడుపేదో నేను ఏడుస్తాను!"

"ఒక్క పనికి ఇద్దరం ఏడ్వటం దేనికి... ఇద్దరిదగ్గరా నువ్వే ఏడు!"

"ఆడదాని ఏడుపుకు వెయిట్ ఎక్కువుంటుందే బంగారం!"

"సరే ఇంతేనా... ఇంకేమైన చెప్పాలా?"

"ఇంకా అంటే చాలా వున్నయి చెప్పేందుకు!"

"ఒకటి గుర్తుంచుకో బావా! ముందు నా ఫ్రెండ్ కిడ్నాపర్ల చేతుల్లోనుంచి సురక్షితంగా బయటపడాలి... అప్పుడు ఏం చేయాలో, ఏం చేస్తే బాగుంటుందో నేను నిర్ణయిస్తాను... నీ అమెరికా ప్రయాణం నిజమేనా... ఒరిజినల్ ఆర్డర్స్ చూపిస్తేనేగాని నేను నమ్మను... నీ నాటకాలు నా దగ్గర కుదరవ్!"

"రాత్రే ఫోన్‌మీద మెసేజ్ వచ్చింది... అన్ని ఫార్మాలిటీసు పూర్తయి కాగితాలు రావటానికి సమయం పడుతుంది... కాస్త ఆగాలి మరి!"

"సరే! నేను నాలుగురోజుల్లో విశాఖపట్నం వస్తాలేగాని... ఒళ్ళో దిండు మాత్రం తీయబోకు, అట్లాగే ఉంచుకో!" ఫోన్ ఆఫ్ చేసింది ముసిముసి నవ్వులతో దానివంకే చూస్తూ.

అప్పుడు చూసింది. అందులో ఓ మిస్సడ్ కాల్ ఉంది. అది జగన్నాథంగారినుంచేనేమోనని ఆదుర్దాగా కామాక్షిని పిలిచింది.

* * *

జగన్నాథం కారు మియాపూర్ చౌరస్తాకు కిలోమీటర్ దూరంలో వున్న పోలీస్ చెక్‌పోస్ట్ దగ్గర ఆగుతుండగానే డోర్ తీసుకొని హడావుడిగా దిగాడు. ఆయన్ను చూస్తూనే పోలీసులు ఎలర్టయి ముందుకు వచ్చారు.

"అంబులెన్స్ ఏదీ రాలేదా?"

"రాలేదు సార్!"

ఆయన అనుమానం బలపడింది. ఈ కాస్త దూరంలో మధ్యలో ఎక్కడా ఏ నర్సింగ్ హోమూ లేదు. నిజంగా దాంట్లో పేషెంటే వున్నట్లయితే ఎక్కడా ఆగకుండా ముందుకు వెళ్ళాలి... దారి తప్పించాడూ అంటే?...

"మెయిన్ రోడ్డు మీదగా కాకుండా పక్క సందుల్లోనుంచి వెళ్ళి మళ్ళా హైవే ఎక్కవచ్చా ఎక్కడైనా ఈ రూట్‌లో?" అంటూనే చేతిలోని సెల్ ఆన్‌చేసి బిహెచ్ఎల్ దగ్గరున్న చెక్‌పోస్ట్‌కు కాల్‌చేశాడు.

అవతల ఆన్ చేయగానే, "ఏ అంబులెన్స్ వచ్చినా ఆపండి అక్కడ... అంతేకాదు... నేను పావుగంటలో అక్కడుంటాను... వెహికల్స్‌నన్నిటినీ ఆపీ ఇంతకు ముందే మీకు ఫ్లాష్ చేసిన ఫొటోలో వున్న అమ్మాయి దేంట్లో వున్నా ఆ వాహనాన్ని పక్కన నిలబెట్టి అందులోనివాళ్ళనందరినీ అదుపులోకి తీసుకోండి!"

"యస్ సార్!"

మళ్ళా ఏసీపీ కూర్చున్న కారు ముందుకు దూకింది.

మదీనాగూడా దాటుతుండగా ఓ పెద్ద నర్సింగ్‌హోం కనబడింది. దానిముందు ఓ అంబులెన్స్ ఉండటంతో దాంట్లోకి పోనివ్వమన్నాడు కారుని డ్రైవర్‌తో.

పోర్టికోలో కారు ఆగుతుండగానే గమనించాడు. ఆ అంబులెన్స్ ప్రైవేటుదే. వడివడిగా లోపలకు వెళ్ళాడు.

రిసెప్షన్‌లో వున్న అమ్మాయి పోలీస్ డ్రస్‌లో వున్న ఆయన్ను చూస్తూనే లేచి నిలబడింది.

"ఇప్పుడు అంబులెన్స్‌లో ఎవరినైనా తీసుకు వచ్చారా?"

"ఐదు నిముషాలయింది సార్... చాలా సీరియస్ కేస్‌లా వున్నది...

క్యాజుయాలిటీలో డాక్టర్లు పరీక్షిస్తున్నారు!"

"పేషెంటుతోపాటు వచ్చినవాళ్ళు ఎక్కడున్నారు?" ఆత్రంగా అడిగాడు.

"అందరూ అక్కడే ఉన్నారు సార్!"

"క్యాజుయాలిటీ ఎక్కడ?"

"పక్క కారిడార్‌లో మొదటి గదే సార్!" వినయంగా చెప్పింది. "రండి చూపిస్తాను!"

వెంటనే ముందుకు వెళ్ళి కారిడార్‌లోకి తిరిగాడు జగన్నాథం. తలుపు దగ్గర చాలామంది నిలుచుని వున్నారు. వాళ్ళను నెట్టుకుంటూ లోపలకు వెళ్ళాడు.

లోపలకు విసురుగా వచ్చిన ఆయన్ను, పేషెంటును పరీక్షిస్తున్న డాక్టర్లు, విచిత్రంగా చూచారు.

"చెప్పండి!"

"ఇప్పుడు అంబులెన్స్‌లో తీసుకు వచ్చిన పేషెంటు ఎవరు?"

ఆ గదిలో మంచాలమీద మరో ఇద్దరు ఆడ పేషెంట్లు వున్నారు.

"ఈమేనండి!" అన్నాడు తాము పరీక్షలు చేస్తున్న ఆమెను చూపిస్తూ, అందులో ఒక డాక్టరు.

ఆ పేషెంటును చూస్తూనే గిరుక్కున వెనక్కు తిరిగాడు జగన్నాథం ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయకుండా. ఆ బెడ్‌మీద వున్నది ఎనభై ఏళ్ళ ముసలమ్మ!

ఆయనకు అర్థమయిపోయింది– మియాపూర్ చౌరస్తాలో అతివేగంగా ఇటు వచ్చిన అంబులెన్స్ ఇది కాదు!

తను చూసిన అంబులెన్స్‌లో పేషెంట్ ఎవరూ ఉండి వుండరు. ఉండివుంటే తప్పకుండా ఇక్కడకు వచ్చి ఉండేవాళ్ళు. కానీ అది రోడ్డుమీద పోయిన తీరు అతడికి అనుమానాన్ని కలిగిస్తోంది. పేషెంటు ఎవరూ లేనప్పుడు సిగ్నల్స్ దగ్గరకూడా ఆగకుండా అంత దూసుకుపోవాల్సిన అవసరమేమొచ్చింది?

మళ్ళా ఆయన కారు హైవేమీదకు ఎక్కింది. రోడ్డుకు అటూ ఇటూ మరో రెండు కార్పొరేట్ హాస్పిటల్స్ కనబడినయి. ఆగి అక్కడ కనుక్కున్నా ఎలాంటి సమాచారమూ దొరకలేదు. అసలు ఈరోజు ఉదయంనుంచి ఇంతవరకూ కొత్త పేషెంటు ఎవరూ ఆ ఆసుపత్రులలో జేరలేదట!

కారు ముందుకు పోతునేవున్నది. చందానగర్‌కు వచ్చారు.

అప్పుడు చేతిలోవున్న వైర్‌లెస్‌లో రింగ్ వచ్చింది. ఆత్రంగా దాన్ని ఆన్‌చేశాడు జగన్నాథం.

"సార్! ఇప్పుడే ఓ సంగతి తెలిసింది... లింగంపల్లి రైల్వేస్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో రైలు పట్టాలకు పక్కగా వున్న చెరువలోకి అంబులెన్స్ ఒకటి దొర్లిపోయింది... మనవాళ్ళంతా అక్కడకు వెళుతున్నారు...!"

జగన్నాథం ఆ వార్త వింటూనే ఉలిక్కిపడ్డట్లుగా చేతిలోని రిసీవర్ వంకే చూస్తూ వుండిపోయాడు కళ్ళప్పగించి!

# 8

ఏసీపీ జగన్నాథం కూర్చున్న కారు లింగంపల్లివైపుకు పరుగెత్తటం మొదలుపెట్టింది. పట్టాల పక్కగా కంకరతేలిన రోడ్డు ఎప్పుడో యాభై సంవత్సరాల క్రితం వేసినట్లుగా వున్నది. అంతేగాకుండా ఆ బాటను ఎక్కువగా ఎవరూ వాడుతున్నట్లుగా గూడా అనిపించటంలేదు.

దారి చూపిస్తూ ముందు సీట్లో కూర్చొని వున్న సబిన్స్‌పెక్టర్‌ను, "ఇది మళ్ళా నేషనల్ హైవేకు ఎక్కడ కలుస్తుంది?" అని అడిగాడు.

"ఇక్రిశాట్ అవతల సార్!"

– ఆయనకు అర్థమయింది హైవేమీద మియాపూర్‌నుంచి పోలీసునిఘా ఎక్కువగా వుండటంతో దాన్ని ఇటువైపుకు మళ్ళించారన్నమాట– తన అనుమానం నిజమే

అవ్వవచ్చు... అందులోనే కిడ్నాప్ చేయబడిన నివేదిత ఉండివుండాలి...

ఆయన శూన్యంలోకి చూస్తున్నట్లుగా చుట్టూవున్న గుట్టల్లోకి, అక్కడక్కడా పచ్చగా కనబడుతున్న పొలాల్లోకి చూస్తూ ఉండిపోయాడు. చుట్టూ ఎక్కువగా తాటిచెట్లు... వాటికి కట్టిన కల్లు కుండలు...

తన ఊహే నిజమయితే ఆ అంబులెన్స్‌లో వున్న అందరూ ఆ చెరువులోని నీళ్ళలో మునిగిపోయివుండాలి... లేదా ఆ వాహనాన్ని బయటకు తీయటానికి కుదరక ఆ అమ్మాయిని తీసుకొని వాళ్ళు తప్పించుకు పారిపోయి అయినా వుండాలి...

– అందరూ జలసమాధి అయివుంటే మాత్రం తనుపడుతున్న శ్రమంతా వృధానే అవుతుంది...

కూతురు కామాక్షి కళ్ళముందు కదిలింది. కామాక్షి స్నేహితురాలు అపరంజి కళ్ళముందు కదిలింది. ఆమెకూ, ప్రస్తుతం తను ఆత్రంగా ఎదురుచూస్తున్న నివేదితకూ నడుమ వున్న విచిత్రమైన కథ గుర్తుకువచ్చింది.

నో...

అలా జరగటానికి వీల్లేదు... ఆ అంబులెన్స్ చెరువులో పడిపోవటానికి వెనుక ఏదో కారణం వుండవచ్చు...

ఆయన పోలీసుబుర్ర చకచకా పనిచేయటం మొదలుపెట్టింది...

తమను తప్పుదారి పట్టించటానికిగాను... అందులోని అందరూ మరో కారులోకి మారి, దాన్ని నీళ్ళల్లోకి తోసివేసి వుంటే?... తాము నిజం తెలుసుకునే లోపే వాళ్ళు చాలా దూరం వెళ్ళిపోవచ్చు!

ఆయన వెంటనే వైర్‌లెస్ ఆన్‌చేసి జహీరాబాద్ పోలీస్ చెక్‌పోస్ట్‌కు ఫోన్‌చేసి, "నేను ఏసీపీ జగన్నాథాన్ని మాట్లాడుతున్నాను... హైదరాబాద్‌నుంచి వచ్చే ఏ వాహనాన్ని పూర్తిగా పరీక్షించకుండా వదలవద్దు... నేను ఇప్పుడు అక్కడకే వస్తున్నాను! మీరు కంట్రోల్‌రూం నుంచి వచ్చిన కిడ్నాప్ అయిన అమ్మాయి, అనుమానితుడి

ఫొటోలను గుర్తుంచుకున్నారు కదా!” అన్నాడు.

“యస్ సార్!”

ఆయన మెసేజ్ ఇవ్వటం పూర్తయ్యే సమయానికి వాళ్ళ కారు రైలు పట్టాలపక్కగా వున్న ఆ చెరువు దగ్గరకు వచ్చింది. అప్పటికే అక్కడ పోలీసులున్నారు. పక్కన పొలాల్లో పనిచేస్తున్న కొందరు రైతులూ వచ్చారు.

చెరువులో నీళ్ళు నిండుగానే వున్నయి. అందులో పాతికడుగల లోపలకే వెళ్ళిపోయింది అంబులెన్స్. దాని పైకప్పు మాత్రమే బయటకు కనబడుతోంది.

అప్పటికే నీళ్ళల్లో వున్న ఆ వ్యానును బయటకు లాగటానికిగాను తాళ్ళు కట్టేందుకు ఇద్దరు ఈతగాళ్ళు లోదుస్తులతో చెరువులోకి దిగుతున్నారు. తాళ్ళను కట్టి బయటకు లాగేందుకుగాను అంతకుముందే అటువైపుగా గ్రెనైట్ రాళ్ళతో వెళుతున్న ఓ లారీని ఆపారు.

జగన్నాథం కారు దిగి ఒడ్డుకు వెళుతూ, “వాళ్ళను అసలు అందులో మనుష్యులు ఉన్నారో లేరో చూడమనండి ముందు!” అన్నాడు సబిన్స్పెక్టర్‌తో.

అతడు అదే చెప్పాడు లోపలకు దిగుతున్న వాళ్ళతో.

వాళ్ళిద్దరూ ఈదుకుంటూ దానిదగ్గరకు వెళ్ళి నీళ్ళల్లో మునిగి లోపలకు చూచారు. అంత స్పష్టంగా కనబడకపోవటంతో బయటకు వచ్చి, “నీళ్ళు మురిగ్గా వుండటంతో ఏమీ కనబడటంలేదు సార్!... లోపలంతా నీళ్ళున్నయి!” అన్నారు.

“సరే... ఆ వ్యాన్ వెనుక తాళ్ళు కట్టండి...” అంటూనే కానిస్టేబుల్స్‌చేత ఒడ్డున దానికి దాపుగా తెచ్చి నిలబెట్టిన లారీకి తాళ్ళు కట్టించాడు.

ఆ ప్రక్రియ పదినిముషాలల్లోనే పూర్తయింది.

లారీని స్టార్టుచేసి ముందుకు నడిపించాడు లారీ డ్రైవరు లోడ్‌గేర్‌లో. ఒక్క నిముషం తరువాత వ్యాన్ చిన్నగా వెనక్కు రాసాగింది ఆ బురద నీళ్ళలోనుంచి అతి

భారంగా.

ఒడ్డుకు వచ్చేటప్పటికి పదినిముషాలు పట్టింది. అది బయటకు వస్తున్న కొద్దీ అద్దాలు తీసివున్న తలుపులగుండా నీళ్ళు బయటకు రాసాగినయి.

ఆత్రంగా అందరూ దాని చుట్టూ మూగారు.

జగన్నాథమూ ముందుకు వెళ్ళాడు.

"లోపల ఎవరూ లేరుసార్!"

"దాంట్లోవాళ్ళు నీళ్ళల్లోకి జారిపోయారేమో సార్!" ఇన్‌స్పెక్టర్ అనుమానం వ్యక్తం చేశాడు.

జగన్నాథంకు వాళ్ళు చేసిన ట్రిక్కు అర్థమయిపోయింది. వాళ్ళు అతడు అనుమానిస్తున్నట్లుగా నీళ్ళల్లో పడిపోయివుండరు. తను ఊహించినట్లే జరిగింది. క్రిమినల్ బ్రెయిన్స్ పోలీసుల బుర్రలకన్నా పదునుగా వుంటయి!

"నువ్వు వెంటనే అన్ని స్టేషన్లనూ కాంటాక్ట్‌చేయి... ఎక్కడైనా వ్యాన్ పోయినట్లుగా కంప్లెయింట్ వచ్చిందేమో కనుక్కో... చెరువులో శవాలేవీ దొరక్కపోవచ్చు... అయినా ఒకసారి చెక్ చేయించు!" అంటూనే కారెక్కి మళ్ళా హైవేమీదకు పోనివ్వమన్నాడు జగన్నాథం.

హైవే ఎక్కుతుండగా ఇంటినుంచి ఫోనొచ్చింది. చేసింది కూతురు కామాక్షి. "ఏం నాన్నా ఏమైనా సమాచారం దొరికిందా. అపరంజి టెన్షన్ పడుతోంది!" అన్నది ఆదుర్దాగా.

"లేదురా... అదే పనిమీద వున్నాను... దొరుకుతుందిలే... వర్రీ అవ్వద్దని చెప్పు!"

"ఆ అమ్మాయికి ఏ హానీ జరక్కుండా వుండేలా చూడు, నాన్నా!"

"నాకు తెలియదురా... నేనూ అదే ఉద్దేశ్యంలో ఉన్నానులే!" ఫోన్ ఆఫ్

చేస్తుండగానే వైర్‌లెస్ రిసీవర్ రింగయింది.

"సార్! నేను జహీరాబాద్ చెక్‌పోస్ట్‌నుంచి ఇన్‌స్పెక్టర్ విక్రాంత్‌ను మాట్లాడుతున్నాను... మీరు ఫ్లాష్ చేసిన ఆ అమ్మాయి ఓ టాక్సీలో దొరకింది... అపస్మారక స్థితిలో వున్నది... ఆ టాక్సీ డ్రైవర్‌ని, మీరు పంపిన ఫొటోలోవున్న మనిషిని కూడా పట్టుకున్నాం!" అన్నాడు వడివడిగా.

"థాంక్యూ... థాంక్యూ...!" ఎక్సయిటింగ్‌గా అన్నాడు జగన్నాథం. "వాళ్ళిద్దరికీ బేడీలు వేసి జాగ్రత్తగా కాపలా కాయండి... వెంటనే ఆ అమ్మాయిని జహీరాబాద్ తీసుకువెళ్ళి ఏదైనా పెద్ద హాస్పిటల్లో జేర్చండి... అక్కడా ఆ అమ్మాయికీ కాపలా పెట్టండి... జాగ్రత్త... నేను ఓ గంటలో అక్కడకు వచ్చేస్తాను!" రిలాక్సింగ్‌గా ఆయన సీటులో వెనక్కు వాలుతూ అన్నాడు.

* * *

"హైమా! నివేదిత వచ్చిందా?"

కాల్ చేసింది నివేదిత తల్లి రుక్మిణి విజయవాడనుంచి.

"ఇంకా రాలేదు పిన్నీ!"

"అదేంటే... ఉదయం ఏడుగంటలకు హాస్టల్‌నుంచి పెళ్ళికని బయల్దేరింది ఒంటిగంటవుతున్నా అక్కడకు రాకపోవటమేమిటి... దాని హాస్టల్‌కు అత్తాపూర్ ఎంత దూరంలో వున్నదే?" ఆదుర్దాగా అడిగింది.

"ఆటోలో ఎంత ట్రాఫిక్కువున్నా గంటలో వచ్చేయవచ్చు పిన్నీ!... ఉదయం ఏడింటికే బయల్దేరిందంటుంటివి అప్పుడు రోడ్లు అంత రద్దీగా గూడా ఉండవ్ మరి... మధ్యలో ఏ స్నేహితురాలింటికైనా వెళ్ళిందేమో!"

"స్నేహితురాలింటికి వెళితే సెల్ ఆఫ్‌చేయాల్సిన అవసరమేమున్నది! అది కళ్యాణమండపానికి దారితెలియక ఇబ్బంది పడుతున్నదేమోనని నాకు భయంగా వున్నది!" ఆమె కంఠంలో సన్నని ఒణుకు.

"అంత అడ్రసు దొరక్కపోతే ఫోన్‌చేస్తుందిగాని, ఊరికినే రోడ్లమ్మట తిరుగుతూ కూర్చుంటుందా?"

"లేకపోతే అది ఎక్కిన ఆటోకు యాక్సిడెంటవ్వలేదు గదా!"

ఆమె ఆలోచనలకు కాస్తంత చికాకు వేసింది హైమవతికి.

"అప్పుడు దాని సెల్‌లోవున్న నంబర్లకు పోలీసులు ఫోన్‌చేసి సమాచారం అందించి వుండేవాళ్ళుకాని, ఊరికినే పిచ్చిపిచ్చిగా ఆలోచించబోకు... మీ అల్లుడుగారు భోజనం చేస్తున్నారు... అదవ్వగానే మేం ఇద్దరం దాని హాస్టల్‌కు వెళ్ళి వివరంగా కనుక్కొని నీకు ఫోన్ చేస్తాం!" అన్నది అనునయిస్తున్నట్లుగా హైమవతి.

"నాకెందుకో భయంగా వున్నది... అది ఎక్కడ ఇబ్బందులు పడుతున్నదోనని... లేకపోతే సెల్ ఆఫ్ చేసి వుండదు... నేనూ మీ బాబాయ్ ఇప్పుడు హైదరాబాద్‌కు బయల్దేరుతున్నాం!" ఆమె ఏడ్చేయటం మొదలు పెట్టింది ఫోన్‌లోనే.

"ఏంటి పిన్నీ! చిన్నపిల్లలాగా మరీను... మీరు వచ్చి ఏంచేస్తారు?... మీకూ కొత్తేగదా ఈ ఊరు!"

"పోలీసుల కాళ్ళు పట్టుకొని వెతకమని అడుగుతాం... అసలు దాన్ని వదిలిపెట్టి ఇన్నాళ్ళు ఉండనేలేదు నేనింతవరకూ... వద్దే ఒక్కదానివీ అంత దూరం ఎందుకే, ఆ కోచింగ్ ఏదో మన విజయవాడలో లేదా అని నెత్తీనోరు కొట్టుకున్నా నామాట వింటేనా... దాని మాటలకు తానా తందానా అంటూ మీ బాబాయ్... నా మాటలంటేనే ఎగతాళి... ఇలా అయితే అది సివిల్స్ పాసయి ఏ జిల్లాకన్నా కలెక్టరుగా జాయినింగ్ రిపోర్టు ఇవ్వటానికైనా ఒంటరిగా పోనిస్తావా అంటూ... చూశావుగా ఇప్పుడేమైంది... దానికి ఏమైందో ఏమిటో... నా బుర్ర తిరిగిపోతున్నది!" అన్నది రుద్ధకంఠంతో.

"సరే పిన్నీ! నువ్వూ బాబాయ్ రండి... ఈలోగా మేమూ హాస్టల్‌కు వెళ్ళి వివరాలు కనుక్కుంటాం... అవునూ... మీరు ఎలా వస్తారు ఇప్పుడు... రైలుగాని, బస్సుగాని అయితే సిటీ ఔట్‌స్కర్ట్స్‌లోకి రాగానే నాకు ఫోన్‌చేయి... మీ అల్లుడు కారు తీసుకు

వస్తారు మీరు దిగేచోటుకి!"

"ఇప్పుడు రైల్లోను, బస్సుల్లోనూ వచ్చి కాలయాపన చేయటం నా వల్లకాదు తల్లీ!... వెంటనే మా కారులోనే బయల్దేరతాం!" అన్నది ఆమె ఇంకా ఏమాత్రం ఆలస్యాన్ని భరించలేనట్లుగా.

"అయితే కొత్తపేట పండ్లమార్కెట్ దగ్గరకు రాగానే నాకు రింగివ్వు!... మా ఇంటికి అది రెండు నిముషాలే దూరం!"

"దానికక్కడ ఏ ప్రమాదం జరిగి వుండదుగదా!"

"ఏమీ కాదు... నువ్వు ఊరికినే హైరానపడబోకు... అదుగో ఆయన చేయి కడుక్కుంటున్నారు... మేం బయల్దేరతాం ఇంక!" పిన్ని భయపడటం చూస్తుంటే ఆ అమ్మాయికీ ఇక తాత్సారం చేయటం ఇష్టం లేకపోయింది.

* * *

జగన్నాథం కారు హైవే ఎక్కుతుండగానే కూతురు కామాక్షికి ఫోన్‌చేశాడు. తను జహీరాబాద్ జేరటానికి ఎట్లాలేదన్నా ఇంకో గంట పట్టవచ్చు!

"అరేయ్! నువ్వూ అపరంజి వెంటనే జహీరాబాద్‌కు రండి... ఊరికి మొదట్లోనే మా చెక్‌పోస్ట్ వున్నది అక్కడ ఉంటాను నేను... మన డ్రైవర్ను తీసుకొని కారులో బయల్దేరండి!"

ఆయన మాట వింటూనే, "నివేదిత దొరికిందా డాడీ!" ఆత్రంగా అడిగింది తండ్రిని ఆ అమ్మాయి.

"దొరికినట్లుగానే సమాచారమొచ్చింది... ఆ అమ్మాయి బాగా అప్‌సెట్ అయినట్లున్నది... స్నేహితురాలు పక్కనుంటే ధైర్యంగా వుంటుందని!" నివేదిత అపస్మారక స్థితిలో వుంటే అక్కడ హాస్పిటల్లో జేర్చామన్న విషయం చెప్పలేదు. దానివలన అనవసరంగా అపరంజిని కంగారు పెట్టినట్లవుతుందని. ఆయన ఇలాంటివెన్నో చూసిన మనిషి. ఏ పరిస్థితులలో ఎలా మాట్లాడాలో ఆయనకు బాగా తెలుసు.

జహీరాబాద్ చెక్‌పోస్ట్ దగ్గరకు వచ్చేటప్పటికల్లా అనుకున్నట్లుగానే గంటకు పైగా పట్టింది. చెక్‌పోస్ట్‌కు ఇవతలగా చాలా వాహనాలు ఆగివున్నయి. అక్కడే ఒక పక్కగా వున్న పెద్ద చింతచెట్టుక్రింద టాక్సీ ఆపివున్నది. దానిచుట్టూ పోలీసులు వున్నారు. చాలామంది జనం ఉన్నారు.

ఆయన్ను చూస్తూనే ఇన్‌స్పెక్టర్ పరుగెడుతున్నట్లుగా వచ్చి శాల్యూట్ చేశాడు.

"ఆ అమ్మాయికి ఎట్లావున్నది?"

"మన స్మారకంలో లేదు సార్!... మీరు చెప్పినట్లు వెంటనే జహీరాబాద్ హాస్పిటల్లో జేర్పించాను...!"

"ఆ వెధవెక్కడున్నాడు?"

అతడు తలవాల్చాడు మాట్లాడకుండా.

"ఏమైంది?" అరుస్తున్నట్లుగా అడిగాడు జగన్నాథం.

"ఆ అమ్మాయిని మేం షిఫ్ట్‌చేస్తున్న సమయంలో తప్పించుకుపోయాడు సార్!... అప్పటికీ మనవాళ్ళు కాపలా ఉన్నారు... ఎటుపోయాడోకూడా తెలియనంతగా ఇక్కడ ఆగివున్న వాహనాల మధ్యనుంచి పారిపోయాడు సార్!... నా అనుమానం వాడికి అండగా మరికొందరు కూడా వున్నారు!"

"సో మన తెలువులు అంతలో వున్నయ్యన్నమాట... ఈలాంటి సంఘటనలతోనే మన డిపార్టుమెంటు పరువు పోయేది, నవ్వులపాలయ్యేది!" విసురుగా తిట్టటం మొదలుపెట్టాడు జగన్నాథం పోలీసు భాషలో.

అతడు ఎండిపోయిన గొంతును పెగుల్చుకొని, "వాడిని ఎక్కడున్నా పట్టుకుంటాం సార్! ఆ టాక్సీ డ్రైవర్‌కు బేడీలు వేసే కూర్చోబెట్టాం!"

జగన్నాథం నవ్వాడు.

"ఆ డ్రైవర్ వాడి మనిషే అని నీకెలా తెలుసు?... ఆ రాస్కెల్ టాక్సీని హైర్

చేసివుండవచ్చుగదా!... అతడిని ఇటు తీసుకురండి!"

తరువాత రెండు నిముషాలకే తెల్లడ్రస్సులోవున్న ఆ కారు డ్రైవరు ఆయన ముందుకు వస్తూనే నమస్కారం పెట్టాడు.

"నీకు శంకర్‌తో ఎన్నాళ్ళబట్టి పరిచయం?" సూటిగా అడిగాడు.

"ఏ శంకర్ సార్?"

"నేను చెప్పాలా అది కూడా... ఆ అమ్మాయిని కిడ్నాప్‌చేసి నీ కారులో తీసుకువస్తున్న మీవాడు... నా దగ్గర నాటకాలు ఆడొద్దు... నిజాలు చెప్పటం నీకు మంచిది!"

ఆ డ్రైవరు ఒక్కసారిగా ఘొల్లుమన్నాడు.

"వాడెవడో నాకు తెలియదు సార్!... అసలు ఆ అమ్మాయిని కిడ్నాప్ చేశారనే విషయమే ఇక్కడ పోలీసులు చెప్పేంతవరకూ నాకు తెలియదు... మా చెల్లెలు ఆరోగ్యం బాగోలేదు... అర్జంటుగా షోలాపూర్ తీసుకువెళ్ళాలంటూ వస్తే... మా ట్రావెల్స్ ఓనరు, అతడిదగ్గర ఎడ్వాన్సుగా రానూపోనుకు మొత్తం డబ్బులు తీసుకొని ట్యాంకునిండా పెట్రోలు కొట్టించి నన్ను తీసుకు వెళ్ళమని పంపారు!"

"మీ ట్రావెల్స్ పేరేంటి?"

"విఘ్నేశ్వరా ట్రావెల్స్ సార్... చందానగర్ సెంటర్‌లోనే వున్నది... ఇదుగోండి మా విజిటింగ్ కార్డు!" అంటూనే జేబులోనుంచి పర్సుతీసి, అందులోని కార్డు బయటకులాగి జగన్నాథంకు ఇచ్చాడు.

ఆయన అనుకున్నదే అది!

శంకర్ బహు తెలివిగలవాడు!

"ఇన్‌స్పెక్టర్ కారును జహీరాబాద్‌కు పంపి స్టేషన్‌లో పెట్టించు... ఆ ట్రావెల్స్ ఓనర్ను కూడా వెంటనే అక్కడకు రమ్మనమని ఫోన్‌చేసి చెప్పు!" అన్నాడు వాటి వలన

ఏ ఫలితముండదని తెలిసినా రూల్సు ప్రకారం వాళ్ళ స్టేట్‌మెంట్లు తీసుకోవాల్సిన అవసరం ఉంది గనుక!

ఇన్‌స్పెక్టర్‌ను తీసుకొని జగన్నాథం జహీరాబాద్‌లోని నర్సింగ్‌హోంకు బయల్దేరాడు.

దారిలో ఇన్‌స్పెక్టర్‌ను అడిగాడు. "వాడు పారిపోతుంటే అంత తెలివితక్కువగా మీరంతా చూస్తూ నిల్చున్నారా... అంతమంది ఉండీ అక్కడ!" ఆ విషయంలో ఆయన బాగా చికాకు పడుతున్నాడు.

ముఖం వేలాడేశాడు అతడు. "చెప్పానుకదా సార్! అతడు ఒక్కడు కాదు ... ఇంకా కొంతమంది వాడిని అనుసరించి వాడికి సాయంగా వచ్చారని నా అనుమానం సార్!... టాక్సీ ఆపి ఆ అమ్మాయిని గుర్తించి మీకు ఫోన్ చేయటం, ఆపైన ఆ అమ్మాయిని ఆసుపత్రికి పంపించే హడావుడిలో వున్నప్పుడు వాళ్ళంతా కారుచుట్టూ మూగి, ఏమైంది, ఏమైంది అని అక్కడున్న మనవాళ్ళని వేధించసాగారు... వివరాలు తెలుసుకున్న తరువాత, ఇంకా మా వెహికిల్స్ ఆపటం దేనికి, మీకు కావాల్సిన వాళ్ళు దొరకారు కదా అంటూ వాదన పెట్టుకున్నారు... వాళ్ళు చెప్పిందీ నిజమే అనిపించింది... హైవే అవ్వటంతో గంటలోనే ట్రాఫిక్కు మూడు కిలోమీటర్ల దాకా ఆగిపోయింది... దాంతో తోపులాటలు, మరికొంతమంది డ్రైవర్లు, పాసింజర్లు వాళ్ళకు వత్తాసుగా రావటంతో పెద్ద గొడవే అయింది... ఆ హడావుడిలోనే వాడు కాస్తా జారుకున్నాడు... తరువాత మాతో వాదన పెట్టుకున్న వాళ్ళూ కనబడలేదు...! ఇదంతా చూస్తుంటే వాళ్ళు కావాలనే గొడవపెట్టుకున్నారేమోననిపిస్తోంది!" అన్నాడు.

జగన్నాథం అతడి మాటలు విని మెదలకుండా ఊరుకుండిపోయాడు. తరువాత ఐదునిముషాలల్లోనే నివేదితను జేర్చిన నర్సింగ్‌హోం ముందు కారు దిగారు.

లోపలకు వెళుతూనే, ఇన్‌స్పెక్టర్, "ఇంతకుముందు తీసుకువచ్చిన అమ్మాయి కాన్షస్‌లోకి వచ్చిందా?" అడిగాడు అక్కడ క్యాజుయాలిటీలో వున్న డాక్టర్‌ని.

"ఆ అమ్మాయికి మత్తుమందు ఇంజక్షన్‌గా ఇచ్చినట్లున్నారు సార్, అందుకే

అంత మగతగా పడుకొని వున్నది... పల్స్, బిపి నార్మల్‌గా వున్నయి... ఈసీజీగూడా చూశాం... నో ప్రాబ్లమ్...!" అంటూ ఐసీసీయూలో వున్న నివేదిత దగ్గరకు దారితీశాడు అతడు.

* * *

రాత్రి పదకొండు గంటలయింది నివేదిత తల్లిదండ్రులు కొత్తపేట ఫ్రూట్ మార్కెట్ దగ్గరకు వచ్చేటప్పటికి. అప్పుడు హైమవతికి ఫోన్‌చేస్తే అయిదు నిముషాలల్లోనే వాళ్ళు కారు తీసుకొని అక్కడకు వచ్చారు.

"ఏమైందే?... దానివిషయం ఏమైనా తెలిసిందా?" అన్నది రుక్మిణి ఆత్రంగా హైమవతిని చూస్తూనే.

"ముందు ఇంటికి పద పిన్నీ!" అన్నది అనునయంగా హైమవతి.

"ఇప్పుడు ఇంటికి దేనికే... హాస్టల్‌కు వెళదాం... మీ ఇంటికి దగ్గరేనంటివి కదా అది!" ముఖం చిట్లిస్తూ అన్నది రుక్మిణి.

"ఇప్పుడు హాస్టల్లో ఎవరుంటారు పిన్నీ!... వార్డెన్‌కూడా ఇంటికిపోయి వుంటుంది... పొద్దున్నే వెళదాంలే!"

"ఉఁహూఁ... ముందు అక్కడికే వెళదాం... వార్డెన్ లేకపోతే దానితో చదువుకుండే పిల్లలుండరా అక్కడ!"

హైమవతికి ఏం చేయాలో తెలియలేదు. ఆమె భర్తే చొరవతీసుకొని, "అలాగే వెళ్దాం... ఎటూ నివేదిత హాస్టల్‌కు వెళ్ళాలీ అంటే మా ఇంటివైపునుంచే వెళ్ళాలి... మా ఇంటి దగ్గర మీ కారు పెట్టి, నా దాంట్లో నలుగురం వెళ్దాం... పిల్లలుకు గూడా చెప్పి వెళితే మనం తిరిగి రావటానికి కాస్త ఆలస్యమయినా భయపడకుండా వుంటారు!" అన్నాడు.

నివేదిత తండ్రి భార్యకు నచ్చజెప్పాక, అంతా కలిసి వాళ్ళింటికి వెళ్ళారు.

ఆమె అప్పటిదాకా బాగా ఏడ్చింది అన్నట్లుగా కళ్ళు ఎర్రబడి వున్నయి. రెప్పలు వాచివున్నయి. ముఖమంతా ఉబ్బి వున్నది. గొంతు బొంగురుపోయి మాట ముద్దగా వస్తున్నది.

కారు దిగి, వాళ్ళ సంచులు లోపల పడేస్తుండగా చిన్నగా హైమవతి భర్త ఆయనకు దగ్గరగా వచ్చి, "నివేదితను ఎవరో కిడ్నాప్ చేశారు... పోలీసు బలగమంతా ఆ అమ్మాయికోసమే వెతుకుతున్నారు... మీకయితే ఎలాంటి ఫోనూ ఇంతవరకూ రాలేదుకదా... వాళ్ళ డిమాండ్లు ఏమిటో చెబుతూ!" అడిగాడు.

ఆయన ఉలిక్కిపడ్డట్టుగా అతడివంక చూచాడు.

"అలాగా! మాకేం ఫోన్లు రాలేదే!" అన్నాడు జావలా జారిపోతూ. "ఆ మాట వింటే రుక్మిణి తట్టుకోగలుగుతుందా?"

"నిజమే! అందుకే ఇప్పుడు హాస్టల్‌కు వెళ్ళినా కొత్తగా తెలిసే విషయమేమీ వుండదు... పోలీస్ స్టేషన్‌కు వెళ్ళినా అదే పరిస్థితి... బాగా పొద్దుబోయిందిగదా... తెల్లవారుతూనే వెళితే ఏదైనా సమాచారం దొరకవచ్చు!" అయన వంకే చూస్తూ అన్నాడు హైమవతి భర్త.

"కంట్రోల్ రూంలో ఏమైనా తెలుస్తుందేమో... అసలు అది కిడ్నాప్ అయినట్లుగా వాళ్ళకు కంప్లెయింట్ ఎవరు ఇచ్చివుంటారు... హాస్టల్ వార్డెన్ ఇచ్చివుంటే ఆమెకు కొంతయినా సమాచారం తెలిసివుండాలి!"

"ఎవరిచ్చారో కూడా తెలియటం లేదు... మధ్యాహ్నం ఒంటిగంటప్పుడు పోలీసులు వచ్చి ఆ అమ్మాయిని గురించి వివరాలు అడిగేటంత వరకూ నివేదితను కిడ్నాప్ చేసిన విషయం హాస్టల్ వార్డెన్‌కూ తెలియదు! వెంటనే ఆమె పోలీస్ డిపార్ట్‌మెంటులో తనకు తెలిసినవాళ్ళను కనుక్కుంటే... ఈ కేసును ఏసీపీనే స్వయంగా పర్యవేక్షిస్తున్నారు... వీలయినంత త్వరలోనే కిడ్నాప్ చేసిన వాళ్ళను పట్టుకోవచ్చనే ఆశాభావంలో ఉన్నాం- అని చెప్పారట వాళ్ళు!"

పక్కన మనిషి క్రింద పడ్డట్లుగా శబ్దమవ్వటంతో ఇద్దరూ ఒకేసారి అటు చూచారు. అక్కడ నేలమీద పడివున్నది రుక్మిణి! అంతకుముందు రెండు నిముషాల క్రితమే తలుపు దగ్గరకు వచ్చి నిలబడ్డ ఆమె వాళ్ళ మాటలు వింటూనే తట్టుకోలేక కుప్పలా కూలబడిపోయింది!

* * *

ఉదయం ఏడుగంటల పైన అరగంట అయింది.

ఏసీపీ జగన్నాథం సెల్ రింగయింది. కాల్ వచ్చింది కంట్రోల్ రూం నుంచి.

"గుడ్‌మార్నింగ్ సార్! విజయవాడనుంచి కిడ్నాప్ అయిన నివేదిత తల్లిదండ్రులు వచ్చారు... మన దగ్గరున్న ఆ అమ్మాయి ఫొటో చూపించి వాళ్ళు ఆ అమ్మాయి తల్లిదండ్రులే అని నిర్ధారించుకున్నాం... ఆ అమ్మాయిని కిడ్నాపర్లనుంచి విడిపించామని, ఇప్పుడు సురక్షితంగా మీ ఇంట్లోనే వున్నదని చెబితే మీ ఇంటికి వస్తామని అంటున్నారు... ఏం చేయమంటారు?"

ఒక్కక్షణం ఆలోచిస్తున్నట్లుగా ఆగాడు జగన్నాథం.

"ఒక్కపని చేయండి... ఆ అమ్మాయి నిద్రపోతున్నదిగాని ఓ పావుగంటాగి కానిస్టేబుల్‌ని ఎవరినైనా ఇచ్చి నా దగ్గరకు పంపండి... కులాసాగానే వున్నది, భయపడాల్సిన అవసరంలేదని చెప్పండి!"

"అలాగే సార్!"

సెల్ ఆఫ్ చేస్తూనే కూతుర్ని, అపరంజిని పిలిచాడు తన గదిలోకి.

"చూడు అపరంజి! నివేదిత తల్లిదండ్రులు విజయవాడనుండి వచ్చారుట... వాళ్ళు ఇప్పుడు ఇక్కడకు వస్తున్నారు... ప్రస్తుతం మీ ఇద్దరి విషయం ఎవరికీ తెలియటం ఇష్టం లేదంటుంటివి కదా... ఏంచేద్దాం!"

ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయలేదు అపరంజి. "నేను ఇప్పుడు మా ఇంటికి

వెళ్ళిపోతాను... వాళ్ళు వెళ్ళింతరువాత మళ్ళీ వస్తాను!" అన్నది.

"నివేదితను వాళ్ళు తీసుకు వెళతానంటే!"

"చెప్పండి అంకుల్! కిడ్నాపర్ పారిపోయాడు... అతడితో మీ అమ్మాయికి ప్రమాదం పూర్తిగా తొలిగిపోలేదు... అతడిని పట్టుకోవటానికిగాను నివేదితనుండి కొన్ని వివరాలు తెలుసుకోవాల్సిన అవసరం వున్నది... అసలు మీ అమ్మాయి మా అమ్మాయికి మంచి స్నేహితురాలవ్వటం వలననే ఈ కేసు నా పరిధిలోది కాకపోయినా నేను చొరవ తీసుకోవాల్సి వచ్చింది... ఆ షాక్‌నుండి కోలుకోవటానికిగాను నివేదితను ఇంకోరోజు ఇక్కడే స్నేహితురాలితో ఉండనివ్వండి... నేనూ నాకు కావాల్సిన వివరాలు సేకరిస్తాను ఈలోగా... అటు ఈ కేసు పోలీస్ రికార్డ్సుకు ఎక్కిందికాబట్టి ఆ అమ్మాయి స్టేట్‌మెంటు కూడా తీసుకోవాల్సిన అవసరం వుంటుంది... ఇక్కడే వుంటే పోలీస్ స్టేషన్‌కు వెళ్ళకుండా మా ఇంట్లోనే నేను ఆ ఏర్పాటు చేయగలుగుతానని చెప్పండి... వాళ్ళకు అభ్యంతరంలేకపోతే వాళ్ళనీ ఇక్కడే ఉండమనండి... మీరు ఆ మాట అన్నా వాళ్ళు ఉండటానికి అంగీకరిస్తారని నేను అనుకోను!"

ఆయనకు అపరంజి సలహా నచ్చింది.

"ఇంకో విషయం కూడా అంకుల్! నివేదిత మీ దగ్గరుండగానే ఎలాగైనా కన్విన్స్ చేసి డిఎన్ఎ టెస్ట్‌కు అంగీకరించేలా చేసి ఆమె బ్లడ్ శాంపిల్ తీసుకోవాలి!" అన్నది దృఢమైన కంఠంతో.

"ఓకే!" ఆయన చిరునవ్వుతో అన్నారు. "నాకు అర్థమయింది నీ యాంగ్జయిటీ!"

తరువాత పదినిముషాల్లోనే ఆ ఇంటినుంచి అపరంజి వెళ్ళిపోయింది హడావుడిగా.

ఆమె ఎక్కిన కారు ఆ ఇంటి గేటుదాటిన అయిదు నిముషాలకే నివేదిత తల్లిదండ్రులను, హైమవతి దంపతులను తీసుకు వచ్చిన కారు పోర్టికోలో ఆగింది.

సరిగ్గా అప్పుడే నివేదితా లేచి నిద్రమత్తు వదిలించుకుంటూ బాత్‌రూంకు వెళ్ళింది.

* * *

# 9

రాత్రి ఎనిమిది గంటలయింది.

నిర్మల భర్తతో అమెరికా వెళ్ళేందుకుగాను ఎయిర్‌పోర్ట్‌కు బయల్దేరింది. వాళ్ళతోపాటు తల్లీ, దండ్రే కాకుండా, అన్నా వదినలు కూడా బయల్దేరారు. అపరంజీ బయల్దేరింది.

“అమెరికానుంచి వస్తున్న నిన్ను సంవత్సరం తరువాత చూడబోతున్నానని ఎంతో హుషారుగా ఆత్రంగా వచ్చానే... కానీ, ఎందుకో ఈ ట్రిప్పు ఎంజాయ్ చేయలేకపోయాను!” అన్నది అపరంజి నీరసంగా ఇంకో గంటకు బయల్దేరబోతున్నారు అనగా.

“ఎందుకని?” అన్నది నిర్మల భృకుటి ముడివేసి. “నేను ఎక్కువ సమయం నీతో గడపలేకపోయాననా?”

“అదీ ఒక కారణమేగాని... ముఖ్యంగా నా విజయవాడ స్నేహితురాలు కిడ్నాప్ అవ్వటం మనస్సును పూర్తిగా కలచివేసింది... కామాక్షి నాన్న ఎంతో సాయం చేయబట్టికాని లేకపోతే దాని జీవితం నాశనం అయివుండేది... ఆ టెన్షనే నన్ను ఇప్పటికీ చికాకు పరుస్తోంది!” అన్నది నీరసంగా అపరంజి.

“పోనీయ్‌లే! సుఖంగా బయటపడినందుకు సంతోషించాలి... ఇక మర్చిపో ఆ విషయం... నేనూ ఎక్కువ సమయం నీతో గడపలేకపోయినమాటా వాస్తవమేగా... నీతోనే కాదు మనవాళ్ళందరినీ కూడా కలవలేకపోయాను ఏవేవో వెధవ పనులు, తక్కువ సమయం... ఈసారి అలాంటివేవీ పెట్టుకోనులే!” అంటూనే త్వరత్వరగా, “నేను మళ్ళా వచ్చేటప్పటికి నీకు పెళ్ళయితే ఎక్కడుంటావో...!” అన్నది నవ్వుతూ.

“అయితే నా పెళ్ళికి రావా?” విసురుగా అన్నది. “సరేలే... మీరు రావటానికి వీల్లేకపోతే, మీరు హైదరాబాద్ వచ్చినప్పుడు నేనూ బావా వస్తాంలే!” అన్నది కించిత్

అసహనంగా. "నాకిష్టమయిన వాళ్ళనెప్పుడూ నేను దూరం చేసుకోలేను... కనీసం నేనయినా వచ్చి నువ్వున్నన్ని రోజులు ఉండివెళతాను!"

"అలా అనికాదే... రావటానికే ప్రయత్నిస్తాను... వీలుకాకపోతే అనే మాట నేను అనేది! నీకు కోపం ఎప్పుడూ ముక్కు మీదే ఉంటుంది!" అన్నది నిర్మల అపరంజి చేతిమీద చేయివేసి అనునయంగా. "నీ మొహం అప్పుడు నాతోపాటు అన్నిరోజులు బావను వదిలి ఉండగలవే... పెళ్ళవ్వటమంటే మగా ఆడా వంటికి ఫెవికాల్ రాసుకున్నట్లే... నేను ఈ పది రోజులూ ఆయన్ను వదిలి ఉండటానికి ఎంత ఇబ్బంది పడ్డానో తెలుసా!" ఆ మాటలు అంటున్నప్పుడు నిర్మల ముఖమంతా ఎర్రబడింది.

ఆ మాటలకు అపరంజి నవ్వు ఆపుకోలేకపోయింది.

మధ్యాహ్నం రెండు గంటలప్పుడు కామాక్షి తల్లి భోజనానికి ఉండమని ఎంత చెప్పినా వినకుండా హైమవతి పిన్నినీ, బాబాయ్‌ని తీసుకువెళ్ళిపోవటంతో కామాక్షి అపరంజికి ఫోన్‌చేసింది. వెంటనే అపరంజి వాళ్ళింటికి వెళ్ళింది.

నివేదిత చాలా వరకు కోలుకుంది. అపరంజిని చూస్తూనే వలవలా ఏడుస్తూ కౌగిలించుకున్నది. "నాకు పునర్జన్మనిచ్చావ్ అక్కా!... నీతో పరిచయం కలగకపోయినట్లయితే నేను ఈ పాటికి ముంబయ్ యమకూపంలో పడి గిలగిలా కొట్టుకుంటూ చచ్చిపోయి వుండేదాన్ని!"

'నాతో పరిచయం లేకుండా వున్నట్లయితే నీ జీవితంలో అసలు ఈ బీభత్సం జరిగివుండేదే కాదేమో!' అనుకున్నది మనస్సులోనే అపరంజి. "ఇందులో ఎవరు చేసేది ఏమీలేదు... పైనున్న భగవంతుడి చేతిలో మనమంతా కీలుబొమ్మలం... ఆయన ఎలా ఆడిస్తే అలా ఆడటమే!" అన్నది ఓదారుస్తూ.

"నిజమే!" అన్నట్లుగ నివేదిత తల ఊపుతూ, "ఎల్లుండి ఉదయాన్నే విజయవాడ వెళ్ళిపోతాం... అమ్మ ఏడుపు చూడలేకుండా ఉన్నాను... అసలు ఇవ్వాళే వెళ్దామన్నది... కానీ అంకుల్ ఇవ్వాళా రేపూ ఉండి నేను బాగా కోలుకున్నతర్వాతే వెళ్ళమనటంతో అమ్మ ఒప్పుకోక తప్పలేదు... ఆపైన వారి డిపార్ట్‌మెంట్‌లో కూడా కొన్ని ఫార్మాలిటీస్

పూర్తిచేయాల్సిన పని ఉన్నదట... మాతోపాటు విజయవాడకు ఓ కానిస్టేబుల్‌ని సాయంగా పంపుతానన్నారు!" అన్నది చిన్నగా. "ఎల్లుండి తెల్లవారేటప్పటికి హైదరాబాద్ దాటి వెళ్ళిపోవాలి... ఆ రోగ్ తప్పించుకు వెళ్ళటం ఆయనకూ ఆందోళనగానే వున్నది ముందు ముందు ఎలాంటి ఇబ్బందులు కలిగిస్తాడోనని!"

ఆయన నివేదితను ఈ రెండు రోజులూ ఉండమనటంలో అదే కారణం కాదని, తను కోరినట్లు డిఎన్ఏ టెస్ట్ చేయించాలనేది ముఖ్యోద్దేశ్యమని అపరంజికి తెలిసినా మౌనంగా ఉండిపోయింది.

నివేదితా డిఎన్ఏ విషయంలో ఆయన మాటను కాదనలేకపోయింది. "నాకు మరో జీవితాన్ని ఇచ్చిన అక్క ఉద్దేశ్యమూ అదే... అయితే అంకుల్! ఈ రహస్యాన్ని ఎట్టి పరిస్థితులలోనూ బహిర్గతం చేయకుండా ఉండాలనేదే నా కోరిక... రిజల్ట్ ఏవిధంగా వచ్చినా అమ్మా నాన్నకు దాని వలన మనస్థాపం కలిగించటం నాకిష్టంలేదు!" ఆ మాట చెబుతున్నప్పుడు ఆమె చాలా ఆవేశానికి లోనయింది.

"అలాగేనమ్మా! ఆ విషయం మన ముగ్గురు మధ్యే ఉంటుంది... దాన్ని గురించి నువ్వేమీ భయపడవద్దు!"

"అపరంజి నాకు స్వంత అక్కే అవ్వవలసిన అవసరం లేదు... మానసికంగా ఆమె ఇప్పటికే అక్కకంటే ఎక్కువగా దగ్గరయింది... ఈ చెల్లెలు తను చేసే ప్రతిపనినీ ఆమె దృష్టికి తప్పకుండా తీసుకువెళుతుంది!"

"నీ నిర్ణయం చాలా ఉన్నతంగా ఉన్నదమ్మా!" జగన్నాథమూ తృప్తిపడ్డాడు ఆమె మాటలకు. వాళ్ళిద్దరి విషయంలో నిజానిజాలు తెలుసుకోవటానికి ఆయనకూ ఉత్సుకతగానే ఉన్నది. ఈలాంటివి చాలా అరుదైన సంఘటనలు... జీవితాంతం గుర్తుంచుకో తగ్గవి!

అపరంజి రాక కామాక్షి తండ్రికి చెప్పటంతో, ముగ్గురినీ తన ఆఫీసుకు తీసుకు రమ్మనమని ఓ ఇన్‌స్పెక్టర్‌ని కారిచ్చి పంపించాడు.

"మరి సివిల్స్ ఏం చేయాలని!" దారిలో అపరంజి అడిగింది నివేదితను.

"నా మూడంతా పాడయిపోయింది... ఈ హైదరాబాదు, హాస్టలు, కోచింగ్ అంటేనే ఒళ్ళంతా భయంతో గగుర్పొడుస్తోంది. నిగ్రహించుకొని, చదివి పరీక్షలు రాసినా విజయం సాధిస్తాననే నమ్మకంలేదు... విజయవాడ వెళ్ళి ఈ షాక్‌నుండి తేరుకోగలిగితే అక్కడే ఏదైనా కోచింగ్ సెంటర్‌లో జేరతాను... లేదా ఇంట్లో కూర్చొని చదవటమే... ఫలితమంటావా దైవాధీనం!... అమ్మ కూడా ఎట్టి పరిస్థితులలోనూ నన్ను ఇక్కడ ఉండనీయదు... నాకూ ఉండాలనిలేదు!"

నివేదిత నాంపల్లి స్టేషన్‌లో రైలు దిగినప్పటినుండీ జరిగిన ప్రతివిషయాన్నీ ఆమె చెప్పినట్లుగా జగన్నాథం రికార్డ్ చేయించాడు. తరువాత ఫోరెన్సిక్ ల్యాబ్‌కి డిఎన్ఏ పరీక్షకుగానూ రక్తం శ్యాంపిల్స్ ఇవ్వటానికి ఇద్దరినీ పంపించాడు.

రాత్రి ఎయిర్‌పోర్ట్‌నుంచి నిర్మలకు ఆమె భర్తకు సెండాఫ్ ఇచ్చి అందరూ ఇంటికి వచ్చేటప్పటికి పదకొండు దాటింది. మరునాడు ఉదయం ఢిల్లీ ఫ్లయిట్‌కు నిర్మల అన్నయ్య, వదినా వెళ్ళాలని నిర్ణయించుకున్నారు.

భోజనంచేసి మంచంమీదకు జేరేటప్పటికి పన్నెండు గంటలు. అప్పుడు అపరంజి సెల్ రింగయింది. చేసింది బావ సుధీర్.

"అంజీ!"

"చెప్పు... ఇప్పుడు మంచి మూడ్‌లో వున్నాను... మా స్నేహితురాలు సేఫ్‌గా దొరికింది!" అన్నది తేలిగ్గా నవ్వేస్తూ.

"అదిగాదే... మీ మామ అంత పెద్ద బ్రెయినున్న లాయరు గదా. అన్ని కోర్టులలోనూ సింహంలా గర్జించి కేసులు గెలుస్తుంటాడే... నాన్నా! మా పెళ్ళిసంగతేమిటి... నాకూ వయస్సు వచ్చింది, వీలయినంత త్వరగా నీ స్వంత చెల్లెలు కూతుర్ని నా జీవితభాగస్వామినిగా చేసుకొని లైఫ్‌లో సెటిల్ అవుదామని అనుకుంటున్నాను అని సిగ్గు విడిచి నువ్వు అడగమన్నావుకదా అని ఆయన ముందు

ఒక ఏడ్పు ఏడ్చాను... వెంటనే ఆయన కళ్ళజోడు పైనుంచి నన్ను చూస్తూ- పోయి మీ అమ్మనడగరాదుటరా అన్నాడు... అదేమిటి నిర్ణయం తీసుకోవాల్సింది ఆయనా, ఆమెనా?" అన్నాడు గొంతు తగ్గించి.

అపరంజి పకపకా నవ్వింది. "పెళ్ళామంటూ ఒకతె ఉంటే మగవాడికి నోరు పెగలదులేగాని ఆయన ముందు ఏడవటం దేనికి... నవ్వుతూ అడిగితే ఒప్పుకుండేవాడేమోగదా!" అన్నది కాస్తంత ఎగతాళిని మాటల్లో రంగరించి.

"ఏమో... ఆయనముందు ఆ మాట ఎత్తటానికే నాకు భయమేసింది... అది సరేగాని రేపు నా గతీ అంతేనా, అంజీ?" అన్నాడు నీరసంగా.

"చూద్దాం... రేపటి సంగతి రేపే!" అన్నది ముసిముసి నవ్వులతో.

"సరేనమ్మా! అమ్మముందూ ఏడ్చాను... ఆమె ఒకసారి మూతి తిప్పేసి ఊరుకున్నదేగాని సమాధానం చెప్పదే... ఇక నావల్లకాదుగాని... నువ్వే మీ నాన్న ముందు, మీ అమ్మ ముందు, మీ ఆత్తయ్యముందు ఏడ్చి ఆ లాగ్నాలేవో తొందరగా పెట్టించు!"

"నేను ఎవ్వరిముందూ ఏడవను... అవునూ ఏమిటి నీ హడావుడి... నా చదువు పూర్తికానివ్వవా... అసలు నువ్వు అమెరికాలో ఎన్నాళ్ళు ఉండటానికి వెళుతున్నావ్?"

"నెలన్నారు... అది నెలవుతుందో ఆరునెలలు అవుతుందో నాకేం తెలుసు!"

"ఓ సంవత్సరంపాటు ఉండిరా... రోజూ నాకీగోల తప్పుతుంది... అప్పటికి నా చదువూ పూర్తవుతుంది!"

"అప్పుడు మనం పర్మనెంట్‌గా అమెరికా వెళ్ళిపోతే ఎట్లావుంటుందంటావ్?"

"నేను సరే అన్నా మీ అమ్మా నాన్నా ఒప్పుకుంటారా?... ఒక్కగానొక్క ముద్దులకొడుకువి!"

"మీవాళ్ళకు మాత్రం నువ్వా ఒక్కదానివేకదా!"

"అందుకే నీ ఆ బోడి ఆలోచనలకు మంగళంపాడి బుద్ధిగా వుండు!"

"కనుక అదిరా సంగతి... నా లైన్‌లోకి వస్తున్నావ్... మనకు ఎలాగూ ఆ అదృష్టం లేదుగనుక వెంటనే ఓ నెలరోజుల పాటయినా అక్కడ హనీమూన్‌లా తిరిగొద్దామనేది నా కోరిక!"

"నువ్వా ఆఫీసు పనిమీద వెళుతున్నావ్... రోజంతా గొడ్డుచాకిరీ చేసి డీలాపడి నువ్వు గదిలో జేరేదాకా నేను ఒంటరి పక్షిలా నీకోసం రెండు కళ్ళూ వాచేలా ఎదురు చూస్తూ కూర్చోవాలి... అదా హనీమూన్ అంటే... ఏం తెలివి బావా నీది!"

"ఇక అది అయ్యే పని కాదుగాని వదిలేయ్.. అసలు సమస్య గురించి ఆలోచించు... మా పెళ్ళెప్పుడూ అంటే– మీ అత్త ముఖం చిట్లించి మూతి తిప్పటమే నన్ను తికమకపెడుతోంది!"

"తిప్పనీయ్! మనం రిజిస్ట్రారాఫీసులో సంతకాల పెళ్ళి చేసుకొని, మెళ్ళో పూలదండలతో వెళ్ళి పాదాలకు నమస్కరిస్తే, ఆమె ఐసయిపోయి ముఖం చేటంత చేసుకొని, వడివడిగా వంట ఇంట్లోకి వెళ్ళి ఎర్రనీళ్ళు తెచ్చి మనిద్దరికీ తిప్పి లోపలకు తీసుకువెళుతుంది... ఆపైన నాన్నా, బుజ్జిముండా, అమెరికా సంగతి మరిచిపోయి ఇక్కడే చేస్తున్న ఉద్యోగం చక్కగా చేసుకుంటూ మంచి పేరు తెచ్చుకొని బ్రతుకూ... కాదంటావా నువ్వే ఓ చిన్న కంపెనీ ప్రారంభించి, దానికి ఎమ్డీనంటూ వాకిట్లో బోర్డుపెట్టుకొని నా కళ్ళముందే ఉండరా అంటూ దీవించేస్తుంది!" అన్నది అతడిని కవ్విస్తూ.

"ఏమన్నావ్... ఏమన్నావ్... నేనంత పనికిరాని వాడిలా కనబడుతున్నాననా నీ ఉద్దేశ్యం?"

"నా ఉద్దేశ్యం కాదయ్యా మగడా... మీ అమ్మ దీవనను గురించి చెబుతున్నాను... అంతే!"

మరునాడు సాయంత్రం విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో అపరంజి వైజాగ్‌కు బయల్దేరింది.

* * *

ఉదయం ఎనిమిది గంటలయింది హైదరాబాద్‌నుంచి వచ్చిన విశాఖ ఎక్స్‌ప్రెస్ వాల్తేర్ స్టేషన్‌లో మొదటి ప్లాట్‌ఫాం మీద ఆగేటప్పటికి.

దిగేందుకు పెట్టె తీసుకొని తలుపు దగ్గరకు వచ్చిన అపరంజిని క్రింద నిల్చొని వున్న సుధీర్ చూస్తూనే, "చెయ్యి ఇస్తావా... చేతిలో పెట్టె ఇస్తావా?" అన్నాడు.

ఆ మాట వింటూనే ఉలిక్కిపడ్డట్లుగా అతడి వంక చూచింది. అతడు స్టేషన్‌కు వస్తాడని ఆమె అనుకోలేదు.

పది రోజుల తరువాత మొట్టమొదటిసారిగా అతడిని చూస్తుంటే ఆమె మనస్సంతా ప్రఫుల్లమయింది. కళ్ళు విశాలమయినయి. ఆనందంతో పెదవులు విచ్చుకున్నయి.

"చేయి ఇవ్వటమంటే అర్థం తెలుసా?" అన్నది కొంటెగా నవ్వుతూ పెట్టెలోనుంచి దిగకుండానే. ఒక్కసారి తలతిప్పి వెనక్కు చూచింది. ఎవ్వరూ లేరు.

"నీ బోడి ప్రశ్నలకు నా దగ్గర తయారుగా సమాధానాలుండవుగాని ముందు ఆ పెట్టె ఇచ్చి, నా చేయి పట్టుకొని దిగి... బయట కారులో కూర్చున్న తరువాత చెరో డబ్బా ఎనర్జీ డ్రింకు త్రాగి, అప్పుడు ఏం చెప్పాలో బుర్రకు పదును పెడతాను!"

"మా బావ బంగారు కొండ!" అన్నది మురిపెంగా అతడు పట్టుకున్న చేతిమీద గిల్లుతూ.

"అపరంజి అంటే పది వన్నెల బంగారంట కదా... నువ్వే ఎప్పుడో చెప్పినట్లు గుర్తు!" అన్నాడు అతడూ నవ్వుతూ.

ఇద్దరూ స్టేషన్ బయటకు వచ్చి పార్కింగ్‌లో వున్న కారు దగ్గరకు వెళ్ళారు. సూట్కేసును డిక్కీలో పడేసి ముందు సీట్లో అతడి పక్కన కూర్చున్నది అపరంజి.

"స్టేషన్‌కు వస్తున్నానని ఫోన్ చేయలేదేం?"

"సర్ప్రైజ్ చేద్దామని!" కారు స్టార్టుచేస్తూ అన్నాడు. "ఏదైనా హోటల్లో కాసేపు కూర్చుందామా చక్కటి టిఫెన్ కొట్టేస్తూ!"

"హోటల్లో ఏం తిన్నానని తెలిసినా మీ అత్త నాబుర్ర తినటం ఖాయం!"

"అవునే!" స్టేషన్‌ముందునుంచి కారు బయటకు వచ్చి అంతగా రద్దీలేని రోడ్డుమీద పోతున్నది. "మీ అత్తకు తలతిక్క ఉన్నదేమిటే ఏదో కొత్త థీరీ బయటకు తీసింది..."

"అమ్మ కడుపు చల్లగా హాయిగా బ్రతుకుతున్నావ్... పెద్దవాళ్ళను అనవలసిన మాటలేనా అవి!"

"తల్లులకు పిల్లలమీద ప్రేమ ఉండవచ్చుగాని... అది వాళ్ళ కోరికలను బలిచేసేలా ఉండగూడదు!"

"నిన్ను చంపేంత కొత్త థీరీ బయటకేం తీసిందేం?" అన్నది వింతగా అతడి ముఖంలోకే చూస్తూ.

"పెద్దచదువులే చదివావుగా... రక్తసంబంధీకులను చేసుకుంటే పుట్టేపిల్లలు అవకతవకలుగా పుడతారనే విషయం నీకు తెలియదా అంటూ నానెత్తిన ఒకటి మొట్టి అక్కడనుంచి విసవిసా వెళ్ళిపోయింది, రాత్రి నేనామాట మరోసారి ఎత్తితే!" ఒక్కక్షణం ముభావంగా ఉండి, "ఏమిటో ఆమె గోల నాకు అర్థం కావటంలేదు!" అన్నాడు.

"నువ్వు సీరియస్‌గా చెబుతున్నావా... నన్ను ఏడిపించటానికి జోకేస్తున్నావా?" అన్నది విసురుగా అపరంజి అతడి చేతిమీద చేయివేస్తూ.

"నేను చాలా సీరియస్‌గానే చెబుతున్నానే తల్లీ!"

"తల్లీ లేదు అమ్మా లేదు... ముందు ఏదైనా గుడిముందు కారు ఆపి రెండు దండలు కొను!" అన్నది విసురుగా అతడివంక చూస్తూ.

సుధీర్ పకపకా నవ్వుతూ కారు స్పీడు పెంచాడు.

* * *

మూడు రోజుల తరువాత సాయంత్రం ఐదు గంటలప్పుడు– అపరంజి తన గది తలుపులు మూసేసి బావ తలపులతో మనస్సునంతా మత్తెక్కించుకుంటూ మంచం మీద పడుకొని వున్నది. ఆన్ చేసివున్న ఏసీ సుగంధపరిమళమైన వాసనలు వెదజల్లుతూ ఆమెకు మరింత మత్తును కలిగిస్తోంది.

'స్వాములవారు ఇప్పుడేం జేస్తున్నారో!' మురిపెంగా అనుకుంటూ సెల్‌ను చేతిలోకి తీసుకున్నది బావకు ఫోన్ చేసేటందుకు.

సరిగ్గా అప్పుడే దాంట్లో ఒక కాల్ వచ్చింది. కొత్త నంబరు. ఎవరా అనుకుంటూ ఆన్ చేసింది.

"అక్కా! నేను నివేదితను... కొత్త సెల్ తీసుకున్నాను... దీన్ని కొన్న తరువాత ముందుగా కోల్‌కతా కాళీ టెంపుల్‌కు కాల్ చేశాను... రెండోది నీకే... ఈ నంబరు సేవ్ చేసుకో!"

"థాంక్యూ! ఎలావున్నావ్... పూర్తిగా కోలుకున్నట్లేనా?" అన్నది సంతోషంగా. తను విశాఖపట్నం వచ్చినప్పటినుంచీ చేయాలని. కానీ, నివేదిత నంబరు లేకపోవటంతో ఆమె కాల్ కోసం రోజూ ఆత్రంగా ఎదురుచూస్తోంది.

"ఫరవాలేదు... మామూలుగానే ఉన్నాను!"

"పుస్తకాలు తెరిచావా?"

''ఇంకాలేదు... చదువుదామా, వద్దా అనే సందిగ్ధత పుస్తకాలను తెరవనీయటంలేదు!"

"అదేం?"

"సివిల్స్ అనుకుంటేనే ఆలోచనలు హైదరాబాద్‌కు వెళ్ళిపోయి మనస్సునంతా గజిబిజి చేస్తున్నయి!" ఆమెనుండి ఓ పేలవపు నవ్వు వెలువడింది.

"నువ్వు తప్పకుండా చదవగలుగుతావు... పుస్తకాలు తెరిచింతరువాత రెండుమూడు

రోజులు ఇబ్బందిగా వుండవచ్చేమోగాని తరువాత నిన్ను అవే మరో ప్రపంచంలోకి తీసుకు వెళ్ళిపోతయ్యనేది ఖాయం... ఖాళీగా కూర్చుంటేనే వెధవ ఆలోచనలు దెయ్యాల్లా ముసురుకొని జూలు విదిలించేది... పుస్తకాలతో కుస్తీ పట్టటమో, స్నేహితులతో గడపటమో... ఏదో ఒకటి చేస్తూనే ఉండు!"

"నేను విజయవాడలో చదువుకుని వున్నట్లయితే స్నేహితురాళ్ళు ఉండేవాళ్ళు... నేను ఎక్కువ చదివింది కొల్‌కతాలోనే... ఆరు నెలలే కదా అయింది మేం ఇక్కడకు వచ్చి!"

"అయితే అక్కడే ఏదైనా సెంటర్‌లో జేరిపోతే వాళ్ళ కోచింగ్ ఎలా వున్నా సివిల్స్‌కు ప్రిపేరు అవుతున్న మిగతా వాళ్ళతో పరిచయాలు ఏర్పడతయి... వాళ్ళు సామాన్యంగా తెలివిగలవాళ్ళు, మంచివాళ్ళే వుంటారు... !" అన్నది ఎంతో చనువుగా సలహా రూపంలో.

"అలాగే అక్కా!"

కొద్ది క్షణాలు నిశ్శబ్దమావరించింది వాళ్ళిద్దరి నడుమా.

"మన బ్లడ్ రిపోర్టు త్వరలోనే రావచ్చు!" అన్నది అపరంజి.

నివేదిత ఆ మాట వింటూనే దిగులుగా నిట్టూర్పు విడిచింది– ఆ రిపోర్టు ఎలాంటి విస్ఫోటనాన్ని కలిగిస్తుందోనన్నంతా భయంగా మూలిగింది. "ఫలితం మనిద్దరిమధ్యే వుంటే ప్రశాంతంగా వుంటుంది!" అన్నది చిన్నగా.

"డోంట్ వర్రీ... అది నిన్నెంత ఇబ్బంది పెడుతుందో నన్నూ అంత ఇబ్బంది పెడుతుంది... కానీ నిజాన్ని తెలుసుకోవటం మన భవిష్యత్తుకు ఎంతో అవసరమని నా ఉద్దేశ్యం!"

"నేను నువ్వేం చెప్పినా కాదనను అక్కా!"

"థాంక్యూ!... అలాగే మనం అనుకున్నది కూడా మరొకటి వున్నది... మనం పుట్టిన ఆసుపత్రులనుండి సర్టిఫికెట్లు తీసుకోవటం... మన పెద్దవాళ్ళకు అనుమానం

రాకుండా– ఎప్పటికైనా జీవితంలో అమెరికాలో స్థిరనివాసం ఏర్పరుచుకోవాలంటే గ్రీన్‌కార్డు పొందటానికి అది ఎంతో అవసరమని వాళ్ళకు నచ్చచెప్పటమే! ఇప్పటికే ఇరవై రెండు సంవత్సరాలు గడిచిపోయినయి... తరువాత తరువాత అంటే అది దొరకటం కష్టమవుతుంది కనుక ఇప్పుడు ప్రయత్నించి తీసుకొని జాగ్రత్త చేసుకోవటమే ఎంతో మంచిది అంటూ కన్విన్స్ చేయాలి!... నా ఆదుర్దాకి ముఖ్యకారణం మన పోలికలే కాదు... పుట్టిన తేదీలూ ఒకటవ్వటమే... అదే చాలా విచిత్రంగా వున్నది... నేనూ రేపు మా అమ్మను అడుగుతాను... నా భయమల్లా ఇన్ని సంవత్సరాల తరువాత ఆ ఆసుపత్రి వాళ్ళు ఆ సర్టిఫికెట్‌ను ఇవ్వ గలుగుతారా అని... చూద్దాం... ప్రయత్నం చేయటంలో తప్పులేదుకదా!"

"ఓకే అక్కా! నేనూ మమ్మీని అడుగుతాను... నేను పుట్టింది కోల్‌కతాలోనే... అక్కడ డాడీకి తెలిసినవాళ్ళు చాలామంది వున్నారు... వాళ్ళద్వారా తెప్పించమని చెబుతాను!"

"గుడ్!... మనం ఏపని చేసినా మరొకరికి అనుమానం రాగూడదు... అవునూ నువ్వు రాత్రిళ్ళు సామాన్యంగా ఎన్నింటికి పడుకుంటావ్?"

"పది దాటుతుంది!"

"నీ గదిలో నువ్వొక్కదానివే కదా పడుకునేది!"

"అవును!"

"నేను ఎప్పుడు ఫోన్ చేసినా రాత్రి పదిన్నర తరువాతే చేస్తాను... ఓకేనా?"

"ఓకే... నేనూ అప్పుడే చేస్తాను!"

"బై!"

ఆఫ్ చేసి నివేదిత చేసిన నంబరును సెల్‌లో సేవ్‌చేసుకున్నది అపరంజి.

* * *

మరునాడు ఉదయం టిఫెన్ చేస్తున్నప్పుడు అపరంజి తల్లినడిగింది, “అమ్మా! నేనెక్కడ పుట్టానే?” అంటూ.

రుక్మిణి కూతురువంక విచిత్రంగా చూచింది. “ఇప్పుడు దాని అవసరం ఏమొచ్చింది నీకు?”

“బావ అమెరికా వెళ్ళే ఆలోచనలో ఉన్నాడు!” అన్నది తలవంచుకొని.

“అయితే?”

“అక్కడే సెటిల్ అయినా అవ్వవచ్చు!”

“వాడు సెటిల్ అయితే నీ పుట్టిన వివరాలు దేనికి?” అన్నది భృకుటి ముడివేసి ఆమె.

“మరీ ట్యూబ్‌లైట్‌లా అయిపోతావేం... బావ వెళితే నేను వెళ్ళనా?”

“నువ్వూ వాడూ కట్టకట్టుకు పోయి అక్కడ శాశ్వతంగా ఉంటామూ అంటే నేనూ మా అన్నయ్యా చేతులు ముడుచుకు కూర్చోవాలా ఇక్కడ!”

“మీరూ రండి!”

“అది అయ్యే పని కాదులే!”

“ఓకే అమ్మా! వెళతామూ, వెళ్ళమూ... అది తరువాత సంగతి... ఎప్పటికయనే అక్కడికి వెళితే గిళితే గ్రీన్ కార్డు పొందాలీ అంటే మేం పుట్టిన ఆసుపత్రినుంచి సర్టిఫికెట్ కావాలిట... మొన్న మాటల్లో నిర్మల అంది అక్కడ పర్మినెంటుగా సెటిల్ అవ్వాలీ అనుకుంటే మాత్రం ఆ కాగితాలన్నీ మనం తయారుగా పెట్టుకోవాలి అని... తనయితే చాలా ఇబ్బంది పడిందట వాటికోసం... ఇప్పటికే ఇరవై దాటామా... ఇంకో పదేళ్ళకో పదిహేనేళ్ళకో అలాంటి అవసరం పడిందే అనుకో అంత పాతరికార్డులు ఆ ఆసుపత్రివాళ్ళు లేవూ అన్నారంటే ప్రత్యామ్నాయాల కోసం తిప్పలు పడాలి... ఇప్పుడు శెలవలే కాబట్టి వాళ్ళు ఆ పాత రికార్డులు తీయటానికి ఎన్నిసార్లు తిప్పినా

ఓపిగ్గా వెళ్ళి సాధించుకు రాగలుగుతాను!"

"మీ బావ అమెరికా వెళ్ళటానికి మా అన్నయ్య, వదిన ఏమాత్రం ఒప్పుకోరు... వాడు వెళ్ళడు!"

"మీరు ఒప్పుకోకపోతే నేను మాత్రం వెళతానా, నేనూ వెళ్ళను... కానీ అవసరం పడ్డప్పుడు పరుగెత్తేదానికంటే ఇప్పుడు తీసుకొని అట్టిపెట్టుకోవటంలో నష్టంలేదుకదా... అవసరమొస్తే ఉపయోగించుకుంటాం... లేకపోతే లేదు!"

"సరే! నీ ఇష్టం తల్లీ... చూస్తున్నాను కదా నీకు ఒకళ్ళు చెబితే వినే అలవాటు ఎప్పుడూ లేదు... ఎంత అనుకుంటే అంతే... నువ్వు అనకాపల్లిలో సుశ్మితా నర్సింగ్ హోంలో పుట్టావు... నాన్నకు చెబితే తెప్పిస్తారులే!"

"మనది మొదటినుంచీ విశాఖపట్టణమే కదా... అక్కడెందుకు పుట్టాను?"

"మీ తాతయ్యా వాళ్ళు అప్పుడు అక్కడుండేవాళ్ళు... అందుకని డెలివరీకి నన్ను అనకాపల్లి తీసుకువెళ్ళారు!"

అపరంజి మనస్సు ఎంతగానో తేలికపడింది. అమ్మ అంత ఖచ్చితంగా చెబుతున్నదీ అంటే తన పుట్టుక విషయంలో ఎలాంటి అనుమానమూ లేదు!

* * *

శనివారం రాత్రి తొమ్మిదిగంటలప్పుడు హైదరాబాద్‌నుంచి ఏసీపీ జగన్నాథం అపరంజికి ఫోన్ చేశాడు.

"నమస్తే అంకుల్!"

"నువ్వు ఇప్పుడు ఎక్కడున్నావ్?"

"మా మేడమీద కూర్చొని మ్యాగజైన్ చదువుకుంటున్నాను!"

"నీ పక్కన ఎవ్వరూ లేరుగదా?"

"లేరు అంకుల్!"

"అయితే మనం రహస్యాలు మాట్లాడుకోవచ్చు అన్నమాట!" ఆయన పెద్దగా నవ్వుతూ అన్నాడు.

"ఫరవాలేదు చెప్పండి అంకుల్... డిఎన్ఏ రిపోర్టు వచ్చిందా?"

"అవునమ్మా... నువ్వు నివేదిత స్వంత అక్కచెల్లెళ్ళే అని నిర్ధారణ అయింది!"

# 10

"మైగాడ్!" ఎక్సయిటింగ్‌గా పెద్దగా అరిచింది ఏసీపీ జగన్నాథం మాటలు వింటూనే అపరంజి. చేతిలోని పుస్తకాన్ని పక్కకు విసిరేసి లేచి నిలబడింది. "అంటే మా ఇద్దరి తల్లిదండ్రులూ ఒకరేనా, అంకుల్?"

ఆయన ఏదో చెప్పటానికి సంశయిస్తున్నట్లుగా కొన్ని క్షణాలు ఆగాడు.

"చెప్పండి అంకుల్!" మరోసారి పెద్దగానే అన్నది. "నిజాలు తెలుసుకోవటానికి నాకూ ఆత్రంగానే వున్నది!"

"నువ్వన్నట్లుగా మీ ఇద్దరి తల్లిదండ్రులూ ఒకరే అవ్వవచ్చు, కాకనూపోవచ్చు... ఖచ్చితంగా ఒకరే అని చెప్పటం కష్టం!"

"అంటే?" ఆయన మాటలు అపరంజికి విచిత్రంగా తోచినయి.

"అంటే..." ఆయన నసుగుతున్నట్లుగా ఆగాడు. "మీ ఇద్దరిలోని జన్యుకణాలను పరీక్షించి మీ జననానికి కారణం ఒకరే అని నిర్ధారణ చేయగలిగింది ఫోరెన్సిక్‌ల్యాబ్... అయితే ఇద్దరికీ తల్లిదండ్రులు ఒకరేనా... తల్లి మాత్రమే ఒకరా? తండ్రే ఒకరా లాంటి ప్రశ్నలకు సమాధానాలు కావాలీ అంటే వాళ్ళ రక్తం కూడా తీసుకొని పరీక్షించాల్సి వుంటుంది!"

"అదికాదు అంకుల్... నేను నివేదిత స్వంత అక్కచెల్లెళ్ళమే అయితే మేం ఇద్దరం ట్విన్స్ అన్నమాట... ఇద్దరిదీ పుట్టినతేదీ ఒకటే!... మా ఇద్దరికీ తల్లి ఒకతయితేనేకదా అది సంభవమయ్యేది!"

"నువ్వు అనేది నిజమే... అయితే నువ్వు ఫిజియాలజీ గనుక చదివివుంటే నేను చెప్పేది తేలిగ్గా అర్థమవుతుంది అపరంజీ! అందులో చెప్పిందేమిటంటే- పురుషుడినుండి వెలువడే అనేక వేల శుక్రకణాలల్లో ఒకటి మాత్రమే స్త్రీ అండకణాన్ని ఫలదీకరణ చేస్తుంది... అలా ఫలదీకరణమయినప్పుడు ఆ స్త్రీ గర్భధారణ చేస్తుంది. ఒక్కొక్కసారి- అదీ అరుదుగానే అనుకో- ఆ అండకణం రెండుగా చీలే అవకాశముంది. అప్పుడు ఇద్దరు, మూడుగా చీలితే ముగ్గురు, నాలుగయితే నలుగురు జన్మిస్తారు ఆ స్త్రీకి... ఒకేకాన్పులో ఎంతమంది పుట్టినా ఒక శుక్రకణమే కారణమవుతుందిగాని, వేరువేరు శుక్రకణాలు కావు... స్త్రీకి ఒక మగవాడిద్వారానే అది జరుగుతుంది కనుక ఎవ్వరినీ అనుమానించాల్సిన అవసరం లేదు!"

అపరంజి ఆయన మాటల్ని అతి జాగ్రత్తగా వింటున్నది.

"మీ ఇద్దరూ ట్విన్సే అయితే నీ తల్లిదండ్రులో, నివేదిత తల్లిదండ్రులో ఒకరే మీ అసలు తల్లిదండ్రులవుతారు!"

అపరంజి తల వాల్చేసింది.

"అంటే...?"

ఆయన మాటలు వింటుంటే అపరంజికి నోరు పెగలటంలేదు. శరీరమంతా బిగుసుకుపోయింది.

ఆ రాత్రి ఆమెకు నిద్రలేదు.

* * *

ముందు అనకాపల్లి వెళ్ళి ఆసుపత్రిలో తన జనన వివరాలు తెలుసుకుంటేనేగాని ఈ మిస్టరీకి తెరపడదు!

అనకాపల్లి అక్కడకు దగ్గరే. మహా అయితే ముప్పావుగంట ప్రయాణం. నలభై కిలోమీటర్ల దూరంలో వున్నది.

తను వెళతానంటే అమ్మ అరిచింది. "నాన్న ఎవరో ఒకర్ని పంపి తెప్పిస్తారు ఎందుకంత తొందర... రేపే అమెరికా వెళుతున్నట్లుగా మాట్లాడతావేం!" అంటూ.

తనేం సమాధానం చెప్పగలదు. వేలికేస్తే కాలికి, కాలికేస్తే వేలికీ మెలిక వేయటంలో మహా దిట్ట. అన్నగారి లాయర్ తెలివి ఆమెకూ కొంత అంటుకున్నట్లే అనిపిస్తుంది. అంతిమంగా తన మాటే నెగ్గాలంటుంది ఆయనలాగానే.

కాదూగూడదు అని తను బయల్దేరినా ఇక బావగారున్నారు- ఇంత పెద్ద మగవాడిని ఇక్కడ నేనుండగా ఆ వెధవ బోడి సర్టిఫికెట్టుకోసం ఆడకూతురివి నువ్వే వెళ్ళాలా అంటూ తయారవుతాడు.

ఆయనగారిని తీసుకు వెళ్ళటమంటే విశాఖపట్నమొక్కటే కాదు రాష్ట్ర రాజధానిదాకా టాంటాం కొట్టేస్తాడు- తను ఇరవై సంవత్సరాల క్రితపు ఆ సర్టిఫికెట్టును ఎంత చాకచక్యంగా తెచ్చిందీ వివరిస్తూ!

తనే దీన్ని రహస్యంగా తీసుకురావాలి. ఆ ఆసుపత్రిలోనైనా తెలుస్తుందేమో- అమ్మకు ఆ సమయంలో ఇద్దరు ఆడపిల్లలు పుట్టారా, ఒక్కరే పుట్టారా అన్న విషయం!

ఆమె ఏం చేయాలా అని ఆలోచిస్తున్న సమయంలోనే ఆమెకో చక్కటి అవకాశం చేతికంది వచ్చింది. ఆరాత్రి అనకాపల్లినుంచి ఫోన్ వచ్చింది. చేసింది తనతో కలిసి యూనివర్శిటీలో చదువుకున్న సుజాత- తనకు సుజీ!

"చెప్పవే... ఏంటి అసలు నువ్వు విశాఖపట్నం వైపుకే రావటం లేదా లేక వచ్చీ నన్ను చూడకుండానే వెళ్ళిపోతున్నావా?"

"ఈమధ్య రాలేదులే అటు... వస్తే నీకు కనబడకుండా ఎట్లా వెళతాను... నువ్వు రేప్పొద్దున్నే బయల్దేరి ఇక్కడకు రావాలి!"

"దేనికి తల్లీ!"

"వచ్చిం తరువాత చెప్పకూడదా?"

అప్పుడు రాత్రి ఎనిమిది గంటలయింది.

"అంటే నన్ను పన్నెండు గంటలు సస్పెన్స్‌తో చంపాలనా నీ ఉద్దేశ్యం?" అన్నది అరుస్తున్నట్లుగా.

"ముందు చెప్పలేదని కోప్పడకు గాని... రేపు ఉదయం పది గంటలకు నా ఎంగేజ్‌మెంటు!"

"చెప్పవేం మరి...!" ఎక్సయిటింగ్‌గా అరిచింది. "సాయంత్రమే చెబితే ఈపాటికి అక్కడ వాలేదాన్నికదా... అభినందనలు... కంగ్రాచులేషన్స్... ఎన్నింటికన్నావ్?"

"పదింటికి!"

"అయితే... ఎనిమిదింటికల్లా మీ ఇంట్లో వుంటాను!" అన్నది సంతోషంగా.

తండ్రిని ఎలాగో తిప్పలు పడమని తను కారు తీసుకువెళితే సరి!

"ఇంతకీ నీ హీరో ఎక్కడివాడు... ఎక్కడుంటాడు... ఏం చేస్తుంటాడు... నీ మాట వినేవాడేనా?" ప్రశ్నల వర్షం కురిపించింది.

"ఇప్పుడు అందరికీ గమ్యం, స్వర్గం- అన్నీ అమెరికానే కదా... రెండేళ్ళబట్టి అక్కడే సాఫ్ట్‌వేర్‌లో పనిచేస్తున్నాడు... మాకు కాస్త దూరపుబంధువేలే...!" ఒక్కక్షణమాగి, పకపకా నవ్వుతూ, "వాళ్ళనాన్న వాళ్ళ అమ్మ గీచిన గీటు దాటడుట అని మా బంధువులంతా చెవులు కొరుక్కుంటుండగా విన్నాను... మరి తండ్రి పోలికలే వస్తే..." సాగదీస్తూ ఆగిపోయింది.

"అంటే డబుల్ కంగ్రాచ్యులేషన్స్ చెప్పాలన్నమాట!" అపరంజీ పకపకా నవ్వింది.

కాగలకార్యం గంధర్వులే తీరుస్తారు అన్నట్లుగా అవకాశం చేతికంది రావటంతో అపరంజికి హుషారు వచ్చింది. ఇప్పుడు అమ్మ ఎలాంటి అభ్యంతరాలూ చెప్పదు. తనకూ, సుజాతకు వున్న స్నేహం ఆమెకూ తెలుసు!

వెంటనే తండ్రికి ఆ విషయం చెప్పి- తనకు అనకాపల్లి వెళ్ళటానికి రేపు రోజంతా

కారు కావాలని కూడా ఓ మాట అన్నది. ఆయనకు అపరంజి ముద్దుల కూతురు మరి– కాదనలేకపోయాడు...

అమ్మ అంత కచ్చితంగా ఆ హాస్పిటల్ సంగతి చెప్పినప్పుడు తనకు ఆమే తల్లి అనటంలో ఎలాంటి సందేహమూ లేదు. అయితే అప్పుడు నివేదిత కూడా తన తల్లికే పుట్టిందా? మరి ఆ అమ్మాయి కోల్‌కతాలో పుట్టానంటున్నది?

అన్నీ అనుమానాలే... సరైన సమాధానం దొరకటం లేదు... కానీ ఈ మిస్టరీని ఛేజించక తప్పదు!

రాత్రి ఎన్నో ఆలోచనల నడుమ ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు. అనకాపల్లి వెళ్ళేందుకుగాను సెల్‌లో అయిదున్నరకు అలారం పెట్టుకోవడంతో అది మ్రోగగానే లేచి కూర్చున్నది. ఏడింటికన్నా బయల్దేరితే ఎనిమిదింటికల్లా సుజాత ముందు ఉండగలుగుతుంది. సరిగ్గా అరున్నరకు స్నానానికి వెళ్దామని వార్డ్‌రోబ్‌లోనుంచి గుడ్డలు తీస్తుండగా సెల్ మ్రోగింది. చేసింది సుధీర్!

పొద్దున్నే ఈయనగారి గోల ఏమిటో అనుకుంటూ ఆన్ చేసింది.

“అంజీ! అనకాపల్లి వెళుతున్నావటగా... అత్తయ్య ఫోన్ చేసింది... నన్ను నీకు తోడెళ్ళమన్నది... ఆమెకు ఒంటరిగా తన కూతురిని పంపటం ఇష్టంలేదు... ఏం చేస్తాను మరి కాదనలేకపోయాను... నేను ఓ గంటలో నా కారు తీసుకు వస్తున్నానుగాని రెడీగా వుండు...” గడగడా చెప్పుకు పోతున్నాడు.

చేతిలో సెల్ అట్లాగే పెట్టుకొని నుదుట టపటపా కొట్టుకోసాగింది శబ్దమయ్యేలా.

“ఏమైందే?”

“బాగా తల వేడెక్కిపోతేను చల్లబరుచుకుంటున్నానుగాని... మీ అత్తమాట వినకపోతే నానా రభస చేసేస్తుంది... నేనేం చిన్నపిల్లనా... స్వంత కారులో వెళు తున్నాను... మా డ్రైవరుంటాడు... భయమేమిటి... నీ పనులన్నీ వదిలేసుకుని ఆమె నిన్ను నాకు ఎస్కార్ట్‌గా వెళ్ళమనటం, నువ్వు బుర్రూపటం చాలా బాగుంది...

ఎందుకొచ్చిన గొడవకాని, నేను తయారవుతున్నాను త్వరగా వచ్చేసేయ్!" చికాకుపడుతూ ఫోన్ ఆఫ్ చేసింది. 'ఈ హాస్పిటల్ సంగతి మరో సారి ఎవ్వరికీ చెప్పకుండా వెళ్ళి తేల్చుకోవాలి' అనుకుంటూ, మూడంతా పాడయిపోగా నీరసంగా బాత్రూంలోకి వెళ్ళింది.

ఏడుగంటలప్పుడు మరల సెల్ మ్రోగింది. చేసింది మళ్ళా బావే... అంటే ఇంకొద్ది నిముషాలల్లో ఇక్కడ తయారవుతాడన్నమాట!

"అంజీ! నాకిప్పుడే మా స్నేహితుడొకడు ఫోన్‌చేశాడు... విశాఖలో హైదరాబాద్‌నుంచి వస్తున్నాడట... మళ్ళా రాత్రికి వెళ్ళిపోవాలట... స్టేషన్‌కొచ్చి కలిసి ఈరోజంతా వాడితోటే గడపాలిట... సారీ! ఏమనుకోవద్దు నిన్ను డిజపాయింట్ చేస్తుంటే!"

'మంచికాలం కలిసొస్తే నడిచొచ్చే పిల్లలు పుడతారని ఊరికే రాలేదు సామెత' అని మనస్సులోనే అనుకుంటూ, "సరేలే నువ్వాపనిలో వుండి... సాయంత్రం అక్కడనుంచి రాగానే చాలా జాగ్రత్తగా వెళ్ళొచ్చానని నీకు ఫోన్ చేసి మరీ చెబుతాను!" అన్నది హుషారుగా అపరంజి.

* * *

అపరంజి అనకాపల్లిలో స్నేహితురాలింటిముందు కారు దిగేటప్పటికి ఎనిమిది గంటలయింది. అప్పటికే ఇల్లంతా బంధువలతో కళకళలాడుతోంది. వాకిట్లో తెల్లటి షామియానా వేశారు. కుర్చీలు వేశారు.

కారులోనుంచి దిగుతున్న అపరంజిని కిటికీలోనుంచి చూస్తూనే, సుజాత తన గదిలో కూర్చొని మేకప్ చేయించుకుంటున్నదల్లా, లేచి బయటకు పరుగెత్తుకుంటూ వచ్చింది.

కూతురు హడావుడికి వెనగ్గా వచ్చిన ఆమె తల్లి అపరంజిని చూస్తూనే, "అమ్మయ్య! వచ్చావుగదా!" అన్నది పకపకా నవ్వుతూ. "దానికి పెళ్ళికళ ఇప్పటికి వచ్చింది...

పొద్దుటినుంచి పక్కన నువ్వు లేకపోవటంతో మొహం ముడుచుకు కూర్చుంది!"

సుజాత అపరంజిని తీసుకొని లోపలకు వెళ్ళింది.

ఫంక్షన్ అయ్యేటప్పటికి పన్నెండు. భోజనాలు అయ్యేటప్పటికి రెండు.

పెళ్ళికొడుకు అందంలో సుజాతకు తగ్గట్టుగానే వున్నాడు. మంచి పొడుగరి. అమ్మాయింత బంగారు చాయ కాకపోయినా పచ్చటివాడిక్రిందే లెక్క.

"మన్మథుడే నీ మొగుడు!" అంటూ స్నేహితురాలి బుగ్గలు పట్టుకు సాగదీసింది అపరంజి.

మూడుగంటలప్పుడు స్నేహితురాలికి చెప్పి బయల్దేరింది సుశ్మితా నర్సింగ్‌హోం ఎక్కడున్నదో పట్టుకోవటానికి– మార్కెట్ వీధికి.

అది చాలా తేలిగ్గానే దొరికింది. బెల్లం మార్కెట్ పక్కగా వున్నది. అక్కడకు వెళుతుండగానే బెల్లం వాసన ముక్కుపుటాలను అదరగొట్టేసింది. కలుషిత వాతావరణం స్పష్టంగా కనబడుతోంది. అంత పెద్ద ఆసుపత్రిని దానిపక్కన ఎలా కట్టారా అనుకుంటూ కారు దిగింది. నాలుగు అంతస్తులతో విశాలంగా కట్టి ఉన్నది ఆ ఆసుపత్రి.

ఇరవై రెండు సంవత్సరాల క్రితం తను పుట్టిన ఆ ఆసుపత్రిలో కాలుపెడుతుంటే ఆమెనేదో తెలియని శక్తి ఆవహించినట్లుగా ఉద్రేకం కలిగింది.

ఒక పక్కగా రిసెప్షన్ కౌంటరు. దాని వెనకాల ఓ అందమైన అమ్మాయే కాక మరో ఇద్దరు మగవాళ్ళు. వాళ్ళముందు నిలుచున్న పేషెంట్ల ఇలాకా మనుష్యులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెబుతున్నారు ఓపిగ్గా. ఆ హాల్లోనే ఇంకా చాలామంది గోడవారగావున్న కుర్చీలలో కూర్చొనివున్నారు.

కౌంటర్‌ముందు జనం కాస్త తగ్గినతరువాత అపరంజి వెళ్ళి అక్కడ వున్న అమ్మాయిని, "ఎక్స్యూజ్‌మీ!... నాకో ఇన్ఫర్‌మేషన్ కావాలి... ఎవరిని కాంటాక్ట్ చేయాలో చెప్పగలరా?" అన్నది ముఖమంతా నవ్వును నింపుకుంటూ.

అసలే అందమైన ముఖం. ఆపైన దాన్ని విశాలం చేస్తున్నట్లుగా చిరునవ్వు. కొద్ది క్షణాలపాటు ఆ అమ్మాయి కన్నార్పకుండా అపరంజినే చూస్తూ ఉండిపోయింది.

"చెప్పండి!"

"నేను పందొమ్మిది వందల తొంభైలో ఈ ఆసుపత్రిలోనే పుట్టాను!" అదేదే గర్వకారణంలా కనుబొమ్మలు పైకెత్తి, "అంటే ఇరవై రెండు సంవత్సరాల క్రితం!" రిసెప్షనిస్ట్ వంక చూసింది. "నా బర్త్ సర్టిఫికెట్ కావాలి! ఎవర్ని కాంటాక్టు చేయాలి?"

ఆ అమ్మాయి కొంతసేపు ఆలోచిస్తున్నట్లుగా పెన్ను చివరను పెదవుల కానించుకొని వుండిపోయింది.

"చాలా సంవత్సరాల క్రితంది గదా... దేనికోసం?"

"నేను అమెరికా వెళదామనుకుంటున్నాను... ఎప్పటికయినా గ్రీన్ కార్డ్ కావాలీ అంటే ఆ సర్టిఫికెట్ అవసరముంటుందని ఇప్పటికే అక్కడున్న మా కజిన్ చెప్పింది! ముందుగా జాగ్రత్త పడదామని!"

"ఐసీ... కానీ అంత పాతదీ అంటే ఇప్పుడు ఆ రికార్డులు దొరకటం కష్టమే అవ్వవచ్చు... ఐదు సంవత్సరాల క్రితమే హాస్పిటల్ ఈ మేనేజ్‌మెంట్ చేతిలోకి వచ్చింది... పాతవాళ్ళు రికార్డులన్నీ ఇచ్చారో లేదో తెలియదు... రెండోది మా రికార్డ్‌కీపరు మదర్ చనిపోతే రెండు రోజులక్రితం శ్రీకాకుళం వెళ్ళాడు... అతడుగాని వాటిని గురించిన సరైన సమాచారం ఇవ్వలేడు... పదిహేను రోజులు పడుతుంది అతడు తిరిగి డ్యూటీలో జేరేటప్పటికి..."

"ఆ మనిషి లేకపోతే మరోమనిషి చూడరా?" అపరంజి ముఖంలో కాస్తంత నిరాశ చోటు చేసుకున్నది.

"ఉన్నాడు, చూస్తాడు... ఇప్పటివి అయితే తేలిగ్గా తీయగలుగుతాడుగాని అంత పాతవి అతడివల్ల కాదు...ఒక పనిచేయండి...  మీ డేటాఫ్ బర్త్, మీ తల్లిదండ్రుల పేర్లు రాసిచ్చి పదిహేనురోజుల తరువాత ఫోన్‌చేసి రండి...

అతడు లీవ్‌నుంచి రాగానే నేను వెతికించి సర్టిఫికెట్ తయారుచేయించటానికి ప్రయత్నిస్తాను!" అపరంజి అందం ఆ అమ్మాయిని కళ్ళు తిప్పుకోనీయకుండా వాగ్దానం చేసేలా చేసింది.

అపరంజి నీరసపడిపోయింది. కాని చేసేదేమున్నది ఆ రికార్డ్ కీపర్ వచ్చేటంతవరకూ ఆగక తప్పదు. తను మరోసారి రాకా తప్పదు!

కాగితం తీసుకొని తన పేరుతో సహా వివరాలన్నీ రాసి ఇచ్చింది. ఆ అమ్మాయి వాటిని చూస్తూనే, "ఆ సర్టిఫికెట్‌లో మీ పేరు ఉండదు... మీ తల్లిదండ్రుల పేరు రాస్తూ ఆడపిల్లపుట్టినట్లుగా ఇవ్వగలుగుతాం!" అన్నది.

"ఓకే!" అంటూనే– తన తల్లికి కవలలు పుట్టారేమో చూస్తారా అని అడుగుదామా అని నోటిదాకా వచ్చిందిగాని– కవలలు పుడితే వాళ్ళే రాసిస్తారు– అలా రాయకపోతే ఆ రికార్డుకీపర్నే మరోసారి చూడమని అడగవచ్చు– అనుకుంటూ, హాస్పిటల్ విజిటింగ్ కార్డును ఫోన్ నంబరు కోసం అడిగి తీసుకొని బయటకు వచ్చి కారెక్కింది అపరంజి.

* * *

అనకాపల్లి వెళ్ళివచ్చిన మూడోరోజు రాత్రి నివేదిత ఫోన్ చేసింది.

"చెప్పు చెల్లీ! ఇప్పటికయినా పుస్తకాలు బయటకు తీశావా?"

నివేదిత పకపకా నవ్వింది. "ఇంకాలేదు! మూడ్ రావటం లేదు!"

"నీ నవ్వు నీకు మూడ్ వచ్చినట్లే చెబుతోంది... పుస్తకాలు తెరవకపోవటానికి అది కారణం కాదు!"

"అభికూడా అలాగే అన్నాడు... ఎందుకూ అంటే నాకు సరైన సమాధానం దొరకటంలేదు... ప్రిలిమనరీస్ దగ్గర పడుతున్నా ఇదివరకటి ఉత్సాహం ఏమాత్రం కలగటంలేదు... మా అమ్మా నాన్నా వీళ్ళవునా కాదా అనే ప్రశ్న ఒక వైపు నన్ను వేధిస్తుంటే, నువ్వు నన్ను ముంబయ్ ఉచ్చునుంచి తప్పించకపోతే నా బ్రతుకు ఎలా వుండేదా అనే ప్రశ్న నా మనస్సునంతా కలుషితం చేస్తున్నది... అయిపోయిన

వాటిగురించి ఇంకెందుకు వేదన అనవచ్చు కానీ మనస్సుకు సర్దిచెప్పుకోవటం అంత తేలిగ్గా అయ్యేలా లేదు!"

నివేదిత చెప్పదలుచుకున్నదాన్ని పూర్తిగా చెప్పనిచ్చింది.

"అభి ఎవరు?" కుతూహలంగా అడిగింది. 'బాయ్ ఫ్రెండా?'

"అభి బెనర్జీగారి అబ్బాయి!"

"బెనర్జీ ఎవరు?"

"సాల్ట్‌లేక్‌లో మేమున్న ఇంటి యజమాని... అభి అక్కడే ఎమ్‌బీబీఎస్ చేసి ఓ ప్రైవేట్ నర్సింగ్‌హోంలో డాక్టర్‌గా చేస్తున్నాడు!"

"మీరిద్దరూ మంచి స్నేహితులన్నమాట!"

కిలకిలా నవ్వింది నివేదిత. ఆ నవ్వు అపరంజికి ఎన్నో అర్థాలు చెప్పింది. అతడిగురించి మాటల్లో వస్తేనే అంత ఆహ్లాదపడుతున్నదీ అంటే మామూలు స్నేహితుడే కాదు చాలా దగ్గరవాడు అయివుండాలీ అనుకున్నది.

చాలా చొరవగా, "నీ ఫియాన్సీనా?" అన్నది.

అటునుంచి మరోసారి పూలజల్లులా నవ్వు. "అక్కా! మనిద్దరికీ పరిచయమయి కనీసం నెలయినా కాలేదు... ప్రస్తుతం మనిద్దరి మనస్సుల్లోనూ మనమిద్దరమే ఉన్నాం... ఒకళ్ళకొకళ్ళం మన గత ఇరవైరెండు సంవత్సరాల జీవితాన్ని, ఆ జీవితాన్ని అనుభవించిన మన మనస్సుల్ని తెలుసుకోవాలంటే కొంతకాలం పట్టవచ్చు... అంతేకాదు ఆ జీవితాల్ని ఆస్వాదించటానికి మనం కొన్నాళ్ళు కలిసి గడిపితేనేగాని వాటి అందాలు మనకు తెలియవు... కానీ మనం కలిసి గడపటమూ అంటే మనల్ని పెంచినవాళ్ళ గుండెల్లో విస్ఫోటనాలు కలిగించటమే... జగన్నాథం అంకుల్ చెప్పిన విషయం భయపెడుతోంది... మనం కలిసే అవకాశం వచ్చేంతవరకు ఇంకెన్నో పరిశోధనలు చేయాల్సి వున్నది... అప్పటివరకూ మాట్లాడుకోగలిగేది ఈ సెల్‌ఫోన్లద్వారానే... అప్పుడప్పుడూ గతాన్నీ పంచుకుందాం... ఏమంటావ్ అక్కా!"

ఆ అమ్మాయి మాటల్లో కాస్తంత నిరాశ, భయం, తెలియని దిగులు తొంగిచూస్తున్నయి.

ఆమె మాటలను కాదని తను మాత్రం ఎలా అనగలదు?

"ఇక అభిని గురించి నేనే చెప్పాలి... అభి నాకు ఆత్మీయుడు మాత్రమే... చాలా తెలివిగలవాడు... మృదుస్వభావి... నీ ఫియాన్సీనా అన్న నీ మాటకు నా దగ్గర సమాధానం లేదు... మేం ఇద్దరమూ, ముఖ్యంగా నేను, ఎప్పుడూ ఆ దృష్టితో ఆలోచించనేలేదు!" అన్నది... ఆ మాటలు ఆమె గుండె లోతుల్లోంచి వచ్చినట్లే అనిపించింది అపరంజికి.

"ఐ యామ్ సారీ!" అన్నది తను తొందరపడ్డానా అన్నట్లుగా.

"సారీ దేనికి? మాకు తెలిసిన ఎవరైనా అదే అనుకుంటారు... మేం తరచూ కాళీ టెంపుల్‌కు వెళ్ళేవాళ్ళం... దక్షిణేశ్వర్‌కు వెళ్ళేవాళ్ళం... రామకృష్ణ ధ్యానమందిరంలో గంటలతరబడి ఆ నిశ్శబ్దాన్ని ఆస్వాదిస్తూ కూర్చుండేవాళ్ళం... అక్కడనుంచి హుగ్లీ నదిమీదగా పడవలో వెళ్ళి వివేకానంద మందిరంలో గడిపేవాళ్ళం... గరీహాట్‌లోను, ధరమ్‌తొలాలోను, పార్క్‌స్ట్రీట్‌లోనూ పేవ్‌మెంట్‌మీద దొరికే మంచి పుస్తకాలకోసం వెళ్ళేవాళ్ళం... రాసబేహారీ ఎవెన్యూలో షాపింగ్‌కంటూ తిరిగేవాళ్ళం... వీటన్నిటినడుమా మాకు తెలిసింది ఒక్కటే- స్నేహం!'

అపరంజి కొద్ది'క్షణాలు ఆగింది ఇక ఆ విషయాన్ని అంతటితో ఆపేయాలన్నట్లుగా.

"మనల్ని మనం విపులంగా తెలుసుకోవాలీ అంటే మనకు సాయం చేసేది సెల్‌ఫోన్ ఒక్కటే అన్న నీమాట నిజం... ఓకే!... వీలయినన్ని సార్లు రాత్రిళ్ళు దాన్నే ఆశ్రయిద్దాం...!"

"ష్యూర్!"

అప్పుడు సమయం రాత్రి పన్నెండు గంటలయింది.

* * *

పదిరోజుల తరువాత ఒకరోజు సుజాత ఉన్నట్లుండి విశాఖపట్టణం వచ్చింది. వస్తూనే అపరంజిని తనతోపాటు బజారుకు తీసుకువెళ్ళింది పెళ్ళి గుడ్డలు కొనుక్కోవటానికంటూ.

"ఇంకా నెలరోజుల టైం వున్నది గదే ఇప్పుడే అంత తొందరదేనికి?"

సుజాత నవ్వుతూ, "ఎన్నిసార్లు రావాలో! నాకు కావాల్సినవి, నచ్చినవి నేను కొనుక్కుంటాను... మా ఇంట్లోవాళ్ళకు, బంధువులకీ పెట్టవలసినవి మా అమ్మ కొంటుంది... కొన్ని అనకాపల్లిలోనే తీసుకుంటుందిలే!" అన్నది.

"సరేలే... బాగానే వున్నది... నీ పెళ్ళి చీరలు కొనేటప్పుటు పక్కన నీ ఉడ్‌బీ వుంటే బాగుంటిదిగదా!"

మూతి తిప్పింది సుజాత. "మా అమ్మా అదే గోల! కానీ నాకిష్టంలేదు... నేను కట్టుకుండే చీరలుగాని, డ్రస్సులుగాని నాకిష్టమయినవే నేను కొనుక్కోవాలి గాని, ఎంత మొగుడయితే మాత్రం ఆయనకు నచ్చినవి నేను కొనుక్కొని కట్టుకోవాలా?... నో...!" అన్నది సుజాత. "అలా ఎన్నటికీ నా స్వవిషయాలల్లో ఆయన్ను జోక్యం చేసుకోనీయను!"

"సంబడమే... ఆ మూడుముళ్ళూ పడేంతవరకే ఈ వెధవ కబుర్లు... చూస్తానుగా... నీ గుడ్డలసంగతి వదిలేయ్... అసలు పెళ్ళయిం తరువాత మేం కనబడతామా అని... అంతదాకా ఎందుకు నేనూ మా బాబాయి కూతురు దాని పెళ్ళయ్యేంతవరకూ ఎలా ఉండేవాళ్ళం... ఒకే మంచం ఒకే కంచంలా పెరిగాం... మొన్న పెళ్ళయిం తరువాత మొట్టమొదటిసారిగా అమెరికానుంచి వస్తున్నదిగదా అని హైదరాబాద్ పరుగెత్తుకుంటూ వెళితే ఒక థ్రిల్లు లేదు పాడూ లేదు... ఎప్పుడూ దాని మొగుడు కబుర్లు, అమెరికా స్నేహితుల కబుర్లు... ఎందుకొచ్చానా అనిపించింది!"

"నేను అలా కాదులే!"

"చూద్దాంగా!"

"చూద్దాం కాదు... ప్రామిస్... సరేగాని... శుభలేఖలు ప్రింటింగ్‌కు ఇచ్చాం... త్వరగానే వస్తయి... రాగానే ఫోన్ చేస్తాను నువ్వు రావాలి... మన ఫ్రెండ్సందరి అడ్రసులూ ఫోన్లమీద పట్టుకొని కార్డులు పంపించాలి!" అన్నది సుజాత.

"రేపు సోమవారమే మా కాలేజీ తెరిచేది!" అన్నది నసుగుతున్నట్లుగా. "సరేలే... వస్తాలే!"... ఎలాగూ ఆసుపత్రి వాళ్ళు పదిహేను రోజుల తరువాత రమ్మనమన్నారు బర్త్ సర్టిఫికెట్ కోసం... అమ్మకు ఏవేవో కారణాలు కల్పించి చెప్పకుండా హాయిగా వెళ్ళి అది చెప్పినట్లుగా రెండురోజులుండి తన పనీ చేసుకురావచ్చు!

ఇద్దరూ గుడ్డలు కొనుక్కునేందుకు జగదాంబ సెంటర్‌కు బయల్దేరారు.

* * *

రాత్రి పదిగంటలప్పుడు సెల్ రింగయింది.

చేసింది నివేదిత.

"చెప్పు చెల్లీ!" అన్నది ఉత్సాహంగా. ఆ అమ్మాయితో మాట్లాడటమంటేనే అపరంజికి శరీరంలో తెలియని ఉత్కంఠత ఏర్పడుతుంది.

– అవును! నివేదిత తనతోపాటు రక్తం పంచుకు పుట్టటమే కాదు, తల్లి గర్భంలో తొమ్మిదినెలలు కలిసి ఒకటిగా జీవించింది!

"అభీ ఇప్పుడే ఫోన్ చేశాడు!"

"ఏమని?"

"మనం అనుకున్నాం కదా ఇద్దరం హాస్పిటల్స్‌నుంచి బర్త్ సర్టిఫికెట్లు తెప్పిస్తే మన మిస్టరీ ఏమైనా తేలుతుందేమోనని!"

"చెప్పు... చెప్పు... దొరికిందిటనా సర్టిఫికెట్టు!"

"అదే చెప్పొచ్చేది... అమ్మ చెప్పినదాని ప్రకారం మొదటిసారి నాన్నకు ఆఫీసర్‌గా ప్రమోషన్ వచ్చినప్పుడు కోల్‌కతాకు బదిలీ చేశారు. అప్పుడు మేం తాలిగంజ్‌లో

వుండేవాళ్ళంట... అక్కడకు దగ్గరలో వున్న కాళీఘాట్‌లోని నర్సింగ్‌హోంలో పుట్టానట నేను... అందుకని అభీకి ఆ వివరాలు ఇచ్చి సర్టిఫికెట్ తీసుకోమని చెప్పాను... అతడ ఇప్పుడు అక్కడకు వెళితే తెలిసిందేమిటంటే ఐదు సంవత్సరాల క్రితం ఆ ఆసుపత్రి అగ్నిప్రమాదంలో కాలిపోయిందట... ఇప్పుడు ఆ స్థలంలో కమ్మర్షియల్ కాంప్లెక్స్ ఏదో కట్టారట– ఆ సర్టిఫికెట్ మనకు దొరికే అవకాశం లేదని చెప్పాడు!"

"అయ్యో అలాగా!"

"నీదేమైంది?"

"అనకాపల్లి వెళ్ళి వివరాలు ఇచ్చివచ్చాను... అన్నీ బాగుంటే ఈ వారంలో దొరకవచ్చు!" అన్నది అపరంజి నీరసంగా. "చూద్దాం... ఇరవై రెండు సంవత్సరాల క్రితంది కదా... ఇక్కడా ఆసుపత్రి మేనేజ్‌మెంటు మారింది... పాత రికార్డులు దొరుకతయ్యో లేదో చూడాలి!"

# 11

సమయం రాత్రి తొమ్మిది పైన అరగంటయింది. సుధీర్ అప్పుడే ఇంటికి వచ్చాడు. కొడుకు కోసం తల్లి అన్నం తినకుండా ఎదురు చూస్తూ హాల్లోనే కూర్చున్నది. "ఇంతసేపు ఎక్కడకు వెళ్ళావురా... నాన్న ఇప్పటిదాకా చూసిచూసి భోజనం చేసి పడుకున్నారు!" అన్నది అతడు లోపల కాలు పెడుతుండగానే.

"మున్సిపల్ స్టేడియంలో బుక్ ఎగ్జిబిషన్ పెట్టారమ్మా... అపరంజి పుస్తకాలేవో కొనాలంటేను దాంతోపాటు వెళ్ళాను... మధ్యలో జోరున వాన... అది తగ్గి వచ్చేటప్పటికి ఆలస్యమయింది!"

"కారులోనే వెళ్ళావుగదా... వానొస్తే ఏమయింది?"

"నీకు తెలిసిందేగదా అమ్మా!... వానొచ్చిందంటే విశాఖపట్నంలో రోడ్లమీద పల్లాలన్నీ నీళ్ళమయమయి కారు నడపటం కష్టమవుతుందని... అందుకే వాన

తగ్గిందాకా అక్కడే పుస్తకాలు చూస్తూ ఉండిపోయాం!"

స్నానం చేసి వచ్చి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు సుధీర్. అతడు వచ్చేటప్పటికల్లా ఆమె రెండు కంచాల్లో అన్నీ వడ్డించింది.

భోజనం చేస్తూ, "అమ్మా! నాకొక్క విషయం చెప్పండి... ఎందుకు ప్రతిదీ నానుస్తారు నువ్వూ, నాన్నా... నేనేదో హడావుడి పడుతున్నానని కాదు... నాకూ ఇరవై ఏడు వస్తున్నయి... ఆడపిల్ల తల్లిదండ్రులకూ కాస్త తొందరే వుంటుంది... నాన్నతో అంటే నిన్నడగమంటాడు... నాకే సిగ్గుగా వున్నది నా పెళ్ళి తొందరగా చేయండి అంటూ మిమ్మల్ని పదేపదే అడగటానికి!" సౌమ్యంగానే అన్నా ఆ మాటల్లో అంతర్లీనంగా కాస్తంత చికాకు వున్నది.

ఆమె కొద్దిక్షణాలు ఆలోచిస్తున్నట్లుగా ఆగింది. "అనకాపల్లి అచ్యుతానందం మామయ్య కొడుకు సంగతి తెలుసుగదరా...!" అన్నది కొడుకునే చూస్తూ.

"రాంపండుకు ఏమైంది...?" మధ్యలో ఇప్పుడాయన విషయం ఎందుకొచ్చిందా అనుకుంటూ నుదురు ముడివేశాడు.

"పెదనాన్న ఎంత చెప్పినా వినకుండా ఆదిలక్ష్మిని పెళ్ళిచేసుకున్నాడా... వాడికి పుట్టిన పిల్ల ఎలా వుంది... సరైన పెరుగుదల లేదు పాడు లేదు... పొద్దుగూకితే కళ్ళు సరిగ్గా కనబడకపోంగా మందమతిలా కూర్చున్న చోటే గొబ్బెమ్మలా కూర్చొనివుంటుంది... పదేళ్ళొచ్చినయి అని పేరేగాని ఐదేళ్ళ పిల్లకంటే కనాకష్టంగా వున్నది... దాన్ని చూస్తూ ఆ తల్లీ తండ్రేకాదు, తాతా, బామ్మా కూడా దిగులుపడి చస్తున్నారు!"

"అయితే దానికి నా పెళ్ళికీ సంబంధమేమిటి?" అన్నాడు చిరాగ్గా సుధీర్ తల్లినే చూస్తూ.

"అదేరా నేను చెబుతున్నది... అయిన సంబంధాలు చేసుకుంటే అలాంటి పిల్లలు పుట్టే అవకాశం ఉంటుందనేది నిజమా కాదా?... పెద్దవాళ్ళు ఎంత వద్దన్నా వినకుండా

మొండికేసి మేనత్తకూతుర్ని చేసుకున్నాడు!" అన్నది విసురుగా. "ఇప్పుడు అనుభవిస్తున్నాడు!"

సుధీర్ పకపకా నవ్వాడు. "కొన్ని వందల్లో అలాంటి కేసు ఏదో ఒకటి తగిలి వుండవచ్చు... నాకు తెలియక అడుగుతాను... అలాంటి పిల్లలు పరాయి సంబంధాలు చేసుకున్నవాళ్ళెవరికీ పుట్టలేదంటావా?"

"ఎవరికైనా నూటికో కోటికో వాళ్ళు పూర్వజన్మలో చేసుకున్న పాపానికి పుట్టి వుంటారు... అంతేగాని తెలిసీ తప్పటడుగు వేస్తానంటే ఎట్లా, ఇంత చదువూ చదివి!"

"సరే! నువ్వు చెప్పిందే కరెక్ట్ అనుకుందాం... నెల్లూరు విశ్వనాథం పెదనాన్న పెద్దకొడుకు అక్క కూతుర్నేగా చేసుకున్నది మరి... వాళ్ళమ్మాయి ప్రత్యూష మొన్న గ్రూప్ ఒన్‌లో మొదటి పదిమందిలో వచ్చి ఇప్పుడు గెజిటెడ్ ఆఫీసరయి ఆర్‌డీవోగా పనిచేస్తోంది... మరి ఆ అమ్మాయెందుకు అవిటిగా పుట్టలేదంటావ్?"

"దాని అదృష్టం... వాళ్ళ అదృష్టం... కానీ తెలిసి తెలసీ చేతులెందుకు కాల్చుకోవాలంటాను నేను!"

"చూడమ్మా! నీవన్నీ చాదస్తపు భయాలు... నాకు అలాంటివేం లేవు... నేను అపరంజిని తప్ప మరొకర్ని చేసుకోలేను... చేసుకోను!"

"నిన్ను కని పెంచిన పెద్దవాళ్ళమాటకు విలువే లేదంటావ్!" అన్నది దిగులుగా కొడుకు వంక చూస్తూ. "వాళ్ళ ఇష్టాఇష్టాలకు గౌరవం ఇవ్వాల్సిన అవసరం లేదని ఎక్కడ నేర్చుకున్నావురా!" అన్నది నిష్ఠూరంగా.

"మీరన్నా, మీ మాటలన్నా నాకు ఎంతో గౌరవమున్నది... కానీ వయసొచ్చిన కొడుకు మాటను గూడా మీరు వినాలని అనుకోనక్కరలేదా? పిచ్చిపిచ్చి ఆలోచనలతో కన్న పిల్లల కలల్ని చెరిపేసి వాళ్ళ జీవితపు ఆనందాల్ని త్రుంచిచేయాలనుకోవటం న్యాయమా?... అత్తయ్యా, మామయ్యా కూడా ఇలాగే ఆలోచిస్తున్నారా?"

"ఆడపిల్ల తల్లిదండ్రులు కూతురు పెళ్ళయితే చాలనుకుంటారు!"

"ఆ కూతురు భవిష్యత్తు ఎంత దుర్భరంగా మారినా ఫరవాలేదనే అనుకుంటారా వాళ్ళు!" ఎగతాళిగా అన్నాడు.

"ఏమో... నాకవన్నీ తెలియవురా... నువ్వు మాత్రం అపరంజిని చేసుకోవటం నాకిష్టంలేదు... అది బంగారుబొమ్మే కాదనను... తెలివిగలదీ, మంచిదీ, మనతో కలిసిపోయేదే, కాదనను... కానీ నా ఒక్కగా నొక్క కొడుక్కు పుట్టే పిల్లలు నీ అంత తెలివిగలవాళ్ళుగా పుట్టాలని నేను కోరుకుంటున్నాను...!" కంఠం హెచ్చించి సూటిగా మనస్సులోని మాట చెప్పేసి పెరుగు గిన్నెలోనుంచి పెరుగు తీసి వేసుకున్నది కంచంలో.

"సరేనమ్మా! మాకు పుట్టబోయే పిల్లలు అవిటివాళ్ళుగా పుడతారేమోననేదేగా నీ భయం... ఓకే! తప్పకుండా నీకు ఆ దిగులు లేకుండా చేస్తాను... మాకు పిల్లలు పుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటాను గాని దాన్ని మాత్రం పెళ్ళి చేసుకోకుండా వుండను!" అన్నాడు అతడూ ఆఖరి ఐటమ్‌గా పెరుగు వేసుకుంటూ.

"అంటే మన వంశం ఇంతటితో అంతమై పోవాలనేనా?"

"ఎందుకంతమవుతుంది... అనవసరపు ముళ్ళు వేయవద్దు... నీ మాట నేను వింటున్నప్పుడు, నామాటా నువ్వు వినాలి... అంతగా పిల్లలు కావాలీ అనుకుంటే నీకు నచ్చిన, నువ్వు మెచ్చిన, అన్ని విధాలా యోగ్యులయిన పిల్లనో, పిల్లవాడినో పెంపుడు తెచ్చుకుందాం!" ఇంకేం మాట్లాడేది లేదన్నట్లుగా కంచం ముందునుంచి లేచి వాష్‌బేసిన్ దగ్గరకు వెళ్ళాడు చేయి కడుక్కునేందుకు.

ఆమె కొయ్య బొమ్మలా బిగుసుకుపోయి వెళుతున్న కొడుకువంకే చూస్తూ వుండిపోయింది!

* * *

అనకాపల్లినుంచి సుజాత ఫోన్‌చేసింది అపరంజికి గురువారం నాడు రాత్రి తొమ్మిదప్పుడు తల్లి భోజనానికి రమ్మనమని పిలుస్తుంటే చేతిలోని పుస్తకాన్ని పక్కనపడేసి లేస్తున్న సమయంలో. ఆన్‌చేస్తూనే, "చెప్పవే!" అన్నది.

"ఏంలేదు... రేపు పొద్దునే శుభలేఖలు ఇస్తానని ప్రెస్‌వాడు చెప్పాడు... రేపు సాయంత్రానికి నువ్వు ఇక్కడకు వచ్చేయ్ రెండు మూడు రోజులుండేటట్లుగా... వచ్చేటప్పుడు మన ఫ్రెండ్స్ అడ్రసులు నీ దగ్గరున్నంతవరకూ పట్టుకొస్తావుగదా... అదేగాక ఇక్కడ మనిద్దరం కలిసి చేయాల్సిన పనులు చాలా వున్నాయి... షాపింగ్ కూడా వున్నది. లోకల్ ఫ్రెండ్స్‌ను స్వయంగా వెళ్ళి ఆహ్వానించాలి. ఆ తరువాత నీతో పాటే విశాఖపట్నం వస్తాను... అక్కడా మన ఫ్రెండ్సందరినీ ఆదివారం పిలవచ్చు... ఓకే!" అన్నది సుజాత.

"అలాగే! తప్పకుండా..." చటుక్కున తలెత్తి గోడకున్న క్యాలెండర్ వంక చూచింది. క్రితంసారి తను అనకాపల్లిలో ఆసుపత్రికి వెళ్ళివచ్చి రేపటికి పదిహేను రోజులు అవుతోంది. ఆ నర్సింగ్‌హోంలో రికార్డుకీపరు వచ్చివుంటే ఆ పనికూడా పూర్తిచేసుకోవచ్చు!

"బస్సు ఊళ్ళోకి ఎంటర్ అవుతుండగానే నాకు కాల్‌చేయి... బస్టాండుకు కారు పంపిస్తాను!"

"అలాగేలే... నేను రేపు ఉదయం పదింటికల్లా వస్తాను... ఊరికినే కంగారు పడబోకు... మీ వాళ్ళంతా మొన్న ఇక్కడ కొన్న చీరలు ఎలా ఉన్నయ్యన్నారు?"

"నాకు కావాల్సినవి, నచ్చినవి నేను కొనుక్కున్నాను... మధ్యలో వాళ్ళెవళ్ళు వంకలు పెట్టేటందుకు!" అన్నది అరుస్తున్నట్లుగా.

"అంటే వాళ్ళకు నచ్చలేదన్నమాట!" పకపకా నవ్వింది అపరంజి.

"ఆ విషయం వదిలేయ్... నువ్వు మాత్రం వస్తున్నావు... రెండు రోజులు ఇక్కడే ఉంటానని ఆంటీకి చెప్పిరా... లేకపోతే నన్ను చెప్పమంటావా?"

"ఏమక్కరలేదులే... మా అమ్మ ఎప్పుడూ నా మాట కాదనదు!"

ముందు తన జన్మరహస్యమేదో తెలుసుకోవాలని తనకూ ఆత్రంగానే ఉన్నది. అమ్మ అనకాపల్లి దానికోసం వెళతానంటే నసక్కుండా ఈ పని కలిసొచ్చింది...

మళ్ళా కాలేజీలో పాఠాలు మొదలు పెట్టారంటే ఇబ్బంది అవుతుంది!

"థాంక్యూ!" సుజాత సెల్ ఆఫ్‌చేసి డైనింగ్ టేబుల్ దగ్గరకు వస్తుంటే, "ఎంతసేపే ఆ సెల్‌ఫోన్లో సొల్లు కబుర్లు... ఎవతె చేసింది?" అన్నది అరుస్తున్నట్లుగా తల్లి.

అపరంజి ఆమె అరుపుల్ని చాలా తేలిగ్గా తీసుకుంటూ, "పెళ్ళికూతురు సుజాత... ఇన్విటేషన్ కార్డులు వచ్చేస్తున్నయ్యట... నేను వెళితే ఇద్దరం కలిసి ఎవరెవరికి పంపాలో నిర్ణయించి, అడ్రసులురాసి పోస్ట్ చేయాలిట... ఆపైన అనకాపల్లిలో ఇవ్వాల్సిన వాళ్ళందరికీ ఇవ్వటమే కాకుండా ఏదో షాపింగ్ కూడా వున్నదట!" అంటూనే దగ్గరకు వచ్చి తల్లి మెడచుట్టూ చేతులు వేసి మీదకు ఒరుగుతూ, "పెళ్ళికూతురు మాట ఎలా కాదనాలో నాకు అర్థంకాలేదే... నువ్వు ఒప్పుకుంటావులే అనే ధైర్యంతో సరే అన్నాను... నేను పక్కన లేకపోతే దానికి ఏపనీ సాగదు!" అంటూ తల్లివంక మురిపెంగా చూడసాగింది.

"నేను కాదంటే నువ్వు ఆగుతావా?" అన్నది కూతురు ముఖంలోకి ఆప్యాయంగా చూస్తూ.

"నువ్వు ఆమాట అను... నువ్వు గీచిన గీటు దాటితే అప్పుడడుగు!" అన్నది బుంగమూతి పెట్టి తల్లి చెంపమీద ముద్దుపెట్టుకుంటూ.

"ఛీ పో! మరీ చిన్నపిల్లలా వెధవ్వేషాలు!" మెడచుట్టూ వున్న కూతురు చేతుల్ని తీసేస్తూ అన్నది.

"అంటే మా అమ్మ నేను అనకాపల్లి వెళ్ళటానికి ఒప్పుకున్నదన్నమాట!... థాంక్యూ మమ్మీ... థాంక్యూ!" మరోసారి తల్లిని ముద్దు పెట్టుకుంటూనే ఇవతలకు వచ్చి ఆమె ఎదురుగా వున్న తనకోసం పెట్టిన కంచముందు కూర్చున్నది అపరంజి.

కూతురు మాటలకు, చేష్టలకు ఆమె మనస్సంతా ప్రఫుల్లమయింది. 'మహా చిలిపి!' అనుకున్నది మనస్సులోనే.

* * *

శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల సమయం.

విజయవాడలో ఎండ అంత తీక్షణంగా లేదు. ఆపైన పక్కనే వున్న కృష్ణానది ప్రభావంతో చల్లటిగాలి వీస్తోంది. ఇంద్రకీలాద్రి కొండమీద కనకదుర్గ గుడిముందు జనం బారులు తీరివున్నారు. ధర్మదర్శనం క్యూ గుడి బయటదాకా వున్నది. ఇవికాక మరో రెండు క్యూలు. ఒకటి ప్రత్యేక దర్శనానికి మరోటి కుంకుమార్చనలు చేయించేవారికి.

జయంతి అర్చన క్యూలో వున్నది. ఆ అమ్మాయికి హైదరాబాద్ మాదాపూర్‌లోని ఓ పేరున్న ఐటీ ఫరమ్‌లో ఇంటర్వ్యూ వచ్చింది. విశాఖపట్టణంలో బి.టెక్ చేసింది క్రితం సంవత్సరం. ఇక్కడే ఆరునెలలుగా ఓ చిన్న కంపెనీలో అనుభవం కోసం ఉద్యోగం చేస్తున్నది.

మరునాడు హైదరాబాద్ వెళ్ళాలి. వెళ్ళేముందు అమ్మవారికి అర్చన చేయించి ఆశీర్వాదం పొంది వెళ్ళాలని గుడికి వచ్చింది. శుక్రవారం అవ్వటంతో రద్దీ ఎక్కువగా వున్నది. ప్రత్యేక దర్శనం క్యూలో కొందరు విదేశీయులు కూడా వున్నారు. వాళ్ళల్లో ఆడామగా చాలామంది నుదుట కుంకుమ బొట్లు పెట్టుకొని కనబడ్డారు.

హైదరాబాద్‌లో ఉద్యోగం గనుకు వస్తే మళ్ళీ గుడికి వచ్చి కుంకుమార్చన చేయించాలి. అప్పుడే తృప్తిగా వుంటుంది. తనకూ వస్తుందనే నమ్మకమూ వున్నది. అక్కడ అదే కంపెనీలో తనతో చదివిన మరో అమ్మాయి పనిచేస్తున్నది. తనకు కాల్ లెటర్ రాగనే ఫోన్‌చేస్తే, “మంచి కంపెనీ వచ్చేసేయ్... ఫ్యూచర్ బాగుంటుంది... ఉండటానికి కూడా దిగులేం లేదు... గచ్చిబౌలీలో రెండు గదుల ఇంట్లో నేనొక్కదాన్నే ఉంటున్నాను... ఇద్దరం ఒకళ్ళకొకళ్ళం తోడుగా వుండవచ్చు... మా మేనేజర్‌కు నీ సంగతిచెప్పి సెలక్ట్ అయ్యేలా చూడమని చెబుతానుగాని, నువ్వు గూడా బాగా ప్రిపేర్ అయిరా... ఇది ప్రైవేటుది, మనం ఎంత చెప్పినా వాళ్ళు మెరిట్‌కే ప్రాధాన్యత ఇస్తారు... వాళ్ళ వ్యాపారం బాగుండాలని వాళ్ళు అనుకుంటారు గదా!” అన్నది నవ్వుతూ.

తనకా ఉద్యోగం తప్పక వస్తుందని జయంతికి నమ్మకం వున్నది. ఇంటర్వ్యూ బాగా చేయగలననే ధైర్యం వున్నది. అది వస్తే తమ కుటుంబానికి ఆర్థికంగా ఎంతో వెసలుబాటుగా వుంటుంది!

క్యూ చిన్నగా ముందుకు నడుస్తున్నది. అకస్మాత్తుగా జయంతి చూపు ప్రత్యేక దర్శనం క్యూలో వున్న నివేదిత మీద పడింది.

'ఇదేంటి... అపరంజి విజయవాడ వస్తూ నాకు చెప్పనేలేదు...!' అనుకున్నది అర్చన క్యూలోవున్న తన స్నేహితురాలిని చూస్తూ. ఆ క్యూలో జనం ముందుకు వస్తున్నారు. మరో నాలుగయిదు నిముషాలల్లో అపరంజి తన పక్కకు వచ్చేస్తుంది.

ఉత్కంఠతతో చూస్తోంది జయంతి. తనకు ముందుగా వస్తున్నట్లు చెప్పనందుకు బాగా చివాట్లు పెట్టాలి. ఎంత స్నేహంగా వుండేవాళ్ళు విశాఖలో బిటెక్ చదువుతున్నంత కాలం. తనూ వాళ్ళ ఇంటికి దగ్గరగానే ఒక ఇంట్లో మరో ఇద్దరితో కలిసి అద్దెకుండేది.

అవతల క్యూలోవాళ్ళు నాలుగడుగులు దగ్గరలోకి రాగానే ఇక ఆగలేకపోయింది జయంతి. "ఏమే అపరంజీ! ఎప్పుడొచ్చావ్?" అన్నది ఆత్రంగా.

నివేదిత చటుక్కున తలెత్తింది జయంతి అన్నమాట వింటూనే.

అయోమయంగా నలువైపులా చూస్తూ ఉండిపోయింది.

"నేనే... జయంతిని... ఇటు పక్కన!" పెద్ద గొంతుకతో అరుస్తున్నట్లుగా అన్నది జయంతి.

నివేదితకు అర్థమయింది జయంతి అనబడే ఆ అమ్మాయి అపరంజికి స్నేహితురాలన్నమాట!... తను జాగ్రత్తగా వుండాలి... ముందు తండ్రి వున్నాడు, వెనుక తల్లి వున్నది!

తనని కాదన్నట్లుగా తలవంచుకున్నది నివేదిత.

జయంతికి చర్రున కోపమొచ్చింది.

'దీని దుంపతెగ... దీనికేమొచ్చింది మాయరోగం!' అనుకుంటూ ఆ అమ్మాయి తనకు దాపుగా వచ్చేంతవరకూ ఆగింది కొద్ది క్షణాలవరకూ.

దగ్గరకు రాగానే నోరంతా తెరుస్తూ కంఠం హెచ్చించి, "నన్ను అప్పుడే మరిచిపోయావా... ఇంకా సంవత్సరం కూడా కాలేదే బి.టెక్ అయి!" అన్నది పెద్దగా నవ్వుతూ.

నివేదితకు నోట మాటపెగల్లేదు. ఏం మాట్లాడాలో తెలియనట్లుగా కన్నార్పకుండా జయంతినే చూస్తున్నది.

క్యూ దగ్గరకు వచ్చేసింది. నివేదిత జయంతి పక్కకు వచ్చింది.

జయంతి ఇక ఆగలేదు. "అదేంటే అట్లాచూస్తావ్... ఎవరో కొత్తదాన్ని చూస్తున్నట్లు!... నేను విశాఖలో నీ క్లాస్‌మేట్ జయంతినే!" అన్నది ఆ అమ్మాయి భుజం మీద చేయివేసి ఊపుతూ.

నివేదిత తల్లి కల్పించుకుంటూ, "నువ్వు పొరబడుతున్నావమ్మా!... మా అమ్మాయి విశాఖపట్నంలో ఎప్పుడూ చదవలేదు... అసలు ఆ ఊరే ఎప్పుడూ వెళ్ళలేదు... నువ్వు దీన్ని ఎవరనుకొని పలకరిస్తున్నావో!" అన్నది చిన్నగా.

ఒక అడుగు ముందుకు వేసిన నివేదిత తండ్రీ ముఖం వెనక్కు తిప్పి వాళ్ళ మాటలే వింటున్నాడు.

"ఇది అపరంజి కాదా?"

"కాదమ్మా! మా అమ్మాయిపేరు నివేదిత... మాది విజయవాడే! పొరబాటు పడ్డట్టున్నావ్!"

జయంతి బిక్కమొహమేసింది. 'అదేమిటి... అచ్చం ఒకేలా ఇద్దరెలా ఉంటారు?' అనుకుంటూనే, "సారీ అండి! మా ఫ్రెండ్ అపరంజి అచ్చం ఇలాగే ఏమాత్రం తేడా లేకుండా వుంటుంది... మీ అమ్మాయిని చూస్తూనే అదే అనుకున్నాను... సారీ... సారీ!" తడబడటం జయంతి వంతయింది.

క్యూ ముందుకు వెళుతున్నది. నివేదితా ముందుకు వెళ్ళిపోయింది.

ఎత్తులోగాని, లావులోగాని, రంగులోగాని, రూపంలోగాని ఏలాంటి తేడా లేదు... ఇది చాలా విచిత్రంగా వున్నదే... అసలు ఇంతగా ఒకే పోలికలతో ఇద్దరు ఉంటారా?

మెడ వెనక్కు తిప్పి నివేదితనే పరీక్షగా చూస్తున్నది. ఒకటి రెండుసార్లు వాళ్ళింటికిగూడా వెళ్ళింది... ఇప్పుడు ఆలోచిస్తుంటే వాళ్ళమ్మ ఇలా ఉన్నట్లు అనిపించటంలేదు. అపరంజి తండ్రిని తనెప్పుడూ చూడలేదు.

అలా చూస్తున్న జయంతికి మొట్టమొదటిసారిగా అపరంజికి, ఆ అమ్మాయికీ ఉన్న తేడా కనబడింది. అపరంజి ఒత్తయిన జడ పిరుదాలు దాటి మోకాళ్ళదాకా వుంటుంది. ఈ అమ్మాయిది నడుముకు కాస్త పైకి కత్తిరించినట్లుగా వున్నది!

అపరంజే కత్తిరించుకోగూడదనేమున్నది... కానీ వాళ్ళు కాదు మొర్రో అంటుంటే తను చేయగలిగిందేమున్నది...

నో... నో...

అమ్మవారికి కుంకుమార్చన అయి బయటకు రాగానే వాళ్ళను పట్టుకొని పూర్తి వివరాలు తెలుసుకోవాలనుకున్నది.

రియల్లీ ఏ వండర్!

* * *

శుక్రవారం అపరంజి అనకాపల్లి బస్టాండులో బస్సు దిగేటప్పటికి ఉదయం పదకొండు గంటలయింది. ఇంటిదగ్గర తొమ్మిదింటికి బయల్దేరింది. ఊళ్ళోకి బస్సు వస్తుండగానే సుజాతకు ఫోన్‌చేసి చెప్పింది.

సుజాత పది నిముషాలల్లోనే కారు తీసుకొని బస్టాండుకు వచ్చింది. అపరంజిని చూస్తూనే చేయిపట్టుకు తీసుకువెళ్ళి కారులో తన పక్కన కూర్చోపెట్టుకుంటూ, "బాకాగాని

నీకు ఫోన్ చేసిందా ఏమిటే?" అడిగింది ఆత్రంగా అపరంజి ముఖంలోకే చూస్తూ..

"ఆ... జర్నీ అంతా తిన్నది నన్ను... నీకూ చేశానని చెప్పింది... నీ పెళ్ళికి వస్తూ నాలాగేవున్న ఆ అమ్మాయినెవరినో ఎలాగయినా విజయవాడలో పట్టుకొని తీసుకువచ్చి మా ఇద్దరి మధ్యనా తను నిల్చొని ఫొటోలు తీయించుకుంటుందట!" పకపకా నవ్వుతూ అంటున్నా మనస్సంతా గుబులుగానే వున్నది– ఆ తిక్కల్ది నివేదితను తీసుకువచ్చి ఎక్కడ సీన్ క్రియేట్ చేస్తుందోనని.

ఈ పెళ్ళికి తన తల్లీదండ్రీకూడా రావచ్చు!

విశాఖపట్నంలో చదువుకుంటున్న రోజుల్లో జయంతికి స్నేహితురాళ్ళంతా కలిసి 'బాకా' అనే బిరుదిచ్చారు. ఆ అమ్మాయి చెవిలో ఏదైనా ఊదితే చాలు పది నిముషాలల్లో కాలేజీ మొత్తం తెలిసిపోయేది ఆ విషయం– వేరే టముకు వేయకుండా.

నివేదితను గుళ్ళో అర్చన క్యూలో చూసి ఆశ్చర్యపోయిన జయంతి, పూజ అయిపోగానే బయటకు వచ్చి ఇంద్రకీలాద్రి మీద అన్నివైపులా గాలించింది. శివాలయం దగ్గరకు పరుగెత్తింది. బయట షాపులన్నీ చుట్టబెట్టింది.

ఆ అమ్మాయి పూర్వాపరాలు విచారించందే నిద్రపట్టేలా లేదు. పట్టుకొని పరిచయం చేసుకొని, ఎలాగైనా సరే ఒప్పించి సుజాత పెళ్ళికి అనకాపల్లి తీసుకువెళ్ళి పెళ్ళిలో అపరంజి పక్కన నిలబెట్టితేనేగాని తన ఆత్రం తగ్గదు! అయినా ఎంత తిరిగినా నివేదిత కనబడలేదు.

అటు నివేదితకూ కంగారుగానే వున్నది. ఎవరికి తెలిసినా ఫరవాలేదు– కానీ రెండు కొంపల్లోను అది ఓ చిచ్చుకాగూడదు. అందుకే అమ్మవారి దర్శనం కాగానే బయటకు వచ్చేసింది. శివాలయంకు వెళ్దామని తల్లిదండ్రులంటున్నా, "అన్ని మెట్లు దిగి మళ్ళా ఎక్కాలమ్మా... మన కారేమో ఇక్కడున్నది... ఎందుకో నీరసంగా వున్నది... ఇంటికి వెళ్దాం!" అంటూ వాళ్ళను బయల్దేరదీసింది.

ఆమె చెప్పినదాంట్లోనూ అబద్ధం లేదు. ఈ మధ్య కొద్దిగా నీరసంగా వుంటున్నది.

చదువు ఎక్కువయి అలా ఉంటున్నదేమోననుకున్నా హైదరాబాద్‌నుంచి వచ్చిన తరువాత తనేం ఎక్కువగా చదవటంలేదు. కానీ మనస్సులో మాత్రం హైదరాబాద్‌లో తగిలిన షాక్‌నుండి కోలుకోలేకపోతున్నానా అనే భయం వెంటాడుతున్నది. అపరంజి చొరవతీసుకొని ఆ రాక్షసులనుండి తనను రక్షించింది గాని లేకపోతే తన జీవితం ఏమయి వుండేంది. అది గుర్తుకు రావటం ఆలస్యం శరీరంలో నరాలన్నీ తెలియని ప్రకంపనకు లోనవుతున్నయి. మనస్సు అస్థిమితమవుతున్నది. ఏదో భయం వెన్నుతట్టి మరీ మనిషిని కలిచివేస్తున్నది– ఈ జయంతి ఎవరోగాని తనని అపరంజే అనుకున్నది!

అనకాపల్లి బస్టాండునుంచి సుజాత అపరంజిని తీసుకొని మరో పదినిముషాలల్లోనే ఇంటికి వెళ్ళింది.

"ఒక పని చేద్దాం... ఈరోజు తిథి, వారం, నక్షత్రం అన్నీ బాగున్నయిట. శుభలేఖలను ముందు తిరుపతి వెంకటేశ్వరస్వామికి, షిర్డీ సాయిబాబాకు, మంత్రాలయం రాఘవేంద్రస్వామికి అడ్రసులురాసి పోస్ట్ చేయమన్నది అమ్మ! కనుక ముందు కాసిని కాఫీత్రాగి, నూకాంబిక అమ్మవారి గుడికి వెళ్ళి, ఆమె పాదాల దగ్గర ఒక శుభలేఖ పెట్టి పూజచేయించి వచ్చి, భోజనాలు కాగానే చిరునామాలు వ్రాయటం మొదలు పెడదాం!" అన్నది సుజాత.

శుభలేఖలు చాలా అందంగా అచ్చువేయించబడినయి. పైన విఘ్నేశ్వరుడు, క్రింద వెంకటేశ్వరస్వామి, అలిమేలుమంగ. లోపల ఎడంవైపు వరుడు, వధువు ఫొటోలు...

"అలాగే... పెద్ద గుడేనా అది!"

"పెద్దదా చిన్నదా అన్నదికాదు ప్రశ్న... అనకాపల్లిలో వున్న నూకాంబికా అమ్మవారు నవశక్తులలో ఓ శక్తి... ఆమె దీవెనలు వుంటే మనం సాధించలేని విజయాలుండవు... నా వివాహం ఏ గొడవలూ లేకుండా జరిగిపోవాలని, నా భవిష్యత్ మూడు పువ్వులూ, ఆరుకాయల్లా వెలిగిపోవాలని కోరుకోవటానికే ఆమె దర్శనం చేసుకునేది!" అన్నది సుజాత తన్మయంగా కళ్ళుమూసుకుంటూ.

అన్నట్లుగానే తరువాత అరగంటకే నూకాలమ్మ గుడికి వెళ్ళారు ఇద్దరూ.

ఆలయ ప్రాంగణం విశాలంగా వుండి ప్రశాంతంగా వున్నది. లోపలంతా కొబ్బరి చెట్లేగాకుండా రకరకాల పచ్చని చెట్లు భక్తులకు కనువిందు చేస్తున్నయి.

ఇద్దరూ అమ్మవారిని దర్శించుకున్నారు. సుజాత శుభలేఖను పూజారిగారికిచ్చి అమ్మవారి దగ్గరపెట్టించింది. వాళ్ళమ్మ ప్రత్యేకంగా చెప్పటంతో కుంకుమ పూజచేయించింది.

నాలుగవుతుండగా సుజాతకు చెప్పి కారు తీసుకొని నర్సింగ్‌హోంకు వెళ్ళింది అపరంజి. సుజాతకు తెలుసు అపరంజి అక్కడకు ఎందుకు వెళుతున్నది. తనూ వస్తానంటే, "నువ్వు నేను తెచ్చిన ఫోన్ నంబర్లకు ఫోన్‌చేసి అడ్రసులు రాసుకో... ఓ అరగంటలో వచ్చేస్తాను... చాలా రోజులయిందిగదా చెప్పి తయారుగానే వుంటుంది... ఇద్దరం వెళ్ళి టైం వేస్ట్ చేసుకోవటం దేనికి... మనం అడ్రసులు వ్రాయాల్సిన కార్డులు చాలా ఉన్నయి!"

ఏ కళనున్నదో సుజాతా రెట్టించలేదు.

ఆసుపత్రికి వెళ్ళేటప్పటికి క్రితంసారి ఉన్న రిసెప్షనిస్టే అక్కడ వుండటమే గాకుండా అపరంజిని చూస్తూనే గుర్తుపట్టింది.

"రండి... మొత్తానికి మా రికార్డుకీపరు సుబ్బారావుగారు సాధించాడు... మీ రికార్డులు దొరికినయి... సర్టిఫికెట్‌గూడా తయారుచేసి పెట్టాడు... ఎడం వైపు కారిడార్‌లో చివరగదే ఆయనది... అక్కడకు వెళ్ళండి... మీ పేరు చెప్పగానే తీసి ఇస్తారు!" అన్నది చిరునవ్వుతో.

"థాంక్యూ!" చాలా హుషారుగా ఆ తెల్లని మొజాయిక్ ఫ్లోర్‌మీద పరుగెడుతున్నట్లుగా అడుగులు వేస్తూ వెళ్ళింది అపరంజి.

తన సమస్య తీరిపోయినట్లే. తన తల్లీదండ్రుల విషయంలో తనేమీ ఇక మనస్సును అస్థిమితపరుచుకోనక్కరలేదు. అయితే తన తల్లిదండ్రులే నివేదిత తల్లిదండ్రులా?

తామిద్దరూ కవలపిల్లలయితే మాత్రం అదే అవుతుంది. అంటే తనవాళ్ళు నివేదితను వేరే వాళ్ళకు దత్తు ఇచ్చివుంటారు!

చివరిగది తలుపు తెరిచేవుంది. తెలియని ఉద్విగ్నితతో లోపల కాలుపెట్టి, "నమస్కారమండీ! నా పేరు అపరంజి... పదిహేను రోజుల క్రితం వచ్చి నా బర్త్‌సర్టిఫికెట్ కావాలని మీ రిసెప్షనిస్ట్‌కు చెప్పివెళ్ళాను... అప్పుడు మీరు లీవులో ఉన్నారు!" అన్నది చిన్నగా.

ఆయనకు యాభై యేళ్లు పైనే ఉంటయి. అప్పటికే జుట్టంతా నెరిసిపోయివున్నది. భూతద్దాల కళ్ళజోడు. బక్కగా వున్నాడు.

"అవునమ్మా! చెప్పింది రోజీ... తయారు చేసి అట్టిపెట్టాను... దీనికోసం విశాఖపట్నంనుంచల్లా వచ్చారట కదా!" అన్నాడు కళ్ళజోడు పైనుంచి అపరంజిని చూస్తూ. "గ్రీన్ కార్డ్ కోసమేనా?"

"అవునండీ!" అన్నది అతడిచ్చిన సర్టిఫికెట్‌ను అందుకుంటూ. "రెండు తయారు చేయలేదా?" అన్నది ఓ రాయి విసురుతున్నట్లుగా.

"రెండు దేనికమ్మా... మేం ఒకటే ఇస్తాం... ఎన్ని కావాలంటే అన్ని మీరు జిరాక్స్ తీయించుకోవటమే!"

"మా అమ్మకు మేం కవలలం పుట్టాంగదా... ఇద్దరికీ వేరువేరువి కావాలి!"

అతడు తన చిన్నకళ్ళను ఒకసారి మూసుకున్నాడు ఆలోచిస్తున్నట్లుగా.

"అలాంటిదేం లేదే!" అంటూనే లేచి పక్కనున్న బీరువా తెరిచి ఓ రిజిస్టరు బయటకు లాగాడు. పేజీలు తిప్పుతూ ఒకచోట ఆగి, "ఆరోజు రుక్మిణి అనే ఆమెకు ఒక్కతే అమ్మాయి పుట్టింది... కవలలు పుట్టలేదు!" అన్నాడు. "మీ నాన్నగారి పేరు రాఘవేంద్రరావే కదా... అలాంటిదేమైనా వున్నట్లయితే తప్పకుండా ఇక్కడ రికార్డయివుండేది!"

* * *

# 12

అపరంజి సుశ్మితా నర్సింగ్‌హోంనుంచి చికాగ్గా బయటకు వచ్చింది.

తన బర్త్ సర్టిఫికెట్ తయారుచేయించి అట్టిపెట్టిన రిసెప్షనిస్ట్‌కు కృతజ్ఞతలు చెప్పాలనే ఆలోచన కూడా ఆ క్షణాన ఆమెకు రాలేదు.

తన తల్లికి అప్పుడు కవలలు పుట్టకపోయివున్నట్లయితే తను ఎవరి కూతురు అయివుండాలి. నివేదిత తల్లే తన తల్లా? అలా జరగటానికి వీల్లేదు. తను ఎక్కడ పుట్టింది, తేదీతోసహా అమ్మ స్పష్టంగా చెప్పటమేకాదు, ఆ విషయం ఆసుపత్రి రికార్డులతో నిర్ధారణకూడా జరిగింది. అయినా ఆ అసుపత్రిలో తన తల్లికి ఇద్దరు పిల్లలు పుట్టలేదని ఆయన కచ్చితంగా చెబుతున్నాడంటే డిఎన్ఏ పరీక్ష తప్పయివుండాలి...

– మరి ఒకే పోలికలతో, ఒకే రోజున తామిద్దరూ పుట్టటం ఎలా జరిగింది? వేరువేరు స్త్రీలకు వేరువేరు ప్రదేశాలలో ఒకే రోజున ఒకే పోలికలున్న ఇద్దరు పిల్లలు పుట్టటం సంభవమా?... నో... అలా జరగదు... జరగటానికి వీల్లేదు... ఇది మిలియన్ డాలర్ ప్రశ్నే...

– నిజానిజాల శోధనకు ఏదైనా పరిశోధనాసంస్థ సాయం అర్థిస్తే?

తల అడ్డంగా ఊపుకుంటూ వచ్చి కారులో కూర్చున్నది... ఇరవై రెండు సంవత్సరాల క్రితం ఏం జరిగిందో వాళ్ళు తేల్చకపోంగా బంధువులందరి నడుమా అదో పెద్ద చర్చనీయాంశమయి తమిద్దరి తల్లిదండ్రులకూ అవమానకరమైన పరిస్థితులు ఏర్పడవచ్చు! వద్దు... అలా జరగటానికి వీల్లేదు...

తనూ, నివేదితే ఈ సమస్యను వీలయినంత రహస్యంగా పరిష్కరించాలి...

విశాఖపట్నమెళ్ళిన తరువాత ఇక్కడ జరిగినది నివేదితకు చెప్పి ఏంచేస్తే బాగుంటుందో తననీ ఆలోచించమని చెప్పాలి.

పక్కన స్నేహితురాలున్నా అస్తవ్యస్తపు ఆలోచనలతో అన్యమనస్కంగా కూర్చున్నది

అపరంజి. అప్పటికీ సుజాత ఒకటి రెండుసార్లు అడగనే అడిగింది, "అదేమిటి... మూడీగా వున్నావ్... ఒంట్లో బాగోలేదా?" అంటూ.

అపరంజి నవ్వేసి ఊరుకున్నది. "ఏం లేదులే!"

సుజాత అనకాపల్లినుంచి తనతో వైజాగ్ రావటం, శుభలేఖలు పంచటం, షాపింగ్ చేయటంతో క్షణం తీరికలేకుండా ఇద్దరూ తిరుగుతునే వున్నారు. అయినా అపరంజి మనస్సు తన తల్లిదండ్రులెవరా అన్న ఆలోచనలనుండి బయటకు రాలేకపోతోంది.

ఆదివారం సాయంత్రం ఆరవుతుండగా సుజాత అనకాపల్లి వెళ్ళిపోయింది.

ఆమె అటు వెళ్ళగానే విశ్రాంతి తీసుకోవాలన్నట్లుగా తన బెడ్‌రూంలోకి వెళ్ళి మంచం మీద పడుకుంటే నివేదిత వచ్చి పక్కనే కూర్చున్నట్లుగా కళ్ళముందు కదిలింది. మరుక్షణంలోనే– ఇన్నాళ్ళు తామిద్దరూ ఫోన్‌మీద కూడా మాట్లాడుకోకపోవటం అపరంజికి విచిత్రంగానే తోచింది. తను సుజాతతో బిజీ అయినట్లుగానే నివేదిత సివిల్స్ పుస్తకాలతో బిజీ అయివుండవచ్చు!

రాత్రి పదిగంటలప్పుడు భోజనంచేసి తన గదిలో జేరిన తరువాత నివేదితకు ఫోన్ చేసింది అపరంజి.

"సారీ చెల్లీ! మా స్నేహితురాలి వివాహానికి తేదీ నిర్ణయమవ్వటంతో ఆ హడావుడిలో ఫోన్ చేయలేకపోయాను... నువ్వూ చేయలేదంటే టెన్షన్ తగ్గించుకొని మళ్ళీ చదువులో పడ్డావన్నమాట... వెరీగుడ్!" అన్నది చాలా తేలిగ్గా.

"చదువా పాడా... ఒంట్లో బాగుండటంలేదు... !" అన్నది చాలా నీరసంగా వున్నది ఆ కంఠం. "అందుకే నీకు ఫోన్ చేయలేకపోయాను!"

"ఏమైంది?" ఆదుర్దాగా అడిగింది అపరంజి.

"వారం రోజులబట్టీ జ్వరం వస్తుండటంతో అమ్మా నాన్నా కంగారు పడి ఆసుపత్రిలో జేర్చారు... ఈ రోజే నార్మల్‌కు వచ్చింది... ఇంటికి వెళ్ళింతరువాత నీకు చెబుదామని

ఊరుకున్నాను... డాక్టర్లేమో అన్నీ తినమంటున్నా అమ్మ మహా చాదస్తంగా చారన్నం, చింతకాయ పచ్చడి తప్ప మరేమీ తిననీయటంలేదు... అందుకే ఈ నీరసం!" అన్నది నవ్వుతూ నివేదిత.

"ఎందుకొచ్చిందంటారు డాక్టర్లు ఆ జ్వరం?" అడిగింది అపరంజి ఆదుర్దాగా.

"వాళ్ళేం చెబుతారు... వైరల్ ఫివర్ అంటూ యాంటీబయటిక్స్ ఇచ్చారు... వాటితో మహా చికాకుగా వున్నది!"

"జాగ్రత్తగా మందులు వేసుకుంటున్నావా?"

"వేసుకోబట్టేకదా నార్మల్‌కు వచ్చింది!" అన్నది నవ్వి.

"ఎప్పుడు డిశ్చార్జ్ చేస్తారట!"

"రేపు చేస్తారేమో!"

"ఓకే... ఆల్ ద బెస్ట్... ఇంటికి రాగానే ఫోన్‌చేయి... అప్పుడు తీరిగ్గా మాట్లాడుకుందాం!" అంటూ సెల్ ఆఫ్ చేసింది అపరంజి.

అనకాపల్లి ఆసుపత్రిలో తను తెలుసుకున్న విషయం ఆరోగ్యం బాగుండని సమయంలో నివేదితకు చెప్పటం ఇష్టంలేకపోయింది. అసలే చికాకులో ఉన్నప్పుడు మరో చికాకునుకూడా నెత్తిన రుద్దటం దేనికి?

అసలు నివేదిత కష్టాలన్నిటికీ తనే కారణమా అన్న న్యూనతా భావం ఆమెను పూర్తిగా ఆవరించగా శూన్యంలోకి చూస్తున్నట్లుగా చూస్తూ మౌనంగా కూర్చుండిపోయింది చాలాసేపు.

– ఆ వెధవ, నివేదితను తను అనుకునే కిడ్నాప్ చేశాడు. తను విజయవాడలో పోలీసులకు పట్టించాననే కోపంతో తన మీద కసి తీర్చుకోవాలనుకున్నాడు.

అదే అపరంజిని ఎంతగానో బాధిస్తున్నది!

* * *

రాత్రి తొమ్మిది గంటలయింది. నివేదిత ఆసుపత్రిలో బెడ్‌మీద పడుకొని సివిల్స్ ప్రిలిమనరీస్‌కు పనికివచ్చే పుస్తకం చదువుకుంటోంది. ఆమెను ఆరోజు కూడా డిశ్చార్చ్ చేయలేదు. మరునాడూ నార్మల్‌లోవుంటే మధ్యాహ్నానుంచి పంపింస్తాం అనటంతో అక్కడే ఉండిపోయింది. మనసుకు ఎక్కకపోతున్నా కాస్త కాలక్షేపంగానైనా వుంటుందని పుస్తకాలు తెప్పించుకున్నది.

తల్లి కూడా లేదు. తను అన్నం తిని కూతురుకు తెచ్చేందుకు ఇంటికి వెళ్ళింది. తండ్రి సాయంత్రం వరకూ వుండి వెళ్ళాడు కూతురు కులాసాగానే ఉండటంతో.

గదిలో హాస్పిటల్ ల్యాండ్‌లైన్ ఎక్స్‌టెన్షన్ రింగయింది. తల్లో తండ్రో చేసుంటారనుకుంటూ రిసీవర్ అందుకున్నది.

“మేడమ్! మీకు హైదరాబాద్‌నుంచి కాల్ వున్నది... కలపమంటారా?” ఆసుపత్రి టెలీఫోన్ ఆపరేటర్ అడిగింది.

తనకు హైదరాబాద్‌నుండి చేసేవారెవరా అనుకుంటూనే, “కనెక్ట్ చేయండి!” అన్నది.

మరుక్షణంలోనే క్లిక్‌మన్న శబ్దం. తరువాత అటువైపునుంచి మగకంఠం. “నువ్వు చాలా తెలివిగలదానివే కాకుండా పెద్ద కిలాడీవనికూడా తెలుసు నివేదితా... కానీ, నేను నిన్ను మించినవాడినని గుర్తుంచుకో...!”

ఆ మాటల వింటూనే ఉలిక్కిపడ్డట్లుగా రిసీవర్ వంక చూస్తూ ఉండిపోయింది– ఎవరు మాట్లాడుతున్నది, ఏం మాట్లాడుతున్నది కూడా అర్థంకానట్లుగా.

“ఎవరు?... ఎవరు?” అన్నాననే అనుకున్నది గాని నోరు పెగలటంలేదు. ఒళ్ళంతా చెమటలు పడుతోంది అతడి మాటలకు.

“ఇంకా నన్ను గుర్తు పట్టలేదా? రెండుసార్లు నన్ను పోలీసులకు పట్టించినదానివి... ఎట్టి పరిస్థితులలోనూ నిన్ను వదిలిపెట్టను... పాతాళంలో వున్నా జుట్టుపట్టుకు బయటకు లాక్కువచ్చి నేననుకున్నది చేసితీరతానుగాని నీవలన పొందిన

అవమానాలను సహిస్తూ ఊరుకోను!"

భయంతో వణుకుతూనే, "ఎవరు మాట్లాడేది?" అన్నది నంగినంగిగా నివేదిత.

అతడు పకపకా నవ్వాడు. "నీ పాలిట యముణ్ణి... శంకర్‌ని... విజయవాడలోనే కాకుండా జహీరాబాద్‌లో కూడా నన్ను పోలీసులకు అప్పగించినదానివి... అంత తొందరగా ఎలా మర్చిపోయావ్?"

"నిన్ను పోలీసులకు పట్టించింది నేను కాదు!" ధైర్యం తెచ్చుకొని గొంతు పెగల్చుకొని అన్నది.

"నువ్వు చాలా తెలివిగలదానివని నాకు తెలుసు... నా జీవితంలో ఓ ఆడదాని చేతిలో దెబ్బతినటం– అందునా రెండు సార్లు– ఇదే మొదటిసారి. నిన్ను చూస్తుంటేనే నా ఒళ్ళు కుతకుతలాడిపోతోంది. నా కళ్ళల్లో పడ్డ అందమైన ఆడపిల్లనెవరినీ ఇంతవరకూ నేను వదిలిపెట్టలేదు... నీకూ త్వరలో ముహూర్తం పెట్టక తప్పదు... రోజులు లెక్కపెట్టుకోవటమే నువ్వు చేయవలసిన పని..." ఫోన్ పెట్టేసిన శబ్దం.

అసలే నీరసంగా వున్న ఆమె మరింత నీరసంగా బెడ్‌మీద వెనక్కు వాలిపోయింది భయంతో. చేతిలో రిసీవర్ అలాగే వున్నది. గుండె దడదడలాడుతోంది. ఇదెక్కడి పీడా తనకు. తనకీ సివిల్స్ పరీక్ష కలెక్టరు ఉద్యోగం కోసం రాలేదు, తన ప్రాణం తీసేందుకు వచ్చింది. కళ్ళమ్మట నీళ్ళు గిర్రున తిరిగినయి.

తను ఆసుపత్రిలో వున్నట్లుగా తన ఇంట్లోవాళ్ళకు, అపరంజి, అఖిలకు తప్ప మరెవ్వరికీ తెలియదు. మరి అది శంకర్ దాకా వెళ్ళిందీ అంటే అతడు సామాన్యుడు కాదు.

గంట తరువాత తల్లి అన్నపు క్యారియర్ తీసుకువచ్చే వరకూ మగతతోగూడిన భయంతో అలాగే మంచంమీద ముడుచుకొని పడుకొని వుండిపోయింది. మనసంతా చీకటి ఆవరించినట్లుగా వున్నది.

తల్లి లోపల కాలు పెడుతుండగానే, "అమ్మా! నేను ఆసుపత్రిలో వున్నట్లు

ఎవరికైనా చెప్పావా?" అడిగింది మంచంమీద చటుక్కున లేచి కూర్చుంటూ.

"అవును... గంట క్రితం హైదరాబాద్‌నుంచి నీ హాస్టల్ రూంమేట్ నిర్మల ఫోన్‌చేస్తే చెప్పాను... నీకు చేసిందా... నీ కొత్త సెల్‌నంబరు ఎవ్వరికీ ఇవ్వొద్దన్నావు కదా అని ఆసుపత్రి నంబరు ఇచ్చాను!"

"ఏం అడిగింది?" ఆత్రంగా అడిగింది లేచి కూర్చుంటూ.

"ఏమీలేదు... నివేదిత హైదరాబాద్‌లో తగిలిన ఆ షాక్‌నుండి బాగా కోలుకున్నదా ఆంటీ అన్నది. మేమే ఇంకా కోలుకో లేకపోతున్నాం, అది అప్పుడే ఎక్కడ కోలుకుంటుంది అని చెప్పాను నేను... జ్వరమొస్తుంటే ఆసుపత్రిలో జేర్చామనటంతో అ అమ్మాయీ కంగారు పడిపోయింది!"

తలవంచుకు కూర్చున్నది నివేదిత.

"రెండు మూడు రోజులబట్టీ నీతో మాట్లాడాలని నీ సెల్‌కు ప్రయత్నిస్తుంటే అది కవరేజ్ యేరియాలో లేదంటూ సమాధానమొస్తున్నదట... అందుకే ల్యాండ్‌లైన్ నంబరును వార్డెన్‌ను అడిగితీసుకొని చేస్తున్నానన్నది... ఒకసారి నివేదితతో మాట్లాడతాను హాస్పిటల్ నంబరు ఇస్తారా అని అడిగింది... అప్పుడు ఈ ఆసుపత్రి ఫోన్ నంబరు, నీ రూం నంబరు అన్నీ చెప్పాను... ఆ అమ్మాయికూడా చాలా బాధపడుతున్నది నీ విషయంలో!" క్యారియర్ టేబుల్ మీద పెడుతూ అన్నది.

తనేం మాట్లాడాలో అర్థంకానట్లుగా అయోమయంగా తల్లినే చూస్తూ ఉండిపోయింది నివేదిత.

అంతకు క్రితంరోజు హైదరాబాద్‌లో...

నివేదిత వయస్సులోనే వున్న ఓ అమ్మాయి ఉదయం పదిగంటల సమయంలో దిల్‌షుక్‌నగర్‌లోని సంత్‌సాయీరాం ఇనిస్టిట్యూట్ వారి సివిల్స్ కోచింగ్‌సెంటర్ లేడీస్‌హాస్టల్‌ముందు ఆటోదిగి లోపల వార్డెన్ దగ్గరకు వచ్చింది. ఆమె చేతిలో ఓ సూట్కేసు వున్నది.

"నివేదిత కావాలండీ! రూం నంబరు చెబుతారా?" అన్నది.

"మీరెక్కడనుంచి వస్తున్నారు?" అడిగింది వార్డెన్ నుదురు చిట్లించి, ఆ అమ్మాయి చేతిలోని సూట్కేస్‌ను చూస్తూ.

"ముంబయ్‌నుంచి వచ్చానండీ... అది ఇక్కడ మీ సెంటర్‌లో జేరినప్పటినుండి హైదరాబాద్ రమ్మనమని ఫోన్ చేస్తుంటే నాకు ఇప్పటికి వీలుచిక్కింది... ఇద్దరం మంచి స్నేహితులం!..." అన్నది.

వార్డెన్ ఆ అమ్మాయి మాటలు వింటూనే, "నివేదిత మా ఇనిస్టిట్యూట్‌లో కోచింగ్ మానేసి వెళ్ళిపోయిందిగదా! మీకు చెప్పలేదా?" అన్నది.

"అదేమిటి? ఎన్నాళ్ళయింది... ఎక్కడకు వెళ్ళింది?" ఆదుర్దాగా అడిగింది. "నాకు ఫోన్ చేయనేలేదు... నేనూ ఇక్కడ ఒక ఇంటర్వ్యూవుంటే, ఎట్లాగయినా మూడు నెలలు ఉంటానన్నది కదా అని రెండూ కలిసొచ్చేలా ప్లాన్ చేసుకు వచ్చాను... వచ్చేముందు రెండు మూడుసార్లు చేసినా సెల్ కనెక్ట్‌కాలేదు... చదువుకి అవరోధంగా వుంటుందని స్విచ్ ఆఫ్ చేసిందేమో అనుకున్నానేగాని, వెళ్ళిపోతుందని తెలిస్తే ముందే వచ్చి ఉండేదాన్ని!" అన్నది బాధపడుతూ. "అవునూ... ఎందుకు మానేసింది ఇక్కడ... మరేదైనా కోచింగ్ సెంటర్‌లో జేరిందా?"

"లేదండి... విజయవాడ వెళ్ళిపోయింది!"

"అంత అకస్మాత్తుగా వెళ్ళిపోయిందంటే... అనారోగ్యంతో కాదుగదా!"

"అదేంకాదు... అనుకోకుండా ఓ దుర్ఘటన జరిగింది... ఆ అమ్మాయిని ఎవరో కిడ్నాప్ చేశారు... పోలీసులు కొన్ని గంటల్లోనే కిడ్నాపర్స్‌ను పట్టుకొని ఆ అమ్మాయిని సురక్షితంగా తీసుకురాగలిగారుగాని, దాంతో బాగా భయపడి ఇక్కడ వుండనంటూ వెళ్ళిపోయింది! నివేదిత పేరెంట్స్ గూడా ఇంకా ఉంచటానికి ఇష్టపడలేదు!"

"నిజంగానా... అయ్యో ఎంతపని జరిగింది... డబ్బుకోసమేనా కిడ్నాప్ చేసింది?"

"తెలియదు..."

వాళ్ళ నడుమ కొద్ది నిముషాలు నిశ్శబ్దమేర్పడింది.

"ఏమనుకోకుండా ఒక్క పనిచేస్తారా... విజయవాడలో వాళ్ళ ఇంటి ఫోన్ నంబరు నా దగ్గరలేదు... మీ దగ్గరుంటే ఇవ్వగలరా... అది అంత బాధలో వున్నప్పుడు తప్పకుండా వెళ్ళి ఒకసారి చూసి ఓదార్చి రావాలనిపిస్తోంది... ఎటూ ముంబయ్‌నుండి ఇంతదూరం వచ్చానుగదా... ఇంటి అడ్రసువుంటే చెప్పండి... లేకపోయినా ఫోన్‌నంబరు దొరికినా చాలు... మరొక్క విషయం... అది ఇక్కడ రూంలో సింగిల్‌గా వుండేదా ఇంకెవరితోనైనా కలిసివుండేదా... మీ దగ్గర వివరాలు లేకపోతే వాళ్ళయినా చెప్పగలరేమో కనుక్కోవచ్చు!"

"నిర్మలతో కలిసి వుండేది... ఇప్పుడు ఆ అమ్మాయి క్లాసులో వున్నది... మీకు కావాల్సింది విజయవాడలో వాళ్ళ ఇంటి ఫోన్ నంబరూ, అడ్రసే కదా... మా రికార్డ్స్‌లో ఉంటయిలేండి... నేనిస్తాను... నివేదిత చాలా తెలివిగలదని మా ఇన్‌స్ట్రక్టర్స్ అంటుండగా విన్నాను... మానేసి వెళ్ళిపోతుంటే చాలా బాధ వేసింది!"

"నాకూ అలాగే వున్నదండి... దాన్ని వెళ్ళి చూచి మాట్లాడితేనేగాని నా మనసుకు తృప్తిగా వుండదు!"

నివేదిత పూర్తి వివరాలతో పది నిముషాలల్లోనే ఆ హాస్టల్‌నుండి బయటకు వచ్చిన ఆ అమ్మాయి అక్కడికి దగ్గరలోనే హోటల్లో కూర్చుని వున్న శంకర్, కృష్ణదేవుడు ఎలియాస్ శంభు ఎలియాస్ త్రినేత్రుడు దగ్గరకు హుషారుగా వెళ్ళింది తను వెళ్ళిన పని విజయవంతంగా ముగియటంతో.

* * *

"కామాక్షీ! నేను అపరంజిని... అంకుల్ ఉన్నారా ఇంట్లో?"

అప్పుడు రాత్రి పది గంటలయింది. అంతకు పావుగంట క్రితమే నివేదితనుండి ఆమెకు ఫోన్ వచ్చింది.

"ఏమిటి... కొత్త సమస్య ఏమైనా వచ్చిందా?" అన్నది నవ్వుతూ కామాక్షి.

"సమస్యలన్నీ నివేదితకే వస్తున్నాయి... వాటికి తోడు అనారోగ్యంతో ఆసుపత్రిపాలయింది... శంకర్‌గాడి గొడవతో దిగులుపడినట్లున్నది!"

"బయటపడింది కదా ఇంకా దేనికి దిగులు? మళ్ళా ఏమైనా జరిగిందా?"

"వాడు ఆ అమ్మాయిని వదిలేలా లేదు... దాని ఫోన్ నంబర్ సంపాదించి అంతుచూస్తానంటూ ఫోన్ చేశాడట!"

"అయ్యో!... ఇదెక్కడి గొడవే!" అంటూ బాధపడింది కామాక్షి. "నాన్న ఇంట్లోనే ఉన్నారు... ఇస్తానుండు!"

ఆయన లైన్లోకి వస్తూనే, "చెప్పమ్మా! ఏమిటి సంగతి?" అన్నారు.

"అంకుల్! ఆ శంకర్‌గాడు నివేదితను బెదిరిస్తూ ఫోన్ చేశాడు... వాడిని ఎలాగైనా పట్టుకొని జైల్లో పడేస్తేనేగాని ఆ అమ్మాయి బయట తిరగగలిగేలా లేదు... వాడివలన దాని జీవితం నాశనమయ్యేలా వున్నది!" అన్నది బాధతో అపరంజి.

"ఆ అమ్మాయి నంబరు వాడికెలా దొరికింది?"

"అదే అర్థం కావటంలేదు... వాడి చెంచా ఆటో డ్రైవర్‌కు నివేదిత హాస్టల్లో వున్న సంగతి తెలుసు... బహుశః అక్కడే సంపాదించి వుంటాడని అనుమానంగా వున్నది!"

"సెల్‌కు చేశాడా?... ల్యాండ్‌లైన్‌కు చేశాడా?"

"కిడ్నాప్ చేసినప్పుడు ఆ ఆటోడ్రైవరు దాని సెల్ లాక్కొని నీళ్ళ గుంటలో పారేశాడు గదా... విజయవాడ వెళ్ళింతరువాత కొత్త సెల్ కొనుక్కున్నది... ఆ నంబరు వాళ్ళ అమ్మకు, నాన్నకు, నాకూ తప్ప ఎవరికీ చెప్పలేదు... నివేదితకు జ్వరమొస్తుండటంతో ఆసుపత్రిలో జేర్చారు... ఇంటికి ఎవరో ఆడమనిషి దాని ఫ్రెండ్‌నంటూ ఫోన్‌చేసి నివేదితతో మాట్లాడతానంటే వాళ్ళమ్మ ఆసుపత్రి వివరాలు చెప్పటంతో అక్కడకు చేశాడు శంకర్!"

"ఐసీ!"

"మీ డిపార్ట్‌మెంట్ అతడు ఎక్కడనుంచి ఫోన్ చేసిందీ కనిపెట్టలేరా, అంకుల్!" ఆత్రంగా అడిగింది.

"ఆ అమ్మాయి ఆసుపత్రిలో వున్నదంటుంటివి... ఆసుపత్రి నంబరుకు ఎప్పుడూ ఏవో ఫోన్లు వస్తునే వుంటయి... ఈ అమ్మాయి రూంకు కనెక్ట్ చేసిన నంబరునుబట్టి తెలుసుకోవాలి... అది అంత తేలిక అనుకోను... కష్టపడి నంబరును పట్టుకున్నా అది ఏ కాయిన్‌బాక్స్‌దో అయివుంటుంది. మహా అయితే అతడు ఏ ఊరునుంచి చేసిందీ తెలుసుకోవచ్చు... నేను మావాళ్ళతో మాట్లాడతాను... ఆ అమ్మాయి వున్న ఆసుపత్రి వివరాలు, ఫోను నంబరు, తీసుకో... ఒక పని చేయమను... జ్వరం తగ్గితే డిశ్చార్జ్ అయి వెంటనే ఆ పబ్లిక్ ప్లేస్‌నుండి ఇంటికి వెళ్ళిపొమ్మను... ఇంటినుంచి ఎట్టి పరిస్థితులలోనూ కొన్నాళ్ళపాటు బయటకు రావద్దని చెప్పు... కొత్తవాళ్ళనెవరినీ– ఆడగాని, మగగాని– ఇంట్లోకి రానీయవద్దని పేరెంట్స్‌కు చెప్పమను... నేనూ ఎస్పీతో మాట్లాడతాను ఏం చేస్తే బాగుంటుందో ఆలోచించమని... వీలుంటే ఆ అమ్మాయికి సెక్యూరిటీ ఎరేంజ్ చేయమని చెబుతాను... ఓకే!..."

"ఓకే అంకుల్!... మీకు శ్రమ ఇస్తున్నాను!..."

"ఏం ఫరవాలేదమ్మా... ఇది మా డ్యూటీలో భాగమే!"

"ఇప్పుడు ఇదేకాదు... మరో సమస్యకూడా వచ్చింది అంకుల్!" అన్నది చిన్నగా, చెప్పటానికి ఇబ్బంది పడుతున్నట్లుగా గొంతు తగ్గించి.

"చెప్పమ్మా... సమస్య అంటూ వచ్చినప్పుడు చెప్పేయటమే... ఏం చేస్తే బాగుంటుందో ఆలోచించవచ్చు!"

"డిఎన్ఏ టెస్ట్‌లో నేనూ, నివేదితా ఒకే తల్లికి పుట్టినట్లుగా వచ్చిందిగదా... ఆపైన మా ఇద్దరి పుట్టిన తేదీలు ఒకటే అవ్వటంతో కవలలమయి వుంటామని అనుకుంటున్నాం ఇప్పటివరకు... ఆ టెస్ట్ రిజల్ట్ సరిగ్గానే ఉంటుందంటారా అంకుల్!"

"అనుమానించాల్సిన పనేలేదు... అది కరెక్ట్‌గానే వుంటుంది... అంతేకాదు ఇద్దరూ ఒకేరోజున ఒకే పోలికలతో పుట్టినప్పుడు కవలలే అవ్వాలి మరి!"

"కానీ నేను పుట్టిన నర్సింగ్‌హోం రికార్డులలో మా అమ్మకు ఆ రోజున ఒకే ఆడపిల్లపుట్టినట్లుగా వున్నది, అంకుల్!"

* * *

"అంజీ! నా బుర్ర తిరిగిపోతుంది మీ అత్తతో... మా అత్త ఇంకా బయటపడలేదుగదా మన విషయంలో... ఎలా ఆమెకు నచ్చజెప్పాలో అర్థం కావటంలేదు... ఇది ఇలా వుంటే మధ్యలో మరో సమస్య... ఇవ్వాళ ఆఫీసుకు వెళ్ళగానే మా బాస్ పిలిచి చెప్పాడు– అమెరికా వెళ్ళాల్సింది పదిరోజుల్లోనే– తయారుగా ఉండమంటూ!"

సాయంత్రం ఆఫీసునుంచి సరాసరి మేనత్త ఇంటికి వచ్చాడు. అంతకుముందే ఆమె దగ్గరలోవున్న బంధువుల ఇంటికి వెళ్ళింది– వాళ్ళను చూసి చాలా రోజులవ్వటంతో. అపరంజి ఒక్కతే ఇంట్లో వున్నది.

"అది పాతగోలే గదా... ఇంతకీ అమెరికా గోల ఎన్నాళ్ళట?" అపరంజి అడిగింది దిగులుగా ముఖంపెట్టి.

"నెల రోజులన్నాడు... అక్కడకు వెళ్ళిం తరువాత పనినిబట్టి అవసరం పడితే మరో వారం రెండు వారాలు ఉండాల్సి రావచ్చు అన్నాడు... ఎన్ని రోజులయినా పని పూర్తిచేసి రావాలిగదా!"

అపరంజి అతడి మాటలకు మరింతగా నీరసపడిపోయింది.

"అక్కడకు వెళ్ళేందుకు నిన్ను మించిన మొనగాడు మరోడు దొరకలేదటనా?" చికాగ్గా అన్నది.

"ఆ ప్రాజెక్ట్ చేస్తున్నది నేను... తప్పదు నేనే వెళ్ళాలి!"

"కాఫీ కలుపుకు వస్తా!" అన్నది లేస్తూ.

"మా అత్త చేసినవి తింటానికి ఏమైనా ఉంటే పట్టుకురా!"

"చేగోడీలు వున్నయి... తెస్తాలే!"

"చెప్పేది పూర్తిగా విని వెళ్ళు... నేను అమెరికా వెళ్ళేలోగా మన పెళ్ళిసంగతి వాళ్ళు తేల్చకపోతే మనమే కానిచ్చేసుకొని– మీరేం చేసుకుంటారో చేసుకోండి అని ఇంటికి వచ్చేద్దాం?... అలా చేస్తే ఎలా ఉంటుందంటావ్... తరువాత వాళ్ళు చేయగలిగిందేమున్నది... ఇంట్లోనుంచి వెళ్ళగొడతారా?" అన్నాడు గుసగుసగా అపరంజి చెవిదగ్గర అతడు నోరు జేర్చి.

అపరంజి అతడిని ఒక్కతోపు తోసి లేచి వంటింట్లోకి వెళుతూ, "నీసంగతి నాకు తెలియదుగాని ఆ మాట వినటం ఆలస్యం మా అమ్మ నా తాట వలుస్తుంది... కావాలంటే ఇద్దరం ముందే పెద్దవాళ్ళకు స్పష్టంగా చెప్పి వెళ్ళి రిజిస్టర్డ్ మ్యారేజ్ చేసుకుందాం! అనవసరపు నాటకాలాడొద్దు!"

"ఇదెక్కడ దొరికిందిరా బాబో!" నెత్తిన చేతులు పెట్టుకొని వెనక్కు వాలిపోయాడు సుధీర్.

* * *

సెల్ రింగవుతుంటే లైటార్పి పడుకున్నదల్లా లేచి, టీపాయ్ మీదనున్న దాన్ని అందుకొని ఎవరు చేశారా అని చూసింది, అర్థరాత్రప్పుడు, అపరాత్రప్పుడు కబుర్లు చెప్పేందుకు ఫోన్లుచేసేది బావే అయివుంటాడులే, మళ్ళా కొత్త ఆలోచన వచ్చివుంటుంది– అనుకుంటూ.

డిస్ప్లే అయివున్నది కొత్తనంబరు... కొత్తనంబరు అనుకుంటుండగానే శంకర్ గుర్తుకు వచ్చాడు. గుండె గుబగుబలాడింది. తన నంబరూ పట్టుకున్నాడా వాడు?

భయం భయంగా ఆన్ చేసింది అపరంజి. భయమంటూ ఏర్పడకూడదుగాని, ఏర్పడితే తన నీడకూడా దయ్యంలానే కనబడుతుంది.

"నమస్తే, భాభీ! నేను అభిని... మీ చెల్లెలు నివేదితకు స్నేహితుడిని... కోల్‌కతా వాసిని!" అతడి మాట చాలా మృదువుగాను, సౌమ్యంగాను వున్నది. భాభీ అనటంతో ఎంతో ఆత్మీయంగా పలకరించినట్లేవున్నది.

"నమస్తే... నమస్తే!" అన్నది కించిత్ తడబడుతూ. "కోల్‌కతా నుండేనా మాట్లాడుతున్నది?"

– తన గురించి నివేదిత అతడికి అంతా వివరంగా చెప్పేవుంటుంది. లేకపోతే అతడు అంత చొరవగా ఫోన్ చేయడు.

"లేదు బాభీ! విజయవాడ వచ్చాను... పనిమీద చెన్నయ్ వెళుతూ, ఆ మధ్య జ్వరం వచ్చిందిగదా ఒకసారి వేదీని చూచి వెళ్దామని ఇక్కడ దిగాను... కానీ ఈ రోజే అది మళ్ళా హాస్పిటల్‌లో జేరింది!"

"అదేమిటి... తగ్గి డిశ్చార్జ్ అయి వారం రోజుల క్రితమే ఇంటికి వెళ్ళింది కదా... కాస్త నీరసంగా ఉన్నానని మాత్రమే చెప్పింది నాకు!"

"లేదు... రాత్రే మళ్ళా ఎక్కువగా జ్వరం రావటంతో హాస్పిటల్‌లో ఎడ్మిట్ చేశారు... బాగా భయపడుతున్నది... నన్ను పట్టుకొని చాలాసేపు ఏడుస్తూ ఉండిపోయింది... అంత బాధలోనూ తన జీవితం కాలి బూడిదయిపోకుండా మీరు ఎలా రక్షించింది చెప్పింది!"

ఏం మాట్లాడాలో తెలియనంతగా నీరసపడిపోయింది అపరంజి.

"మీరూ డాక్టరే కదా... ఏమిటి దాని పరిస్థితి!"

"ఇక్కడ డాక్టర్లతో మాట్లాడాను... ఏమేం పరీక్షలు చేయిస్తే బాగుంటుందో వాళ్ళతో చర్చించాను... నేను చెన్నయ్‌లో మూడు రోజులుండాలి... సెమినార్ జరుగుతోంది... మా ఆసుపత్రి తరఫున డెలిగేట్‌గా వెళుతున్నాను... అక్కడ పేపర్ ప్రెజంట్ చేయాలి... అది అయి తిరిగి వెళుతూ మళ్ళా విజయవాడ వస్తాను... అప్పటికి రిపోర్టులన్నీ వస్తయి కాబట్టి ఆ అనారోగ్యానికి కారణమేమిటో

తెలుసుకోవచ్చు... మీరు కాని రాగలుగుతారా విజయవాడకు!... ఆమె మనసంతా మీరే నిండి ఉన్నారు... మిమ్మల్ని చూడాలని వేదీ తహతహలాడుతున్నది!" అతడు ఆ మాటలు చిన్నగా అన్నా చాలా స్పష్టంగా వున్నయి.

తను విజయవాడ వెళ్ళి వాళ్ళవాళ్ళందరికీ కనబడితే పరిణామం ఎలా ఉంటుందో ఊహించటానికే భయపడుతోంది అపరంజి!

– కానీ తను అక్కడకు వెళ్ళక తప్పని పరిస్థితి కొద్దిరోజుల్లోనే వస్తుందని ఆ క్షణాన ఆమె గ్రహించలేకపోయింది!

# 13

అభి అంత ఆప్యాయంగా మాట్లాడుతుంటే తను కచ్చితంగా విజయవాడకు రాలేనని చెప్పలేకపోయింది.

"నా మనసూ నివేదితతోనే నిండివున్నది... చూద్దాం... అన్నీ సానుకూలమయిన రోజున తప్పకుండా వస్తాను!" అన్నది అపరంజి.

"నమస్తే భాభీ! ఉంటాను!" అన్నాడు అభి వినయంగా.

"నాదో చిన్న అనుమానం... మీరు బెంగాల్లో పుట్టి పెరిగారుకదా ఇంత చక్కటి తెలుగు ఎలా మాట్లాడగలుగుతున్నారు?" ఆసక్తితో అడిగింది.

అతడు నవ్వాడు. "మా తాతలకాలంలో మేం గుంటూరునుంచి కోల్‌కతా వెళ్ళామట... అప్పటినుంచీ అక్కడే వున్నాం... మా ఇంట్లో ఇప్పటికీ తెలుగే మాట్లాడుకుంటాం!"

నివేదితను 'వేదీ' అని పిలచేటంత దగ్గరవాడయ్యాడంటే అది మామూలు స్నేహంకాదు, అతడి హృదయమంతా ఆ అమ్మాయి మీద ప్రేమతో నిండి ఉండాలి!

* * *

మరునాడు రాత్రి అపరంజి నివేదితకు ఫోన్‌చేసింది. క్రితం రోజు అభి చేసిన వెంటనే చేద్దామనుకున్నది కాని, అతడు ఆమె పక్కనే ఉంటాడనే ఉద్దేశ్యంతో ఆగింది.

అటు నివేదిత సెల్ ఆన్‌చేయగానే, "వేదీ!" అన్నది ఆప్యాయతలో రంగరించి పలికిందామాట.

అపరంజి పిలుపుకు ఉలిక్కిపడినా ఆ కంఠం వింటూనే నివేదిత వలవలా ఏడ్వసాగింది. "అక్కా! నా జీవితం ముగింపు దశకు వస్తున్నట్లుగా తోస్తోంది... మళ్ళా జ్వరం రావటంతో ఆసుపత్రిలో జేరాను... బాగా నీరసంగా వున్నది... కొద్దిపాటి జ్వరమే అంటున్నా, అంత బలహీనత ఎలా వచ్చిందో అర్థం కావటంలేదు... ఇదేదో నన్ను కబళించేందుకే వచ్చిన మాయదారి రోగంలా వున్నది!"

"ఎందుకట్లా ఊహించుకుంటావ్... అభి చెప్పాడు... ఈ జ్వరం పెద్ద సమస్యకాదని!" ధైర్యం చెబుతున్నట్లుగా అన్నది. "నువ్వు మంచి తిండి తినాలి... జ్వరం తగ్గాలీ అంటే శరీరంలో శక్తి రావాలి... ఆంటీకి చెప్పు చారన్నంకాదు పుష్టిగల పదర్థాలను తయారుచేసుకు రమ్మనమని!" చిన్నగా నవ్వుతూ అన్నది. "నువ్వు అనవసరంగా భయపడుతున్నావు... దాన్ని ముందు పోగొట్టుకో... నీకేమీ కాదు!" అన్నది ఓదారుస్తున్నట్లుగా.

"దేవుడు నాయందు కరుణించాలి కదా!"

"దేవుడు కాదు... పక్కన అభివుంటే నీకు అన్ని రోగాలు తగ్గుతయి... అవునూ... నీకు అతడు స్నేహితుడనే అన్నావుగాని... నేను భాభీ అయ్యేంత సన్నిహితుడని చెప్పనేలేదు... గుడ్‌లక్... అతడి మాట మధువును సేవిస్తున్నంత తీయగా వున్నది... అతడి సాంగత్యంలో నీ భవిష్యత్తు మూడుపువ్వులూ ఆరుకాయల్లా వెలిగిపోతుందనేది ఖాయం!" అన్నది ఆమె అంతరంగం తెలుసుకోవాలన్నట్లుగా కాస్తంత ముందుకో అడుగువేస్తూ.

నివేదిత అంత నీరసంలోనూ అపరంజి మాటలకు హాయిగా నవ్వింది. "నువ్వు చాలా తెలివిగలదానివని నాకు తెలుసు అక్కా!... అభి నీతో మాట్లాడిన అయిదు

నిముషాలలోనే మా మనసులను అర్థం చేసుకోగలిగావంటే– నువ్వు నా సోదరివయినందుకు గర్వంగా వున్నది!"

"నువ్వు త్వరగా కోలుకొని ఓ ఇంటిదానివి అయ్యే సమయానికి మన సమస్యలన్నీ మబ్బుల్లా విడిపోగా, నీ వివాహ వేడుకలో పెత్తనమంతా నాదే... బై!... గుడ్‌లక్!" సెల్ అఫ్‌చేసింది అపరంజి.

* * *

"అంజీ!" నాలుగు రోజుల తరువాత ఆ పిలుపు ఆమెకు అమృతపు జల్లులాగానే అనిపించింది. "నా అమెరికా ప్రయాణానికి వీసా, టికెట్టు వచ్చినయి!" అన్నాడు. "వచ్చే శనివారమే... అంటే ఇంకో వారం రోజులకు!"

"ఒక్కడివేనా... ఇంకెవరైనా వస్తున్నారా?"

"నువ్వు రానంటివి కదా... అదృష్టం... మా కంపెనీ నాకు కంపెనీ ఇవ్వటానికి ఈ ప్రాజక్టే చేస్తున్న మరో అమ్మాయిని కూడా పంపుతున్నారు... ప్రియంవద అని– నీకంటే కూడా బాగుంటుందిలే!" అన్నాడు నవ్వుతూ.

అపరంజికి అర్థమయిపోయింది తనను ఆటపట్టిస్తున్నాడని.

"మరోమాట కూడా అన్నాడు మా బాసు... రెండు సింగిల్ రూంలు తీసుకుంటే చాలా ఖర్చవుతుంది అక్కడ... ఓ డబుల్ తీసుకొని, నెలేగదా కళ్లుమూసుకో అంటూ... థాంక్స్ చెప్పాను ఆయన సలహాకు!"

"నీ బోడి కబుర్లకు నేనేం కుళ్ళుకోనుగాని... హోటల్‌వాళ్ళు ఒప్పుకుంటే ఒక సింగిల్‌లోనే ఇద్దరూ ఏడ్వవచ్చుకదా... ఇంకా డబ్బు కలిసొస్తుంది!" నొక్కి పలుకుతూ అన్నది. "ఇప్పుడే మీ బాసు నాకూ ఫోన్ చేశాడులే– 'అమ్మాయీ ఈపాటికి మీ పెళ్ళయివుంటే మీ ఇద్దరినీ కంపెనీ ఖర్చు మీద పంపేవాడిని కదా... మిస్ అయిపోయావ్ ఛాన్స్... ఏం చేస్తాం... నెక్స్ట్‌టైం బెటర్ లక్ అన్నాడు!" అన్నది అతడికి కనబడకపోయినా నాలిక బయటకు పెట్టి ఎక్కిరిస్తూ.

"నీ మొహం... మాబాస్‌కు తెలుగు రానేరాదు నీతో మాట్లాడటానికి... ఎనీహౌ... నువ్వు ఎయిర్‌పోర్ట్‌కు వస్తావు కదా... అక్కడ పరిచయం చేస్తానులే ఆ అమ్మడిని... ఇంతకీ రేపటి మన ప్రోగ్రాం సంగతి ఏమిటి?" మాట మారుస్తూ అన్నాడు.

"దేనికిట ప్రోగ్రాం!" విసురుగా అన్నది.

"ఇదెక్కడి బుద్ధూ దొరికిందిరా బాబూ నాకు... రేపు నా పుట్టినరోజే!"

"అయితే ప్రోగ్రాం నువ్వు చెప్పాలి...!" కాస్తంత కోపాన్ని తగ్గించుకుంటూ అన్నది.

"రుషికొండ బీచ్‌కి వెళదామా?"

"రాను!"

"భీమిలీ?"

"అసలు రాను!"

"మరెక్కడికి వెళదామంటావ్!" అరుస్తున్నట్లుగా విసుగ్గా అడిగాడు.

"కనకమహాలక్ష్మి టెంపుల్‌కుగాని, సింహాచలంగాని... తొమ్మిదింటికి బయల్దేరటం... రెండు చోట్లా దణ్ణం పెట్టుకొని వచ్చేయటమే!"

"అష్టోత్తరాలు, శతనామావళులు ఏమీ లేవా?"

"నీ ఓపిక బావా... ముందుగా జన్మదిన శుభాకాంక్షలు స్వీకరించు...!" హాయిగా నవ్వేస్తూ అన్నది. బావ పుట్టినరోజు అనే విషయం గుర్తుకు రావటంతో పూర్తిగా శాంతించింది. "తొమ్మిదింటికల్లా వచ్చేయ్... జీడిపప్పు వేసి, స్వచ్ఛమైన నేతితో ఉప్మా చేస్తాను తిని బయల్దేరదాం గుళ్ళకు ... స్వామీ! మధ్యాహ్నం భోజనం మీ అత్త చేతివంటే!"

"మా అమ్మ నా పుట్టినరోజని కూడా చూడకుండా తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతుంది... నువ్వే వచ్చి మీ అత్త వంట రుచిచూడు!"

"ఏం అమ్మా... పెళ్ళయిందాకా నువ్వే నామాట వినొచ్చుగదా... తరువాత ఎలాగూ శాస్త్రప్రకారం నీ మాట నేను వినాలి!" అన్నది కొంటెగా.

"అసలు ఈ అత్తలగొడవలు, నీ ఉప్మాసంగతి వదిలేసేయ్‌గాని... ఎనిమిదింటికల్లా వస్తాను... రెడీగా వుండు... సింహాచలంలో పులిహోర ప్రసాదం బాగుంటుంది బ్రేక్‌ఫాస్ట్ అక్కడే... రెండు గుళ్ళకూ వెళ్ళిం తరువాత ఏదైనా స్టార్ హోటల్లో భోజనం చేద్దాం... కడుపునిండా తిని కైలాసగిరికి వెళ్ళి కబుర్లుచెప్పుకుంటూ చెట్లక్రింద కూర్చొని అయిదింటికల్లా కొంపలకు జేరదాం!... రోజంతా మనిద్దరమే!... ఆ క్షణాలే నాకు అమెరికానుండి తిరిగి వచ్చేటంత వరకూ పంచదార చిలకలు!"

"ఫైన్ యార్!"

మరునాడు ఉదయాన ఎనిమిదింటికల్లా సుధీర్ వచ్చి కారు హారన్ కొట్టాడు. అప్పటికే తయారయివున్న అపరంజి పరుగెత్తుకుంటూ వంటింటి గుమ్మం దగ్గర నిలబడి, "అమ్మా సింహాచలం వెళుతున్నాం నేనూ, బావా?" అన్నది పెద్దగా.

"ఇప్పుడు దేనికే?" అన్నది చిరాగ్గా ఆమె.

"బావ పుట్టినరోజుగదా... స్వామిని దర్శించుకుందామని... అట్లాగే కనకమహాలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజ చేయించి వస్తాంగాని... నాకు అన్నం వండబోకు!... బై!"

కూతురు మాటలకు నోరు తెరుచుకు చూస్తున్న ఆమె కోలుకొని నోరు తెరిచేలోగానే అపరంజి కారెక్కి ముందు సీట్లో బావపక్కన కూర్చున్నది!

సింహాచలం కొండెక్కి ఉగ్రనరసింహస్వామి దేవాలయం ముందు కారు దిగేటప్పటికి ముప్పావుగంట పట్టింది.

పూజా ద్రవ్యాలు కొనుక్కొని, ఎత్తుమెట్లెక్కి వెయ్యి సంవత్సరాలకు పైగా చరిత్రవున్న ఆ దేవాలయంలోపలకు వెళుతుంటే, ఎన్నిసార్లువెళ్ళినా భక్తులకు వింత అనుభూతే కలుగుతుంటుంది.

చల్లటిగాలి, ఆహ్లాదకరమైన వాతావరణం. గాలిగోపురం దాటుతూ వెనక్కు తిరిగి చూస్తే చుట్టూ ఆకుపచ్చని రంగు పులిమినట్లుగా చెట్లు కనువిందు చేస్తున్నాయి. లోపలకు వెళ్ళి పూజకు టిక్కెట్టు తీసుకొని ప్రత్యేక దర్శనం క్యూలో నిలబడ్డారు ఇద్దరూ.

వాళ్ళవంతు వచ్చి పూజ అయి తీర్థప్రసాదాలు తీసుకొనేటప్పటికి మరో అరగంటపట్టింది. ప్రధాన దేవాలయ ద్వారం దాటి బయటకు వస్తూనే ఎడం వైపు వున్న కప్పస్థంభం దగ్గరకు వెళ్ళారు. స్థలపురాణం ప్రకారం ఆ స్థంభాన్ని సంతాన గోపాలయంత్రం వేసి నిలబెట్టారు. దాన్ని కౌగిలించుకొని మనస్సులో కోరిక అనుకుంటే నెరవేరుతుందనేది భక్తుల విశ్వాసం. పిల్లలు లేనివారికి పిల్లలు పుడతారనేది చాలామంది నమ్మకం. అది కౌగిలించుకోవటానికి టిక్కెట్టు తీసుకోవాలి.

సుధీర్ రెండు టిక్కెట్లు తీసుకొని ఒకటి అపరంజికిచ్చాడు.

ఆమె వెళ్ళి ఆ స్థంభాన్ని కౌగిలించుకొని కళ్ళుమూసుకున్నది. తన మనస్సులోని కోరికను స్వామికి విన్నవించుకుంటున్నట్లుగా ఆమె పెదవులు కదలాడుతున్నాయి. తరువాత తృప్తిగా కళ్ళుతెరిచి ఇవతలకు వచ్చింది. వెంటనే సుధీర్ వెళ్ళి కౌగిలించుకొని రెండు నిముషాలు అలాగే వుండిపోయాడు.

ఆ ఆవరణలోనే అద్భుతమైన శిల్పాలు చెక్కిన తొంభై ఆరు స్థంభాల మండపం వున్నది. దాన్ని చూసిం తరువాత ప్రసాదాలు అమ్మే చోటకు వెళ్ళి రెండు లడ్లు, పులిహోర ప్యాకెట్లు తీసుకొని పక్కగా వున్న గట్టుమీద కూర్చొని వాటిని తిని బయటకు వచ్చారు.

కనకమహాలక్ష్మి దేవాలయంకు వచ్చేటప్పటికి పన్నెండు గంటలయింది.

అమ్మవారికి దేవాలయం అంటూ ఏమీ లేదు. భక్తులు ఎవరికి తోచిన విధంగా వాళ్ళు పూజలు చేసుకోవచ్చు. సామాన్యంగా దర్శనానికి వచ్చిన ప్రతివారూ పసుపు కుంకుమలు సమర్పించి క్షీరాభిషేకం చేస్తారు.

అపరంజి పసుపుకుంకుమలను, పాలప్యాకెట్టును కొనుక్కువచ్చింది. ఇద్దరూ వెళ్ళి పూజచేసి బయటకు వచ్చేటప్పటికి ఒంటిగంటయింది.

"తరువాయి కార్యక్రమం తల్లీ... ఇంతవరకూ నువ్వు కోరినట్లే చేశాను గదా... ఇక నా ఇష్టప్రకారం నాకు నచ్చిన హోటల్‌కు భోజనానికి వెళదాం!" అన్నాడు సుధీర్.

"బావమాట బంగారు మూట!" అన్నది అపరంజి హాయిగా నవ్వేస్తూ.

ఇద్దరూ హోటల్ డాల్ఫిన్‌కు వెళ్ళారు. భోజనం చేసి కాసేపు లాంజ్‌లో కూర్చొని మూడు గంటలప్పుడు బయటకు వచ్చారు.

"కైలాసగిరికి వెళ్ళి చెట్లక్రింద ఓ గంట సేపు సముద్రపు గాలులు పీలుస్తూ కూర్చుందామా మేడమ్!"

"శుభమ్!" అన్నది అపరంజి హుషారుగా.

చెట్లక్రింద జేరేటప్పటికి పావు తక్కువ నాలుగయింది. వాతావరణం చల్లగా వుండటంతో అప్పటికే చాలామంది వచ్చి కొండమీద తిరుగుతున్నారు. పిల్లలు ఆడుకుంటున్నారు. కెమేరాలు తెచ్చుకున్నవాళ్ళు ఫొటోలు దిగుతున్నారు. ఓ పక్కగా జనం అంతగా లేని చోటకు వెళ్ళి అపరంజి సుధీర్ ఓ చెట్టు క్రింద పచ్చగడ్డిలో కూర్చున్నారు. సుధీర్ అయితే పరుపులా వున్న గడ్డిమీద కూర్చుంటూనే వాలిపోయాడు.

"నిన్న రిజిస్ట్రారు ఆఫీసుకు వెళ్ళి కాగితాలు పట్టుకు వచ్చాను... నీది పాస్‌పోర్ట్ సైజు ఫొటో కావాలి... నాదైతే రెడీగానే వున్నది!" అన్నాడు మెడ కాస్త పైకి ఎత్తి తన పక్కగా కూర్చున్న అపరంజితో.

"అత్తయ్యను ఒప్పించలేకపోతున్నావా?" అన్నది నుదురు ముడివేస్తూ అపరంజి.

"ఆమెగారయితే మెట్టు దిగటంలేదు... గుళ్ళో పెళ్ళంటే న్యాయశాస్త్రంలో ఏదో ఒక సెక్షన్‌ను బయటకు లాగి ఆ పెళ్ళి చెల్లదంటూ మీ మామ తీర్పు ఇచ్చేస్తాడు అత్త పోరు పడలేక... అందుకే శుభ్రంగా వెళ్ళి ఎవరూ కాదనలేని సంతకాల పెళ్ళి

చేసుకోవటమే ఉత్తమం అనిపిస్తోంది నాకు!" మాటల్ని ఒత్తి పలుకుతూ అన్నాడు.

ఆమె ఏదో ఆలోచిస్తూ కొద్దిగా దగ్గరకు జరగటంతో చేయిపట్టుకొని మీదకు లాక్కోబోయాడు.

"ఊఁ..." కళ్ళు పెద్దవిచేసుకొని ఉరిమినట్లుచూసింది అపరంజి.

"బామ్మో! ఎందుకొచ్చిన గోలగాని... ఓ అడుగు దూరంగా కూర్చో!" అన్నాడు ఎగతాళిగా. "మళ్ళా చేయి తగిలింది, కాలు తగిలింది అంటూ నా మూడంతా పాడుచేస్తావ్!"

పకపకా నవ్వింది అపరంజి. "సింహాచలం వదిలినప్పటినుండీ నిన్ను ఒకటి అడగాలని అనుకుంటున్నాను, బావా!... మనిద్దరిమధ్యా రహస్యాలేం ఉండకూడదు గదా... కప్పస్థంభాన్ని కౌగిలించుకొని నువ్వేం కోరుకున్నావ్?... నేనయితే మన పెళ్ళి త్వరగా జరగాలని కోరుకున్నాను!"

"నాకు తెలుసు నువ్వు అదే కోరుకుంటావని... నీ కోరిక తీరితే నా కోరికా తీరినట్లేగదా అని నేనా విషయం అడక్కుండా మరోటి కోరుకున్నాను!" అన్నాడు కళ్ళు చికిలించి అపరంజినే చూస్తూ.

"అంతకు మించిన గొప్పకోరికేమిటో!"

"మనకు పిల్లలు కలగకుండా వుండాలని!"

"వ్వాట్!" ఉద్వేగంతో ఒక్కసారిగా లేచి నిలబడింది. "ఏమన్నావ్... మళ్ళీ చెప్పు!"

"మనం భార్యాభర్తలవ్వటానికి ఆటంకం చెబుతున్న అమ్మ భయమేమిటో చెప్పాను గదా... ఆమె భయాలు నిజం కాకుండా ఉండాలనే అలా కోరుకున్నది!"

నిలుచున్నది నిలుచున్నట్లే బిగుసుకుపోయింది కొద్దిక్షణాలవరకూ అపరంజి!

* * *

రామబ్రహ్మంకు చెల్లెలు జగదీశ్వరి ఫోన్ చేసింది రాత్రి బాగా పొద్దుబోయిం

తరువాత.

"చెప్పవే... క్షణం తీరిక దొరకటం లేదు వచ్చి చూద్దామంటే... నువ్వా పక్కన బావగారులేందే బయటకు రావు... నాకయితే కోర్టు, ఇల్లే నా స్థావరాలు... విశాఖపట్నమంతా ఆయనదే... ఎక్కడ ఎపార్టుమెంట్లు కట్టిస్తాడో... ఎక్కడ తిరుగుతుంటాడో ఆయనకే తెలియాలి... అంతా కులాసానేకదా... ఏమిటి విశేషాలు?"

"అంతా కులాసానే... నిన్ను చూసి చాలారోజులయింది... వచ్చి మాట్లాడాలని వున్నదిగాని... నువ్వన్నట్లు ఆయనకూ క్షణం తీరిక లేకుండా వున్నది... సిటీ మధ్యలో ఇళ్ళు కట్టటానికి ఖాళీస్థలాలు దొరక్కపోవటంతో శివార్లమీద పడ్డారు... పొద్దున వెళితే రాత్రికి ఎప్పుడో రావటం... ఇంట్లో భోజనం ఒకపూటే!" అన్నది నవ్వుతూ. "అవన్నీ ఎప్పుడూ ఉండేవేలేగాని... పిల్లల పెళ్ళి విషయం ఏమాలోచిస్తున్నావ్... నాకయితే చూచాయగా తెలిసింది మా వదిన అంత సుముఖంగా లేదని... ఎందుకనిట... ఆమె చెప్పే కారణాన్ని నమ్మాలా లేక మనస్సులో మరేదైనా ఉద్దేశ్యం పెట్టుకొని నిరాకరిస్తున్నదా అన్నది తెలుసుకోవటానికే ఇప్పుడు ఫోన్ చేస్తున్నది... అక్కడ నీ ఎదురుగ్గా మా వదిన లేదుగదా?"

"లేదులే వంటింట్లో పనిమీదవున్నది!"

"అయితే కాస్త మనస్సు విప్పి మాట్లాడు! వాళ్ళిద్దరికీ ఒకళ్ళంటే ఒకళ్ళకి ఇష్టమని అందరికి తెలిసిందే... ఇప్పుడు ఏ స్టేజిలో వున్నారంటే మనం కాదన్నా పెళ్ళి చేసుకునేలా వున్నారు... మన గౌరవం మన నిలబెట్టుకోవటం మనకే మంచిది!" అనునయంగా అన్నయ్యకు చెప్పింది. "వదిన్ను ఒప్పించాల్సిన బాధ్యత నువ్వు తీసుకోవాలి, అన్నయ్యా!"

"మీ వదిన చాలా మొండిగా వాదిస్తున్నది... నాకూ ఎలా నచ్చజెప్పాలో అర్థం కావటంలేదు!" అన్నాడు నసుగుతున్నట్లుగా. "పిల్లల్ని చూస్తే కాదనలేకపోతున్నాను... అదా ససేమిరా అంటున్నది... అటు వాడూ ఆమెతో వాదిస్తూనే ఉన్నా ఏమాత్రం తగ్గటంలేదు!"

"ఇప్పుడు నీ మాటల్నిబట్టి అర్థమవుతున్నది, నీ ఉద్దేశ్యమూ అదేనని... స్పష్టంగా

చెప్పరాదు... ఇంకా వదిన ఒప్పుకోవటంలేదు అని దేనికి వంక పెట్టటం... నీదీ అదే మాటయితే దాన్ని బయటకు వెళ్ళొద్దని, బావతో తిరగొద్దని కట్టడి చేస్తాను... నువ్వూ మీ అబ్బాయిని అదుపులో పెట్టుకో... మా ఇంటికి రానీయబోకు, దానితో తిరగనీయబోకు... అయినా నా భయాలు నాకున్నయి... మనం కాదన్నా వాళ్ళు ఆగేలా లేరు... రహస్యంగానయినా పెళ్ళిచేసుకొని అమెరికా వెళ్ళాలనుకుంటున్నారా అనిపిస్తోంది... మనం కాదని మరీ మొండి కేస్తే అంతపనీ చేస్తారేమో... నీకూ ఉన్నది ఒక్కడే కొడుకు, నాకూ ఉన్నది ఒక్కతే కూతురు... అది గుర్తుంచుకో!" ఖస్సున లేచింది అన్నయ్యమీద.

ఆమె కోపమంతా తనమీద కాదు, వదినమీదేనని ఆయనకు తెలుసు.

"ముందు నువ్వు బీపీ తగ్గించుకో... నేను ఎటూ మాట్లాడలేని పరిస్థితులలో వున్నాను... నన్ను అర్థం చేసుకో!"

"యాభై సంవత్సరాల క్రితంనుంచి కలిసి పెరుగుతున్న చెల్లెల్ని నోరుమూసుకోమనటం తేలికేగాని, పాతిక సంవత్సరాల క్రితం జీవితంలోకి వచ్చిన భార్యను ఆ మాట అనలేవుగదా... నాకు అర్థమవుతున్నదిలే!" అన్నది నిరసనగా. "మనమిద్దరం ఒక తల్లి రక్తం పంచుకు పుట్టామనే విషయాన్ని మరిచిపోకు!"

"నువ్వు తొందరబడి పిల్లల్ని ఏమీ అనబోకు... చూద్దాం... కొన్నిటికి కాలమే పరిష్కారం చూపుతుంది... నేను మరోసారి మీ వదినతో మాట్లాడతాను!" అన్నాడు చెల్లెలును సముదాయిస్తున్నట్లుగా.

"సరే అన్నయ్యా! నాకూ మనస్సు వున్నది... నాకూ ఆత్మగౌరవమున్నది... మీ అంత భాగ్యవంతులం కాకపోయినా సమాజంలో నీకున్నంతపేరు మీ బావగారికీ వున్నది... కనుక త్వరలో నిర్ణయమంటూ తీసుకోవలసింది నువ్వే... నేను నీ మాటకు కట్టుబడివుంటాను... మరోసారి దేబిరిస్తూ అడిగి నిన్ను ఇబ్బంది పెట్టను... ఏం జరిగితే అది జరుగుతుందని దేవుడిమీద భారం వేసి వదిలేస్తాను!" విసురుగా ఫోన్ పెట్టేసింది జగదీశ్వరి.

ఏం చేయాలా అన్నట్లుగా రామబ్రహ్మం ఆ రిసీవర్ వంకే చూస్తూ కూర్చుండిపోయాడు చాలాసేపు– అటు స్వంత చెల్లెలు మాటా కాదనలేడు, ఇటు భార్యమాటా కాదనలేడు. వీటన్నిటికీ మించి కొడుకు మాటా తీసివేయలేడు...

ఒక నిట్టూర్పువిడిచాడు– తను చెల్లెలికి చెప్పినట్లు కాలమే ఈ సమస్యను పరిష్కరించాలి!

* * *

కామాక్షి అపరంజికి ఫోన్ చేసింది ఉదయం పదిగంటలప్పుడు.

"అపరంజీ! నాన్న మాట్లాడతాడటనే నీతో!"

"ఇవ్వు!" అన్నది ఆత్రంగా– ఆయన ఏం చెబుతాడోనన్నట్లుగా.

"అపరంజీ! శుభవార్తమ్మా!"

"ఏమిటి అంకుల్?"

"శంకర్ చచ్చిపోయాడు!"

"రియల్లీ!... ఎలా అంకుల్... ఎన్‌కౌంటరా?" అన్నది ఉత్సాహంతో వడివడిగా.

"ఏ క్రిమినల్ చచ్చినా ఎన్‌కౌంటరేనా... మా డిపార్ట్‌మెంట్‌మీద ప్రజల్లో ఎంతగా చెడు అభిప్రాయమున్నదీ నీ మాటలతో అర్థమవుతున్నది!" ఆయన పకపకా నవ్వాడు. "ఎ గుడ్ జోక్!"

"సారీ అంకుల్!"

"ఫరవాలేదమ్మా... మా మీద దురభిప్రాయం ఏర్పడటం బాధగానే వున్నా కొన్ని దుర్ఘటనలు మాకా చెడ్డపేరు తెచ్చినమాట వాస్తవమే... శంకర్ విషయంలో నాకు తెలిసిన సమాచారం ప్రకారం... వాడు లింగంపల్లి నుంచి హైదరాబాద్ వస్తున్న ఎమ్ఎమ్‌టీఎస్‌లో ప్రయాణిస్తూ, వాడి వలన జీవితంలో ఘోరంగా వంచింపబడిన

ఓ స్త్రీ కంటపడ్డాడు... ఆమె ఆవేశపడకుండా వాడిని మాటల్లోపెట్టి అవీఇవీ అడుగుతూ, నవ్వుతూ మాట్లాడుతూ తలుపుదాకా తీసుకువచ్చి, తన కసినంతా తీర్చుకుంటున్నట్లుగా రెచ్చిపోయి, అతడు ఊహించని రీతిలో కాలితో ఒక్క తన్నుతన్ని బయటకు తోసివేసింది... రైలు మంచి స్పీడ్‌లో వెళుతున్నదేమో వాడు పక్క ట్రాక్‌మీద పడుతూనే తలపగిలి చచ్చాడు!... బేగంపేట స్టేషన్‌లో ఆమె రైలుదిగి తను చేసిన పనిని చెప్పి పోలీసులకు లొంగిపోయింది!"

"థాంక్ గాడ్! వాడికి సరైన శిక్షే వేసిందన్నమాట... చచ్చింది శంకరేనని మీరూ కన్ఫరమ్ చేసుకున్నారా, అంకుల్!" పూర్తిగా సంశయం తీర్చుకోవాలి అన్నట్లుగా అడిగింది అపరంజి.

"వాడేనని చంపిన స్త్రీ చెప్పటమే కాకుండా, వాడి ఫొటోను అంతకుముందు నివేదిత కిడ్నాప్ అయినప్పుడు అన్ని స్టేషన్లకీ ఫ్లాష్ చేశాంకదా... సబిన్స్‌పెక్టర్‌కు అనుమానమొచ్చి ఆ ఫొటోతో పోల్చిచూసి అతడేనని గుర్తించాడు... ఇది జరిగి అప్పుడే నాలుగు రోజులయింది... నేనూ నిర్ధారణ చేసుకొని నీకు చెబుదాంలే అని ఆగాను... ఇక మీరు నిశ్చింతగా ఉండవచ్చు!"

"థాంక్స్ ఎ లాట్ అంకుల్! నేనిప్పుడే నివేదితకు చెబుతాను... వాడి భయంతోటే కాబోలు దానికి జ్వరం తిరగబెట్టి మళ్ళా ఆసుపత్రి పాలయింది!" అన్నది కాస్తంత దిగులుగా.

"అయ్యో! అలాగా... వెంటనే అ అమ్మాయికి ఈ సంగతి చెప్పు... దాంతోటే జ్వరం వస్తే మాత్రం వెంటనే తగ్గిపోతుంది... గుడ్‌లక్!"

* * *

నాలుగు రోజులబట్టీ నివేదిత సెల్ ఆఫ్‌లోనే వున్నది. కారణం అపరంజికి అంతుపట్టటంలేదు. అభి చెన్నయ్ వెళ్ళేముందు నివేదిత మళ్ళా ఆసుపత్రిలో జేరిందని చెప్పాడు. తరువాత తను నివేదితకు ఫోన్‌చేస్తే ఏడ్చింది తనకు అంత్యదశ సమీపించిందంటూ. అభి చెన్నయ్‌నుండి వచ్చాడో లేదో తెలియటంలేదు. అతడికి

చేద్దామన్నా అతడి నంబరును తను తీసుకోవాలనే ఆలోచన అతడితో మాట్లాడిన సమయంలో రాలేదు.

ఏం చేయాలో, ఎలా నివేదిత పరిస్థితి తెలుసుకోవాలో అర్థంకాని అయోమయంలో పడిపోయింది అపరంజి. జగన్నాథం అంకుల్ చెప్పిన విషయం చెబితే నివేదిత త్వరగా కోలుకోగలుగుతుందనే ఆశ మనస్సులో మిణుకు మిణుకుమంటోంది. తనకు విజయవాడలో జయంతి ఒక్కతే తెలుసు. దానికి చెబుదామన్నా నివేదిత ఇల్లు ఎక్కడో, అది ఏ ఆసుపత్రిలో వున్నదో తెలియనప్పుడు ఏమని చెబుతుంది, ఎక్కడ వెతకమని చెబుతుంది. ఆపైన అది క్రితంసారి దుర్గగుడిలో కనబడిన విషయం చెప్పినప్పుడు తను ఆమె ఎవరో తెలియనట్లుగానే మాట్లాడింది. ఇప్పుడు చెబితే ఫలితం దక్కకపోంగా అది చేసే యాగీకి తను తట్టుకోవాలి.

నివేదితనుండిగాని, అభినుండిగాని ఫోన్ వస్తుందనే ఆశతో వేచి ఉండటమే తను చేయగలిగిన పని!

ఏం చేయాలా అని ఆలోచిస్తున్న సమయంలోనే సెల్ రింగయింది, ఆత్రంగా ఆన్‌చేస్తే ఆమె ఆలోచనలకు ఒక ముగింపు లభించినట్లుగా అభి కంఠం వినబడింది. “నమస్తే భాభీ!”

“ఎక్కడనుంచి? చెన్నయ్‌నుంచా, విజయవాడనుంచా?” ఆత్రంగా అడిగింది. అతడి కంఠం విన్న సంతోషంలో అప్పటివరకూ తను పడిన వేదనను సంపూర్ణంగా మరిచిపోయింది.

“చెన్నయ్‌నుండి ఉదయాననే విజయవాడ వచ్చాను… ఇప్పుడు నివేదిత వున్న ఆసుపత్రినుంచే మాట్లాడుతున్నాను! నాలుగు రోజులబట్టీ మీకు ఫోన్‌చేయలేకపోయానని వేదీ బాధపడుతోంది… అనవసరంగా ఫోన్లుచేస్తూ శ్రమ పడవద్దంటూ సెల్ తీసేసుకొని, ఆఫ్‌చేసి తన దగ్గరే పెట్టుకున్నదట ఆంటీ… నేనూ నాలుగురోజులబట్టి వేదీతో మాట్లాడలేకపోయాను. అంకుల్‌తోటే మాట్లాడుతున్నాను!”

“ఇప్పుడెలా వున్నది దానికి?”

"బాగాలేదు... మీరు ఒకసారి వచ్చి వెళ్ళగూడదా, భాభీ!"

ఎలా చెప్పాలో తెలియనంత సంధిగ్ధతలో పడిపోయింది అపరంజి.

"దాని అనారోగ్యం నన్ను ఎంతగానో బాధిస్తున్నది!" అతడి మాట చాలా దిగులుగానూ, నీరసంగానూ వున్నది.

"అసలేమిటి దాని ప్రాబ్లం?" కంగారు పడుతూ అడిగింది. అతడే బాధపడుతున్నాడూ అంటే అది ప్రమాదకరమైన జబ్బే అయివుండవచ్చు!

"దానికి వచ్చింది లుకీమియా!" అతడి కంఠమూ ఆ మాట చెబుతున్నప్పుడు బాధతో తడిసింది.

"అంటే?" ఆదుర్దాగా అడిగింది.

"బ్లడ్ క్యాన్సర్!"

# 14

అభినవ్ కళ్ళు తడుస్తున్నయి ఆ మాట చెబుతున్నప్పుడు. "అవును భాభీ! నాకూ చాలా బాధగానే ఉన్నది!"

"అయ్యో!" వలవలా ఏడ్వసాగింది అపరంజి.

అతడు ఇంకేం మాట్లాడాలో తెలియనట్లుగా సెల్ ఆఫ్‌చేసి, ఆ హాస్పిటల్ వరండా చివరనుంచి నివేదిత పడుకొని వున్న గదిలోకి వచ్చాడు. కావాలని తన సెల్‌నూ ఆఫ్ చేశాడు. అతడికి తెలుసు నివేదితకు అత్యంత ఆత్మీయురాలైన అపరంజి మళ్ళీమళ్ళీ ఫోన్ చేస్తుందని!

మంచంమీద జారిగిలపడిపోయింది నిస్సత్తువగా అపరంజి. కోలుకోలేనంత దెబ్బ తగిలినట్లుగా ముఖమంతా నల్లగా వాడిపోయింది. చెంపలమీదగా కన్నీరు ధారగా కారుతోంది.

జీవితం ఎంత విచిత్రమయినది... ఈరోజే అంకుల్ జగన్నాథం నుంచి శంకర్ హతుడయినట్లుగా తెలుసుకొని ఆనందపడుతూ నివేదితకూ చెప్పాలని ఆరాటపడింది. ఇంతలోనే అశనిపాతంలా ఈ వార్త...

భూమంతా అందని కొండలూ, భయంకరమైన లోయలతో నిండివున్నట్లే జీవితమూ సంతోషాలు, విషాదాలు, బాధలూ, భయాలు, ప్రేమలూ, ద్వేషాల సమ్మిళతమే... ఏ క్షణాన ఏ సంతోషానికి పరవశిస్తామో, ఏ బాధకు కృంగిపోతామో మనకే తెలియదు.

'దేవుడూ! నా చెల్లెల్ని రక్షించవూ!'

* * *

"సామాన్యంగా మనిషి శరీరంలో ఐదు లీటర్లదాకా రక్తముంటుంది. దాంట్లో సగం నీరులాంటి ప్లాస్మాద్రవపదార్థముంటుంది. రక్తంలో అధికశాతం ఎర్రకణాలే. శరీరంలోని వ్యాధులతోనూ, బ్యాక్టీరియా వైరస్ లాంటి వ్యాధి కారకాలతోనూ పోరాడేది తెల్లకణాలు. ఎక్కడైనా రక్తం కారుతుంటే గడ్డకట్టించి, స్రావం ఆగిపోయేలా చేసేది ప్లేట్‌లెట్‌కణాలు. ఈ మూడు రకాల మౌలిక కణాలు పుట్టుకువచ్చేది ఎముకమజ్జనుంచి!" అభినవ్ చెబుతున్నాడు ఎదురుగ్గా కూర్చున్న నివేదిత తండ్రి వివేకానందమూర్తికి. "రక్తం శరీరానికి కావాల్సిన ప్రాణవాయువును అందించటమే కాకుండా, కీలకమైన పోషకాలను, హార్మోన్లను శరీరమంతా తీసుకు వెళ్తుంది. వ్యర్థాలను శుద్ధిచేస్తుంది."

అతడు ఉదయాననే చెన్నయ్‌నుంచి వచ్చి ఆసుపత్రిలో నివేదితకు చేసిన పరీక్షల రిపోర్టులను చూస్తూనే కించిత్ కంగారుపడ్డాడు. వేదన చెందాడు. ఆ పరీక్షల ఫలితాలమీదే ఇప్పుడు వాళ్ళు మాట్లాడుకుంటున్నది.

"హెమోగ్లోబిన్ ఆడవాళ్ళలో కనీసం పన్నెండు ఉండాలంటారు కదా... దీనికి ఎనిమిదే వున్నది... అది ఆయాసపడుతుండటానికి కారణం కావాల్సినంత ఆక్సిజన్ అందక పోవటమేనా? అసలు లుకీమియా రావటానికి ప్రధాన కారణం ఏమిటి?"

ఆ మాట అడుగుతున్నప్పుడు ఆయన గొంతు బాధతో తడుస్తున్నది.

"హెమోగ్లోబిన్ తగ్గటంతో ఆయాసంవచ్చే అవకాశమున్నది... నివేదితకు వచ్చింది క్రానిక్ మైలోజెనస్ లుకీమియా. ఇది పెద్దవాళ్ళల్లోనే అధికంగా వస్తుంటుంది. ఈ సమస్య చాలారోజుల క్రితమే వేదీ శరీరంలో ప్రారంభమయివుండాలి... ఒక్కొక్కసారి రోగం బయటపడటానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది... నీటి మార్పు, వాతావరణమార్పు, చదువు ఒత్తిడితో హైదరాబాద్ వెళ్ళింతరువాతే అలసట అధికమవటంతో బయటపడింది... అందులో కిడ్నాప్ దుర్ఘటన మానసిక అశాంతికి గురిచేసి బాగా కృంగదీసింది. అసహజమైన తెల్లకణాల సంఖ్య విపరీతంగా పెరగటంతో శరీరం ఇన్‌ఫెక్షన్లతో పోరాడే శక్తిని కోల్పోయింది... దానివలననే ఎముకమజ్జ దెబ్బతిని మిగతా కణాల ఉత్పత్తిమీద ప్రభావం చూపిస్తోంది. అది ఇంకా ప్రమాదకర స్థాయిని చేరుకోకపోవటం అదృష్టం... దీన్ని మందులతో తగ్గించవచ్చుగాని, ఎముకమజ్జ మార్పిడీ చేస్తే పూర్తిగా తగ్గి కోలుకోగలుగుతుంది. ప్రారంభదశే కనుక మార్పిడీలో ఎలాంటి ప్రమాదమూ ఉండదు!"

బెడ్‌రూంలోనుంచి నివేదిత తల్లి రుక్మిణి ఏడుపు ఉండిఉండి తీతువుపిట్ట కూతలా వినిపిస్తోంది.

వాళ్ళు అరగంట క్రితమే ఆసుపత్రినుండి వచ్చారు. అభి నివేదిత దగ్గర ఉండి వాళ్ళను పంపిద్దామనుకున్నాడుగాని వివేకానందమూర్తి, "నేను ఇప్పుడు కారు డ్రైవ్‌చేసే స్థితిలో లేనుగాని, నువ్వు మమ్మల్ని ఇంటిదగ్గర దించి కారు తీసుకొని వచ్చేయ్!... ఆంటీ వంటచేసిం తరువాత మీ ఇద్దరికీ భోజనం తీసుకొని ఆటోలో వస్తాం!" అంటూ అభినికూడా తీసుకువచ్చాడు. ఆయన ఉద్దేశ్యం కారు నడపలేకపోవటం కాదు, అభిని ఒంటరిగా కూర్చోబెట్టి కూతురు స్థితి ఏమిటో తెలుసుకోవాలని.

రుక్మిణి పరిస్థితీ తుఫాను సమయంలో నడిసముద్రంలో ఇరుక్కున్న నావలా ఉన్నది. పూర్తిగా డీలాపడిపోయింది.

"నయమవుతుందంటావా? తిరిగి లేచి మామూలు మనిషి అవ్వగలుగుతుందా"

కంఠం దీనంగా వున్నది.

అభి ఆయనకు ధైర్యం చెప్పాలన్నట్లుగా ఆ ప్రశ్నను చాలా తేలిగ్గా తీసుకుంటూ, "నేను వేదీని వచ్చే సంవత్సరం సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యేలా చేయాలని అనుకుంటున్నాను... నాకానమ్మకం వున్నది!" అన్నాడు దృఢమైన కంఠంతో.

ఆయన ఆత్మీయంగా అభినవ్ కళ్ళల్లోకి చూచాడు.

"నువ్వు దానికి ఈ విషయం చెప్పవద్దు... మేమూ చెప్పం... ఆసుపత్రిలో డాక్టర్లను కూడా చెప్పవద్దని చెప్పు!"

"ఆ మాట నేనే మీకు చెబుదామనుకుంటున్నాను... డాక్టర్లకు ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు... పేషెంట్ ఆత్మస్థయిర్యాన్ని ఎప్పుడూ వాళ్ళు దెబ్బదీయరు!" అభి ఆసుపత్రికి వెళ్ళేందుకు లేచాడు.

"ఎక్కడా లీలగానైనా దానికి ఇలాంటి రోగం వస్తుందని ఊహించలేదు... సామాన్యం క్యాన్సర్ అంటే వంటిన గడ్డలాంటిదో, లేక ఎదైనా భాగం అసహజంగా పెరగటమో జరుగుతుందంటారు... దీనికి అలాంటివేం లేవుగదా!"

"దీంట్లో అలాంటి చిహ్నాలేవి కనబడవు... దెబ్బతిన్న రక్తకణాలను నిర్మూలించేందుకు శరీరంలో కావాల్సిన యంత్రాంగం వున్నది... అది నిర్మూలించలేనప్పుడే అలాంటి కణాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతయి... దాన్నే బ్లడ్‌క్యాన్సర్ అంటారు... అలా దెబ్బతిన్న కణాలు మజ్జలో పేరుకుపోయి, రక్తకణాల ఉత్పత్తి మందగించేలా చేస్తుంది... సమస్యలన్నీ మొదలయ్యేది అక్కడే! దాని లక్షణాలు– చెమటతో తరచూ జ్వరం రావటం, తలనొప్పి, ఆకలి తగ్గటం, బలహీనం, నిస్సత్తువ... ఇవి చాలావరకూ నివేదితలో కనబడుతూనే వున్నయి!"

"దానికి వచ్చింది అదేనని సరిగ్గానే నిర్ధారించారంటావా... లేకపోతే సెకండ్ ఒపీనియన్‌కు వెళ్దామా?" ఆయన మనస్సులో ఏమూలనో కూతురుది ఆ రోగం కాదనే ఆశ మిణుకుమిణుకు మంటున్నది. ఒక్కగానొక్కకూతురు. అతి గారాబంగా

పెంచుకుంటున్నారు. ఆ మాట విన్నప్పటినుంచీ మనస్సంతా అయోమయంగా వున్నది.

"తప్పేంలేదు... వెళ్ళటం మంచిది కూడా... ఇప్పుడయితే చేయాల్సిన పరీక్షలన్నీ సరిగ్గానే చేశారు... నివేదిత తుంటి ఎముకభాగంనుంచి మజ్జను తీసి పరీక్షించారు... ఫ్లోసైటోమెట్రీ పరీక్షలో యాంటీబోడీల సాయంతో క్యాన్సర్‌కణాలను గుర్తించారు... చికిత్స జరిగిన తరువాత జబ్బు పూర్తిగా తగ్గిందనే విషయాన్ని మళ్ళా ఆ పరీక్షతోటే నిర్ధారిస్తారు!... కాదంటే హైదరాబాద్ తీసుకువెళ్ళి స్పెషలిస్టులకెవరికైనా చూపిద్దాం!"

"ఒకవేళ..." నసుగుతున్నట్లుగా ఆగాడు. ఆయన సంశయాలు ఆయనవి. కాన్సర్ అంటేనే ప్రతి మనిషికీ భయం. అది యముడు విసిరిన పాశంలాంటిది. అందునా అది ఆత్మీయులకే వచ్చిందీ అంటే మరీను...

"ఒక పనిచేద్దాం అంకుల్... మరోసారి ఇక్కడే మరోల్యాబ్‌లో పరీక్షలన్నీ చేయిద్దాం... అక్కడా ఇలాంటి రిపోర్ట్టేవస్తే ఎక్కడికీ వెళ్ళవద్దు... చికిత్స మొదలుపెడదాం... లేదూ, మరో విధంగా వస్తే హైదరాబాద్ తీసుకువెళ్ళి చూపిద్దాం... కన్ఫరమ్ అయితే ముందు కెమోథెరాపీ చేయిద్దాం... బ్లడ్‌క్యాన్సర్‌లో దానివలన పెద్దగా దుష్ప్రభావాలు ఉండవు... కొద్దిగా వున్నా మందులతో నియంత్రించవచ్చు... కాదంటే బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్ చేయిద్దాం!"

"అది ఎలా చేస్తారు?" ఆయన నుదురు ముడివేస్తూ అభినవ్ వంక చూచాడు.

"ఆరోగ్యవంతులైన మరొకరి ఎముకల్లోనుండి మజ్జను తీసి వేదీ ఎముకల్లోకి ఎక్కించాలి... దాని వలన అన్నికణాలు మామూలు స్థితిలో ఉత్పత్తి అవ్వటం మొదలెడతయి!"

"అది తేలిగ్గా అయ్యే పనేనా?" భయం భయంగా అడిగాడు.

"మార్పిడీ తేలికే... మీదిగాని, ఆంటీదికాని కలుస్తుందేమో చూడాలి!"

"మేం సంతోషంగా ఇస్తాం!" అన్నాడు ఆయన త్వరత్వరగా. "కలవకుండా ఉండే పరిస్థితికూడా ఉన్నదా?" సంశయిస్తూ అడిగాడు.

"అందరిదీ కలవాలనీ లేదు... ఇచ్చేమనిషి రక్తసంబంధీకుడయితే సామాన్యంగా కలుస్తుంది... రక్తసంబంధీకులయినా కలవని సమయాలూ వున్నయి!"

"కలవకపోతే?" ఆత్రంగా చూచాడు అభివంక ఏం వినాల్సివస్తుందో అన్నట్లుగా..

"పేషెంట్‌కు సరిపోయే మజ్జవున్న మనిషిని పట్టుకోవాలి... వాళ్ళు ఇవ్వటానికి అంగీకరించాలి... చూద్దాం... ఇప్పటినుంచే ఎందుకు ఆ ఆలోచన... సామాన్యంగా తల్లిదండ్రులలో కనీసం ఒకరిదైనా తప్పకుండా కలుస్తుంది... అదో సమస్య కాదులే అంకుల్...!" అన్నాడు భయపడవద్దు అన్నట్లుగా ధైర్యం చెబుతూ.

అతడి మాటలకు ఆయన మనస్సు పూర్తిగా ఛిద్రమయిపోయి ఎన్నో అనుమానాలను మనస్సునిండా సృష్టిస్తోంది.

"వర్రీకాబోకండి అంకుల్... నేను శెలవుపెట్టి వచ్చి ఆ సంగతేదో చూస్తాను... ఒకసారి ట్రాన్స్‌ప్లాన్టేషన్ అయితే ఆ రోగాన్ని పూర్తిగా నిరోధించగలిగామన్నమాటే!... నాకుమాత్రం వేదీ ఆరోగ్యం బాగుపడటానికి మించిన ఆనందం మరోటేమున్నది!"

అతడు ఆసుపత్రికి వెళ్ళిపోగానే లోపలకు వచ్చి, "వంటచేయ్ రుక్మిణీ!... భోజనం చేసి, వాళ్ళకు తీసుకువెళ్దాం!" అన్నాడు భార్యతో.

"వంట చేయలేనండి... నేను భోజనం కూడా చేయను... మీరు హోటల్లో తిని వాళ్ళకు క్యారియర్ తీసుకు వెళ్ళండి!" అన్నది ఏడుస్తూనే రుక్మిణి. "నేనే పాపం చేశానని ఆ పాపిష్టి రోగం దానికి వచ్చింది?"

ఆయన భార్య పక్కనే కూర్చొని, అనునయంగా ఆమె వెన్నుమీద చేయివేసి, ఓదారుస్తున్నట్లుగా రాయసాగాడు.

అతడికి తెలుసు పురుషుడి గుండెకంటే స్త్రీ గుండె చాలా సున్నితమని... ఏ బాధనూ తట్టుకోలేదని!!

* * *

ఆదివారం మధ్యాహ్నం అపరంజి తీరిగ్గా కూర్చొని అమ్మ, నాన్నలతో కబుర్లు చెబుతూ భోజనం చేస్తుండగా హైదరాబాద్‌నుండి కామాక్షి ఫోన్‌చేసింది. "చెప్పవే!" అన్నది సెల్ ఆన్‌చేస్తూ.

"కృష్ణవేణి ఏమైనా చెప్పిందా నీకు!"

"దాన్ని కలిసి చాలారోజులయింది... ఏమంటుంది... ఎప్పటికప్పుడు దానిదగ్గరకు వెళ్ధామనుకుంటాను... ఏవో పనులు... కాలేజీ, చదువుతోటే సరిపోతోంది సమయమంతా!" అన్నది అపరంజి.

"ఏంలేదు వచ్చేనెలలో సింహాద్రి అప్పన్నది చందనోత్సవంటగదా... దాంతో ఎప్పుడో అన్నాను... విశాఖపట్నంలో ఎన్నాళ్ళున్నా ఆ ఉత్సవం చూడలేదని... అదెప్పుడూ కాలేజీ శెలవల్లోనే, పరీక్షలుప్పుడో వస్తుంది... ఇప్పుడు ఖాళీగా వున్నాను కదా అని తప్పకుండా రమ్మనమన్నది... వాళ్ళన్నయ్య అరకు వ్యాలీలో స్టార్‌హోటల్ కట్టాడటకదా... దేవుడిని దర్శించుకున్న తరువాత ఓ నాలుగు రోజులు అరకులో ఉండేటట్లుగా ప్లాన్ చేస్తున్నదట... నువ్వూ, నేనూ, అదీ, సులోచన... అదే సమయంలో మూడు రోజులు ఏపీ టూరిజం డిపార్ట్‌మెంట్ వాళ్లు అరకులో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారట... అందులో భాగంగానే ఒక రోజు వాళ్ళ హోటల్ ఆవరణలో థింసా నృత్యం ఏర్పాటు చేస్తున్నారట... ప్రోగ్రాం వివరంగా తరువాత చెబుతాను, రైలు టిక్కెట్లు ముందుగా బుక్ చేసుకోవాలి కాబట్టి ఫోన్‌చేస్తున్నాను అని చెప్పింది!" అన్నది కామాక్షి.

కామాక్షి ఫోనుతో, అపరంజికి ఓ ఆలోచన వచ్చింది. నివేదిత దానికీ తెలుసుకదా, అరకు వెళ్ళేందుకు ఎలాగూ వస్తానంటున్నది కాబట్టి, దాన్ని తీసుకొని విజయవాడ వెళ్ళివస్తే ఎలా ఉంటుందా అని... ఇంకెవరన్నా వచ్చిన తామిద్దరినీ చూసి దాన్నో వింతగా ప్రచారం చేయటం మొదలుపెడతారు. లేనిపోనివన్నీ కల్పించి కథలల్లుతారు. అభి ఆ సమయంలో అక్కడ ఉండేటట్లయితే దాని తల్లిదండ్రులకు కనబడకుండా ఆసుపత్రికి వెళ్ళి రావచ్చు!

వెంటనే తల్లితో అన్నది. "నాతోపాటే విశాఖలో బిటెక్ చేసిన మా స్నేహితురాలు విజయవాడలో అనారోగ్యంతో ఆసుపత్రిలో వున్నది. ఒకసారి వెళ్ళి చూసిరావాలని అనుకుంటున్నాను, అమ్మా!... హైదరాబాద్‌నుంచి కామాక్షి ఇప్పుడే ఫోన్‌చేసింది సింహాచలంలో చందనోత్సవం చూడటానికి వస్తున్నట్లుగా... విజయవాడ అమ్మాయి దానికీ స్నేహితురాలే... ఇద్దరం కలిసివెళ్ళి చూసొచ్చేమా?"

"మరీ అంత దగ్గర స్నేహితురాలయితే చూసిరండి... విజయవాడేగా ఉదయాన్నే వెళ్ళి రాత్రికి తిరిగి రావచ్చు!" తల్లి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటంతో ఎలా నివేదిత దగ్గరకు వెళ్ళిరావాలా అని ఆలోచిస్తున్న అపరంజికి దారిదొరికింది.

"దుర్గగుడి చూసికూడా ఎన్నేళ్ళయిందో... వీలుంటే అమరావతి వెళ్ళిరావచ్చు... రెండు మూడు రోజులు ఉండి వస్తాం!" వాటినన్నిటినీ చూడాలీ అనేదానికంటే ఎక్కువ సమయం నివేదిత గడపాలనేదే ఆమె కోరిక.

వెంటనే తన గదిలోకి వెళ్ళి కామాక్షికి విజయవాడ వెళ్ళాల్సిన సంగతి చెప్పి ముందుగానే రిటరన్ టిక్కెట్టు తీసుకోవద్దని సూచించింది.

సాయంత్రం అయిదుగంటలప్పుడు కృష్ణవేణి ఫోన్‌చేసింది, "ఇంట్లోనే వున్నావా... అరగంటలో వస్తా!" అంటూ.

"రా...రా... నువ్వెందుకొస్తున్నావో తెలుసులే!" అపరంజి అన్నది నవ్వుతూ.

"అయితే కామాక్షి ఫోన్ చేసిందన్నమాట!"

"అది చెప్పటమూ... నేను ఓకే చేయటమూ అయిపోయింది!"

"థాంక్యూ!"

అన్నట్లుగానే అపరంజి దగ్గరకు మరో అరగంటలో వచ్చింది కృష్ణవేణి.

కూల్‌డ్రింక్స్ త్రాగుతూ అపరంజి బెడ్‌రూంలో కూర్చున్నారు ఇద్దరు. అపరంజి తల్లయితే వచ్చి కృష్ణవేణిని పలకరించి రెండు నిముషాలు మాట్లాడి వెళ్ళిపోయింది.

"అనకాపల్లినుంచి సుజాతనుకూడా రమ్మంటే సరదాగా వుంటుందికదే!"

"దాని పెళ్ళయి నెల కాలేదు ఇంకా... మొగుడి దగ్గర వున్నది... రమ్మంటే ఇద్దరినీ రమ్మనమనాలి... ఆ టైంలో అరకులో రూం దొరకటం బహుకష్టం... అన్నయ్యేమన్నా నలుగురికీ ఓ డబుల్ బెడ్‌రూం ఇచ్చి రెండు బెడ్లు ఎక్స్‌ట్రా వేయిస్తానన్నాడు... అది మొగుడితో కలిసి వస్తానంటే మన రూంలో ఎకామడేట్ చేయలేం... హోటల్లో సగం గదులేమో టూరిజం డిపార్టుమెంటు తీసుకున్నది వాళ్ళప్రత్యేక ఆహూతులకిచ్చేందుకు... మిగతా వాటికోసం అన్నయ్యమీద బాగా ఒత్తిడి పెరిగిపోతోంది... మనకంటే తప్పక ఒకటి అట్టిపెట్టాడు... అందుకే దానికి చెప్పలేదు... సులోచనయితే ఇక్కడే వుంటుంది... అక్కడ తిరగటానికి గూడా మన నలుగురికీ ఒక కారు సరిపోతుందీ... అన్నీ ఆలోచించే సులోచనను పిలుద్దామనుకున్నాను!" అన్నది. ఆ అమ్మాయికీ సుజాత మంచి స్నేహితురాలేకానీ, ఆ సమస్యతో సుజాతను వదిలేయక తప్పలేదు.

"ఏమిటి మన ప్రోగ్రాం?"

"చందనోత్సవ సమయంలో అక్కడ మూడు రోజులు శుక్ర, శని, ఆది ప్రోగ్రాములు... టూరింజం డిపార్టుమెంటువాళ్లు అరకు గ్రామంలోనూ, బొర్రాకేవ్స్ దగ్గరా, మా హోటల్ ఆవరణలోనూ మూడు రోజులూ థింసా నృత్యం ఏర్పాటు చేస్తున్నారు... వాటికయితే టిక్కెట్లు పిచ్చగా అమ్ముడయిపోతున్నయి... మనం గురువారం ఉదయాననే బయల్దేరి మందు స్వామిని దర్శించుకొని వెళదాం... హోటల్లో వాళ్ళ ప్రోగ్రాం ఆదివారం పెడుతున్నారు... మనం అక్కడ ఏర్పాట్లలో పాలుపంచుకొని ఫంక్షన్ సక్సెస్ అయ్యేలా చూడాలి... ఎక్కువగా విదేశీయులు వస్తున్నారు... వాళ్ళల్లో చాలామందికి మన హోటల్లోనే బస... వాళ్ళను రిసీవ్ చేసుకొని అక్కడ చూడాల్సిన ప్రదేశాల విషయంలో గైడ్ చేయాలి... ఆ మూడు రోజులూ అన్నయ్య వాళ్ళకోసమని పాతిక కార్లదాకా బుక్‌చేసి అట్టిపెట్టాడు...!"

"అంటే మనకు చేతినిండా పనేనన్నమాట!"

యూనివర్శిటీలో చదువుతున్నప్పుడు వాళ్ళ బ్యాచ్ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించటంలో ఎప్పుడూ చాలా ముందుండేవాళ్ళు... అందుకే కృష్ణవేణి అన్నయ్య ఆ పనిని చెల్లెలకి అప్పజెప్పాడు!

* * *

నివేదిత సెల్ ఇంకా ఆఫ్‌లోనే వుంచింది. అభి నంబరుకు చేసింది రెండు రోజుల తరువాత అపరంజి.

"మీరెక్కడున్నారు?"

"నిన్న రాత్రే కోల్‌కతా వచ్చాను... ఇప్పుడు డ్యూటీలో వున్నాను!"

"మా చెల్లెలు ఎలా వున్నది?"

"షి ఈజ్ ఫైన్... ఈ పాటికి ఇంటికి వెళ్ళివుంటుందనే అనుకుంటున్నాను... ఇంకా నేను ఫోన్ చేయలేదు... నేను మీకు మరో గంటలో ఫోన్ చేస్తాను! ఇప్పుడు ఓ అర్జంటు కేసు అటెండ్ అవుతున్నాను, భాభీ!"

"ఓకే... ఓకే!" సెల్ ఆఫ్ చేసేసింది అపరంజి.

– నిన్ననే డిశ్చార్జ్ చేసివున్నట్లయితే రాత్రి తప్పకుండా నివేదిత తనకు కాల్ చేసివుండేది... చేయలేదూ అంటే ఇంకా డిశ్చార్జ్ అయివుండకపోవచ్చు!

* * *

పదిరోజులయినా నివేదితనుండి ఫోన్ రాకపోవటంతో అపరంజి కలవరపడుతూ అభినవ్‌కు ఫోన్ చేసింది ఆమె ఎలావున్నది అతడికి తెలిసివుంటుందన్న ఉద్దేశ్యంతో.

"లేదు భాభీ! నాతో కూడా మాట్లాడటంలేదు... అంకుల్‌తోనే మాట్లాడుతున్నాను... మొన్నయితే మళ్ళా జ్వరమొచ్చిందట... అంకుల్ కంగారు పడుతున్నారు... రక్తపరీక్షలో తెల్లకణాలు బాగా పెరిగినట్లుగా తెలిసిందట!"

"తెల్లకణాలు దెబ్బతినటంతో శరీరంలో రోగనిరోధకశక్తి తగ్గుతుందన్నారు మీరు...

మరి పెరిగినప్పుడు రోగనిరోధకశక్తి పెరగాలిగదా!"

అతడు నవ్వాడు. "అలా అనికాదు... అవి తరిగినప్పుడే కాదు, అధికంగా పెరిగినప్పుడూ ఇబ్బందే... అవన్నీ దెబ్బతిన్న కణాలు అవ్వటం వలన ఇన్‌ఫెక్షన్ల బెడద ఇంకా ఎక్కువగా వుంటుంది... ఎముకమజ్జలో క్యాన్సర్‌కణాలు బాగా పెరగటంతో ఎముకమీద ఏమాత్రం ఒత్తిడి వచ్చినా బాధగావుంటుంది!"

"అయితే ఇప్పుడు ఏంచేస్తే నివేదిత కోలుకోగలుగుతుంది, అభీ!" అన్నది దుఃఖాన్ని అతి కష్టంమీద ఆపుకుంటూ. "చేయాల్సిన పరీక్షలన్నీ చేసి అదే జబ్బని డాక్టర్లు సరిగ్గా నిర్ధారించారా అని నాకు సంశయంగా వున్నది!"

ఆత్మీయులందరికీ సహజంగా వచ్చే అనుమానాలే అవి!

అతడు నిట్టూర్పు విడిచాడు. "అన్ని పరీక్షలూ అయింతరువాతే క్యాన్సరనే నిర్ధారణ జరిగింది... బోన్‌మారో ట్రాన్స్‌ప్లాన్టేషన్ చేయక తప్పదు... దురదృష్టమేమిటంటే అంకుల్‌ది గాని, ఆంటీది గాని మార్పిడీకి పనికి రాదని డాక్టర్లు తేల్చారట... ఆయన డోనార్లకోసం ప్రయత్నిస్తున్నారు!" అన్నాడు కాస్తంత దిగులుగా.

"రక్తసంబంధీకులది కలిసే అవకాశమున్నదంటిరి కదా!" అనుమానంగానూ, అసహనంగానూ అడిగింది అపరంజి. తమ భవిష్యత్తంతా ఎటు వెళుతున్నదో అర్థంకానంత గందరగోళంగా వున్నది. అంటే నివేదిత తల్లిదండ్రులు అనబడే వాళ్ళు, నివేదితకు కన్నతల్లిదండ్రులు కారా? వాళ్ళకు కాక నివేదిత తన తల్లిదండ్రులకే పుట్టివుంటే అనకాపల్లి ఆసుపత్రిలో వివరాలు అలా ఎందుకు నమోదు కాలేదు? ఒకవేళ ఇద్దరు పుడితే అమ్మకు కాన్పుఅయి మగతలోవున్న సమయంలో ఎవరైనా రెండో పిల్లను డబ్బుకు కక్కుర్తిపడి అక్కడనుంచి తప్పించి మరెవరికైనా ఇచ్చారా? ఏమో? ఎప్పుడూ విశాఖపట్టణమే చూడలేదంటున్న నివేదిత కోల్‌కతాలో వున్న వాళ్ళ దగ్గరకు జేరే అవకాశమెక్కడున్నది? అది పుట్టకముందు వాళ్ళు అనకాపల్లిలోగాని లేరు గదా!

ఒక్కక్షణం అపరంజి బుర్ర మొద్దుబారిపోయింది. అమ్మదీ, నాన్నదిగానీ బోన్‌మారో

దానికి మ్యాచ్ అవుతుందా? వాళ్ళను తీసుకువెళ్ళి పరీక్షచేయించటం తనకు సాధ్యపడేనా?

ఏం మాట్లాడాలో తెలియనట్లుగా కొద్దిక్షణాలు మౌనంగా వుండిపోయింది.

"రక్తసంబంధీకులు అయినంతమాత్రాన కలవాలనేంలేదు... నాకు తెలిసిన ఒక కేసులో తల్లిదండ్రులదే కాదు, అన్నయ్య, అక్కయ్యలదీ కూడా కలవలేదు. అతడికిద్దరు తమ్ముళ్ళున్నారు. వాళ్ళు కవలలు. అందులో ఒకరిదే కలిసింది... శరీర నిర్మాణంలోని విచిత్రాలే అవి మరి!"

"నాది ప్రయత్నిద్దామా?" త్వరత్వరగా అన్నది.

"అవసరమనుకుంటే తప్పకుండా ప్రయత్నిద్దాం... మీదనేకాదు, నాదీ ప్రయత్నిద్దాం...వేదీ అదృష్టవంతురాలయితే ఆత్మీయ స్నేహితులదయినా మ్యాచ్ అవ్వవచ్చు!"

అపరంజి ఒక్కసారి కళ్ళుమూసుకున్నది. మార్గాలు తెలియని నిజాల గూళ్ళలోనుంచి తామిద్దరూ బయటకు రావాల్సిన సమయం ఆసన్నమవుతున్నదన్నమాట. అందువలన ఎలాంటి విస్ఫోటనాలు సంభవించినా తన సహోదరి ఆరోగ్యం బాగుపడటం ప్రధానం... ఇక తను ముందుకు అడుగులు వేయక తప్పదు!

"నేను త్వరలోనే శెలవుపెట్టి విజయవాడ వెళతాను... మరో డాక్టరు శెలవులో వుండటంతో ఇక్కడ పని ఒత్తిడి ఎక్కువగా వున్నది... అతడు డ్యూటీలో జేరగానే బయల్దేరతాను... వేదీ దగ్గర వుండి ఏంచేయాలో నిర్ణయిస్తాను... అంకుల్‌కూడా నన్ను రమ్మనమంటున్నారు. ఆయన బాగా డీలాపడిపోయారు!"

"ఈ పరిస్థితులలో అదే మంచిది... మీరు విజయవాడ రాగానే ఫోన్ చేయండి, నేనూ వస్తాను... నా మనసంతా మా ఇద్దరి రూపాలతోనే నిండివున్నది... అంత బాధలోవున్న దాన్ని చూడకుండా ఉండలేకపోతున్నానే అని వ్యధచెందుతున్నాను!" గుండె లోతుల్లోనుంచి ఎగతన్నుకొస్తున్న వేదనను నిగ్రహించుకోలేక పోతున్నది అపరంజి. వెంటనే ఆమెకో ఆలోచన రాగా, "మీరు ఒక పని చేయండి... విజయవాడ

ఏ రైలులో వెళ్ళేది ఫోన్  చేస్తే మిమ్మల్ని విశాఖపట్టణం స్టేషన్‌లో కలుస్తాను!" త్వరత్వరగా అన్నది. అలా అతడిని కలవటం వలన తమగురించిన కొన్ని నిజాలు అతడూ  తెలుసుకునే అవకాశం ఏర్పడుతుందనేది ఆమె ఆలోచన!

* * *

అపరంజి కాలేజీనుండి బయటకు వస్తుండగా గేటు దగ్గర తన కోసమే ఎదురుచూస్తూ కారులో కూర్చొని వున్న సుధీర్ కనబడ్డాడు. అపరంజిని చూస్తూనే, కారు ముందు డోర్ తెరిచి, "ఎక్కు" అన్నాడు.

నుదురు ముడివేసింది. "ఏమైంది?"

"చెబుతానుకదా... ప్రతిదీ తొందరపడితే ఎలా... ఎల్లుండే నేను అమెరికా వెళ్ళేది... కాసేపు ఎక్కడయినా కూర్చొని మాట్లాడుకోవాల్సిన విషయాలున్నయి!" అన్నాడు ఆమె కూర్చొని కారు డోరు మూస్తుండగా.

"ఏదైనా హోటల్‌కు పోదాం పద... స్ట్రాంగ్ టిఫెన్, కాఫీ పడాలి... ఇంటికి వెళితే ఆ రెండూ అమ్మ ఇచ్చేది!"

కారు ముందుకు దూసుకుపోయి ఓ స్టార్ హోటల్‌ముందు ఆగింది.

లోపలకెళ్ళి ఓ టేబుల్‌ముందు కూర్చుంటూనే, "ఉల్లిపెసరట్టుకు ఆర్డరివ్వు!" అన్నది. బేరర్ వస్తే అదే చెప్పాడు.

"ముందే చెప్పేదా... పెసరట్టు తిన్నతరువాత చెప్పమంటావా?"

"ఆర్డరిచ్చావుగదా మొదలుపెట్టు... తినటం పూర్తయ్యేటప్పటికి విషయం పూర్తయిపోవాలి!" అన్నది నవ్వుతూ. "అమెరికా ఎప్పుడు బయల్దేరాలని?"

"అమెరికా ప్రయాణంతో నీకు చాలా రోజులు దూరంగా వుండాల్సి వస్తున్నదే అని బాధగా వున్నది!"

"నాకు మాత్రం బాధగా లేదంటావా?"

"నేనటంలేదమ్మా ఆమాట... ఈపాటికి మన పెళ్ళయి వున్నట్లయితే కాలేజీకి నీచేత డుమ్మా కొట్టించి నాతోపాటు తీసుకువెళ్ళేవాడినిగదా అనేది నా ఉద్దేశ్యం...!" అతడు కొద్దిక్షణాలు ఆలోచిస్తున్నట్లుగా ఆగాడు. "అవునూ, నాకు అర్థంకావటంలేదు మా అమ్మ మన వివాహానికి పేచీపెట్టటానికి అయిన సంబంధాలయితే అవిటి పిల్లలు పుడతారనే కారణం కాదేమోననిపిస్తోంది...!" కళ్ళుమూసుకొని ఆగి ఆగి అన్నాడు.

"ఎందుకని?... అదికాకపోతే మరేమైవుంటుంది?" అన్నది అతడి ముఖంలోకే వింతగా చూస్తూ.

"చాలా మొండిగా వాదిస్తున్నదంటే నాకు అనుమానంగా వున్నది... మనస్సులో ఇంకేదైనా పెట్టుకు మాట్లాడుతున్నదా అని... నాన్నేమో చెప్పిందంతా వింటాడేగాని, సమాధానం చెప్పడు!" కాస్తంత చికాగ్గా అన్నాడు.

"ఈ హోటల్లో పెసరట్టు స్పెషల్ అని నాకు తెలుసు అందుకే అది చెప్పమన్నది... బాగున్నది!" అన్నది ఫోర్క్‌తో తుంచి నోట్లోపెట్టుకుంటూ. "మామయ్యను నిలబెట్టి అడిగేయమంటావా, నన్ను!"

"ఆ వెధవ ఫోర్క్ తీసి అవతలపారేసి చేత్తో తీసుకు తిను ఇంకా రుచిగావుంటుంది... నువ్వు కాదు మాట్లాడాల్సింది, మామయ్యను, నాన్నను ఒకచోట కూర్చోబెడితే ఎలా వుంటుందా అని ఆలోచిస్తున్నాను!" నవ్వుతూ అన్నాడు.

"రిజిస్ట్రారాఫీసుకు వెళ్ళి అక్కడ మనమివ్వాల్సిన డాక్యుమెంట్స్ ఏవో తెలుసుకొని వచ్చానన్నావుకదా, వాటిని నా మొహాన పారేసి వెళ్ళు... నువ్వు వచ్చేలోగా నేను చేయాల్సిందేదో చేసి అట్టిపెడతాను!"

"తరువాత కార్యక్రమానికైనా వాళ్ళు ఏర్పాటుచేయమంటే మనమే మంచి హోటల్లో రూం బుక్ చేసుకోవాలి!" కళ్ళు చికిలించి అపరంజినేచూస్తూ నవ్వుతూ అన్నాడు సుధీర్.

అతడి మాటలకు చిరాగ్గా ముఖంపెట్టి, "వెధవ గోల!" అంటూ మురిపెంగా

అతడి చేతిమీద కొట్టింది అపరంజి. "హైదరాబాద్ చిన్నత్తకు ఫోన్ చేశావా అమెరికా వెళుతున్నట్లు!"

"చేశానమ్మా! నేను ఉండే చోటుకున్నూ, నిమ్మీ వుండేదానికి ఫ్లయిట్‌లో రెండు గంటల దూరంట... వీలుచూసుకొని వెళ్ళి చూసి రావాలి!"

"గుడ్ బాయ్!"

# 15

రాత్రి ఎనిమిదయింది ఫలక్‌నామా వైజాగ్ రైల్వే స్టేషన్‌లో ఆగేటప్పటికి. అక్కడ రైలు పది నిముషాలు ఆగుతుంది. అభినవ్ వస్తున్న ఎస్ తొమ్మిది దగ్గరకు పరుగెడుతున్నట్లుగా వెళ్ళింది అపరంజి. ఆ కొద్ది సేపటిలోనే తనను చూచి విభ్రాంతి చెందే అతడు కోలుకోవటానికి నాలుగయిదు నిముషాలు పట్టవచ్చు.

సుధీర్ అమెరికా వెళ్ళిన మూడు రోజులకు అభినవ్ ఫోన్‌చేసి, తను విజయవాడకు ఫలక్‌నామాలో వెళుతున్నట్లుగా అపరంజికి చెప్పాడు. ఆమె వైజాగ్ స్టేషన్‌లో కలుస్తాననటంతో తను వస్తున్న బోగీ నంబరు ఇచ్చాడు.

ఆమె బోగీ దగ్గరకు వస్తుండగానే, లాల్చీ పైజమాలో వున్న అభినవ్ పెట్టెదిగి ఆమెకు ఎదురు వచ్చి, "నమస్తే బాభీ!" అంటూ చిరునవ్వుతో నిలుచున్నాడు. "మిమ్మల్ని చూస్తుంటే వేదీని చూస్తున్నంత ఆనందంగా వున్నది!" అన్నాడు బిత్తరపోయి అతడినే చూస్తూ నిలుచున్న అపరంజి రెండు చేతులూ పట్టుకుంటూ.

అతడు నవ్వాడు. "నాకూ వేదీకి నడుమ ఎలాంటి రహస్యాలూ ఉండవు బాభీ!"

అపరంజికే కోలుకోవటానికి రెండు నిముషాలు పట్టింది. కోలుకున్న వెంటనే అడిగింది: "మా చెల్లెలు ఆరోగ్యం ఎలావున్నది?"

"నేను రెండు నెలలు శెలవుపెట్టి వస్తున్నాను!" అన్నాడు చిరునవ్వుతో అతడు. "వేదీ ఆరోగ్యం కుదుటపడి మామూలుగా ఇప్పటి మీలాగా తయారు చేయాలనేది

నా ఉద్దేశ్యం... అంతేకాదు వీలయినంత త్వరలోనే వేదీ మిసెస్ అభినవ్ అవ్వాలనేది నా మనస్సులోని మరో కోరిక!"

అతడి మాటల్లోని దృఢత్వం, కళ్ళల్లోని విశ్వాసం అపరంజికి ఎంతో ధైర్యాన్నిస్తున్నది.

"థాంక్స్... థాంక్స్ ఎ లాట్!" అన్నది ఇంకేం మాట్లాడాలో తెలియనంత ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ.

"బోన్‌మ్యారో మార్పిడికీ ఇంకా డోనార్స్ ఎవరూ దొరకలేదు... ఇక్కడ దాక్టర్ల ద్వారా ప్రయత్నించమన్నాను!"

"నేను విజయవాడ వస్తాను... నాది మ్యాచ్ అవుతుందేమో పరీక్ష చేయిద్దురుగాని!"

"వేదీ చెప్పింది... మీ రహస్యం ఎవరికీ తెలియగూడదనిగదా మీ ఇద్దరి మాటా... అందుకే విజయవాడలో ఉన్నంతకాలం రాత్రిళ్ళు నేనే వేదీకి ఆసుపత్రిలో తోడుగా ఉంటాను... ఆ సమయంలో మీరు కలవచ్చు!"

"థాంక్యూ!... హైదరాబాద్‌లోని నా స్నేహితురాలు కామాక్షిగూడా నాతోపాటు వస్తున్నది... దాని తండ్రే నివేదితను కిడ్నాపర్స్ బారినుండి రక్షించి మాకు డిఎన్ఏ టెస్ట్ చేయించి మేం స్వంత అక్కాచెల్లెళ్ళమని తేల్చింది!"

"ఫైన్!"

"మేం వచ్చేముందు ఫోన్ చేస్తాం... నివేదిత వున్న ఆసుపత్రికి దగ్గరలోనే హోటల్లో రూం తీసుకుందురుగాని!"

రైలు బయల్దేరుతున్నదనేందుకు సూచనగా ఇంజన్ కూతకూసింది.

* * *

ఆరోజు గురువారం. ఉదయాన ఎనిమిది గంటలకు స్నేహితురాళ్ళు నలుగురూ అరకుకు బయల్దేరారు. ఓ గంటలో సింహాచలం వెళ్ళి వరహానరశింహస్వామిని

దర్శించుకొని వెళ్ళాలనేది వాళ్ళ ఆలోచన. అక్కడ వాళ్ళకు ప్రత్యేక దర్శనానికి కృష్ణవేణి అన్నయ్య ఏర్పాట్లు చేశాడు.

సంవత్సరమంతా ఉగ్రరూపంలో ఉండే స్వామిని చందనంతో చల్లబరుస్తుంటారు. ప్రతి ఏట వైశాఖ శుద్ధ తదియనాడు ఆ చందనాన్ని తొలగించి మూలవిరాట్టుకు ఉత్సవాలు జరుపుతారు. అప్పుడే భక్తులకు నిజరూప దర్శనం జరుగుతుంది. సంవత్సరానికి ఒకసారి వచ్చే ఆ ఉత్సవానికి లక్షలాది భక్తులు మన రాష్ట్రంనుండే గాకుండా పొరుగు రాష్ట్రాలనుండి కూడా వస్తారు. దానికి ఇంకా మూడు రోజుల సమయమున్నది. అరకునుంచి తిరిగి వస్తున్నప్పుడు స్వామివారి నిజరూపాన్ని దర్శించుకోవాలని నిర్ణయించుకున్నారు.

"ఈసారి కామాక్షి కప్పస్థంభాన్ని కౌగిలించుకొని వివాహం త్వరగా చేయమని కోరుకుంటుంది!" అన్నది అపరంజి నవ్వుతూ.

"నాకిప్పుడు అంత హడావుడేం లేదు... అయినప్పుడే అవుతుంది... ఆ వెధవగోల ఇప్పటినుంచే దేనికి?" అన్నది అరుస్తున్నట్లుగా కామాక్షి.

"ఇలా అనేవాళ్ళే ఆ మూడుముళ్ళూ పడింతరువాత అందరినీ క్షణాలల్లో మరిచిపోతారు... సుజాత చూడు రెండుమూడు రోజులకొకసారి ఫోన్‌చేసి మాట్లాడేది... పెళ్ళయింది- మనం చేస్తేనే మాట్లాడటం, అదీ అంటీ అంటనట్లుగా!" కృష్ణవేణి పకపకా నవ్వుతూ అన్నది.

వీళ్ళు సింహాచలం గుడికి వెళ్ళేటప్పటికి కృష్ణవేణి అన్నయ్య ఏర్పాటు చేసిన మనిషి వచ్చి వాళ్ళను ప్రధాన ద్వారం ద్వారా లోపలకు తీసుకు వెళ్ళి స్వామివారి దర్శనం చేయించాడు. ఇంకా ఉత్సవం ప్రారంభం కాకపోవటంతో జనం అంతగా లేరు. పందిళ్ళు వేస్తున్నారు. భక్తులు క్యూలో నడిచేందుకు గాను కర్రలతో బ్యారికేడ్లు కడుతున్నారు.

వాళ్ళ కారు అరకువ్యాలీ రోడ్డెక్కేటప్పటికి పది గంటలు దాటింది. మధ్యతరగతి వారికి అరకే కొడైకెనాల్, ఊటీ. అరకు అంటే ఒరియాలో ఎర్రమట్టి అని. ఎటు

చూచినా ఎర్రమట్టే గనుక దానికి ఆ పేరు వచ్చింది.

ఆ నలుగురూ అప్పటికే దాని అందాల్ని చాలాసార్లు చూచారు. ప్యాసింజర్ రైలు ఎక్కి ఉత్కంఠభరితంగా జరిగే ప్రయాణాన్ని ఆస్వాదించారు. అసలు ఆ రైలు బయల్దేరటానికి చాలా ముందుగా వెళ్ళి కుడివైపు సీట్లలో కూర్చునేవారు కావాలని. అప్పుడే లోయలు, పచ్చని చెట్లు, వాటికి పూసే వివిధరంగుల్లో పూలు స్పష్టంగా కనబడేది. వాటి అందాల్ని చూడగలిగేది. కొండ కోనల నడుమ రైలు ఎలా పాములా మెలికలు తిరుగుతూ పోతుందో కనబడేది. దారిలో వచ్చే సొరంగాలను, చిన్నచిన్న వంతెనలనూ చూడగలిగేది.

ఘాట్ రోడ్డుమీద కారు ముందుకు దూసుకుపోతోంది. అరకు కాఫీతోటలకు ప్రసిద్ధి. దారిపొడువునా అందమైన దృశ్యాలు. పచ్చని చెట్ల నడుమ గలగలాపారే సెలయేళ్ళు. తలపైకెత్తి మరీ చూడాలనిపించే కొండ శిఖరాలు. తలవంచితేనేగాని కనబడని లోయలు. మధ్యమధ్య ఇంటికప్పుల మీదగా పొగలు లేస్తూ కనబడే చిన్నచిన్న గ్రామాలు.

ఆ ఘాట్ రోడ్డులో కారు పోతుంటే మేఘాల మధ్యగా పోతున్నట్లే అనిపిస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌లోకెల్లా ఎత్తయిన 'గాలికొండ' ఇక్కడే వున్నది. చుట్టూ పచ్చటి చెట్లతో చక్కని చల్లటి వాతావరణం. వివిధరకాల పక్షులు, పూలు, పండ్లు, వైద్యానికి ఉపయోగించే చెట్లు. కాఫీ తోటలు సరేసరి. అనాసా ఎక్కువగానే కనబడుతుంది.

ఈ ప్రాంత జీవన సరళిని చూపే శిల్పకళావేదికలో నిజంగా మనుష్యులే వివిధ భంగిమల్లో వున్నారా అని తలపించేలా ఏర్పాటుచేసిన బొమ్మలు చూపరులను ముగ్ధుల్ని చేస్తయి.

రోడ్డు పక్కన అక్కడక్కడా ఆ లోయలో నివసించే ఆదివాసులు వరుసగా ఒకరి వెనగ్గా ఒకరు నడిచే దృశ్యాలు కనువిందు చేస్తున్నయి. వారి చీరె కట్టులోని ప్రత్యేకత, జుట్టును నున్నగా దువ్వి కొప్పులా పెట్టుకోవటం పదేపదే చూడాలనిపించేలా వుంటుంది. అందులో రంగురంగుల పూలు. నుదుట పెద్ద కుంకుమ బొట్టు. ముక్కుకు బులాకి.

చెవులకు పెద్దపెద్ద దిద్దులు, వాటికి వ్రేలాడే రకరకాల పూసలు. చేతికి వివిధ రంగుల్లో గాజులు. కాళ్ళకు వెండి కడియాలు. ప్రతివారి నెత్తినా ఓ వెదురు బుట్ట. వాళ్ళు దగ్గరలోవున్న అంగళ్ళకు వెళ్ళి అడవుల్లో సేకరించిన పదార్థాలను విక్రయించి, తమకు కావాల్సిన వస్తువులను తెచ్చుకుంటుంటారు.

మొత్తం అక్కడ పధ్నాలుగు పంచాయితీలున్నాయి. అందులో చిన్నచిన్న గూడాలు చాలా వున్నాయి.

బొర్రాకేవ్స్‌కి అరకు గ్రామానికి మధ్యలో వున్నది కృష్ణవేణి అన్నయ్య రవీంద్ర కట్టించిన స్టార్ హోటల్ 'ఆదరణ'. ఆ కుటుంబానికి వంశపారంపర్యంగా వస్తున్న ఆస్థే లెక్కకు మించి వున్నది. ఆపైన తండ్రి వివిధ వ్యాపారాలు చేసి దాన్ని మరిన్ని రెట్లు పెంచాడు. ఆయనకు ఇద్దరే పిల్లలు– రవీంద్ర, కృష్ణవేణి.

వీళ్ళకారు 'ఆదరణ' ముందు ఆగేటప్పటికి పన్నెండు దాటింది. వీళ్ళను చూస్తూనే కిరణ్ ఎంతో సంతోషించాడు. "నాకు పెద్ద రిలీఫ్ చెల్లాయ్!... ఒక్కడినీ టెన్షన్ పడుతున్నాను... రేపుదయంనుంచీ ఫారినర్స్ వస్తారు... వాళ్ళకు ఏ మాత్రం ఇబ్బంది కలగకుండా నువ్వే చూడాలి!" అన్నాడు. "దేశ విదేశాల్లో మన 'ఆదరణ' పేరు మారుమ్రోగిపోవాలి!"

అతడు ఆ హోటల్ కట్టించిన తరువాత వచ్చిన మొదటి చందనోత్సవం ఇది!

వాళ్ళ బ్యాగులను హోటల్ కుర్రాళ్ళు కారులోనుంచి తీసుకెళ్ళి వాళ్ళకు కేటాయించిన గదిలో పెట్టారు. నలుగురూ ఆ గదిలోకి వెళ్ళారు. వాళ్ళ వెనగ్గా వచ్చిన కిరణ్, "సారీ సిస్టర్స్!... ఈ నాలుగు రోజులూ మీరంతా ఒకే గదిలో సర్దుకోవాలి... సోమవారం ఒక్కొక్కరికీ ఒక్కొక్క గది కావాలన్నా ఇస్తాను!" అన్నాడు నవ్వుతూ.

"ఫరవాలేదండి... మాకే ఇబ్బందీ లేదు... మా కామాక్షి అయితే విశాఖలో వున్నంతకాలం హాస్టల్‌లోనే వున్నది... మేమంటారా అంతా ఒక ఊరి వాళ్ళమే... మేం చేయాల్సిన పనులేవో చెబితే– ఎలా చేయాలో ముందుగానే ప్లాన్ చేసుకొని పకడ్బందీగా నిర్వర్తిస్తాం!" అన్నది అపరంజి.

“అన్ని పనులకూ మనుష్యుల్ని పెట్టాను... వాళ్ళు వాళ్ళకు అప్పగించిన పనులను సవ్యంగా నిర్వర్తిస్తున్నారా లేదా అని చూడటమే మీ పని... సామాన్యంగా ఇక్కడకు వచ్చే విదేశీయులు కేవ్స్, అరకు గ్రామాన్ని చూడటమే గాకుండా, ఆదివాసుల తండాలు నివసించే ప్రదేశాలకు వెళ్ళి వాళ్ళ జీవన విధానాలను చూడటానికి ఇష్టపడతారు... వాళ్ళ ఫొటోలు తీసుకుంటారు... అందుకుగాను ఈ పరిసరాలు బాగా తెలిసిన నలుగురు చదువుకున్న కుర్రవాళ్ళను వారం రోజులపాటు గైడ్స్‌గా వుండేందుకు ఎన్నుకున్నాను... వాళ్ళే ఇక్కడ చూడదగ్గ ప్రదేశాలన్నిటికీ మన కార్లలోనే తీసుకువెళ్ళి చూపిస్తారు ... మీ పనల్లా అలా వెళ్దామనుకున్న వాళ్ళందరితో మాట్లాడి, వాళ్ళ అభిలాష ప్రకారం గ్రూపులుగా చేసి, ఓ గైడ్‌నిచ్చి పంపటం... మన హోటల్లో వాళ్ళు ఏదైనా ఇబ్బంది పడుతున్నట్లుగా మీ దృష్టికి వస్తే సూపర్‌వైజర్లకు తగిన సూచనలివ్వటం!”

నలుగురూ ఫ్రెషప్ అయి గ్రౌండ్ ఫ్లోర్‌లో వున్న రెస్టారెంటకు లంచ్ చేయటానికిగాను బయల్దేరారు.

‘‘మనం కూడా వాళ్ళతోపాటు వెళ్ళి వివిధ ప్రదేశాలనూ చూస్తే బాగుంటుందేమోననిపిస్తోంది!” అన్నది అపరంజి.

“వాళ్ళతో మనకెందుకే... ఆదివారం రాత్రితో ఫంక్షన్ అయిపోతుంది... సోమవారం నాడు మనమే ఓ గైడ్‌ను తీసుకొని వెళ్దాం... మంగళవారం విశాఖకు వెళ్ళవచ్చు... వెళుతూ వెళుతూ సింహాద్రి అప్పన్నను కూడా మరోసారి దర్శించుకోవచ్చు!” అన్నది కృష్ణవేణి.

“ఫైన్!”

* * *

శుక్రవారం బొర్రా గుహల దగ్గర, శనివారం అరకు గ్రామంలో, ఆదివారం ప్రవీణ్ హోటల్ ‘ఆదరణ’ ఆవరణలో థింసా నృత్యం ఏర్పాటు చేయబడింది పర్యాటకశాఖ ఆధ్వర్యంలో.

అరకులో పందొమ్మిది తెగల దాకా ఆదివాసులు ఉన్నారు. వారి కట్టూబొట్టూ కాస్తంత భిన్నంగా వుంటుంది తెగ తెగకీ.

ఆదివారం సాయంత్రం చల్లని వాతావరణంలో హోటల్ 'ఆదరణ' లాన్‌లో ఏర్పరిచారు వారి నృత్యాన్ని.

వారు సామూహికంగా ధిమ్సా, మయూరి నృత్యాలు చేస్తారు. ముఖ్యంగా ఏప్రియల్ మాసంలో వచ్చే ఇటికపొంగల్ సమయంలో చూడాలి. చిన్న, పెద్ద, ముసలి, ఆడా, మగా అందరూ కలిసి ఈ నృత్యాన్ని చేస్తారు. వాల్మీకి, బగత, ఖంద, కోటియా తెగల నృత్యం ప్రసిద్ధి. ఈ థింసా నృత్యంలో కూడా ఎనిమిది రకాలున్నయి. గ్రామదేవతలను పూజించే విధంగా వుంటయి ఈ నృత్యాలు. మగా, ఆడా వేరువేరు వరుసల్లో నిల్చొని ఒకళ్ళనొకళ్లు పట్టుకొని చేసే నృత్యం ఇది. అలా చేస్తూ, పాటలు పాడుతుండగా వివిధ వాయిద్యాలు డప్పు, జోడు కొమ్ములు వాయిస్తుంటారు. వారు కట్టుకున్న దుస్తులు అలంకరణ అందరిదీ ఒకే విధంగా వుంటుంది. తల్లో రంగురంగుల పూలు పెట్టుకుంటారు. సామాన్యంగా వారి నృత్యాలలో వారి జీవిత విధానం తెలుస్తుంది. ఈ నృత్యం చొంపి గ్రామంలో నూటయాభై సంవత్సరాల క్రితం ప్రారంభమయిందంటారు. థింసా అంటే సంతోషం అని!

ఆరు బయట లాన్లో అతిథులంతా గుండ్రంగా కూర్చొని వున్నారు. మధ్యలో నృత్యం జరుగుతున్నది. అక్కడున్న వారంతా ఆహ్లాదంగా రెండు గంటలపాటు జరిగిన ఆ కార్యక్రమాన్ని చూచి ఎంతగానో ఆనందించారు. విదేశీయులయితే ఆ కార్యక్రమం అయ్యేంతవరకూ కెమేరాలు ఆన్‌చేసే వుంచారు.

"ఇంతకష్టపడి వాళ్ళు అంతమంది నృత్యం చేశారుగదా వారికి ఎంతిస్తారేం?" అడిగింది అపరంజి ప్రవీణ్‌ని.

"ట్రూపు మొత్తానికి పదిహేను వందలు... పాల్గొన్న ప్రతి ఒక్కరికీ యాభై!"

* * *

సోమవారం ఉదయం పదిగంటలయ్యేటప్పటికల్లా 'ఆదరణ'లో చాలావరకు గదులు ఖాళీ అయిపోయినయి.

కాఫీలు త్రాగుతూ నలుగురు స్నేహితురాళ్ళు ప్రవీణ్ గదిలో ఓ పక్కగా వున్న సోఫాల్లో కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. అతడికి ఆ మూడు రోజులు వాళ్ళు చేసిన సాయానికి ఆనందంగా వున్నది. విదేశీయులు చాలామంది వెళుతూ వెళుతూ తమకు చేసిన ఏర్పాట్లకుగాను ప్రవీణ్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవటమేగాకుండా అడిగి మరి అతడి విజిటింగ్ కార్డ్సు తీసుకువెళ్ళారు– తమకు తెలిసిన వాళ్ళెవరైనా ఇక్కడకు వస్తుంటే ముందుగా ఫోన్‌చేసి గదులు రిజర్వు చేసుకునేందుకు.

అపరంజి టీపాయ్‌మీద వున్న ఆ రోజు తెలుగు పేపరు తీసుకున్నది. దాంట్లో రోజూ, క్రితం రోజు జరిగిన కార్యక్రమాలను విపులంగా ఫొటోలతో సహా విశాఖపట్నం ఎడిషన్‌లో వేస్తున్నారు. ఆ న్యూస్ కోసం పేజీలు తిప్పుతుండగా ఆమె దృష్టి ఓ వార్తమీద పడింది.

## మానవత్వం మరిచిన త్రాగుబోతు తండ్రి

"రెండు రోజుల క్రితం ఓ ఆదివాసి స్త్రీకి పుట్టిన పసిగుడ్డును– ఆమె భర్త త్రాగటానికి డబ్బులు దొరక్కపోవటంతో ఇంట్లో అందరినీ ఏమార్చి తీసుకు వెళ్ళి అమ్మివేయటం గూడెంలో సంచలనాన్నే కలిగించింది. అది తెలుసుకున్న భార్య, బంధువులు విలపిస్తూ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేయగా పరారీలో వున్న అతడి కోసం గాలింపు మొదలయింది. ఎవరు కొనుక్కున్నది కూడా అంతు చిక్కటంలేదు."

అతడి ఫొటో వేశారు. గడ్డాలు, మీసాలు పెరిగి భుజాలవరకూ వ్రేలాడుతున్న జుట్టు. ఎముకలు వెళ్ళుకొచ్చిన శరీరం. వంటిన పెద్ద గోచీ తప్ప మరేమీ లేదు.

విచిత్రంగా ఆ ఫొటోను, వార్తను చూస్తూ వుండిపోయింది అపరంజి. 'అంత హీనస్థితిలో ఉంటారా మనుష్యులు– ఏ తండ్రయినా అలా చేస్తాడా?' అన్నట్లుగా ఆ వార్త వంకే చూస్తూ బిగుసుకుపోయింది.

"ఏమిటి తాదాప్యంగా చూస్తున్నావ్... వాళ్ళు వేసిన ఫొటోలల్లో మనం కూడా కనబడుతున్నామా?" పేపరు లాక్కుంటూ అడిగింది సులోచన.

కోలుకొని స్నేహితురాలికి చూపించింది ఆ వార్తను. దాన్ని చూస్తూనే నవ్వుతూ, "ఇక్కడనేముంది... దేశమంతా జరుగుతునే వున్నయి ఇలాంటివి!" అన్నది ఆ అమ్మాయి.

ప్రవీణ్ ఆ పేపరు తీసుకొని ఆ వార్తను చదివి పకపకా నవ్వాడు. "ఇవి మామూలే... కన్నతల్లులే అమ్ముతుండగా తాగుబోతు తండ్రి అమ్మటంలో వింతేమున్నది... కొందరికి ఇది కడుపు నింపుకోవటానికి డబ్బు సంపాదించే మార్గం అన్నా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు!"

"నిజమా?" నోరు తెరిచింది అపరంజి.

"తిండికి ఇక్కట్లు పడుతూ నలుగురిముందూ చేయిజాచే దానికంటే అదే మంచి పద్ధతిగా తోచివుండవచ్చు వాళ్ళకు. పిల్లల్ని కనటం, అమ్మటం... అది నేరమే కావచ్చు... పిల్లలు లేని వాళ్ళు ఈ ప్రపంచంలో చాలామంది వున్నారు... తమకు పుట్టిన పిల్లలు తమలాగానే దరిద్రంలో పెరిగేదానికంటే భాగ్యవంతుల ఇళ్ళల్లో మంచి భవిష్యత్తుతో పెరిగేలా చేయటంలో తప్పేమున్నది అనే వాదనకూడా వున్నది... మరి కొందరయితే మేం డబ్బు సంపాదించుకోవటానికి అదొక మార్గంగా ఎన్నుకున్నాం అని నిర్భీతిగా, నిర్లజ్జగా చెబుతారు!"

"ఏదైనా మనుష్యులను జంతువుల్లాగా, అందునా ఏమీ తెలియని పసిబిడ్డలతో అలాంటి వ్యాపారం చేయటం ఘోరం కాదా?" అపరంజి అన్నది. ఆమె మనస్సంతా అతడి మాటలకు వికలత్వం చెందింది.

తనూ నివేదితా కూడా ఒకే తల్లి బిడ్డలయితే ఆమె తమని అమ్మివుండకపోవచ్చుగాని, పెంపకానికి మరొకరికిచ్చి తమ భవిష్యత్తు దిశనే మార్చివేసి వుండవచ్చు.

తమ అసలు తల్లి ఎవరో తనకూ, నివేదితకు కూడా తెలియాలి!

ప్రవీణ్ నవ్వుతూనే, "వారం రోజుల క్రితం జరిగిన ఓ విచిత్రమయిన విషయం

చెబుతాను... అది వింటే మీరు ఇంకెంతగా ఆశ్చర్యపోతారో!" అన్నాడు రింగవుతున్న సెల్‌ను చేతిలోకి తీసుకొని ఆన్‌చేస్తూ.

"నేను పర్యాటకశాఖ, విశాఖపట్టణం బ్రాంచ్‌నుంచి మాట్లాడుతున్నానండి... మీనుండి మాకు కొటేషన్ కావాలి... రోజూ మా బస్సు ఒకటి అరకుకు పర్యాటకుల్ని తీసుకొని తొమ్మిది గంటలకు వస్తుంది... మరల మరునాడు ఉదయం ఏడు గంటలకు అక్కడ బయల్దేరుతుంది... మీ హోటల్లో ఇరవై గదులు మా కోసం ప్రత్యేకంగా రిజర్వు చేసి అట్టిపెట్టగలరా? రెండోది శెలవు దినాల్లోను, పండగ సందర్భాలలోనూ మీ ఆవరణలో థింసా నృత్యాలలాంటి ఆదివాసుల కార్యక్రమాలను ఏర్పాటు చేయాలనేది గూడా ఒక ఆలోచన... అందుకు మీ సహకారం కావాలి! మీరు ఈ మూడు రోజులు చేసిన ఏర్పాట్లను విదేశీ పర్యాటకులు ఎంతగానో మెచ్చుకున్నారు... మీ కొటేషన్ ఆరునెలలు అమలులో వుండేలా ఇవ్వండి!"

"చాలా ఆనందం సార్! మీకు అభ్యంతరం లేకపోతే నేనే స్వయంగా వచ్చి పూర్తి వివరాలు తెలుసుకొని కొటేషన్ రాసి ఇస్తాను!" అన్నాడు ఉత్సాహంగా ప్రవీణ్.

"ఎల్లుండి సాయంత్రం మూడు గంటలకు రాగలుగుతారా?"

"తప్పకుండా... థాంక్యూ!"

సెల్ ఆఫ్ అవ్వగానే చెల్లెలు వంక తిరిగి, "గుడ్ ఆఫర్... పర్యాటక శాఖకు మన హోటల్లో రోజూ ఇరవైగదులు రిజర్వుచేసి ఉంచాలిట... ఎల్లుండి మధ్యాహ్నం మాట్లాడటానికి రమ్మనమన్నారు... మీరు ఉండండి... ఎల్లుండి అంతా కలిసి వెళ్దాం... ఈలోగా మీ స్నేహితురాళ్ళకు ఇక్కడ చూడాల్సినవన్నీ చూపించు... ఓ గైడ్‌ను ఇస్తాను!"

"తప్పకుండా ఉంటామండి... థాంక్యూ... మళ్ళా మాకు ఇటు వచ్చే అవకాశం ఉంటుందో లేదో... ఎల్లుండి మీరే సింహాచలంలో దైవదర్శనం కూడా చేయించాలి!" అన్నది కామాక్షి.

"ష్యూర్!"

"ఇందాక మీరేదో విచిత్రమైన వార్త చెబుతామన్నారు!" అన్నది అతడి వంకే ఆ విషయం వినటానికి ఆసక్తి చూపిస్తూ అపరంజి.

అతడు మళ్ళా నవ్వాడు. "పదిహేను రోజుల క్రితం ఒకతను మా హోటల్లో దిగాడు. నెల్లూరునుంచి వచ్చాడట. ఎమ్మే చదివానన్నాడు... 'అరకులోయలో ఆదివాసుల జీవనం' అనే విషయం మీద పీహెచ్‌డీ చేస్తున్నాడట... విషయ సేకరణకు వచ్చాను, పదిహేను రోజులు ఉంటాను అన్నాడు... ఇక్కడ గ్రామాలన్నీ చూపించి, వాళ్ళతో మాట్లాడేందుకు వీలుగా ఓ గైడ్‌ను ఏర్పాటు చేయమని అడిగాడు... నా దగ్గర పనిచేస్తున్న చాకులాంటి కుర్రాడిని అతడికి అప్పజెప్పాను... వాళ్ళిద్దరూ కలిసి ఊళ్ళన్నీ తిరిగారు... అతడు అక్కడ నివాసితులందరితోనూ మాట్లాడాడు!... పదిహేను రోజులు ఉంటానన్నవాడు పది రోజులకే నా పనయిపోయింది అంటూ గది ఖాళీచేసి వెళ్ళిపోయాడు!"

"అదేమిటి... అన్నాళ్ళుండి ఇక్కడ జరిగే ఫంక్షన్ చూడకుండానే వెళ్ళిపోయాడా... ఆయనగారు రాసే థీసిస్‌లో ఇక్కడ వీళ్ళు చేసే వివిధరకాల నృత్యాల వివరాలను జేర్చడా?" అడిగింది సులోచన.

ప్రవీణ్ మరోసారి నవ్వాడు. "అసలు అతడు రీసర్చ్ స్టూడెంట్ కాదు... విజయవాడలో వున్న ఓ ప్రైవేట్ ఇన్‌వెస్టిగేటింగ్ ఏజన్సీనుంచి వచ్చాడు!"

"అబద్ధమాడవలసిన అవసరం ఏమున్నది?" చెల్లెలే నుదురు ముడివేసి అడిగింది.

"నిజం చెబితే ఈ ప్రదేశంలోనే వుండే నేను సహకరించకపోవచ్చని భయపడి వుండవచ్చు!... అతడి సమస్య పదిరోజుల్లోనే తీరిపోవటంతో వెళ్ళిపోయాడు... పూర్‌ఫెలో పనికాకపోవటంతో బాగా నిరాశపడ్డాడు!"

"ఏం పనిమీద వచ్చాడట?" అపరంజి కుతూహలంగా అడిగింది.

"వాడు ఫత్తేదారుగా రావటంతో నోరు తెరిచి ఒక్కమాట కూడా చెప్పలేదు... నేనిచ్చిన గైడ్ చాకన్నాను కదా... వాడు సేకరిస్తున్న వివరాలను బట్టి వాడి రాకకు

అసలు కారణం కనిపెట్టేసి నాకు చెప్పాడు!”

“ఏమిటది?”

“ఇరవై రెండు సంవత్సరాల క్రితం ఇలానే చందనోత్సవ సమయంలో కోల్‌కతా నుండి నరసింహస్వామి నిజరూప దర్శనానికి ఓ దంపతులు విశాఖ వచ్చారు... దూరప్రదేశాలనుంచి వచ్చినవాళ్ళు ఎవరూ సామాన్యంగా అరకు చూడకుండా వెళ్ళరు... అలా స్వామి దర్శనం కాగానే వాళ్ళూ అరకు వచ్చారు. మధ్య వయస్కులు... పిల్లలు లేరు... వాళ్ళకు అనుకోకుండా పసిపిల్లలను అమ్మే ఓ స్త్రీ తటస్థపడింది... రోజుల పాప... చూడ ముచ్చటగా వున్నది... వాళ్ళు ఆ ఉద్దేశ్యంతో ఇక్కడకు రాకపోయినా, ఇదేదో దైవ సంకల్పంలా అనిపించగా ముందుకు దూకేసి ఆమె కోరిన డబ్బిచ్చి ఆ పిల్లను తీసుకొని వెళ్ళిపోయారు!”

అపరంజి కళ్ళప్పగించి అతడినే చూస్తూ ఉండిపోయింది. ‘కోల్‌కతా దంపతులు’ అనే మాట ఆమె గుండెలో బాకయి గుచ్చుకున్నది.

అంటే?

ప్రవీణ్ తను చెప్పటం కొనసాగించాడు. “అది గతపు కథ... ఇప్పుడు ఆ దంపతులకు ఓ విషమ పరిస్థితి ఏర్పడింది... ఆయన ప్రస్థుతం విజయవాడలో వున్న ఓ బ్యాంక్‌లో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు!”

అపరంజి గుండె దడదడలాడసాగింది ఏం వినాల్సి వస్తుందోనన్నట్లుగా.

“వాళ్ళు పెంచుకున్న అమ్మాయి చాలా తెలివిగలది... చదువులో బాగా రాణించింది... కానీ దురదృష్టవశాత్తు చిన్న వయస్సులోనే ఆ అమ్మాయికి బ్లడ్‌క్యాన్సర్ వచ్చింది!”

అపరంజి ఉలిక్కిపడ్డట్లుగా తలెత్తింది. మొఖమంతా నల్లబడిపోయింది. శరీరం ఒణుకుతోంది.

“అయ్యో!” అన్నది కృష్ణవేణి.

"బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాన్టేషన్ చేయించాలని డాక్టర్లు నిర్ణయించారు... తల్లిదండ్రులు పెంచుకున్నవాళ్ళే అవ్వటంతో వాళ్ళది మ్యాచ్ కాలేదు... డోనార్స్ కోసం ఓ వైపు ప్రయత్నిస్తూనే, అవసరమొస్తే తీసుకు వచ్చేందుకు గాను ఈలోగా అసలు తల్లిని గుర్తించటం మంచిదన్నట్లుగా విజయవాడలోనే వున్న ఓ ప్రైవేటు ఇన్వెస్టిగేటింగ్ ఏజన్సీని సంప్రదించారు. దాని ఫలితమే అతడు ఇక్కడకు రావటం!"

కళ్ళు తిరుగుతున్నట్లనిపించగా నుదురు పట్టుకొని తల వెనక్కు వాల్చింది అపరంజి.

"ఆ అమ్మాయి పేరు చెప్పాడా?" అడిగింది కామాక్షి ఆత్రంగా.

"కావాల్సిన మనిషి దొరక్కపోవటంతో ఏవో కొన్ని విషయాలు మాత్రం నేనిచ్చిన గైడ్‌తో మాటల్లో అన్నాడట!" ప్రవీణ్ ఆగాడు మళ్ళా సెల్ మ్రోగటంతో. చేతిలోకి తీసుకొని ఆన్ చేశాడు. "చెప్పరా." అది వైజాగ్‌నుంచి స్నేహితుడు చేశాడు. అతడి స్నేహితులెవరో చెన్నయ్‌నుంచి అరకు చూడటానికి వస్తున్నారట- వచ్చే శని ఆదివారాలల్లో రూం కావాలిట. "సరే ఆలాగే వుంచుతానులే!" అని చెప్పి టీపాయ్‌మీద వున్న ప్యాడ్‌మీద ఆ విషయం రాసుకున్నాడు.

"రుక్మి అనే ఆ మనిషికోసం అతడు గూడాలన్నీ వెతికాడట... ఆమె పిల్లను అమ్మినప్పుడు ఏ ఊరు అని అడిగితే 'ఇదే' అని చెప్పిందిటగాని సరిగ్గా ఊరిపేరు చెప్పలేదట... అందుకే వచ్చిన అతడు ఇక్కడ వున్న దాదాపు అన్ని గ్రామాలు తిరగాల్సివచ్చింది. చివరకు అరకుకు అయిదు కిలోమీటర్ల దూరంలో చిట్టడవిలో వున్న చిన్న గూడెంలో ఆమె ఉంటున్నట్లుగా తెలిసి అక్కడకు వెళ్ళాడు!"

"దొరికిందా?" ఆత్రంగా ముందుకు వంగుతూ అడిగింది అపరంజి. అతడు చెప్పే సమాధానం కోసం ఆమె గుండె దడదడలాడుతోంది. డిఎన్ఏ టెస్ట్‌లో నివేదిత తన స్వంతచెల్లెలుగానే నిర్ధారించినప్పుడు, ఆమె తల్లీ తనకూ తల్లే అవ్వాలి!

మెదడంతా మొద్దుబారిపోతున్నది. పక్కనున్న కామాక్షి 'ఆవేశపడబోకు' అన్నట్లుగా అపరంజి చేతిమీద చేయివేసి నొక్కింది.

"ఆమెను తీసుకు వెళ్ళారా విజయవాడ?" అన్నది నోరు పెగల్చుకొని కొద్దిక్షణాల తరువాత తనని తాను నిగ్రహించుకుంటూ. ఆమె గనుక విజయవాడ వెళితే తనూ వెంటనే అక్కడకు వెళ్ళాలి!

"అతడు పడ్డ శ్రమకు ఫలితం దొరక్కనేకదా మధ్యలోనే అతడి విచారణ ముగించేసి వెళ్ళిపోయింది...!"

"అంటే ఆమె రానన్నదా?" మరింత ఉత్సుకత– వెళ్ళకపోతే ఇక్కడే తనైనా వెళ్ళి చూసి ఆమె వెళ్ళేందుకు అంగీకరించేలా చేయాలి!

"ఆ గూడెంలో అందరినీ విచారించగా చివరకు ఓ ముసలాడు– దాని తాతట– బయటపడి ఒప్పుకున్నాడట... లచ్చి అట్లాగే కన్నపిల్లల్ని అమ్మేస్తుండేది అంటూ– బయటవాళ్ళకు తన పేరు 'రుక్మి' అని చెబుతుందిగాని, దాని అసలు పేరు 'లచ్చి'... ఉన్నట్లుండి దాని మొగుడు పాము కాటుకు చస్తే, ఆ దిగులుతోనే అదీ మంచమెక్కి క్రితం సంవత్సరమే చచ్చిపోయిందని!"

– అపరంజి ఆ మాట వింటూనే సోఫాలో వెనక్కు జారిగిలపడిపోయింది నీరసంగా.

# 16

బుధవారం రాత్రి గోదావరిలో అపరంజి, కామాక్షి విజయవాడకు బయల్దేరారు. వాళ్ళకు ప్రవీణ్ ఆన్‌లైన్‌లో టిక్కెట్లు తీసుకున్నాడు.

ఆరోజు అరకులో ఉదయాన చీకటితోనే బయల్దేరి, దారిలో సింహాచలంలో స్వామిని చూసుకొని పదకొండు గంటలకల్లా విశాఖపట్నం వచ్చారు.

అపరంజి తల్లికి చెప్పింది. "మేం అయితే మా స్నేహితురాలిని చూసిన తరువాత విజయవాడలో మూడు నాలుగు రోజులుంటాం. కామాక్షి వాళ్ళ నాన్న విజయవాడలోనూ, మంగళగిరి, అమరావతి చూపించేందుకు ఏర్పాటు చేశారు...

ఏంభయం లేదు... మేం రావటానికి ఒకటి రెండు రోజులు ఆలస్యమయినా కంగారు పడబోకు!" అన్నది. "రోజూ ఎలాగూ సెల్‌లో మాట్లాడుతునే ఉంటాను గదా!"

"ఇన్ని చూడాలనుకుంటున్నప్పుడు మన కారు తీసుకు వెళ్ళవచ్చుగదా... నాన్న బయటకు వెళ్ళటానికి క్యాబ్‌ను పిలిపించుకుంటారు... మీరు బస్సుల్లో తిరిగి ఇబ్బంది పడటం దేనికి?" అన్నది.

అపరంజి గుండెల్లో ముల్లు గుచ్చుకున్నట్లుగా బాధ వేసింది ఆమె మాటలకు.'అంత ప్రేమగా తనని చూచే ఆమెను నేను నీ కూతుర్ని కాదు గదా అమ్మా!' అని అనాల్సివస్తుందేమో అని భయం మనస్సును మెలిపెట్టి పిండేస్తోంది.

"వద్దులే అమ్మా... నాన్నను ఇబ్బంది పెట్టటం దేనికి?... మరీ అంత ఇబ్బంది అనుకుంటే మేమే టాక్సీని ఎంగేజ్ చేసుకుంటాం!" అన్నది అనునయంగా. "చెప్పాను గదా... కామాక్షి నాన్న పెద్ద పోలీసాఫీసరు... ఆ ఏర్పాట్లేవో ఆయన చేస్తున్నారని!"

జీవితంలో తనకు ఎంత విచిత్రమయిన పరిస్థితి? నిజం చెప్పలేదు... చెప్పకుండా వుండనూ లేదు!

తను ఆమె కూతురు కాదు అనేది నిజమే అయితే ఎంతగా జీర్ణించుకోలేదో, తన తల్లిదండ్రులూ ఆ నిజాన్ని అంతగా జీర్ణించుకోలేకపోవచ్చు!

అంతా అర్థంకాని అయోమయ పరిస్థితే. ఛేదించేందుకు దారి కనబడటం లేదు– తన తల్లిదండ్రులు మనసు విప్పి నిజానిజాలు చెబితే తప్ప!

రాత్రి పదిగంటలప్పుడు రైలు ఎక్కినా కొలిక్కిరాని ఆలోచనలు.

"అదికాదే కామాక్షీ! తమ కూతురు ఇంత భయంకరమైన వ్యాధితో పోరాడుతున్నదని నివేదిత తల్లిదండ్రులు ఇప్పటికే అతలాకుతలం అవుతున్నారు... నివేదితా జీవన్మరణ సమస్యతో మంచాన పడింది. అటువంటి వాళ్ళకు ఇప్పుడు నివేదితకు కన్న తల్లి చనిపోయిందని ఎలా చెప్పాలి? ఆ ముసలాడు చెప్పినట్లు తన మనవరాలు పిల్లల్ని అమ్మినమాట వాస్తవమే అవ్వవచ్చు... అలా అమ్మిన వాళ్ళలో

తామిద్దరూ ఉన్నట్లుగా ఋజువెక్కడున్నది... అమ్మ నేను అనకాపల్లిలో పుట్టానంటుంది... దానికి తిరుగులేని సాక్ష్యంకూడా వున్నది... నివేదిత కోల్‌తాలో పుట్టినట్లుగా దాని తల్లిదండ్రులు చెబుతున్నారు... దురదృష్టవశాత్తు అది పుట్టిందన్న ఆసుపత్రి అగ్నికి ఆహుతి అయిపోయిందన్నది దేశమంతా తెలిసిన విషయమే... డిఎన్ఏ టెస్టులో మేం ఇద్దరం ఒక తల్లికే పుట్టామని తేలింది– ఏది నమ్మాలి, ఏది నమ్మకూడదు?"– తలపట్టుకు కూర్చున్నది అపరంజి.

"కచ్చితంగా ఈ విషయాన్ని బయటకు తీయాలి అంటే ఇద్దరి తల్లిదండ్రులదీ, మీది మరోసారి రక్త పరీక్ష చేయించాలి... అయినా ఇప్పుడు దాని వలన ఒరిగేదేమిటి... తెలుసుకొని ఏం చేస్తారు... మనస్తాపం తప్ప! అందుకే ఆ విషయాన్ని గురించి ఇప్పుడు ఆలోచించవద్దు... అసలు దాన్ని పూర్తిగా మరిచిపోవటం శ్రేయస్కరం!"

నిస్తేజంగా మిత్రురాలి ముఖంలోకి చూచింది అపరంజి.

"ముందు నివేదిత ఆరోగ్యం కుదుటబడాలి... అనుకోని పరిస్థితులలో నిన్నుగాని నివేదిత తల్లిదండ్రులు చూడటం తటస్థిస్తే వాళ్ళలోనే అంతర్మథనం మొదలవుతుంది... అప్పుడు ఏమౌతుందో చూద్దాం... నీ అంతట నువ్వు బయటపడి సమస్యను మరింత క్లిష్టం చేయవద్దు!" కామాక్షి మిత్రురాలి చేతిని అనునయంగా పట్టుకుంటూ అన్నది.

విజయవాడ వచ్చేశాం అన్నట్లుగా నగరంలోని దీపాలు కనబడుతున్నయి. టైం చూచుకున్నది అపరంజి. ఐదు గంటలయింది. బయట చిరుజల్లు పడుతున్నది. చల్లటిగాలి వీస్తోంది. అప్పటికే అక్కడ దిగాల్సిన ప్రయాణీకులు సామాన్లు పట్టుకొని బోగీ తలుపుల దగ్గరకు వెళుతున్నారు.

అపరంజి, కామాక్షి గూడా పెట్టెలు పట్టుకొని లేచారు.

స్టేషన్‌లో రైలు ఆగింది. అక్కడ ఎక్కువసేపు ఆగుతుందని తెలిసినా అందరికీ హడావుడే. చిన్నగా వాళ్ళూ దిగారు. దిగి అపరంజి నలువైపులా చూస్తుండగా, వెనుకనుంచి, "నమస్తే బాభీ!" అన్న కంఠం వినబడింది.

చటుక్కున వెనక్కు తిరిగింది అపరంజి.

"నమస్తే కామాక్షీ బెహన్!"

ఉలిక్కిపడ్డట్లుగా చూచింది అతడివంక కామాక్షి– తను కూడా తెలుసా అతడికి?

చిరునవ్వుల పలకరింపుల తరువాత, "నివేదిత ఎలా వున్నది?" అడిగింది అపరంజి.

"మీరు వచ్చారు... ఇక వేదీకి ఏ దిగులూ లేదు... ఆమెకు సంపూర్ణ ఆరోగ్యం త్వరలోనే చేకూరుతుంది!" అతడు మొహాన్ని విశాలం చేసుకొని నవ్వుతూ అన్నాడు.

"అంతకు మించిన ఆనందం నాకు మాత్రం ఇంకేముంటుంది!" అన్నది అపరంజి తృప్తిగా అతడినే చూస్తూ.

ఆటో ఎక్కారు ముగ్గురూ. హోటల్ రూంకు వెళ్ళిం తరువాత కిటికీ తలుపులు తెరిచి, "ఎదురుగ్గా రోడ్డు అవతల వున్నదే నివేదిత ఉన్న ఆసుపత్రి... ఓ గంటలో అంకుల్ ఆంటీ వస్తారు... రాత్రి ఎనిమిది దాకా వుంటారు... నేను మిమ్మల్ని ఆ తరువాత తీసుకు వెళతాను!"

పక్క భవంతిలోనే వున్నా అన్ని గంటలు చెల్లెల్ని చూడకుండా వుండటం అంటే ఎన్నో రోజులు చూడలేకపోతున్నట్లే అనిపిస్తోంది అపరంజికి.

"ఇప్పుడు వెళ్ళలేమా?... రెండు నిముషాలు చూచి వచ్చేయవచ్చుకదా!"

"వద్దు... రాత్రికయితేనే హాయిగా వుంటుంది... ఎందుకంటే మిమ్మల్ని చూచి వేదీ చాలా ఎక్సయిట్ అవుతుంది... మీరు దానికి ప్రాణదాతగానే కాదు... మిమ్మల్ని స్వంత అక్కగా భావిస్తోంది... డాక్టర్లు మరో అరగంటలో రౌండ్స్‌కు వస్తారు గనుక అది ప్రశాంతంగా వుంటేనే బాగుంటుందనేది నా ఉద్దేశ్యం... రాత్రిలోగా నేకు డాక్టర్లతో చర్చించి మీ బోన్‌మ్యారో శాంపిల్ తీయించే ఏర్పాట్లు చేస్తాను... రేపు ఉదయాన చేయిద్దాం ఆపని... అంకుల్ ప్రయత్నాలన్నీ విఫలమయినయి... మీది మ్యాచ్ అయితే సరే, లేకపోతే డోనార్స్ కోసం మీడియాలో ప్రకటన ఇవ్వాలనేది

ఆలోచన!"

"శాంపిల్ ఇచ్చేటప్పుడు వాళ్ళు నన్ను గుర్తించే అవకాశం లేదా?"

"అది వేరే గదిలో ఏర్పాటు చేస్తాను!"

అపరంజి అతడి మాటలనే వింటూ ఉండిపోయింది.

అతడు వెళ్ళిపోయాడు చేతి గడియారంలో సమయం చూచుకుంటూ.

* * *

"నాకు తెలియక అడుగుతాను... మీ అత్త మామ నన్ను అరకులో కొనుక్కున్నప్పుడు నేను అనకాపల్లిలో పుట్టినట్లుగా అక్కడ ఆసుపత్రిలో ఎలా నమోదు అయింది?" కంఠం హెచ్చించి అన్నది అపరంజి.

రాత్రి పదిగంటలప్పుడు సుధీర్‌నుండి ఫోను. అతడు నవ్వాడు. "మీ మామ లాయరు తెలివినంతా ఉపయోగించి, ముందుముందు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా ఆయనకు బాగా తెలిసిన నర్సింగ్‌హోంలో అలా రాయించేశాడు... రోజూ ఎంతోమందికి ప్రసవం అవుతుంది అక్కడ... నిజంగా కాకపోయినా రికార్డ్సు సృష్టించేలా చేశాడు!"

"ఇదే ఆలోచన నివేదిత తల్లిదండ్రులకూ వచ్చి ఉంటుందంటావా? అందునా మా ఇద్దరి పుట్టుక తేదీలు ఒకటే అవ్వటం కూడా విచిత్రంగా వున్నది!"

"నువ్వు ఆసుపత్రిలో పుట్టినట్లుగా రాయించటంలోని ముఖ్యోద్దేశ్యం నీకెన్నడూ అసలు నిజం తెలియగూడదని... అలా రాయిస్తూ నిన్ను అరకులో తీసుకున్న రోజునే నువ్వు పుట్టిన రోజుగా రాయించానని నాన్న చెప్పాడు!"

"ఈ విషయమంతా నీకెప్పుడు తెలిసింది... నాకు చెప్పనేలేదు!" అన్నది నిష్ఠూరంగా అపరంజి.

"నన్ను పంపటానికి విమానాశ్రయానికి వచ్చినప్పుడు నాన్నను అడిగాను 'అమ్మ ఎందుకు అంతగా మా వివాహానికి వ్యతిరేకిస్తున్నది' అని... అప్పుడే నేనూ నాన్నా

మనసు విప్పి మాట్లాడుకోగలిగింది... ఇప్పుడు నువ్వెవరో నీకు తెలిసింది కాబట్టి చెబుతున్నాను... ఎక్కడో, ఎవరికో పుట్టిన దాన్ని తన ఇంటి కోడలుగా తెచ్చుకోవటానికి ఇష్టంలేక, ఆమాట సూటిగా చెప్పలేక ఆ వంకా ఈ వంకా పెడుతున్నదట అమ్మ... అది ఎక్కడ ఎవరికి పుట్టినా నా చెల్లెలు దగ్గరే పెరిగిందికాబట్టి అది నా మేనగోడలే అన్నాడుట నాన్న... కానీ అమ్మ అంత తేలిగ్గా కన్విన్స్ అయ్యేలా లేదు అన్నాడు!... అసలు నిన్ను నాకు సెండాఫ్ ఇవ్వటానికి విమానాశ్రయానికి ఎందుకు రావద్దన్నానో ఇప్పటికయినా అర్థమయిందా... కోపమొచ్చి ఎగురుకుంటూ వెళితివికదా... 'అర్థరాత్రప్పుడు నువ్వెందుకమ్మా' అంటూ అమ్మనూ తీసుకు వెళ్ళలేదు!"

తన పుట్టుక మిస్టరీ పూర్తిగా విడిపోవటంతో ఓ దీర్ఘనిశ్వాసం విడిచింది అపరంజి.

"నన్ను కన్నతల్లి సమాధి చూడటం... ఆమె తాతను అంటే నా ముత్తాతను చూడటం ఎంతో ఉద్రేకం కలిగించింది నాకు... ఆ గూడెంలో వున్న వాళ్ళను చూస్తూ, నేనూ అక్కడే వున్నట్లయితే వాళ్ళలాగానే ఉండేదాన్నా అనిపించింది... చాలీ చాలని తిండితో, చదువులేక, మొరటు పనులు చేస్తూ..." ఆ మాటలు చెబుతున్నప్పుడు ఆమె గుండె బరువెక్కింది.

సుధీర్ పకపకా నవ్వాడు. "అతిలోకసుందరి బొగ్గు గనుల్లో దొర్లినా రత్నంలా మెరిసిపోతూనే వుంటుంది... అలా దేవుడు నీకు రాసిపెట్టి వున్నట్లయితే, నీకంటే ముందుగానే నేనూ అక్కడ పుట్టి గోచీపెట్టుకొని తిరుగుతుండేవాడిని!"

"ఛీ! వెధవ్వాగుడు..." కసురుకున్నది అపరంజి.

"నాన్న అమ్మను ఒప్పించేందుకు తన శాయశక్తులా ప్రయత్నిస్తూనే ఉన్నాడు... నేను అమెరికానుంచి తిరిగి వచ్చేటప్పటికి ఆయన విజయం సాధించినా సాధించవచ్చు... కాలేదా, మనల్ని రిజిస్ట్రారాఫీసులో పెళ్ళి చేసుకొని, సినిమాల్లోలాగా మెళ్ళో పూలదండలతో ఇంటికి వచ్చేయమన్నాడు!" అన్నాడు నవ్వుతూ సుధీర్.

"భవిష్యత్తులో ఎలా జరుగుతుందో ఊహించటం కష్టం... నా జీవితం ఇలాంటిదీ అని నిమ్మీకోసం నేను హైదరాబాదు వెళ్ళే రైలు ఎక్కేంతవరకూ తెలియదు గదా!"

అన్నది దిగులుగా.

"అప్పూ! అంతా మరిచిపోయి నువ్వు చేయాల్సిన పని మనం హనీమూన్‌కు ఎక్కడికి వెళ్ళాలో ఆలోచించటం!"

"నేను ఫోన్ పెట్టేస్తున్నాను!" అన్నది విసురుగా.

"అరేయ్ అంజీ! ఆగాగు..." హడావుడిగా అన్నాడు. "ఈ వీకెండ్‌లో నిమ్మీ దగ్గరకు ప్లాన్ చేస్తున్నానురా... దాన్తో ఫోన్లో మాట్లాడాను... నేను వస్తున్నానని ఎంతో సంతోషపడుతున్నది... అవునూ...అమెరికానుంచి ఏం తెమ్మంటావురా నీకు?"

"నువ్వు రావయ్యా బాబు ముందు... నాకు అదే చాలు!" ఖస్సుమన్నది.

"నేనేమన్నాను... హనీమూన్ అన్నాను... నువ్వేమన్నావ్ నేను నీముందుంటే చాలు అన్నావు... ఇద్దరికోరికా ఒకటే గదా... మాటల్లో మార్పేగాని! మన భవిష్యత్తునంతా స్వర్గధామం చేసుకోవటం మన చేతుల్లోని పనేరా!"

ఆమె మొహమంతా ఎర్రబడగా సెల్ ఆఫ్ చేయబోతూ, "గుడ్‌నైట్!" అన్నది.

"ఒక నైటేమిటి బోడి నైటు... ఇంకో డెభై అయిదు సంవత్సరాలు ప్రతి రాత్రీ మనకు శుభరాత్రే!"

* * *

శనివారం రాత్రి పదకొండుగంటలయింది. అందరూ నివేదిత గదిలో వున్నారు. ఆమె ముఖం అపరంజి రాకతో వెలుగు నిండిపోయింది. తోబుట్టువు తనను అంటిపెట్టుకొని ఉన్నదనే భావన ఆమెకు ఎంతో ధైర్యాన్నిస్తున్నది.

క్రితంరోజు ఉదయం బోన్‌మ్యారో పరీక్ష చేయటం అది నివేదితకు పనికి వస్తుందని డాక్టర్లు నిర్ణయించటం జరిగింది. ఈరోజు ఉదయాన మజ్జ మార్పిడీ చేయటం గూడా జరిగిపోయింది. కాస్త నీరసంగా ఉన్నట్లనిపించినా నివేదిత గదిలోకి వచ్చింది అపరంజి.

అందరికంటే ఎక్కువగా ఆనందపడింది అభినవ్.

అపరంజిది బోన్‌మ్యారో మ్యాచ్ అయింది అని తెలుసుకోగానే అభినవ్ నివేదిత తల్లిదండ్రులతో చెప్పాడు. "సమస్య తీరిపోయింది అంకుల్... ఓ అజ్ఞాత డోనార్ వచ్చి శ్యాంపిల్ ఇచ్చి వెళ్ళారు. దాన్ని ల్యాబ్‌లో పరీక్ష చేయటం వేదీకి సరిపోతుందని నిర్ణయానికి రావటం జరిగిపోయింది!" అన్నాడు ఆనందంగా.

"మేం ఆ డోనార్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవాలి... డబ్బు ఎంతివ్వాలో చెప్పు ఇచ్చేస్తాం!" అన్నాడు ఆయన  సంతోషంగా గుండె నిండుగా హాయిగా గాలిపీల్చుకుంటూ.

"ఆమె డబ్బు కోసం ఇవ్వలేదు... మరొకరి జీవితాన్ని రక్షించాలనే మానవత్వంతో, తనది పనికొస్తున్నప్పుడు ఎందుకు ఇవ్వగూడదు, అని ఇచ్చింది. డబ్బు తీసుకోదు... రెండోది ఆమె అజ్ఞాతంగా ఉండాలనే కోరుకుంటున్నది!"

"అజ్ఞాతంగానే ఉండమను అభీ! మేం మాట్లాడం... ఒక్కక్షణం ఆమె పాదాలకు నమస్కరించి వెళ్ళిపోతాం!" నివేదిత తల్లి కళ్ళు ఆనందంతో తడుస్తున్నాయి.

"వద్దు ఆంటీ! ఆమెను తీసుకు వచ్చిన డాక్టర్ ఇది ఎవరికీ తెలియనీయ వద్దు అని చెప్పాడు!"

రామచంద్రరావు అనుమానంగా అడిగాడు. "ఆమెకు ఇంకే రోగాలు లేవుగదా!"

ఆ ప్రశ్నకు బిత్తరపోయాడు అభినవ్. "అంకుల్! ఆ జాగ్రత్తలన్నీ డాక్టర్లు ముందుగానే తీసుకుంటారు... ఆ విషయంలో మీరేమీ అనుమానించాల్సిన పనిలేదు!"

అపరంజి నివేదిత మంచం మీదే కూర్చొని వున్నది ఆమె చేయి పట్టుకొని. నివేదిత కళ్ళనుండి కారుతున్న నీటిని తన చేతులతో తుడిచింది.

"ముంబయ్‌లో యమకూపంలో పడవలసిన నన్ను మొదటి సారి రక్షించావ్... రెండోసారి మరణానికి అంచుదాకా వెళ్ళిన నాకు ప్రాణదానం చేసి బ్రతికిస్తున్నావ్... అక్కా! నీ రుణాన్ని నేను ఎలా తీర్చుకోవాలి?"

"మొదటిది నేను కాదు చేసింది... కామాక్షి... అదే నా స్నేహితురాలు కాకుండా వున్నట్లయితే నేను ఏమీ చేయగలిగి ఉండేదాన్ని కాదు... రెండోది నువ్వు ఎప్పుడూ చిరునవ్వుతో వుండటమే నా రుణం తీర్చుకోవటం... నాకంటే అభినవ్ చేసింది ఎక్కువ... నిద్రాహారాలు మాని అతడు నీకోసం ఎంతగా శ్రమపడుతున్నాడో నీకు తెలియదు?"

"తెలుసు... ఈ శరీరం ఆయనదే అయినప్పుడు దాన్ని జాగ్రత్త చేసుకోవాల్సిన బాధ్యత ఆయనది కాదా... అందుకు కృతజ్ఞతలు చెప్పుకోవటం అంటే నా దేవుణ్ణి అవమాన పరచటమే!" తన్మయంగా అభినవ్‌నే చూస్తూ అన్నది నివేదిత. "అలాగే నువ్వు నా అక్కవు... నన్ను రక్షించుకోవాల్సిన బాధ్యత నీకూ వున్నది... ఇంకోసారి పొరబాటున కూడా రుణం అనే మాటను అనను!" అన్నది ఆత్మీయంగా అపరంజి చేతిని నొక్కుతూ.

అభినవ్ చిరునవ్వుతో నివేదితనే చూస్తున్నాడు.

ఒక్కసారిగా పెద్దగా శబ్దమవుతూ దగ్గరకు వేసివున్న ఆ గది తలుపులు భళ్ళున తెరుచుకోవటంతో అందరి తలలూ ఒకేసారి అటువైపుకు తిరిగినయి– అక్కడ నివేదిత తల్లీదండ్రీ నిలుచొని వున్నారు!

* * *

ఆ ఆసుపత్రిలో నివేదిత పడుకొని వున్న గదిలో వాకిటి వంకే చూస్తున్న ఎవరి నోరూ మూత పడలేదు. మొట్టమొదటి సారిగా నివేదిత తల్లే నోరు తెరిచింది ఓ అడుగు ముందుకు వేసి అపరంజినే చూస్తూ. ఆమెకు శరీరమంతా తేలిపోతూ కళ్ళు తిరుగుతున్నయ్యా అనిపిస్తోంది!... ఇరవై రెండు సంవత్సరాలుగా గుండెల్లో దాచిపెట్టుకున్న ఆ రహస్యం ఓ విస్ఫోటనంలా బ్రద్దలవ్వబోతున్నదా అనిపించగా– వణికిపోతోంది. శరీరం పట్టు తప్పుతోంది.

పక్కగా వున్న ఆమె భర్త ఆమెను పట్టుకున్నాడు పడిపోకుండా. ఆయనకూ అంతా అయోమయంగా వున్నది– నివేదితలాగానే వున్న ఆ అమ్మాయి ఎవరో ఆయనకు

అర్థం కావటం లేదు.

"నువ్వెవరు?" చాలా బలహీనమైన కంఠంతో అడిగింది నివేదిత తల్లి.

అభినవ్ వడివడిగా అడుగులు ముందుకు వేశాడు. "ఆంటీ! ఆమే బోన్‌మ్యారోను వేదీకి ఇచ్చింది!" అన్నాడు.

నివేదిత తండ్రిలో అయితే చలనమేలేదు. బొమ్మలా ఆ అమ్మాయిని చూస్తూ ఉండిపోయాడు.

– అక్కడ వాళ్ళకు తెలియని విషయం– తన కూతుర్ని బ్రతికుస్తున్న ఆ అజ్ఞాత డోనార్‌కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెప్పాలని తపన పడుతున్న ఆ దంపతులకు అభినవ్ సహకరించకపోవడంతో– అక్కడ పనిచేసే ఆయాను పట్టుకొని ఆరా తీయగా, వాళ్ళిచ్చిన డబ్బులకు కక్కుర్తిపడి, "మీ అమ్మాయి లాంటి మరో అమ్మాయే వచ్చి ఇచ్చింది... పక్క గదిలోనే వున్నది... రేపు డిశ్చార్జ్ అవ్వవచ్చు!" అని చెప్పింది వాళ్ళు సాయంత్రం ఇంటికి వెళుతున్నప్పుడు.

తన కూతురులాంటి మరో అమ్మాయే రావటమేమిటో వాళ్ళకు అర్థం కాలేదు. దాంతో ఎలాగైనా ఆమెను చూడాలనే కోరిక వాళ్ళలో బాగా పెరిగిపోగా కావాలని రాత్రి సమయంలో అక్కడకు వచ్చారు.

నివేదిత తల్లి అపరంజి దగ్గరకు వచ్చి ఆమె భుజాలు పట్టుకొని ఆవేశంగా ఊపుతూ, "చెప్పు... నువ్వెవ్వరు?" అరుస్తున్నట్లుగా అన్నది.

ఇక ఏ విషయమూ దాచటంలో అర్థం లేదనిపించింది అపరంజికి. "నేను నివేదిత సోదరిని... మీ అమ్మాయిని ఎవరయితే కన్నారో, వాళ్ళే నన్నూ కన్నారు!" అన్నది స్థిరచిత్తంతో ఎలాంటి తొట్రుపాటు లేకుండా.

ఆ మాటలు తూటాలయి నివేదిత తల్లి ముఖాన్ని తెల్లగా పాలిపోయేలా చేసినయి. పెదవులు వణకటం మొదలుపెట్టినయి. శరీరమంతా చెమటతో తడిసిపోతోంది.

వెనగ్గా వచ్చిన ఆమె భర్త, 'కంట్రోల్ చేసుకో...' అన్నట్లుగా ఆమె భుజంమీద

చేయివేసి దగ్గరకు తీసుకున్నాడు.

"అరకులో మీకు రుక్మిగా పరిచయమైన స్త్రీయే మా ఇద్దరికీ తల్లి!" అపరంజే మరల నోరు తెరిచింది.

బ్రహ్మాండం బద్దలయిపోయింది. బయల్పడిన ఆ నిజాన్ని తట్టుకోలేనట్లుగా ఆమె అక్కడే నేలమీద కూలబడిపోయింది.

నివేదిత తల్లిని చూడలేనట్లుగా ముఖాన్ని పక్కకు తిప్పుకున్నది కళ్ళు మూసుకొని. అభి రోజూ అపరంజినుండి అందుతున్న సమాచారాన్ని కొద్దికొద్దిగా చెబుతుండటంతో అంతగా ఉద్విగ్నతకు లోను కాలేదు. కానీ తల్లి బాధను చూస్తుంటే ఆమె దుఃఖాన్ని నిగ్రహించుకోలేకపోతున్నది.

"ఆంటీ! నన్ను అపార్థం చేసుకోవద్దు... నేనూ నివేదిత లాగానే మరో మంచి అమ్మ దగ్గర పెరిగి ఇంతదాన్నయ్యాను... ఒకసారి అనుమానం వచ్చిం తరువాత కన్నతల్లిని గురించి తెలుసుకోవటం తప్పులేదనే ఉద్దేశ్యంతో ఆరాటపడి ఆరా తీశాను... అసలు నిజాలు తెలియబట్టే నా చెల్లెలు ఇంత భయంకరమైన వ్యాధికి లోనయినా బ్రతికుంచుకునేందుకు చేతనయిన సాయం చేశాను అనే విషయాన్ని మనస్సులో పెట్టుకుంటే మీకు ఈ వేదనే ఉండదు... అంతేకాదు, గతంలోనే కాకుండా భవిష్యత్తులో కూడా మమ్మల్ని పెంచిన వాళ్ళే మాకు తల్లిదండ్రులు అవుతారనేది ఎవ్వరూ కాదనలేని నిజం... ఈ విషయాన్ని నలుగురికీ చెప్పుకోవాల్సిన అవసరం కూడా లేదు!" అన్నది ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ ఆమె పక్కనే క్రింద కూర్చున్నది.

రాత్రే ఫోన్ చేసి తల్లితో మాట్లాడింది అపరంజి. "మీరూ వచ్చి ఇంద్రకీలాద్రి మీద వున్న కనకదుర్గను దర్శించుకుంటే నాకు ఎంతో ఆనందంగా వుంటుంది... నా స్నేహితురాలి ఆరోగ్యం కుదటబడుతోంది... ఈ ఆనంద సమయంలో మీరూ దాన్ని చూచి ఆశీర్వదించాలని నేనూ, అదే కాదు, దాని తల్లీదండ్రీ కూడా కోరుకుంటున్నారు!... అత్తయ్యనూ మామయ్యను కూడా తీసుకువస్తే ఇంకా ఆనందం!" అన్నది ఉత్సాహంగా.

తల్లి కూతురి మాటలకు అంగీకరించింది. అటు సుధీర్ ప్రోద్బలంతో అతడి తండ్రికూడా భార్యను తీసుకొని బయల్దేరాడు.

అభి మరునాడు రాత్రి స్టార్ హోటల్లో డిన్నర్ ఎరేంజ్ చేశాడు. అతడి తల్లి దండ్రులూ వస్తే బాగుంటుందనుకోవటంతో ఫ్లయిట్‌లో వాళ్ళు మరునాడు ఉదయాన విజయవాడ వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

ఇప్పుడు సుధీర్ ఇక్కడ లేడు కాబట్టి అతడు రాగానే మరోసారి అందరూ కలిసేలా చేయాలని అనుకున్నది అపరంజి. నివేదితకు కాస్తంత ఓపిక వస్తే ఇంకా కావాల్సిందేమున్నది?

* * *

ఉపసంహారం:

ఆరు నెలల తరువాత–

అప్పటికి అపరంజి సుధీర్‌ల వివాహం జరిగి నాలుగు నెలలయింది. హనీమూన్‌కంటూ బయల్దేరిన వాళ్ళు ముందు తిరుమల వెంకటేశ్వరుని దర్శించుకొని, మధుర మీనాక్షిని చూచి కొడైకెనాల్ వెళ్ళారు. సుధీర్ ముందుగా చెప్పినట్లే హోటల్ గదిలోనే ఎక్కువ సమయం గడుపుతూ రాత్రేదో పగలేదో తెలియనట్లుగా ఆనందించారు. ఆ తరువాత వారం రోజులకు చూడాల్సిన ప్రదేశాలన్నీ చూచి వైజాగ్‌కు వచ్చారు.

అపరంజి నివేదితకు ఫోన్ చేస్తే, “హనీమూన్‌ను ఆనందించావన్నమాట అక్కా!” అన్నది పకపకా నవ్వుతూ. “పదిరోజులనుండీ నీ దగ్గరనుంచి కాల్ లేకపోతే– మిమ్మల్ని ఎందుకు డిస్టర్బ్ చేయాలని నేనూ చేయలేదు!”

“ఛీ! పో... అదేం కాదు... మేం దేవుడి గుళ్ళచుట్టూ తిరుగుతున్నాం!”

“అదేనక్కా నేనూ చెబుతున్నది... బావగారు నువ్వూ దేవాలయాలు చుట్టూ తిరుగుతుంటే– నాకు అనిపించిందేమిటో తెలుసా... అమ్మవారికి పక్కనున్న అయ్యవారు, అయ్యవారికి పక్కనున్న అమ్మవారు దేవతలే అయితే వాళ్ళు ఉన్న హోటల్ గదులే

దేవాలయాలు అవుతయ్యనేది నిజం!"

"ఆరోగ్యం ఎలా వున్నది?"

"సూపర్... నువ్వు ఇవ్వాళగూడా చేయకపోతే నువ్వు తిట్టినా సహించి నేనే కాల్‌చేసి వుండేదాన్ని నీకు!"

"నేనూ రోజూ చేద్దామనే అనుకుంటున్నానుగాని..." నసుగుతున్నట్లుగా అన్నది అపరంజి. నిజమే బావ తనను ఎక్కడెక్కడో తిప్పుతుంటే సర్వం మర్చిపోయిన మాట వాస్తవం!

"అవన్నీ పోనీయ్‌గాని... నేను ఎందుకు చేస్తున్నానంటే... వేదీతో నా వివాహం వచ్చేనెల పదిహేనున జరిగేందుకు  నిర్ణయించారు... నువ్వూ బావగారు, అమ్మా నాన్నా, మీ అత్తయ్యలిద్దరూ, మామయ్యలూ  నా పెళ్ళికి తప్పకుండా రావాలి... మా అమ్మా, నాన్న, అభి కూడా మళ్ళా ఫోన్లు చేసి చెబుతారు... ముందు టిక్కెట్లు రిజర్వు చేయించుకోండి... అందరూ పదిరోజులు ఇక్కడుండాలి... మీరు చూడాల్సిన ప్రదేశాలు చాలా వున్నయి... మరో విషయం కూడా మీరు అంతదూరం నుంచి రెండు సార్లు రావటం కష్టం గనుక, పెళ్ళినాటికి ముందు రోజే ఎంగేజ్‌మెంటు పెట్టుకున్నాం!"

"నీకు ప్రామిస్ చేశాను గుర్తున్నదా... నీ వివాహంలో పెత్తనమంతా నాదేనని... తప్పకుండా నేనేకాదు, నువ్వు చెప్పిన అందరం వస్తాం! ఈరోజున చాలా మంచి వార్త చెప్పావ్!"

అభినవ్, మరియు అతని తల్లిదండ్రుల బలవంతం మీద నివేదిత ఆసుపత్రినుంచి డిశ్చార్జ్ అయిన నెలలోపే అందరూ కోల్‌కతా వెళ్ళిపోయారు. నివేదిత తండ్రి రెండు నెలలు శెలవు పెట్టాడు. ఇంకా ఎక్కువ సర్వీసు లేకపోవటంతో స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకోవటానికి నిర్ణయించుకున్నాడు అభినవ్ ఒత్తిడితో. ముందు వెళ్ళిన అతడి తల్లి దండ్రులు వాళ్ళింటికి దగ్గరలోనే మరో ఇల్లు చూచి అట్టిపెట్టారు.

"ఎక్కడున్నా నీ ఆరోగ్యం బాగుండటమే నాకు కావాల్సింది!"

"చెప్పానుకదా నీకు... ఈ శరీరమే అభిదయినప్పుడు దాని సంగతేదో ఆయనే చూసుకుంటారు!" పకపకా నవ్వింది నివేదిత.

"చెల్లీ! నీ వివాహం తరువాత మనం చేయాల్సిన పని మరొకటి వున్నది!"

"చెప్పు... ఒకటేమిటి ఎన్ని చేయమన్నా చేస్తాను!"

ఒక్కక్షణం కుడా ఆలస్యం చేయలేదు. "అరకు వెళ్ళి... మనల్ని కన్న తల్లి సమాధిని చూడటమే కాదు అల్లుళ్ళనుకూడా చూపించాలి! ఆమె కన్నతల్లిగా చేయగూడని నేరం చేసినమాట వాస్తవమేకాని– మనల్ని ఎంతో ఉన్నతుల నడుమ పడేసి అద్భుతమైన జీవితాల్ని ప్రసాదించినందుకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి... అంతేకాదు మనకు పరిచయం లేకపోయినా ఎందరో రక్తసంబంధీకులు, బంధువులు– ముఖ్యంగా మన ముత్తాత అక్కడ వున్నారు... వాళ్ళందరికీ గుడ్డలు పెట్టి రావాలని, వాళ్ళకు మనం చేయగలిగిన సాయం చేయాలని నాకు అనిపిస్తోంది!" అంటూనే నివేదితను ఆమె ఆలోచనలకు ఆమెను వదిలేసి సెల్ ఆఫ్ చేసింది.

"అత్తయ్యా! నివేదిత వివాహం వచ్చే నెలలో కోల్‌కతాలో జరగబోతోంది... దానికి మనం అంతా వెళుతున్నాం!" అన్నది వంట ఇంట్లోకి ఒక్క దూకు దూకి సంతోషంగా అపరంజి. అగాథంలో కూరుకు పోవాల్సిన తన స్వంత చెల్లెలు జీవితం ముందుకు ఆనందంగా దూసుకుపోతున్నందుకు ఆమెకూ ఎంతో సంతోషంగా వున్నది.

లోపలకు ఎగురుకుంటూ వచ్చిన కోడల్ని చూస్తూనే కంగారు పడిపోయింది ఆమె. "ఏమిటా ఎగరటం చిన్న పిల్లలాగా... ఒట్టి మనిషివి కూడా కాదు!" అన్నది బుగ్గలు నొక్కుకుంటూ. "కాస్త జాగ్రత్తగా వుండాలి కానుపు అయ్యేంత వరకూ!"

అత్తయ్య మాటలకు అపరంజి చెంపలు కెంపులయినయి.

**(సమాప్తం)**